ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2016 Q4 అక్టోబరు – డిసెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


దళితకోణంలో స్వాతి హత్య వివాదం
పాతపద్ధతులకే మళ్లిన ఎస్పీ
ఓణమ్‌ను మరోలా..
అమెరికా వైపు మొగ్గిన బ్రెజిల్
మరాఠాల ఆందోళన
రైట్‌కు మళ్లుతున్న ఆస్ట్రియా
బుందేల్‌ఖండ్‌లో వజ్రాల వేట
జయలలిత ఆరోగ్యస్థితి
అఖిలేశ్ తిరుగుబాటు బిజెపికి లాభమా? నష్టమా?
చట్టాన్ని చేతిలోకి తీసుకున్న కేరళ న్యాయవాదులు
రిజర్వేషన్లు చేసే చెఱుపు ఎంత?
మరాఠా ఆందోళన పరిణామాలు
ఢిల్లీని పాలించేదెవరు?
నల్లధనం వెల్లడి.. ఏ మేరకు?
మధ్యప్రదేశ్ బిజెపిలో అంతఃకలహాలు
ఒకే పెన్షన్ – బిజెపి మెస్
ఏకవీరుడు ట్రంప్ గెలిచాడు
మంచి నిర్ణయం గందరగోళం పాలు
ఎఫ్‌బిఐ హిల్లరీని కొంప ముంచిందా?
అమెరికా– భయాందోళనలే గెలిచాయి...
కొరియా శశికళ
అర్ణబ్ గోస్వామి దారెటు?
అమెరికా – సర్వేలు ఎందుకు తప్పాయి?
పెద్ద నోట్ల రద్దు – ఓ పెద్ద ఫ్లాప్ షో
ట్రంప్ గెలుపు మన కనర్థమా?
కీర్తిశేషులు బాలమురళీకృష్ణ
నోట్ల రద్దు వలన రియల్ ఎస్టేటు కుదేలైందా?
వీసాల విషయంలోనూ చెప్పినది చేస్తానంటున్న ట్రంప్
రాజమహల్‌పై పగా?
హిందువులు అక్రమవలసదారులు కారా?
ఐర్లండ్‌లో గర్భస్రావ హక్కులకై ఉద్యమం
రక్తభూమి కన్నూరు
ధీరవనిత జయలలిత
విదూషకుడు ‘చో’ కు నివాళి
అమెరికా ఎన్నికలలో రీకౌంట్ ప్రహసనం

**జయలలిత వారసత్వం**
**కొలంబియా శాంతి ఒప్పందం అమలయ్యేనా?**
**టాటా వివాదంలో మిస్త్రీ తప్పుందా?**
**ఆనే ఫ్రాంక్ ఎలా పట్టుబడింది?**
**చైనా సరుకులు వాడడం మానేశామా?**
**ట్రంప్ గెలుపులో పుతిన్ హస్తం వుందా?**
**దేవేంద్ర దరహాసం**
**షీలా దీక్షిత్ గతి ఏమవుతుంది?**
**వచ్చే ఏడాదిలో ఎదురు చూసేందుకు ఏముంది?**

**2016 అక్టోబరు 01, 02** **ఎమ్బీయస్ : దళితకోణంలో స్వాతి హత్య వివాదం**

తమిళనాడులో దళితులు తమ హక్కుల కోసం పోరాడడం ఎప్పటినుంచో వుంది కానీ యిటీవలి కాలంలో పదును పెరిగింది. ఈ పోరాటం ప్రధానంగా ఒబిసిలకు, వారికీ మధ్య జరుగుతోంది. గతంలో దళితులు ఆలయప్రవేశం జరిగితే చాలని కోరుకునేవారు కానీ క్రమేపీ ప్రవేశమే కాదు, పూజల, పండుగల నిర్వహణలో తమకు భాగస్వామ్యం కావాలని అడుగుతున్నారు. అది యివ్వడానికి యితర కులాలు ఒప్పుకోవటం లేదు. 1998లో శివగంగ జిల్లాలో కందాదేవి ఆలయంలో రథాన్ని పండగల్లో తాము కూడా లాగుతామని దళితులలో ఒక తెగ అయిన కుల వెల్లాలర్లు అడిగారు. ఇతర కులస్తులు అంగీకరించలేదు. దాంతో రథానికి నిప్పు ముట్టించారు. వ్యవహారం కోర్టుకి వెళ్లింది. చివరకు హైకోర్టులో అనేక పిటిషన్లు, నిరసన ప్రదర్శనలు జరిగాక, 2005లో 26 దళిత కుటుంబాల వారిని రథం లాగడానికి కోర్టు అనుమతించింది. అంతే అప్పణ్నుంచి యిప్పటిదాకా యితరులు రథోత్సవం ఆపేశారు. ఏమైందని అడిగితే రథానికి మరమ్మత్తులు చేయించాలంటున్నారు.

ఇతరులు కట్టిన ఆలయాల్లోకి తమను రానివ్వటం లేదు కాబట్టి తామే డబ్బులేసి ఓ గుడి కట్టుకోవచ్చు కదా అనుకుని కరూరు జిల్లాలో నాగపల్లి గ్రామంలో 70 దళిత కుటుంబాల వారు ఏడేళ్ల క్రితం సొంత స్థలంలో విరాళాలు వేసుకుని మీనాక్షి మారియమ్మ గుడి కట్టారు. ప్రభుత్వం 25 వేలు యిచ్చింది. గుడి ట్రస్టులో దళితులే వున్నారు. శ్రీలంక నుంచి తరలి వచ్చిన గౌండరు, కొంగు (ఒబిసి) కులాలకు చెందిన తమిళులు కొందరు తాము కూడా విరాళాలు యిస్తామంటే పుచ్చుకున్నారు. అయితే వాళ్లిచ్చిన విరాళాలను నమోదు చేయకుండా దళితులు జాగ్రత్త పడ్డారు. అయినా గుడి కట్టిన ఐదేళ్లకు దళితేతరులు తమకు కూడా కొన్ని హక్కులుండాలంటూ అడగసాగారు. రెండేళ్లగా యీ వివాదం నడుస్తూనే వుంది. తమతో గొడవ పెట్టుకుంటే తాము ఇస్లాంలోకి మారిపోతామంటూ దళితులు బెదిరిస్తున్నారు.

నాగపట్టణానికి దగ్గరున్న పళంగకల్లిమేడు గ్రామంలోని 180 దళిత కుటుంబాల వారిని చూసి వీళ్లకీ ఐడియా వచ్చింది. ఆ గ్రామానికి దగ్గర్లో వున్న భద్రకాళి గుడికి చుట్టుపట్ల 18 వూళ్ల నుంచి భక్తులు వస్తూంటారు. అన్ని కులాలవారి ప్రవేశానికి ఎలాటి యిబ్బందీ లేదు. అయితే యీసారి ఆడి(ఆషాఢమాసాన్ని తమిళంలో అలా అంటారు. వాళ్లకు మాసం పౌర్ణమి నుండి పౌర్ణమి వరకు) మాసంలో జరిగే ఐదురోజుల పండగలో తమకు భాగం కావాలని దళితులు పట్టుబట్టారు. గుడి ఎండోమెంట్స్ శాఖలోకి వస్తుంది కాబట్టి ఆ 5 రోజుల్లో తొలిరోజు, చివరి రోజు ప్రభుత్వాధికారులే పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక మధ్యలో వున్న మూడు రోజులలో పిళ్లయ్‌మార్, కళ్లిమేడు, తామరైపులం కులాల వారు నిర్వహిస్తూ వుంటారు. ఆ మూడు రోజుల్లో ఒక రోజు పూజలు మేం నిర్వహిస్తాం అని దళితులు అడిగారు. 'ఇది వదిలేయండి, మరో పండగలో మొత్తం మీకే యిస్తాం, దీనిలోనే కావాలంటే ఒక పూట యిస్తాం' అని యితర కులాల వారు అన్నారు. 'అదేం కుదరదు, యీ పండుగలోనే పూర్తిగా ఒక రోజు మాకు వదిలేయాలి' అని దళితులు పట్టుబట్టారు. శాంతి కమిటీ ఏర్పరచినా యిరుపక్షాలు పట్టుదలకు పోవడం వలన చర్చలు విఫలమయ్యాయి. దాంతో 6 కుటుంబాల దళితులు ఇస్లాంలోకి మారిపోయారు. మరో 180 కుటుంబాల వారు తామూ మారిపోతాం అన్నారు. చివరకు హైకోర్టు మధురై బెంచ్‌వారు ఆగస్టు 9న తీర్పు యిస్తూ రాజీ కుదిర్చారు. 2017 నుంచి అది అమల్లోకి వస్తుంది.

ఇటీవలి కాలంలో దళితులకు, ఒబిసిలకు మధ్య తగాదా రావడానికి ఒక కారణం ప్రముఖంగా కనబడుతోంది. దళితుల్లో చాలామందికి గ్రామాల్లో భూములు లేని కారణంగా ఆ కులాల యువకులు చదువునే నమ్ముకుని రిజర్వేషన్ల పుణ్యమాని సీట్లు, ఉద్యోగాలు తెచ్చుకుని పెద్ద పట్టణాల్లో, నగరాల్లో బాగా సంపాదించుకుంటున్నారు. ఒబిసి కులాల వారికి కొద్దో గొప్పో భూవసతి వున్న కారణంగా గ్రామాల్లోనే వుండిపోతున్నారు. ఇటీవలి కాలంలో యిరిగేషన్ సౌకర్యాల లేమి వలన ఆ భూముల దిగుబడి తగ్గిపోవడం లేదా వట్టిపోవడం జరుగుతోంది. గ్రామాల్లో, పట్టణాల్లో వున్న ఒబిసి యువతులు ఆర్థికంగా సుఖకరమైన నగర జీవితంపై మోజుతో తమ కులాల యువకుల కంటె దళిత యువకులను పెళ్లాడడానికి యిష్టపడుతున్నారు. ఇది ఒబిసి యువకుల్లో అసహనాన్ని పెంచుతోంది. 2012 నవంబరులో ధర్మపురి జిల్లాలో, 2013 ఏప్రిల్‌లో మరకణంలో, 2015 ఆగస్టులో శేషసముద్రం గ్రామంలో, 2016 మార్చిలో

తిరుపూరులో యిలా పలు సందర్భాల్లో ముఖ్యంగా మధురై, తిరునల్వేలి, శివగంగ, విరుదనగర్, తేణి, దిండిగల్ జిల్లాలలో కులఘర్షణలు పెరుగుతున్నాయి.

ఈ మధ్య కొన్ని జిల్లాలలో చిన్నప్పటినుంచి కులస్పృహ పెంచుతున్నారు. తిరునల్వేలిలోని గోపాలసముద్రం గ్రామంలో విద్యార్థులు తమ కులాలను చాటుకోవడానికి చేతికి రంగురంగుల కాశీతాళ్ల వంటివి కట్టుకుంటున్నారు. దేవర్లు ఎరుపు, పసుపు రంగు తాళ్లు, నాడార్లు నీలం, పసుపు రంగు, యాదవులు కాషాయం, దళితుల్లో పల్లార్లు ఎరుపు, ఆకుపచ్చ రంగు, దళితుల్లో అరుంధతీయులు నలుపు, తెలుపు రంగు తాళ్లు కట్టుకుంటున్నారు. తాడు చూడగానే వీడు ఫలానా అని తెలిసిపోయి, అక్కున చేర్చుకోవాలో, దూరంగా పెట్టుకోవాలో తేల్చుకోవచ్చన్నమాట. తిరునల్వేలి జిల్లా కలక్టరు యీ పద్ధతి మానాలని మౌఖికంగా ఆదేశాలిచ్చినా అమలు కాలేదు. 'ఇవి మా గుళ్లల్లో యిచ్చిన పవిత్రమైన తాళ్లు. కట్టుకోవద్దని చెప్పడానికి వీల్లేదు' అంటూ వాదించారు. అదే జిల్లాలోని కొన్ని వూళ్లల్లో పెద్దవాళ్లు వారి కులాల బట్టి పంచె రంగుల్ని ఎంచుకుంటున్నారట. కొందరు మెడలో వాళ్ల కులానికి చెందిన నాయకుల ఫోటోలను లాకెట్లలా వేసుకుంటున్నారు. నాడార్లయితే కామరాజు బొమ్మ, దేవర్లయితే ముత్తురామలింగ దేవర్ బొమ్మ.. యిలా.

పశ్చిమ తమిళనాడులో గౌండర్లు ప్రధానకులం. వారి కులంలో ప్రముఖుడెవరా అని చూస్తే 19 వ శతాబ్దపు పాలెగార్లలో (చిన్న సంస్థానాధీశుడు) వీరుడైన చిన్నమలై దొరికాడు. అతని పేర ఒక సంఘం పెట్టి యువరాజ్ అనే నాయకుడు ఈరోడు, తిరుచెంగోడు ప్రాంతాల్లో స్కూళ్లకు వెళుతూ గౌండరు కులాలకు చెందిన విద్యార్థులను పోగేసి, వాళ్లకు తమ కులఔన్నత్యాన్ని నూరిపోస్తున్నాడు. ఇటీవలే గోకుల్‌రాజ్ అనే దళిత యువకుని హత్య కేసులో అతను అరెస్టయ్యాడు. కౌసల్య అనే దిండిగల్ జిల్లా దేవర్ కులానికి చెందిన అమ్మాయి ఇంజనీరింగు కాలేజీలో తన క్లాసుమేటు శంకర్ అనే దళితుడిని, ఉడుమల్ పేటకు చెందిన వాణ్ని ప్రేమించి పెళ్లాడింది. ఎంత నచ్చచెప్పినా ఆమె భర్తను విడవకపోవడంతో తలితండ్రులు పెళ్లయిన 8 నెలల తర్వాత 2016 మార్చి నెలలో ఉడుమల్‌పేట మార్కెటులో పట్టపగలు వాళ్లిద్దరిపై దాడి చేయించారని అభియోగం. ఆమె తీవ్రంగా గాయపడింది, అతను చచ్చిపోయాడు. తలితండ్రులు ప్రస్తుతం జైల్లో వున్నారు. కౌసల్యకు ప్రభుత్వం నెలనెలా రూ.11,600 పెన్షన్ యిస్తోంది. 'ఇతర కులాల జోలికి రాకండి' అని దళితులకు హెచ్చరిక యివ్వవలసిన అవసరం వుంది కాబట్టి యీ హత్య అవసరమే అని భావించేవారూ వున్నారు.

ఆగస్టు నెలలో మధురైకు దగ్గర్లో వున్న ఒక గ్రామంలో దేవర్ కులానికి చెందిన ఓ కుర్రాడు దళిత విద్యార్థులు వెళుతూంటే వాళ్లను మారుపేర్లు పెట్టి ఏడిపించాడు. దాంతో వాళ్లు రాళ్లేసి కొడతాం జాగ్రత్త అన్నారు. మాటామాటా పెరిగింది. మర్నాడు దేవర్ కులాల తలితండ్రులు స్కూలుకి వచ్చి ఫిర్యాదు చేశారు. దేవర్ కులానికే చెందిన ఎమ్మెల్యే మద్దతుతో ఆ దళిత పిల్లలపై పోలీసులకు కంప్లయింటు యిచ్చారు. అంతే, పోలీసులు 4గురు దళిత విద్యార్థులు, 1 విద్యార్థినిపై పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) చట్టం కింద కేసు పెట్టేశారు. ఇంతకీ ఆ పిల్లలు వయసు 9 సంఎఎ లలోపే! ఇది బయటకు పొక్కి గొడవ కావడంతో పిల్లల్ని జైల్లోంచి విడిచివేశారు. ఇప్పటికీ ఆ స్కూల్లో దళితులకు, దళితేతరులకు విడివిడి డైనింగు రూములున్నాయి. చాపలు, గ్లాసులు, పళ్లాలు అన్నీ వేర్వేరే!

ఇలాటి సంఘటనల నేపథ్యంలో యిప్పుడు తమిళనాడులో ప్రతీ విషయాన్ని దళిత, దళితేతర కోణంలో పరామర్శించడం ఎక్కువై పోయింది. చెన్నయ్‌లోని నుంగంబాకం రైల్వే స్టేషన్‌లో అందరి ఎదుటా స్వాతి అనే అమ్మాయిని క్రూరంగా నరికి చంపిన కేసులో నిందితుడు రామ్‌కుమార్ దళితుడు కాబట్టి అతనికి అన్యాయం జరిగింది అని వాదించసాగారు. హతురాలు బ్రాహ్మణి కావడం, నిందితుడు దళితుడు కావటం వలన పోలీసులు పరిశోధనలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. దానికి తోడు రామకుమార్ గత నెలలో అనుమానాస్పద పరిస్థితుల్లో పోలీసు కస్టడీలో మరణించడంతో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి, పేదరికం నేపథ్యం కారణంగా అతనిపై జాలి చూపేవారు కూడా పెరుగుతున్నారు. రామకుమార్ తండ్రి రోజుకూలీ. తల్లి వ్యవసాయ కూలీ. అతనికి యిద్దరు చెల్లెళ్లున్నారు. ఇంజనీరింగు పూర్తి చేయలేకపోయాడు. ఉద్యోగం దొరకలేదు. చెన్నయ్‌కి వెళ్లి ట్రైనింగు తీసుకుంటే ఉద్యోగం వస్తుంది అక్కడకు చేరాడు. చూళైమేడులో అద్దెకుంటూ అదే కాలనీలో వున్న స్వాతిని చూసి మనసు పడ్డాడు. కానీ ఆమె స్పందించకపోవడంతో నరికి చంపాడు. చంపుదామని ఉద్దేశంతో దాడి చేయలేదని, కేవలం గాయపరుద్దా మనుకున్నానని, సాయంత్రం టీవీల్లో చూశాకనే చనిపోయిందని తెలుసుకున్నానని పోలీసు విచారణలో అతను చెప్పాడట.

స్వాతి హత్య వార్త పేపర్లలో రాగానే కొన్ని వర్గాల వారు 'ఇది మరో లవ్ జిహాద్ అని, ఒక ముస్లిం యువకుడు ఆమెను బుట్టలో పెట్టడానికి ప్రయత్నించి, విఫలుడై హత్య చేశాడని' సోషల్ నెట్‌వర్క్‌లో ప్రచారం చేయసాగారట. ఇద్దరు సినిమా కమెడియన్లు యీ ప్రచారంలో ప్రధానపాత్ర వహించారట. ఇది చూసి ఒక ముస్లిం సంస్థ 'నిరాధార ఆరోపణలతో మతసామరస్యాన్ని చెడగొడుతున్న వారిని అరెస్టు చేయాల'ంటూ పోస్టర్లు అంటించిందట. నిజానికి స్వాతికి ఒక ముస్లిము స్నేహితుడున్నాడు. అతనే స్వాతి గురించి, రామ్‌కుమార్ గురించి పోలీసులకు సమాచారాన్నిచ్చి విచారణకు సాయపడ్డాడట. రామ్‌కుమార్ ఏ కులంలో పుట్టినా, ఎంత దారిద్ర్యంలో మగ్గినా కేవలం తనను ప్రేమించలేదన్న కోపంతో స్వాతిని హత్య చేయడం అమానుషం. అతనే చంపాడని స్టేషన్లో వున్న బుక్‌స్టాల్ ఓనరు ప్రత్యక్షసాక్షి. వీధుల్లోని సిసిటివి కెమెరాల్లో అతని ఫోటో పడింది. అతను హత్య చేయలేదేమోనని సందేహించేవారు ఫలానావారికి మోటివ్ వుంది, అవకాశం వుంది అంటూ యితరుల వైపు వేలెత్తి చూపగలగాలి. ఇంతటి ఓపెన్ అండ్ షట్ కేసును పోలీసులు మిస్‌హేండ్లింగ్‌తో భ్రష్టు పట్టించి అనవసరంగా అనుమానాలకు, కులపరమైన వాగ్వివాదాలకు తావిచ్చారు.

రామ్‌కుమార్ గురించి వెతకడంలో జరిగిన ఆలస్యం సహేతుకమే కావచ్చు. కానీ అతన్ని పట్టుకోవడంలో చేసిన డ్రామా ఎవరికీ అర్థం కాలేదు. హత్య చేశాక రామ్‌కుమార్ తన వూరికి పారిపోయాడు. అది కేరళ సరిహద్దుకు దగ్గరగా వున్న మీనాక్షిపురం అనే గ్రామం. పోలీసుల కథనం ప్రకారం – 'ఇద్దరు పోలీసులు మఫ్టీలో ఆ గ్రామంలో మాటు వేసి రోజంతా రామ్‌కుమార్ కదలికలను గమనిస్తూ వున్నారు. అతను గొఱ్ఱెలను మేపుతూండడం గమనించారు. చివరకు రాత్రి 11.30కు మరి కొందరు పోలీసులతో కలిసి అతని యింటిపై దాడి చేయడానికి నిశ్చయించుకుని ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా నిలిపేసి, వెళ్లి అతన్ని పట్టుకున్నారు. అప్పుడతను బ్లేడుతో పీక కోసుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించి, ఆ పై అరెస్టు చేశారు.' ఇక్కడ తలెత్తిన ప్రశ్నలేమిటంటే – అంత చిన్న గ్రామంలో యిద్దరు పోలీసులు, ఎంత మఫ్టీలో వున్నా – గ్రామస్తుల కంటపడకుండా పొద్దున్నించి తిరగగలరా? రామ్‌కుమార్ టెర్రరిస్టు కాదు, అతన్ని పట్టుకోవడానికి యింత హంగామా ఎందుకు? ఇవన్నీ చాలనట్లు ఎగ్మూరు మెట్రోపాలిటన్ కోర్టులో రామ్‌కుమార్ తనేమీ ఆత్మహత్యాప్రయత్నం చేయలేదని, పోలీసులతో బాటు వచ్చిన సాదాదుస్తులవారు తన పీక కోయడానికి చూశారని చెప్పాడు. ఎందుకైనా మంచిదని అతనిలో ఆత్మహత్యాధోరణులు పోగొట్టడానికి కౌన్సిలింగ్ సెషన్లు యిప్పించారు. చివరకు ఆత్మహత్య (?)తోనే అతని జీవితం ముగిసింది.

రామ్‌కుమార్ తరఫున అడ్వకేట్ "అతని మరణానికి ఒక రోజు ముందు 'ఈ హత్యలో నాతో బాటు మరి కొందరున్నారు. ముందే బయటపెడితే నా ప్రాణానికి హాని కాబట్టి కోర్టులోనే అన్నీ చెప్తాను' అన్నాడు. అరెస్టు చేసి 90 రోజులైనా పోలీసులు చార్జి షీటు ఫైల్ చేయలేకపోయారు కాబట్టి బెయిలు వస్తుందని మాకు చాలా ధీమాగా వుంది. సెప్టెంబరు 20 న బెయిలు కోసం అప్లయి చేయాల్సి వుంది. కానీ దానికి రెండు రోజుల ముందే అతను ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెప్తున్నారు. నమ్మశక్యంగా లేదు." అంటున్నాడు. జైల్లో ఆత్మహత్య మాట ఎలా వున్నా రామ్‌కుమార్‌పై కేసు దృఢంగానే వుందంటున్నారు విచారణాధికారి. 'హత్యాస్థలంలో కారిన రక్తం, దొరికిన ఆయుధం, రామ్‌కుమార్ చొక్కా యివన్నీ తమిళనాడు ఫోరెన్సిక్ సైన్స్ లాబ్‌కు పంపాం. ఆ రిపోర్టులు రాగానే హంతకుడెవరో నిర్ద్వంద్వంగా తేలిపోతుంది.' అంటున్నాడాయన. దాని మాట ఎలా వున్నా, జైల్లో ఆత్మహత్య మాత్రం చాలా వింతగా, నమ్మడానికి అసాధ్యంగా వుంది. తమిళనాడులో నాలుగు రోజుల కోసారి జైల్లో ఒకడు చచ్చిపోతున్నాడు. 2000 నుండి 2013 మధ్య 1155 మంది చనిపోయారు.

ఇక రామ్‌కుమార్ మరణానికి వస్తే అతను చెన్నయ్‌కు దగ్గర్లో వున్న పుళల్ సెంట్రల్ ప్రిజన్‌లో హై సెక్యూరిటీ జోన్ ఐన రెండవ బ్లాకులోని డిస్పెన్సరీ వార్డులో సాయంత్రం 4.35 కు కరంటు తీగను పళ్లతో కొరికి చనిపోయాడంటున్నారు. సంఘటనకు ప్రత్యక్షసాక్షులెవరూ లేరు కానీ యిద్దరు వార్డర్లు, యిద్దరు జైలు అధికారులు ఆ దరిదాపుల్లోనే ఎక్కడో వున్నారంటున్నారు. ఆ జైలును 2006లోనే అధునాతనంగా కన్సీల్డ్ వైరింగుతో కట్టారు. వైర్లు సాలెగూళ్లలా వేళ్లాడే ప్రశ్న లేదు. ఇతను ఏదైనా స్విచ్‌బోర్డు దగ్గరకు వెళ్లి దాన్ని తెరిచి, వైరు బయటకు లాగి, నోట్లో పెట్టుకోవడం ఆ సెక్యూరిటీ జోనులో ఎలా సాధ్యపడింది? సిసిటివి కెమెరాలున్నాయా? ఎవరు గమనించారు? ఎప్పుడు మెయిన్స్ ఆఫ్ చేసి, విద్యుత్ సరఫరా నిలిపివేశారు? ఆ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స ఎలా జరిగింది? దగ్గర్లో వున్న ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నగరమధ్యంలో వున్న రాయపేట హాస్పటల్‌కు ఎందుకు తీసుకెళ్లారు? ఆసుపత్రికి తీసుకు వచ్చేటప్పటికే అతను చచ్చిపోయాడని అక్కడి వైద్యులన్నారు. దారిలోనే పోయాడా? ఎప్పుడు? – ఇలా అన్నీ ప్రశ్నలే. ఏదైనా ఉన్నతస్థాయి విచారణ కమిషన్ వేసి నిజాలు వెలికితీస్తే తప్ప అసలు సంగతి బోధపడదు. రామ్‌కుమార్ కానీ, స్వాతి కానీ ప్రముఖ కుటుంబాలకు చెందినవారైతే పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించారన్న అనుమానం వచ్చేది. ఇక్కడ అదేమీ లేదు కాబట్టి రామ్‌కుమార్ ఎవరో పలుకుబడి వున్న వ్యక్తుల పేర్లు బయటపెడతానని బెదిరించి వుంటాడని, అందుకనే అతని కథ యిలా ముగిసిందని అనుమానం వస్తుంది. అయితే తమిళనాడులో నెలకొన్న కులఘర్షణల వాతావరణంలో దానికి కులం రంగు పులుముతారన్న భయమూ వేస్తుంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**అక్టోబరు 03, 04** **ఎమ్బీయస్ : పాతపద్ధతులకే మళ్లిన ఎస్పీ**

ఉత్తర ప్రదేశ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్నదానిపై అఖిలేశ్‌కు, పార్టీలో యితర నాయకులకు ఘర్షణ వుందన్న సంగతి అందరికీ తెలుసు. తమ పార్టీ నేరపూరిత రాజకీయాలకు పేరుబడింది కాబట్టి నేరచరిత్ర వున్నవాళ్లను పక్కకు నెట్టేసి, అభివృద్ధి అనే నినాదంపై ఓట్లడుగుదామని అఖిలేశ్ వాదన. అవేమీ చెల్లవు, యిక్కడంతా కుల, మతరాజకీయాలే, నేరచరిత్ర వున్నా ఓటర్లు పట్టించుకోరు అని ములాయం, అతని సోదరుడు శివలాల్, యితర సీనియర్ల వాదన. విభేదాలు యిటీవల రచ్చకెక్కి చివరకు రాజీ కుదుర్చుకున్నారు. అయితే పాతతరం వారు అఖిలేశ్‌కు బుద్ధిగరపడానికే నిశ్చయించుకున్నారని నిన్న తేలిపోయింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో శివపాల్ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో 14 మంది పార్టీ అభ్యర్థులను మార్చేశాడు – పార్టీ రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు చైర్మన్ అయిన అఖిలేశ్‌కు మాటమాత్రం చెప్పకుండా! మార్చివేసినవారిలో అఖిలేశ్‌కు సన్నిహితులు కొందరున్నారు. కొత్తగా టిక్కెట్లు పుచ్చుకున్న ఏడుగురిలో అమన్‌మణి త్రిపాఠి సంగతి చూస్తే నేరస్తుల పట్ల పార్టీ వైఖరి తేటతెల్లమౌతుంది. యుపి కాబినెట్‌లో మంత్రిగా చేసిన అమర్‌మణి త్రిపాఠి తన భార్య మధుమతి తో కలిసి తన ప్రియురాలు కలిసి మధుమితా శుక్లాను హత్య

చేసిన కేసులో జైల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. అతని కొడుకే యీ అమన్. ఇతను ప్లాను వేసి 2015లో తన భార్య సారాను చంపించాడన్న ఆరోపణపై సిబిఐ విచారణ ఎదుర్కుంటున్నాడు. దానికి తోడు కిడ్నాపుల కేసులు కూడా వున్నాయి. అలాటివాడికి టిక్కెట్టిచ్చి 'నేరస్తులకు మా పార్టీలో చోటుండదు' అని చెప్పుకుంటున్న అఖిలేశ్‌ను వెక్కిరించినట్లయింది.

అంతకు ముందు సెప్టెంబరు 19 న అఖిలేశ్‌కు సన్నిహితులైన 7గురు పార్టీ నాయకులను శివపాల్ పదవుల నుంచి తొలగించాడు. వారిలో యిద్దరు ఎమ్మెల్సీలు. ములాయం సింగ్ యూత్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అధ్యక్షుడు, సమాజ్‌వాదీ యువజన్ సభ రాష్ట్ర అధిపతి, సమాజ్‌వాదీ ఛాత్ర సభ రాష్ట్ర అధిపతి తక్కినవారు. దాంతో వారు, వారి అనుయాయులు పార్టీ నుంచి రాజీనామా చేయసాగారు. పార్టీ విడిచి వెళ్లవద్దని అఖిలేశ్ వారికి నచ్చచెప్పుతున్నాడు. 'మా నాన్న సంతోషం గురించి నేనేదైనా చేస్తాను. కానీ బయటివారి జోక్యాన్ని సహించను' అన్నాడు. బయటివారంటే అమర్ సింగ్ అని అందరికీ తెలుసు. అతనూ, యుపి చీఫ్ సెక్రటరీ సింఘాల్, యితర ఉన్నతాధికారులు కలిసి రూ.12,000 కోట్ల సమాజ్‌వాదీ పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టును అమర్ సింగ్‌కు కావలసిన కాంట్రాక్టరుకు అప్పగిద్దామని ప్రయత్నించారని, ములాయం కుటుంబీకులను కూడా ఒప్పించారని విన్నాకనే అఖిలేశ్ మండిపడ్డాడు. అతని దగ్గర ఆడియో సాక్ష్యం కూడా వుందట. పైగా చీఫ్ సెక్రటరీ సింఘాల్ అమర్ సింగ్ పార్టీలో కూర్చుని తనను ఎగతాళి చేస్తూ జోకులు వేశాడని వినగానే అతన్ని బదిలీ చేసేశాడు. శివపాల్ నుంచి పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటుని తను తీసేసుకున్నాడు. వీటన్నిటినీ శివపాల్ విమర్శిస్తున్నాడు. 'మా అందరి కష్టంతో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న అఖిలేశ్ ఒంటెత్తు పోకడలు పోకూడదు. మా సలహాలు వినాలి.' అంటున్నాడు. దీనికి ములాయం మద్దతుంది.

2012లో శివలాల్ తన అన్నగారితో చెప్పాడట – 'నువ్వు యిప్పుడే అఖిలేశ్‌ను ముఖ్యమంత్రి చేయకు. నువ్వే ముఖ్యమంత్రిగా వుండి 2014 వరకు పాలించు. అప్పుడు జరిగే పార్లమెంటు ఎన్నికలలో నువ్వు పోటీ చేసి, ఢిల్లీకి వెళ్లి ప్రధాని అయిపో. అప్పుడు అఖిలేశ్‌ను సిఎంగా చేసినా ఫర్వాలేదు.' అని. 'అతని మాట విని వుంటే నేనీ పాటికి ప్రధానిని అయిపోయేవాణ్ని. అఖిలేశ్‌ను సిఎం చేయడం చేశాం, అతను చెప్పినవాళ్లకు టిక్కెట్లిచ్చాం. దానివలన మాకు 2014లో 5 సీట్లు మాత్రమే వచ్చాయి' అని ములాయం బహిరంగంగా బాధపడ్డాడు. 2014లో మోదీ హవా దేశమంతా వీచిందని అందరికీ తెలుసు. తను ప్రధాని అయ్యేవాణ్నని ములాయం ఎలా అనుకుంటున్నాడో అతనికే తెలియాలి. అఖిలేశ్ అమర్ సింగ్‌ను దూరం పెట్టడం, అతను ఫోను చేసినా తీయకపోవడం ములాయంకు నచ్చటం లేదు. 'కేంద్రప్రభుత్వం నాపై సిబిఐ కేసు పెట్టి జైలుకి పంపాలని చూస్తోంది. ఈ విషయంలో నాకు మద్దతుగా నిలిచింది అమర్ సింగే. అతనికి మనం యిచ్చిన రాజ్యసభ సీటు చాలా చిన్నది.' అంటాడు. తన తండ్రి ఆలోచనా ధోరణితో విసిగిపోయిన అఖిలేశ్ తండ్రికి దూరంగా జరుగుతున్నాడు. అతను యిన్నాళ్లూ తన అధికారిక నివాసంలో ఆఫీసు మాత్రం పెట్టుకుని తండ్రి యింట్లోనే భార్యాబిడ్డలతో వుంటున్నాడు. ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రులందరికీ బంగళాలు కేటాయించింది. తనకు కేటాయించిన భవన నిర్మాణం యింకా పూర్తి కాకపోవడంతో అఖిలేశ్ తండ్రి యింట్లోనే వున్నాడు. ఇప్పుడు ఆ యిల్లు పూర్తయింది కాబట్టి అక్కడకు వెళ్లిపోతానంటున్నాడు.

యుపిలో రాజకీయ పరిస్థితి క్లిష్టంగానే వుంది. అవినీతి, బంధుప్రీతి, నేరాల పెరుగుదల, మతఘర్షణల గురించి చర్చిస్తూనే కులాల సమీకరణ కూడా జరుగుతోంది. బ్రాహ్మణుల ఓట్ల కోసం అందరూ ప్రయత్నిస్తున్నారు. జనాభాలో 13% వున్న వీరు 20 పార్లమెంటు స్థానాల్లో కీలకమైన ఓటు బ్యాంకు. ఉత్తర యుపిలో చాలా నియోజకవర్గాలలో ఫలితాన్ని ప్రభావితం చేయగలరు. యుపిలో బ్రాహ్మణ ఓటర్లతో వున్న చిక్కేమిటంటే వాళ్లు ఏ పార్టీని అంటిపెట్టుకుని వుండరు. యాదవులైతే ఎస్పీకి, దళితులైతే బియస్పీకి వేస్తారన్న అంచనా వుంటుంది. చాలా ఏళ్ల పాటు బ్రాహ్మణులు, రాజపుత్రులతో బాటు కాంగ్రెసుకే ఓటేసేవారు. ప్రతి కాబినెట్‌లో 8 నుంచి 10 మంది దాకా బ్రాహ్మణ మంత్రులుండేవారు. కొంతకాలానికి బిసి ఓట్ల కోసం కాంగ్రెసు వీరి ప్రాధాన్యత తగ్గించి, వారికి టిక్కెట్లిచ్చింది. అయినా బిసిలు ఎస్పీ వైపే మొగ్గారు. 2012 ఎన్నికలలో బ్రాహ్మణ అభ్యర్థులకు బిజెపి 80, బియస్పీ 74 టిక్కెట్లివ్వగా ఎస్పీ 45 యివ్వగా, కాంగ్రెసు 43తో సరిపెట్టింది. కాంగ్రెసు తమని నిర్లక్ష్యం చేస్తోందని బ్రాహ్మణులు అనుకుని దూరమయ్యారు. ప్రతి ఎన్నికకూ పార్టీని మార్చేస్తున్నారు కాబట్టి యీసారి వారిని ఆకట్టుకోవాలని అన్ని పార్టీలు ప్రయత్నించి చూస్తున్నాయి. వారి జనాభా 20% వున్న ప్రాంతాల్లో అన్ని పార్టీలు బ్రాహ్మణ సమ్మేళనాలు పెడుతున్నారు.

సతీశ్ మిశ్రా అనే బ్రాహ్మణ రాజకీయవేత్త సలహాతో బ్రాహ్మణ ఓట్ల విలువను మాయావతి 2007లో గుర్తించింది. అప్పటిదాకా "తిలక్, తరాజూ, ఔర్ తల్వార్ (బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియు చిహ్నాలైన తిలకం, త్రాసు, కత్తి) – ఇన్‌కో మారో జూతే చార్ (వీళ్లను చెప్పులతో నాలుగు దెబ్బలు కొట్టు – చెప్పులు అనడంలో దళిత చిహ్నం గోచరిస్తుంది)" అనే నినాదంతో పైకి వచ్చిన బియస్పీ హఠాత్తుగా బ్రాహ్మణులతో పొత్తు పెట్టుకుని 89 స్థానాలు వాళ్లకు కేటాయించింది. కానీ 206 సీట్లతో గెలిచాక వాళ్లను నిర్లక్ష్యం చేసింది. తమపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు అన్యాయంగా బనాయించిందని వారు ఫిర్యాదు చేశారు. తమను మోసం చేసిందన్న భావనతో వున్న బ్రాహ్మణులకు 2012లో 74 స్థానాలిచ్చింది. 19% బ్రాహ్మణులు మాత్రమే ఓటేశారు. ఇతర కారణాలు కూడా కలిసి, బియస్పీకి మొత్తం 80 సీట్లు మాత్రమే వచ్చాయి. దళిత, బ్రాహ్మణ, ముస్లింల (డిబిఎం) జనాభా కలిపితే 49% కాబట్టి 2014 పార్లమెంటు ఎన్నికలలో వాళ్ల ఓట్లు పడితే చాలు గెలవవచ్చని ఆశిస్తూ దళితుల కంటె ఎక్కువగా బ్రాహ్మణులకు 21, ముస్లిములకు 17 సీట్లు యిచ్చింది. అయినా మోదీ హవాలో అన్ని లెక్కలూ కొట్టుకుపోయాయి. 2017 ఎన్నికలలో కూడా "బ్రాహ్మణ్ శంఖ్

బజాయేగా, హాథీ బఢ్‌తా జాయేగా" (బ్రాహ్మణుడు శంఖం పూరిస్తాడు, ఏనుగు (బియస్పీ ఎన్నికల గుర్తు) ముందుకుముందుకు సాగుతుంది) అనే నినాదం అందుకుంది. బ్రాహ్మణ్ భాయిచారా (సోదరత్వ) సమితి అని పెట్టి సమావేశాలు నిర్వహించి యీసారి 80 సీట్లిస్తానని చెప్తోంది.

ఇంతలో బియస్పీకి చెందిన బ్రజేశ్ పాఠక్ అనే బ్రాహ్మణ నాయకుణ్ని బిజెపి లాక్కుంది. దాంతో ఉలిక్కిపడిన మాయావతి బియస్పీ దళిత నాయకుడు సంజయ్ భారతి జూన్‌లో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టింగులు పెడితే అతన్ని పార్టీలోంచి తీసేసింది. సతీశ్ మిశ్రాకు మూడోసారి రాజ్యసభ సభ్యుడిగా చేసింది. ప్రస్తుతం డిబిఎం ఫార్ములానే మాయావతి నమ్ముకుంది. మాయావతి దళితుల్లో 55% వున్న జాతవ్ కులానికి చెందినది. 2014 పార్లమెంటు ఎన్నికలలో వారు తప్ప తక్కిన దళితులు మోదీకి ఓటేశారు. అందువలన 19.6% ఓట్లు వచ్చినా ఒక్క సీటు కూడా రాలేదు. ఇప్పుడు మోదీ అభ్యర్థి కాదు కాబట్టి మాయావతి ఆశలు పెట్టుకుంటోంది. బిజెపి విషయానికి వస్తే అది బియస్పీతో కలిసి 1995, 1997, 2002-03ల్లో కలిసి పోటీ చేసింది. ప్రతీసారి బియస్పీయే లాభపడింది. బియస్పీ ఎదిగిన కొద్దీ బిజెపి మరింత దిగాలు పడింది. 1996లో 174 అసెంబ్లీ సీట్లున్న ఆ పార్టీ 2002 నాటికి 88 తెచ్చుకుంది. 2007లో బిస్పీ అధికారంలోకి వచ్చినపుడు 51 సీట్లు మాత్రమే తెచ్చుకుంది. పార్లమెంటు సీట్ల విషయానికి వస్తే 1996లో 52 వుంటే, 2004కి 10 వచ్చాయి. 2009కి మరీ దిగజారింది. కానీ 2014 వచ్చేసరికి మోదీ ప్రభంజనంతో 42% ఓట్లతో 71 సీట్లు గెలిచింది. ఇప్పుడు ఆ వూపు తగ్గినా జాతవేతర దళితులను ఆకర్షించడానికి బిజెపి యత్నిస్తోంది.

కాంగ్రెసు నిర్లక్ష్యం చేశాక బిజెపి బ్రాహ్మణులను అక్కున చేర్చుకుంది. గత ఎన్నికలలో బ్రాహ్మణులకు 80 సీట్లు యిచ్చి వారి ఓట్లలో 38% (2007లో కంటె 6% తక్కువ) గెలుచుకుంది. ఈ మధ్య దాకా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా వున్న లక్ష్మీకాంత్ బాజపాయ్ బ్రాహ్మణుడే. అయితే ఏప్రిల్ నెలలోనే కేశవ్ ప్రసాద్ మౌర్యా అనే బిసి నాయకుణ్ని అధ్యక్షుడిగా చేశారు. ఇటీవలి కాలంలో బిజెపి దళితులలో కొన్ని వర్గాలను, (మోదీ బిసి అనే అంశాన్ని గుర్తు చేస్తూ) బిసిలను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటిదాకా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ క్రమంలో తమను కొంచెం వెనక్కిపెడుతోందని బ్రాహ్మణుల అనుమానం. ఆ అనుమాన్ని ఎన్‌క్యాష్ చేసుకోవాలని కాంగ్రెసు యత్నం. అందుకే బ్రాహ్మణుల యింటి కోడలైన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. స్వయంగా బ్రాహ్మణుడైన కాంగ్రెసు ఎన్నికల సలహాదారు ప్రశాంత కిశోర్ (అతన్ని పికె అని పిలుస్తున్నారు) యుపి ఫలితాలను పూర్తిగా శాస్త్రీయ అధ్యయనం చేసి బ్రాహ్మణులను వెనక్కి తెచ్చుకుంటే కాంగ్రెసుకు ఓ మాదిరిగానైనా సీట్లు వస్తాయని తేల్చాడు. 2009 పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెసుకు బ్రాహ్మణులు ఓటేసినపుడు 80లో 21 సీట్లు వచ్చాయి. 2014 వచ్చేసరికి వాళ్లు బిజెపివైపు పూర్తిగా తిరిగిపోవడంతో కాంగ్రెసుకు ఒక్క సీటూ దక్కలేదు. అందుకే యీ సారి అసెంబ్లీ ఎన్నికలలో అందరి కంటె ఎక్కువగా కనీసం 100-125 సీట్లు బ్రాహ్మణులకు యివ్వాలని ప్రతిపాదిస్తున్నాడు. అంతేకాదు, రాహుల్ రోడ్ షో మొదటి విడత దేవరియా, గోరఖ్‌పూర్, గాజీపూర్, ఆజమ్‌గఢ్ వంటి తూర్పు యుపి ప్రాంతాలలో సాగేట్లు ప్లాను చేశాడు. అంతేకాదు, 26 ఏళ్లగా నెహ్రూ వంశీకులు వెళ్లడం మానేసిన అయోధ్యకు పంపాడు. అయోధ్య, వారణాశి, అలహాబాద్ బ్రాహ్మణులకు కంచుకోటలు.

ప్రశాంత్ కిశోర్ ప్లానింగ్‌తో బాటు పార్టీ నిర్మాణాన్ని కూడా పర్యవేక్షిస్తున్నాడు. సీనియర్ నాయకులకు కూడా పాఠాలు నేర్పుతున్నాడు. లఖ్‌నవ్‌లో రాహుల్ గాంధీ కార్యక్రమం ఏర్పాటు చేసినపుడు ప్రతి అసెంబ్లీ సెగ్మెంటు నుంచి 15 మంది చొప్పున రావాలని శాసించి అమలు చేశాడు. గతంలో అయితే కొందరు లీడర్లు తమ అనుయాయులతో సభాస్థలిని నింపేసేవారు. ప్రశాంత్ ముఖ్యంగా గ్రామీణ ఓటర్లపై దృష్టి పెట్టాడు. మన దగ్గర లాగానే ఋణమాఫీ ఆఫర్ చేస్తున్నాడు. 'కర్జ్ మాఫ్, బిజిలీ బిల్ హాఫ్, సమర్థన్ మూల్యా కా కరో హిసాబ్' (అప్పులు మాఫీ, కరంటు బిల్లు సగానికి సగం మాఫీ, మద్దతు ధర పెంచుతాం) అని కాంగ్రెసు నినాదం. తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి వేలాది కిసాన్ మాంగ్ (డిమాండ్) పత్రాలు పూరూరా పంచుతున్నారు. ఆ పత్రాల్లో రైతులు తమ పేరు, విలాసం, టెలిఫోన్ నెంబరు, బ్యాంకులకు బాకీ పడిన అప్పు వివరాలు రాసి యివ్వాలి. తక్కిన మాట ఎలా వున్నా ఓటర్ల ఫోన్ నెంబర్లు పార్టీ చేతికి చిక్కినట్లే. ఎన్నికల టైములో ప్రచారమంతా సెల్‌ఫోన్ల ద్వారా చేసుకోవడానికి అనువుగా వుంటుంది. గతంలో అయితే యివి పార్టీ ఆఫీసుల్లో పడి వుండడమో, పార్టీ బలంగా వున్న చోట పంచడమో జరిగేది. కానీ ప్రశాంత్ కిశోర్ సోనియా గాంధీ బొమ్మ స్టిక్కర్ అంటించిన యీ పత్రాలను 901 బ్లాకుల్లో యింటియింటికీ చేరేట్లు చేయగలిగాడట. ప్రతీ ఎన్నికల బూతు నుంచి అయిదుగురు వాలంటీర్లను ఎంపిక చేసి, విజయావకాశాలున్న అభ్యర్థుల పేర్లు చెప్పమంటున్నాడు.రాహుల్ చేత కిసాన్ యాత్ర చేయించినప్పుడు రాహుల్ తమ యుపిఏ హయాంలో రైతులకు ఏమేమి చేసిందో ఏకరువు పెట్టి, ప్రస్తుత దుర్భర పరిస్థితిని ఎత్తి చూపించాడు.

"నిజానికి ప్రశాంత్ చేస్తున్న పనులు అసాధ్యమైనవేమీ కావు. మేమే చేసి వుండవచ్చు. కానీ ఒకరితో మరొకరం కొట్టుకు ఛస్తూ ఏమీ చేయడం మానేశాం. అందువలననే బయటి వ్యక్తి వచ్చి చెప్పవలసి వస్తోంది. బిజెపి విషయంలో అమిత్ షా వచ్చి అందరిలో కదలిక తెచ్చాడు. ప్రశాంత్ పడుతున్న కష్టం వలన 2017 కల్లా ఎంత గొప్ప ఫలితాలు వస్తాయో చెప్పలేం. 2012లో వచ్చిన 28 సీట్ల కంటె ఎక్కువైతే కచ్చితంగా వస్తాయి. అయితే పార్టీ వ్యవస్థ బాగుపడి, 2019 పార్లమెంటు ఎన్నికల నాటికి పోరాడే స్థితికి వస్తాం." అన్నాడు ఓ కాంగ్రెసు నాయకుడు.

ఇలా అన్ని పార్టీలు తమతమ బలాల్ని పెంచుకోవడానికి చూస్తూ ఉమ్మడి శత్రువైన ఎస్పీని ఎండగడుతున్నాయి. గత ఎన్నికల్లో

19% బ్రాహ్మణ ఓట్లు పడడంతో, బిసిల ఓట్లు కూడా కలవడంతో ఎస్పీ తరఫున నిలబడిన 45 మంది బ్రాహ్మణుల్లో 21 మంది గెలిచారు. తమ గెలుపుకు కారణమని గ్రహించిన ముఖ్యమంత్రి అఖిలేశ్ నాలుగేళ్లగా చాలా బ్రాహ్మణ సమావేశాలు ఏర్పాటు చేస్తూ వచ్చాడు. బ్రాహ్మణశక్తిని చాటిన పరశురాముడి జయంతిని యీ ఏడాది నుంచి పబ్లిక్ హాలిడేగా ప్రకటించాడు. బ్రాహ్మణులపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు విత్‌డ్రా చేస్తానంటున్నాడు. ఇలాటి సమయంలో ములాయం తన పార్టీ ప్రతిష్ఠ తనే తీసుకుంటున్నాడని చెప్పాలి. ప్రజాపతి అనే మంత్రిని అతను వెనకేసుకుని రావడంతోనే అవినీతిపరుల పట్ల ఎస్పీ ఎంత వుదారంగా చాటి చెప్పినట్లయింది.

ఒబిసి వర్గానికి చెందిన గాయత్రీ ప్రసాద్ ప్రజాపతి బహుజన్ క్రాంతి దళ్ అనే పార్టీ అభ్యర్థిగా 1993లో పోటీ చేస్తే 1526 ఓట్లు వచ్చాయి. తర్వాత ఎస్పీలో చేరి 1996లో, 2002లో పోటీ చేసినా ఘోరంగా ఓడిపోయాడు. 2007లో అతనికి టిక్కెట్టు యివ్వలేదు. ఆ తర్వాత అడ్డమార్గాల్లో బాగా సంపాదించి 2012 వచ్చేసరికి అమేఠీలో టిక్కెట్టు సంపాదించాడు. తన కాంగ్రెసు ప్రత్యర్థి సంజయ్ సింగ్ భార్య అమితా సింగ్‌పై డబ్బు విరజిమ్మి గెలిచాడంటారు. గెలవగానే శివపాల్ వద్ద యిరిగేషన్ శాఖలో సహాయమంత్రిగా చేరాడు. తర్వాత తన రియల్ ఎస్టేటు బిజినెస్‌లో భాగస్వామి ఐన ములాయం రెండో భార్య కొడుకు ప్రతీక్ యాదవ్ సిఫార్సుతో మైనింగ్ శాఖకు మంత్రి అయ్యాడు. 2014 ఎన్నికలకు ముందు కాబినెట్ హోదా దక్కించుకున్నాడు. అతనిపై ఎంతోమంది కేసులు పెట్టారు. కానీ అతను వాళ్లను బెదిరించి విత్‌డ్రా చేయించాడట. అమితాబ్ ఠాకూర్ అనే ఐపియస్ అధికారి, సామాజిక కార్యకర్త ఐన అతని భార్య నూతన్‌లు యితనిపై కేసు పెడితే సాక్షాత్తూ ములాయమే ఫోన్ చేసి బెదిరించాడట. ఆ విషయం వాళ్లే బయటకు చెప్పారు. తన ఆస్తి కాజేశాడని అమేఠీలో ఒక వితంతువు 2014లో ప్రజాపతికి వ్యతిరేకంగా లఖనవ్‌లో ధర్నా చేసింది. అతనిపై లోకాయుక్త దర్యాప్తు నడుస్తోంది. అక్రమ మైనింగ్ కేసులో సిబిఐ విచారణకు హైకోర్టు అనుమతి యిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో అఖిలేశ్ అతన్ని తీసేస్తే ములాయం పట్టుబట్టి అతన్ని వెనక్కి రప్పించాడు. శాఖ మార్చారంతే. ఇప్పుడు ప్రభుత్వం తరఫున హైకోర్టు తీర్పును సవాలు చేస్తున్నారు. పార్టీ యిమేజి మారుద్దామని చూస్తున్న అఖిలేశ్ నోరు మూయించి యివన్నీ జరిపిస్తున్న ఎస్పీకి ప్రజలు బుద్ధి చెప్తారో లేదో ఎన్నికల తీర్పే చెపుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 06, 07 వీక్లీకై ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 98**

**ఎమ్బీయస్ : ఓణమ్‌ను మరోలా..**

మలయాళీలందరూ ఎటువంటి భేదాలూ లేకుండా ఓణమ్‌ను ఘనంగా జరుపుకుంటారు. కలకత్తాలో దుర్గాపూజకు ఎంత హడావుడి జరుగుతుందో కేరళలో ఓణమ్‌కు అంత జరుగుతుంది. పంటలు యింటికి వచ్చే సమయం కాబట్టి, బయటి వూళ్లల్లో, రాష్ట్రాల్లో, దేశాల్లో వున్న వాళ్లందరూ యింటికి వస్తారు. వ్యాపారస్తులు ప్రత్యేక డిస్కౌంట్‌లిస్తారు, ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పడవల పోటీలు జరుగుతాయి. మతపపరమైన నేపథ్యం కొద్దిగా వుంది కానీ ప్రధానంగా సామాజికపరంగానే దీన్ని చూస్తారు. మతపరమైన విషయమేమిటంటే బలి చక్రవర్తి (మహాబలి) భూతలానికి వచ్చే రోజది. బలికి, కేరళకు లింకేమిటంటే కేరళను గతంలో మహాబలే పాలించాడట. అందుకే వాళ్ల భాషలో దాన్ని 'మావలినాడు' అంటారు. విష్ణువు వామనరూపంలో వచ్చి, త్రివిక్రముడై పాతాళానికి తొక్కేసినపుడు ఒక కోరిక కోరాడట. ఏడాదికి ఓ సారి భూమికి వచ్చి తన ప్రజలను చూస్తానని కోరితే విష్ణువు సరేనన్నాడట. అందువలన చింగమ్ మాసంలో తిరుఓణమ్ నక్షత్రం వున్న రోజున కేరళకు వస్తాడట. ఆ కథకు లింకు చేసి ఓణమ్ పండగ యాడ్స్‌లో మహాబలి బొమ్మలు, కారికేచర్స్ వేస్తారు. అతనో రాక్షసరాజు అని ఎవరూ ఫీలవరు. ఎందుకంటే మలయాళ జానపద గీతాల్లో మహాబలి కాలంలో ప్రజలందర్నీ హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా చూసి, అందర్నీ ఆనందంగా వుంచాడట. కేరళలో దీపావళిని కూడా మహాబలికే ముడిపెడతారు. అక్కడ నరకాసుర కథ చెప్పరు. కేరళకు మహాబలికి సంబంధం ఏమీ లేదని, కేరళను వామనుడి తర్వాతి అవతారమైన పరశురాముడు తన గొడ్డలితో సముద్రం నుంచి వెలికితీశాడని, అందువలన దాన్ని పరశురామ క్షేత్రమంటారని కొందరు వాదిస్తారు. కేరళలో ఏ ఉత్తర భాగాన్నో మహాబలి పాలించాడని, దక్షిణ కేరళను పరశు రాముడు వెలికి తీశాడని అనుకుంటే సరిపోతుంది. కానీ అలా అయితే మహాబలి ఆరాధన కాకపోయినా అతన్ని ఒకప్పటి రాజుగా గౌరవించడం కొనసాగుతుంది. అది ఆరెస్సెస్ వర్గాలకు రుచించటం లేదు.

ఇటీవలి కాలంలో దళిత స్పృహ పేరు మీద పురాణాలను తమ కిష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. నరకాసురుడు, మహిషాసురుడు, బకాసురుడు, హిడింబాసురుడు వగైరాలందరూ సడన్‌గా ఆరాధ్యదైవాలై పోయారు. వాళ్ల వాళ్ల కులాలు ఏమైనా, వాళ్లు రాజులుగా వుండి ప్రజల్ని పీడించుకుని తిన్నా వాళ్లందరి మీదా దళిత ముద్ర కొట్టేసి, వారికి అన్యాయం జరిగిపోయిందని గగ్గోలు పెట్టేవారు ఎక్కువై పోయారు. వాళ్లు దళితులనడానికి గాని, వాళ్లు ఫలానా మంచిపనులు చేశారని అనడానికి గాని వీళ్ల దగ్గర ఏ ఆధారమూ వుండదు. పురాణాలన్నీ పుక్కిటి పురాణాలు, వాటిని తుంగలోకి తొక్కాలి అనేవాళ్లు హఠాత్తుగా వాటిలో పాత్రలను చారిత్రక పాత్రలుగా చిత్రీకరించ సాగారు. దేవుళ్లను నమ్మం కానీ అసురులను నమ్ముతాం అనసాగారు. అక్కడితో ఆగకుండా దేవీదేవతలను నీచులుగా, శీలం లేనివారిగా చిత్రీకరించసాగారు.

తరతరాలుగా కేరళలో నడుస్తున్న మహాబలి పూజ కూడా యీ ధోరణిలో భాగమే అనిపించింది కేరళ ఆరెస్సెస్ వారికి హఠాత్తుగా.

వాళ్లు నడిపే "కేసరి" అనే పత్రిక సంపాదకుడు ఎన్.ఆర్.మధు "మహాబలి ఎంత గొప్ప రాజైనా వామనుణ్ని విలన్‌గా చూపించడం తగదు. నిజానికి మహాబలి పాలించిన దేశం నర్మదా నదీతీరంలో వుంది. వామనుడి తర్వాతి అవతారమైన పరశురాముడు సృష్టించిన ప్రాంతం కేరళ! క్రిస్మస్‌కు శాంతాక్లజ్ బొమ్మ వాడుతున్నట్లు కేరళలో ఓణమ్‌కు మహాబలి బొమ్మ వాడేసి పిల్లలకు ఆత్మీయుణ్ని చేసేస్తున్నారు." అని వాదిస్తున్నాడు. ఆయన పత్రికలో ఓణమ్‌కు ముందే ఒక వ్యాసం వచ్చింది – 'గతంలో ఓణమ్‌ను వామనజయంతిగా నిర్వహించేవారని, తర్వాత్తర్వాత మహాబలి పునరాగమనానికి లింకు పెట్టారని'. నిజానికి వామనజయంతి భాద్రపద శుద్ధ ద్వాదశినాడు! ప్రహ్లాదుడికి మనుమడైన మహాబలి యింద్రలోకాధిపత్యం కోసం 99 అశ్వమేధయాగాలు చేశాడు. నూరోది పూర్తి చేస్తే తన పదవికి ఎసరు వస్తుందని భయపడిన ఇంద్రుడు విష్ణువు శరణు జొచ్చితే, అతడు కశ్యపుడు తండ్రిగా, అదితి తల్లిగా వామనుడిగా పుట్టాడు. ఉపనయనం జరిగాక బలి చేసే యాగస్థలికి వెళ్లి మూడడుగులు దానం అడగడం, శుక్రాచార్యుడు వద్దంటున్నా బలి దానమిస్తాననడం, వామనుడి త్రివిక్రముడై ఒక పాదంతో భూమిని, మరో పాదంతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడో పాదంతో బలిని పాతాళానికి తొక్కివేయడం అందరికీ తెలిసున్న కథే. మన తెలుగు కాలండరులో చూస్తే సెప్టెంబరు 13 వామనజయంతి, 14 ఓణం పండగ. అలాటప్పుడు రెండిటిని కలిపేసి, ఆ వ్యాసకర్త ఓణాన్ని వామనజయంతిగా నిర్వహించాలని ఎందున్నాడో తెలియదు.

ఈ వ్యాసం రాగానే వామనజయంతి నాడు ఆరెస్సెస్ సంస్థ నుంచి బిజెపిలోకి వచ్చి అధ్యక్షుడిగా వెలుగుతున్న అమిత్ షా 'వామనజయంతి శుభాకాంక్షలు' అంటూ మహాబలి నెత్తి తొక్కుతున్న వామనుడి బొమ్మ వున్న పోస్టరుతో సహా ట్వీట్ చేశాడు. ఇక దాంతో మలయాళీలందరూ మండిపడ్డారు. కులమతాలకు అతీతంగా మలయాళీలందరూ జరుపుకుంటున్న ఓణమ్‌కు వామనజయంతి రంగు పులమడం దేనికి? అని. నిజానికి నంబూద్రిపాద్‌తో సహా కమ్యూనిస్టులు కూడా కేరళ ఒకప్పుడు మహాబలి రాజ్యం అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. ఎందుకంటే సోషలిస్టు సమాజం చెప్పే సర్వసమానత్వం, గొప్పాబీదా తేడా లేకపోవడం యివన్నీ మహాబలి కాలంలో వుండేవనే ప్రగాఢ నమ్మకం మలయాళీలలో వుంది కాబట్టి. ఓణమ్‌లో వ్యాపారస్తులు మహాబలిని ఆహ్వానిస్తున్న పోస్టర్లతో వస్తువులు అమ్ముతారు, ప్రభుత్వం కూడా 'మావెలి స్టోర్స్' అనే పేర చౌకధరల దుకాణాలలో సరుకులు అమ్ముతుంది. అలాటిది సడన్‌గా మహాబలిని పక్కన పడేసి, అతన్ని తొక్కేసిన వామనుణ్ని హైలైట్ చేయడం దేనికంటూ విమర్శలు వచ్చాయి.

నిజానికి పండగ ఒకటే అయినా దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ కారణాలతో జరుపుకుంటారు. విజయదశమిని బెంగాల్ వారు మహిషాసురుడిపై దుర్గ విజయంగా నిర్వహిస్తే, ఉత్తర భారతంలో రాముడు రావణుడిపై గెలిచిన రోజుగా పరిగణించి రామ్‌లీలా నిర్వహిస్తారు. దీపావళిని మనం నరకాసుర వధకై జరుపుకుంటే, మార్వాడీలు లక్ష్మీపూజకై జరుపుకుంటే, జైనులు మహావీరుణ్ని స్మరిస్తూ, సిఖ్కులు వాళ్ల ఆరవ గురు హర్‌గోవింద్‌ను స్మరిస్తూ చేస్తారు. బెంగాల్‌లో కాళీపూజగా అనుకుంటే, గుజరాత్‌లో కృష్ణుడి రాసక్రీడలను గుర్తు చేసుకుంటారు. కేరళ వాళ్ల ఓణమ్‌కు ఆరెస్సెస్ వారు వేరే రంగు పులమడం దేనికి అని విమర్శలు రాగానే యింత రియాక్షన్ ఎదురు చూడని ఢిల్లీ బిజెపి నాయకులు వెంటనే 'వామనజయంతిని తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో నిర్వహించుకుంటారు. వారి కోసం ఆ ట్వీట్' అని వాదించారు. వామనజయంతికి మన తెలుగువాళ్లలో ఒకరినొకరు కానీ, నాయకులు ప్రజలను కానీ గ్రీట్ చేయగా నేనెప్పుడూ చూడలేదు. అమిత్ షా హిందూ ధర్మాన్ని గొప్పగా పాటిస్తున్నాడు కాబట్టి.. అనుకుందామంటే భీష్మ ఏకాదశికి కూడా యిచ్చి వుండాల్సింది. ఇచ్చాడా? గత ఏడాది వామనజయంతికి ట్వీట్ చేశాడో లేదో తెలియదు. చివరకు గొడవ చల్లార్చడానికి వామనజయంతి మర్నాడు అమిత్ షా 'హేపీ ఓణమ్' కూడా ట్వీట్ చేశాడు. ఏం చేసినా, ఆరెస్సెస్ పత్రిక చేస్తున్న ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని అమిత్ షా కేరళ సమాజాన్ని మతపరంగా చీల్చడానికి చూస్తున్నాడనే భావం మలయాళీల మనసులో నాటుకుంటోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

## ఎమ్బీయస్ : అమెరికా వైపు మొగ్గిన బ్రెజిల్

భవిష్యత్తులో ఎదగడానికి చక్కటి అవకాశాలున్న దేశాల కూటమిగా పేరు తెచ్చుకున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా)లో ఇండియాను అమెరికా యిటీవలి కాలంలో తన వైపు లాక్కుంది. బ్రెజిల్‌ను లాక్కోవడం కూడా ఆగస్టులో పూర్తయింది. బ్రెజిల్‌లో రగులుకున్న రాజకీయసంక్షోభం గురించి విపులంగా యీ కాలమ్‌లో మే నెలలో రాయడం జరిగింది. అమెరికా ప్రేరేపిత 1964 నాటి సైనికకుట్ర బాధితురాలిగా, వర్కర్స్ పార్టీ నాయకురాలిగా దిల్మా రూసెఫ్ అమెరికాకు వ్యతిరేకంగానే వ్యవహరించింది. ఇరవై ఏళ్ల సైనికపాలన తర్వాత ప్రజాస్వామ్య పార్టీలు పాలించసాగాయి. 30 పార్టీలు వుండడం చేత సంకీర్ణ ప్రభుత్వాలే గతి అయ్యాయి. 2002 నుంచి దిల్మా ప్రభుత్వపదవుల్లో వుంటూ వచ్చింది. 2010లో అధ్యక్షురాలిగా ఎన్నికై, 2014లో మళ్లీ ఎన్నికైంది. ఆమె పార్టీ పాలనలో 2003–13 మధ్య దారిద్ర్యం 55%, అతిదారిద్ర్యం 65% తగ్గాయి. నిరుద్యోగం చాలా మటుకు తగ్గిపోయింది. లాటిన్ అమెరికాలో తటస్థంగా వున్న లేదా వామపంథాకు మరలిన చాలా దేశాలకు సహాయంగా నిలుస్తూ లాటిన్ అమెరికా దేశాల మధ్య సఖ్యతకై ప్రయత్నిస్తూ వచ్చింది. లాటిన్ అమెరికన్ అండ్ కరిబియన్ స్టేట్స్ (సిఇఎల్ఏసి), యూనియన్ ఆఫ్ సౌత్ అమెరికన్ నేషన్స్ (యుఎన్ఏఎస్‌యుఆర్) వంటి సమాఖ్యలను రూపుదిద్దింది. అమెరికా సూచించిన 'ఫ్రీ ట్రేడ్ ఏరియా ఆఫ్ అమెరికా' ప్రతిపాదన

ఓడిపోవడానికి కారకురాలైంది. బ్రిక్స్‌లో కూడా చురుకైన పాత్ర వహించింది.

అయితే పెట్రోలు ధరలు పడిపోవడం మొదలుపెట్టిన నుంచి బ్రెజిల్‌కు కష్టాలు ఆరంభమయ్యాయి. ఆర్థికస్థితి దెబ్బ తినడంతో పొదుపు చర్యలు చేపట్టి వర్కర్ల ఆగ్రహానికి గురైంది దిల్మా. బ్రెజిల్ రాజకీయనాయకుల్లో చాలామంది అవినీతికి పాల్పడ్డారు. దిల్మా స్వయంగా అవినీతికి పాల్పడకపోయినా, సంకీర్ణప్రభుత్వంలో భాగస్వాములైన అవినీతిపరులపై చర్య తీసుకోవడానికి వెనకాడింది. చివరకు ధైర్యం చేసి వారిపై కేసులు పెట్టి విచారణ ప్రారంభించేసరికి వారంతా కలిసి దిల్మాను దించేశారు. ఆమెపై అవినీతి ఆరోపణలేవీ లేవని జులైలో ఫెడరల్ ప్రాసిక్యూటరు చెప్పినా చిన్న చిన్న కారణాలతో ఆగస్టు 31న సెనేట్‌లో ఆమెను అభిశంసించి, రెండున్నరేళ్లకు ముందే పదవి నుంచి తప్పించాలని తీర్మానం ప్రవేశపెడితే 61 మంది అనుకూలంగా, 20 మంది ప్రతికూలంగా ఓటేశారు. ఆమెకు వ్యతిరేకంగా, తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన వారిలో 60% మందిపై అవినీతి కేసులున్నాయి. దిల్మా స్థానంలో 7గురు సభ్యులున్న పార్టీ నాయకుడు మైకేల్ టెమెర్ అధ్యక్షుడయ్యాడు. ఈ విధంగా 13 ఏళ్ల లెఫ్ట్ వింగ్ వర్కర్స్ పార్టీ పాలన ముగిసి, రైట్‌వింగ్, అమెరికా అనుకూల ప్రభుత్వం అడ్డదారిలో గద్దె కెక్కింది.

బ్రెజిల్ జనాభాలో 51% మంది శ్వేతేతర వర్ణులు. కానీ టెమెర్ కాబినెట్‌లో అందరూ వైట్సే, అందరూ మగవారే. వారిలో 15 మందిపై అవినీతి ఆరోపణలున్నాయి. టెమెర్‌పై కూడా మూడు మిలియన్ డాలర్ల లంచం తిన్నట్లు ఆరోపణలున్నాయి. రియో ఒలింపిక్స్ ప్రారంభోత్సవం నాడు అతను హాజరయితే ప్రజలు అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎందుకైనా మంచిదని క్లోజింగ్ సెరిమనీకి రాలేదు. ఇలాటి వాడి చేతిలోకి బ్రెజిల్ వెళ్లడానికి నిరసనగా వెనెజులా, బొలివియా, ఈక్వడార్ బ్రెజిల్ నుంచి తమ రాయబారులను వెనక్కి రప్పించుకున్నాయి. క్యూబా అధ్యక్షుడు 'దిల్మా అభిశంసన ఒక రకమైన కుట్ర' అని ప్రకటించాడు. ఐక్యరాజ్యసమితిలో బ్రెజిల్ యిన్నాళ్లూ తటస్థంగా లేదా వామపక్షంగా వుంటూ వచ్చింది. ఇప్పుడు దాని పంథా మారడంతో కినిసిన బొలీవియా, కోస్టా రీకా, క్యూబా, ఈక్వడార్, నికార్‌గువా ప్రతినిధులు సమితిలో టెమెర్ ప్రసంగించడానికి లేవగానే 'అడ్డదారిలో నాయకుడైన వాడి ఉపన్యాసం వినం' అంటూ బయటకు వెళ్లిపోయారు. అమెరికా మాత్రం టెమెర్ ప్రభుత్వాన్ని వెంటనే గుర్తించింది. దిల్మాను దింపివేయడం రాజ్యాంగబద్ధంగా వుందని వ్యాఖ్యానిస్తూ అమెరికా-బ్రెజిల్ మధ్య సంబంధాలు మరింత దృఢమవుతాయని ప్రకటించింది. ఒబామా హయాంలోనే హొండురాస్, పరాగువాలలో యిటువంటి పార్లమెంటరీ కుట్రలను ప్రోత్సహించడం జరిగింది. ప్రస్తుతం వెనెజులాలో కూడా అలాటి ప్రయత్నమే సాగుతోంది.

ప్రస్తుతానికి బ్రెజిల్ ఆర్థికపరిస్థితి ఘోరంగా వుంది. గత ఏడాదే 34 లక్షల మంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. నిరుద్యోగుల శాతం 11.6%కి చేరింది. అక్టోబరులో జరిగిన స్థానిక ఎన్నికలలో ప్రజలు మొన్నటిదాకా పాలించిన వర్కర్స్ పార్టీపై తమ ఆగ్రహాన్ని చూపించారు. ఇలాటి పరిస్థితుల్లో టెమెర్ ప్రభుత్వం పెన్షన్లు చెల్లించలేదని, రిటైర్‌మెంట్ వయసును 54 నుంచి పెంచుతానని, ప్రభుత్వ సంస్థలను విదేశీ ప్రైవేటు సంస్థలకు అమ్ముతానని, తమ దేశంలో ఆయిలు, గ్యాస్ వెలికితీసేందుకు విదేశీ కంపెనీలను అనుమతిస్తానని ప్రకటించాడు. ఇవన్నీ అమెరికా అనుకూల విధానాలే. అమెరికాకు పడని చైనా, రష్యాలు సభ్యులుగా వున్న బ్రిక్స్ గురించి టెమెర్ ప్రభుత్వంలోని విదేశాంగ మంత్రి ఒక్క ముక్కా మాట్లాడలేదు. ఇక బ్రిక్స్ భవిష్యత్తు ఎలా వుంటుందో చూడాలి. – **ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016) (ఫోటో – మైకేల్ టెమెర్)**

**అక్టోబరు 08, 09** **ఎమ్బీయస్ : మరాఠాల ఆందోళన**

మహారాష్ట్రలో మూక మోర్చా (మౌన ప్రదర్శన)ల ద్వారా మరాఠాలు చేస్తున్న ఆందోళన రెండు నెలలుగా సాగుతూ అంతకంతకీ ఉధృతమై ఫడ్నవీస్ పదవికి ఎసరు పెట్టేట్టుంది. ఆగస్టు 10 న ఔరంగాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రదర్శనకు లక్షమంది వచ్చారు. అప్పణ్నుంచి ఏ ప్రదర్శనలోనూ లక్షకు తక్కువమంది రావటం లేదట. ఇప్పటిదాకా ఔరంగాబాద్, ఉస్మానాబాద్, జలగావ్, బీడ్, పర్భణి జిల్లాలలో రమారమి 20 ప్రదర్శనలు జరిగాయి. సెప్టెంబరు 23న అహ్మద్‌నగర్‌లో ప్రదర్శన నిర్వహించబోతున్నాం అని రెండు వారాల ముందు ప్రకటించగానే కోటి రూ.ల విరాళం రెండు గంటల్లో అక్కడికక్కడ వసూలైంది. నాశిక్‌లో ప్రదర్శనకు కనీసం 10 లక్షల మంది వచ్చి వుంటారని అంచనా. వచ్చినవారిలో కనీసం మూడోవంతు మంది మహిళలు వుంటున్నారు. తాము అపర జిజీబాయి (ఛత్రపతి శివాజీ తల్లి)లమని రాసిన ప్లకార్డులను యువతులు పట్టుకుంటున్నారు. (నిందితులపై చర్యలు తీసుకోవాలని, తమకు రిజర్వేషన్లు కల్పించాలని అనే డిమాండ్లతో బాటు సముద్రంలో కడుతున్న శివాజీ విగ్రహాన్ని ఏడాదిలోపు పూర్తి చేయాలన్న డిమాండు కూడా కలిపారు) అక్టోబరులో ముంబయిలో నిర్వహిస్తామంటున్నారు. ప్రదర్శనానంతరం యిచ్చే ప్రసంగాల్లో అప్పుల బాధతో తమ తలిదండ్రులు ఎలా ఆత్మహత్య చేసుకున్నారో కొంతమంది బాలికలు వివరిస్తున్నారు. ఎక్కడా రాజకీయనాయకులను దగ్గరకు రానీయటం లేదు.

జులై 13న అహ్మద్‌నగర్ జిల్లాలోని కోపార్డీ గ్రామంలో 14 ఏళ్ల మరాఠీ అమ్మాయి సామూహిక బలాత్కారానికి, హత్యకు గురి కావడంతో సమస్య ప్రారంభమైంది. మన దేశంలో ఎందరో యువతులు అటువంటి ఘోరాలకు గురవుతూంటారు. ఎవరి విషయంలోను యింతటి తీవ్రమైన ప్రతిస్పందన రాలేదు. మరి యీ కేసులో మాత్రం ఏమైంది అంటే దానికి రెండు కారణాలు – ఆమెపై అత్యాచారం

జరిపిన ముగ్గురు యువకులు దళితులు, రెండో కారణం – వ్యవసాయం సరిగ్గా సాగకపోవడంతో మరాఠా రైతులు (ఆ మాటకొస్తే యితర కులాల రైతులు కూడా) ఆర్థికపరమైన యిబ్బందుల్లో పడడం! మొదటి సంగతికి వస్తే – మరాఠాలకు, దళితులకు 1991లో మరాట్వాడా యూనివర్శిటీ పేరు అంబేడ్కర్ యూనివర్శిటీగా మార్చడానికి ప్రయత్నించినపుడు ఘర్షణలు జరిగాయి. గతంలో మరాఠాలు బ్రాహ్మణాధిపత్యంపై పోరాడేవారు. 4% జనాభా మాత్రమే వున్నా ఉద్యోగాలన్నీ వారే చేజిక్కించుకున్నారని వాపోయేవారు. ఇటీవలి కాలంలో బ్రాహ్మణుల ప్రభావం క్షీణించింది. రిజర్వేషన్ల కారణంగా దళితులు అభివృద్ధి చెందుతున్నారని, తమను లెక్కచేయడం లేదని, అన్యాయంగా తమపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులు మోపుతున్నారని, యీనాడు మరాఠా బాలికనే చెరిచే స్థితికి వచ్చారని మరాఠాలు మండిపడుతున్నారు. ''సైరాట్'' అనే మరాఠీ యువప్రేమకథా చిత్రం యిటీవల విడుదలై చాలా హిట్టయింది. దానిలో ఒక మరాఠా అమ్మాయి, దళిత అబ్బాయిని ప్రేమిస్తుంది. ఆ సినిమా చూశాకనే దళితులకు యిటువంటి కోరికలు పుడుతున్నాయని కొందరు మరాఠా నాయకులు సినిమాను తప్పుపడుతున్నారు. అత్యాచార చట్టాన్ని రద్దు చేయాలని, కనీసం సవరించాలని, మహిళలపై అత్యాచారాలు చేసేవారి కేసులు విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు నెలకొల్పాలని యిప్పుడు ఆందోళనకారులు అంటున్నారు.

అత్యాచార చట్టం దుర్వినియోగం జరుగుతూండడం దేశమంతా జరుగుతోందని అందరూ అనే మాటే. శరద్ పవార్ కూడా 'నాకు తెలిసి అగ్రవర్ణాల నాయకులు తమ శత్రువులపై పగ సాధించేందుకు తమ అనుయాయియైన ఎస్సీల ద్వారా యీ చట్టాన్ని వాడుతున్నారు. దాన్ని సవరించవలసిన అవసరం వుంది.' అన్నాడు. 'చట్టం వుండి ఏం ప్రయోజనం? 94% కేసుల్లో శిక్షలు పడటమే లేదు' అని దళితులు విమర్శిస్తున్నారు. 'సాక్ష్యాలు లేకుండా, అసలేమీ జరగకుండా ఉత్తుత్తినే కేసులు పెడుతున్నారు కాబట్టే వీగిపోతున్నాయి' అంటున్నారు దళితేతరులు. మహారాష్ట్రలో దళితులు యితరులపై పెట్టిన అత్యాచార కేసులు 2005లో 258 వుంటే 2015 నాటికి 290 అయ్యాయి. అదే సమయంలో దళితులకు వ్యతిరేకంగా జరిగిన నేరాలు 2005లో 865 వుంటే 2015 నాటికి 1816 అయ్యాయి.

మరాఠాలు జనాభాలో మూడోవంతు వున్నారు. అగ్రవర్ణంగా పిలవబడతారు. రాజకీయ పదవులు, ఉద్యోగాలు, చక్కెర మిల్లులు, మిల్క్ కోఆపరేటివ్‌లు, కోఆపరేటివ్ బ్యాంకులు.. అన్నీ వాళ్లవే. చాలామంది మరాఠా ముఖ్యమంత్రులే 30 ఏళ్ల పాటు పాలించారు. మరి వారు ఒబిసిల మంటూ కాలేజీ సీట్లలో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అడగడం ఏమిటి? అనే సందేహం వస్తుంది. ఒక పరిశీలకుడు మరాఠాలను నాలుగు వర్గాలుగా విభజించి వివరించాడు. మొదటి వర్గం మంత్రులు, కమిషన్‌ల చైర్మన్లు, అనేక బోర్డు చేర్మాన్‌లు, కోఆపరేటివ్ బ్యాంకుల డైరక్టర్లు, సుగర్ కోఆపరేటివ్‌ల బోర్డు సభ్యులు, జిల్లా పరిషత్, గ్రామపంచాయితీ చైర్మన్లు... యిటువంటి వారందరూ దీనిలోకి వస్తారు. వారి కంటె కాస్త తక్కువగా వున్న రెండో వర్గం వారు ధనిక రైతులు. వాణిజ్యపంటలు వేసేవారు. పల్లెటూళ్లలో వారి మాట వేదవాక్కు. వాళ్లు రాజకీయాల్లో డైరక్టుగా లేకున్నా, రాజకీయ నాయకులకు నిధులందించే వర్గం. జాతీయ బ్యాంకులు, ప్రయివేటు సెక్టార్ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు పల్లెల్లో విస్తరించడం వలన మరాఠాలు నడిపే కోఆపరేటివ్ బ్యాంకులు, చిన్న ఫైనాన్షియల్ సంస్థలు, యిటీవల దెబ్బతినసాగాయి. దాంతో యిన్నాళ్లూ వాళ్లు చలాయించిన ఆర్థికపరమైన పెత్తనం బలహీనపడసాగింది. ఇక మూడో వర్గం మధ్యతరగతి, చిన్న వ్యవసాయదారులు. వర్షాలు బాగా పడితే వాళ్లు కింగ్‌లు, లేకపోతే కుదేలవుతారు. రైతు కూలీలు (వాళ్లూ మరాఠాలే) కూలి పెంచేశారని ఫిర్యాదు చేస్తూ వుంటారు. చిన్న చిన్న కమతాలు నడుపుకోవడానికి ధనికుల వద్ద, బ్యాంకుల వద్ద అప్పులు తీసుకుంటారు. జీవనసరళిలో పెద్ద రైతులను అనుకరించబోయి పెళ్లిళ్లకు, పేరంటాలకు విపరీతంగా ఖర్చుపెట్టి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇక అట్టడుగున్న పొరలో వుండే మరాఠాలు భూమిలేని వ్యవసాయకూలీలు, రైతులు. ప్రభుత్వ స్కీముల మీద ఆధారపడతారు. వీళ్లకు ఉపాధి పోయింది. మరాఠాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించి వున్నా, వ్యవసాయం ఘోరంగా దెబ్బ తిన్న మరాట్వాడాలోనే ఆందోళన తీవ్రంగా సాగుతోందని గుర్తిస్తే రైతు కోణం గోచరిస్తుంది. ఈ సారి వర్షాలు బాగా పడ్డాయి కాబట్టి ఆందోళన క్రమేపీ తగ్గుముఖం పడుతుందని కొందరు ఆశిస్తున్నారు.

ఒకప్పుడు బ్రాహ్మణులు, యిప్పుడు దళితులతో సహా అందరూ చదువులను నమ్ముకుని, ఉద్యోగాలు తెచ్చుకుని నగరాలకు విస్తరిస్తే, చాలామంది మరాఠాలు చదువును నిర్లక్ష్యం చేసి, వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. వ్యాపారపరంగా కాలేజీలు నడిపేది మరాఠాలే అయినా, దానిలో విద్యార్థులు మాత్రం మరాఠాలు అధికసంఖ్యలో వుండటం లేదు. తరాలు మారిన కొద్దీ ఆస్తిపంపకాల కారణంగా వ్యక్తిగత భూవసతి తగ్గుతూ వచ్చింది. వ్యవసాయం కిట్టుబాటు కాకుండా పోయింది. పైగా ఈ రోజుల్లో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుమందులు, మద్దతు ధర లేకపోవడం, వర్షాభావం, ఋణభారం యిటువంటి కారణాలతో వ్యవసాయం దెబ్బతినడంతో వీరి ఆర్థిక పరిస్థితి దెబ్బ తింది. చదువులు పెద్దగా లేకపోవడంతో ఉద్యోగాలూ లేవు. దానితో వారితో నిస్పృహ కలిగింది. ఏళ్ల తరబడి సాగిన కాంగ్రెసు-ఎన్‌సిపి పాలనలో తమ పరిస్థితి బాగుపడకపోవడంతో మోదీ వచ్చి ఏదో చేస్తాడన్న ఆశతో వీళ్లంతా బిజెపికి ఓటేశారు. కానీ పరిస్థితిలో మార్పు రాలేదు. దాంతో మరీ కృంగిపోయి ఆందోళన బాట పట్టారు. ఉన్నతవర్గాలకు చెందిన 200 మరాఠా కుటుంబాలను రాష్ట్రసంపదనంతా గుప్పిట్లో పెట్టుకుని చిన్న స్థాయి మరాఠాలను పైకి రానీయలేదని పరిశీలకులు అంటారు. ఆందోళన కారులు తమ కులపు నాయకులపై ఆగ్రహం వున్నా చెప్పుకోలేక, దళితులపై అక్కసు వెళ్లగక్కుతున్నారు.

మరాఠాలతో సమానస్థాయిలో వుండే కుంబీలను ఒబిసిలుగా ముందే గుర్తించారు. తమనీ గుర్తించమని మరాఠాలు అడిగారు. ఇప్పటికే మహారాష్ట్రలో ఒబిసిల కున్న 27% రిజర్వేషన్‌తో కలిపి మొత్తం 52% వుంది. కాంగ్రెసు-ఎన్‌సిపి సంకీర్ణ ప్రభుత్వం

ఎన్నికలు దగ్గర పడ్డాక ఓట్ల కోసం మరాఠాలకు 16%, ముస్లిములకు 5% రిజర్వేషన్ కల్పించింది. లిమిటు దాటడంతో విషయం బాంబే హైకోర్టుకి వెళ్లింది. ఎప్పుడు తేలుతుందో తెలియదు. సుప్రీం కోర్టుకి వెళితే హైకోర్టు తీర్పు దాకా ఆగమంది. రిజర్వేషన్ కల్పించినా మరాఠాలు ఆ పార్టీలకు ఓటేయలేదు. ఇక అలాటప్పుడు తామెందుకు దానిలో తలదూర్చి తక్కినవారికి ఆగ్రహం కలిగించడం అని బిజెపి భావిస్తూండవచ్చు. ఇప్పటివరకు మరాఠాల ప్రదర్శనలలో రాజకీయనాయకులు చొరబడలేదు కానీ కొన్ని మరాఠా పెద్ద తలకాయలు వెనకనుంచి సాయపడుతున్నాయట. ఫడ్నవీస్ బ్రాహ్మణుడు కాబట్టి మరాఠాల ఆవేదన అర్థం చేసుకోలేడని, అతని స్థానంలో ఎవరైనా మరాఠాను తేవాలని కొందరు నాయకులు సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ఎన్నో ఏళ్లగా వున్న వాళ్ల సమస్యలను ఫడ్నవీస్ రెండేళ్లలో ఎలా తీరుస్తాడని అతని అనుచరులు అంటున్నారు. దేశంలో జాట్లు, పటేళ్లు, కాపులు.. యిలా అనేక వర్గాలు రిజర్వేషన్లకై పోరాడుతున్నారు. మరాఠాలు కూడా వారి సరసన చేరారు. చివరకు యీ సమస్య ఎలా రూపుదిద్దుకుంటుందో చూడాలి.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 10,11 వీక్లీకై ఎమ్బీయస్ : రైట్‌కు మళ్లుతున్న ఆస్ట్రియా**

పశ్చిమ యూరోప్‌లో రైటిస్టు ధోరణులు, అతివాద ధోరణులు యిటీవలి కాలంలో పుంజుకుంటున్నాయి. ఐసిస్ కారణంగా కొన్ని దేశాల్లో సంక్షోభం చెలరేగి, శరణార్థులు యీ దేశాలకు వచ్చిపడి తక్కువ కూలీకే పని చేయడానికి సిద్ధపడడంతో స్థానిక నిరుద్యోగులు, చిరుద్యోగులు నష్టపోతున్నారు. గ్లోబలైజేషన్ అనే నినాదంతో, ప్రపంచమంతా సరిహద్దులు లేని గ్లోబల్ విలేజి అంటూ ఆసియా దేశాలలో చొరబడుతూ వచ్చిన పాశ్చాత్యదేశాలు యిప్పుడు ఆ మాటే మర్చిపోతున్నాయి. అక్కడి ప్రజల్లో జాతీయవాదం పేరుతో జాత్యహంకారం పెరుగుతోంది. మేము వేరు, శరణార్థి జాతుల వారు వేరు అని వాదిస్తున్నారు. యూరోప్ దేశాల ప్రజలు బయటి దేశాల వాళ్లెవరూ రాకుండా అడ్డుగోడలు కట్టాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వాలు లొంగుతున్నాయి కూడా. యూరోపియన్ యూనియన్ (ఇయు) లో సభ్యత్వం వుంటే శరణార్థులను ఆదుకోవాల్సిన అగత్యం పడుతోందని, అందువలన బ్రిటన్ తరహాలో మనమూ ఇయు నుంచి తప్పుకోవాలని ఫ్రాన్సు, నెదర్‌లాండ్స్ వంటి దేశాల్లో రైట్ వింగ్ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. గత్యంతరం లేక ప్రభుత్వాలు తల వొగ్గుతున్నాయి.

హంగేరీ పార్లమెంటు జనవరిలో ''జ్యూయలరీ చట్టం'' పేరుతో ఒక చట్టం చేసింది. శరణార్థులకు ఆశ్రయం కల్పించే ఖర్చుల నిమిత్తం వారి వద్ద నున్న విలువైన ఆభరణాలను సొంతం చేసుకునే హక్కును ఆ చట్టం ప్రభుత్వానికి కల్పించింది. అయినా జూన్‌లో సర్వే జరిపితే శరణార్థులను రానివ్వని పార్టీకి ఓటేస్తామని 25% మంది ప్రజలు అన్నారు. శరణార్థుల పట్ల కఠిన వైఖరి వహిస్తాననని హంగేరీ ప్రభుత్వం అనడంతో 68% ప్రజలు దాన్ని సమర్థించారు. ప్రతీ దేశానికి ఇయు శరణార్థుల కోటా యింత అని కేటాయించడాన్ని ఒప్పుకుంటారా? అనే ప్రశ్నతో అక్టోబరు 2 న ప్రజాభిప్రాయం సేకరించింది. 44% మంది ఓటింగులో పాల్గొన్నారు. వారిలో 98% మంది ఇయు శరణార్థుల పాలసీని వ్యతిరేకించారు. ఇయుకు మూలస్తంభంగా నిలిచిన జర్మనీ అధినేత్రి ఏంజెలా మెర్కెల్‌కు వ్యతిరేకంగా నియో-నాజీలు ఎఎఫ్‌డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) పార్టీ పేర ఏర్పడి ఆమెకే సవాలు విసురుతున్నారు. మొత్తం 16 స్టేట్ పార్లమెంట్లు వుంటే 10 వాటిల్లో ప్రాతినిథ్యం సంపాదించుకున్నారు. సెప్టెంబరులో జరిగిన స్థానిక ఎన్నికలో మెర్కెల్‌కు చెందిన క్రిస్టియన్ డెమోక్రాటిక్ యూనియన్ పార్టీ కంటె ఎక్కువ ఓట్లు తెచ్చుకున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలలో వాళ్లు మరింత బలపడతారని అంచనా.

2015 వేసవి నాటికి ముస్లిము దేశాల నుంచి యూరోపియన్ యూనియన్ దేశాలలోకి 10 లక్షల మంది శరణార్థులు వచ్చిపడడంతో ఆ యా దేశాల్లో ముస్లిములు తమ సంస్కృతిని నాశనం చేస్తున్నారని గగ్గోలు పుట్టింది. ముస్లిం శరణార్థులను రానివ్వకూడదని, దేశంలో వున్న ఇస్లామిక్ స్కూళ్లను మూసేయాలని, బురఖాను నిషేధించాలని ఆ దేశాల ప్రజలు అనసాగారు. ఫ్రాన్సులో కొన్ని మునిసిపాలిటీలు ముస్లిం యువతులు ఈత కొట్టేటప్పుడు వేసుకునే బుర్కినిని (బికినిల్లా కాకుండా ఒళ్లు కనబడకుండా వేసుకునే స్విమ్మింగ్ డ్రెస్సులు)లను నిషేధించాయి. దీనితో బాటు ఐసిస్ ఇస్లామ్ పేరుతో టెర్రరిజం అవలంబిస్తోంది కాబట్టి, ముస్లిముల నందరినీ అనుమాన ద ృక్కులతో చూస్తూ, వారిని తమ దేశాల్లో రానివ్వకూడదని యూరోపియన్ ప్రజల కోరిక. ప్రజల యీ మూడ్‌ను సొమ్ము చేసుకోవాలని ప్రతిపక్షాల వారు నడుం బిగించారు. హిట్లర్ కాలం నాటి జాతివాదాన్ని ధైర్యంగా వినిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు ఔననక తప్పటం లేదు. స్లొవాకియా, ఎస్టోనియా, బల్గేరియా, పోలండ్ దేశాలు శరణార్థుల్లో క్రైస్తవులను మాత్రమే స్వీకరిస్తామని చెపుతున్నాయి.

ఇస్లాం వ్యతిరేకత, రైటిస్టు భావాలు కలిసి పోయి రైటిస్టు పార్టీలకు మంచి వూపు వచ్చింది. ఫ్రాన్సులో యిటీవల టెర్రరిస్టు దాడులు జరగడంతో నేషనల్ ఫ్రంట్ పార్టీ అనే రైటిస్టు పార్టీకి 2.50 కోట్ల ఓటర్లు పాల్గొన్న స్థానిక ఎన్నికలలో 68 లక్షల ఓట్లు పడ్డాయి. స్వీడన్‌లో డెమోక్రాట్స్ పార్టీ నడిచే రైటిస్టు పార్టీకి 2010లో 6% ఓట్లు వస్తే 2014 నాటికి 13% వచ్చాయి.నెదర్లాండ్స్‌లో యిప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే పార్టీ ఫర్ ఫ్రీడమ్ పేరుతో వున్న రైటిస్టు పార్టీకి 150 సీట్లలో 33 సీట్లు వస్తాయట. ఇవన్నీ ప్రస్తుతపు ఉదారవాదాన్ని కట్టిపెట్టి, బయటివారిని దేశంలోకి రానివ్వకూడదనే నినాదంతోనే పనిచేస్తున్నాయి. ఇటలీలో వామపక్షాలకు గట్టి పట్టుండే టస్కనీలో రైటిస్టు పార్టీ ఐన నార్దరన్ లీగ్ పార్టీ 20% ఓట్లు సంపాదించింది. ఆస్ట్రియాలో ఫ్రీడమ్ పార్టీ కూడా

అదేబాటలో నడుస్తోంది.

హిట్లర్ నాజీ సేనలో ఎస్ఎస్ విభాగం యూదుల మారణకాండ వంటి అత్యంత ఘోరకృత్యాలు చేసింది. హిట్లర్ ఆస్ట్రియాపై దండెత్తి తన సామ్రాజ్యంలో కలిపేసుకున్నపుడు ఆస్ట్రియా సైనికాధికారులు కొందరు ఆ విభాగంలో చేరి, ఆ జాతిహననంలో పాలుపంచుకున్నారు. ఆ అధికారుల్లో కొందరు 1956లో స్థాపించిన పార్టీయే ఫ్రీడమ్ పార్టీ. 1978 వరకు మాజీ ఎస్ఎస్ సభ్యులే దాన్ని నడిపించారు. అందువలన మేధావులే కాక, సామాన్య ప్రజలు కూడా ఆ పార్టీని ఏవగించుకునేవారు. 'నేను ఆ పార్టీకి ఓటేస్తాను' అని చెప్పుకునేవారిని మనస్సాక్షి లేనివారిగా పరిగణించేవారు. 2005లో హెంజ్ క్రిస్టియన్ స్ట్రాష్ అనే డెంటిస్టు పార్టీ పగ్గాలు చేపట్టాక పార్టీ యిమేజిని సరిదిద్దాడు. గతంలో ఇజ్రాయేలును శత్రుదేశంగా పరిగణించే విధానాన్ని వదిలిపెట్టి ముస్లిములను, అరబ్బు దేశాలను శత్రువులుగా చూడమన్నాడు. "గతకాలపు ఫాసిజమే యీనాడు పొలిటికల్ ఇస్లామ్‌గా రూపుదిద్దుకుంది. దాన్ని మనం ఎదిరించాలి." అంటూ చెప్తూ వచ్చాడు. ఈనాడు ఆ దేశాలన్నిటిలో ఇస్లాం భయం పట్టుకోవడంతో అతని మాటలకు విలువ పెరిగింది.

2008లో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంక్షోభం కారణంగా ఇయులో గ్రీసు, స్పెయిన్ వంటి అప్పుల పాలైన కొన్ని దేశాలు బాగా దెబ్బతిన్నాయి. ఆస్ట్రియా అలాటి దుర్గతినుంచి తప్పించుకుంది. రష్యా పతనమయ్యాక గతంలో కమ్యూనిస్టు పాలనలో వున్న తూర్పు యూరోప్ దేశాలలో ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. అక్కణ్నించి అనేక మంది నిరుద్యోగ యువతీయువకులు పశ్చిమ యూరోప్‌లోని ధనిక దేశాలకు వచ్చిపడ్డారు. అది స్థానికులకు బాధగా వుంది. దానికి తోడు కొత్తగా శరణార్థుల సమస్య వచ్చిపడేసరికి పూరికే భయపడడం ఎక్కువైంది. నిజానికి శరణార్థులు వచ్చాక క్రైమ్ రేటు పెరిగిన దాఖలాలు లేవు. కానీ యీ గణాంకాలు ఎవరికీ అక్కరలేదు. ప్రజల్లో భయాలు ఎక్కువై పోయి, తాము నమ్మినదే నిజమనుకుంటున్నారు. 2015లో సర్వే ఒకటి జరిపి జనాలను అడిగి చూశారు. 'మీ దేశంలో ఎంత మంది శరణార్థులు తలదాచుకున్నారని అనుకుంటున్నారు?' అని. జర్మనీల జనాభాలో 26% విదేశీయులే అని అక్కడి వాళ్లు చెప్పారు. నిజానికి దానిలో సగం కంటె తక్కువ మంది 12% మంది వున్నారంతే. ఫ్రాన్సు, బెల్జియం, యుకె, నెదర్లాండ్స్‌లో కూడా పరిస్థితి అలాగే వుంది.

ప్రజల్లో యిలాటి భయాలు వుంటే స్ట్రాష్ లాటి వాళ్లు పూరకే వుంటారా? తన ఫ్రీడమ్ పార్టీ అనుచరుల్ని పంపి శరణార్థుల శిబిరాలు వేయకూడదని ప్రదర్శనలు నిర్వహింపచేశాడు. ట్రంప్ తరహాలో హంగరీతో సరిహద్దు వద్ద కంచె కట్టాలని డిమాండ్ చేశాడు. 2013 నాటికే ఆ పార్టీకి పార్లమెంటులో 20% సీట్లు దక్కాయి. రాష్ట్రాలలో, మునిసిపాలిటీల్లో గణనీయంగా ఓట్లు తెచ్చుకోసాగింది. 2016 వచ్చేసరికి మరింత అనుకూల పరిస్థితి ఏర్పడింది. 30 సంఎల వయసు కంటె తక్కువ వున్న యువతీయువకులలో అది అత్యంత పాప్యులర్ పార్టీ. రాజధాని వియన్నాలో 31% ఓట్లు వచ్చాయి. డిసెంబరులో జరగబోయే అధ్యక్ష ఎన్నికలలో స్ట్రాష్ తన పార్టీ తరఫున నార్బర్ట్ హోఫర్‌ను నిలబెట్టబోతున్నాడు. అతనికి నెగ్గే అవకాశాలున్నాయంటున్నారు. ఎందుకంటే ఏప్రిల్‌లో జరిగిన మొదటి విడత ఎన్నికలలో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తే అతనికి 35% ఓట్లు పడ్డాయి. 2018లో అత్యున్నత స్థానమైన ఐన ఛాన్సెలర్ పదవికి పోటీ జరుగుతుంది. స్ట్రాష్ దానికి పోటీ చేయవచ్చు. నెగ్గినా నెగ్గవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

### ఎమ్బీయస్ : బుందేల్‌ఖండ్‌లో వజ్రాల వేట

రియో టింటో అనే యుకె కంపెనీ 40 దేశాలలో వజ్రాలను వెలికితీసే ప్రాజెక్టులు నిర్వహిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఛత్తర్‌పూర్ జిల్లాలోని జారా, సగోరియా, షెపురా గ్రామాల్లో అటవీప్రాంతాల్లో భూమిలో వజ్రాలు దొరుకుతాయని అది అంచనా వేసింది. 2002లో స్థల పరిశీలన మొదలుపెట్టి, 2004 జనవరిలో ప్రాథమిక కార్యకలాపాలకై ప్రభుత్వ అనుమతి సంపాదించి వజ్రాలు దొరుకుతాయా లేదా అని పరిశీలించింది. దొరుకుతాయన్న ఆశ కలిగి 2006 సెప్టెంబరులో అన్వేషించేందుకు (ప్రాస్పెక్టింగ్) లీజు సంపాదించింది. అక్కడి చెట్లపై కోతులు ఎక్కువగా వుండడం చేత దాన్ని 'బందర్ ప్రాజెక్టు' అన్నారు. 2008 అక్టోబరులో 'మా అన్వేషణ ఫలించింది. ఇక్కడ 3.74 కోట్ల క్యారట్‌ల కింబర్‌లైట్ దొరుకుతుంది, దాన్నుంచి 2.74 కోట్ల క్యారట్‌ల వజ్రాలు తయారవుతాయి. 2 వేల కోట్ల రూ.ల పెట్టుబడి పెట్టి బయటకు తీస్తాం, 800 మందికి ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా పని కల్పిస్తాం' అని ప్రకటించి ముందుగా 475 హెక్టేర్ల భూమిలో వజ్రాలను వెలికి తీయడానికి, తీసినవాటిని విలువ కట్టడానికి రూ.140 కోట్ల పెట్టుబడి పెట్టి 2010లో రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. తను తవ్వకాలు జరిపేచోట అత్యాధునికమైన సాంకేతికతో మైనింగ్ ప్లాంట్ కట్టింది. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారు 2013లో ప్రాజెక్టును ఆమోదించారు కూడా.

2014 వచ్చేసరికి '971 హెక్టేర్లలో తవ్వకాలు జరుపుతాం' అని కంపెనీ అనడంతో ఫారెస్టు ఎడ్వైజరీ కమిటీవారు 2015 నవంబరులో అభ్యంతరాలు లేవనెత్తారు. ఎందుకంటే దాని కోసం 5 లక్షల చెట్లు కొట్టేయాల్సి వస్తుంది, పులులు సంచరించే ప్రాంతం కాబట్టి వాటికి ఆవాసం పోతుంది, రక్షిత అరణ్యప్రాంతాలు నాశనమవుతాయి. తమ ఉపాధి పోతుందని మూడు గ్రామాలలో నివసించే 2 వేల మంది ప్రజలు అభ్యంతర పెడుతున్నారు. వాళ్ల అనుమతి లేనిదే ముందుకు వెళ్లడానికి చట్టం ఒప్పుకోదు. కంపెనీ

ప్రతిపాదనను, అటవీశాఖ అభ్యంతరాలను రాష్ట్రప్రభుత్వం 2016లో కేంద్రానికి పంపింది. జులై నెలలో పర్యావరణ శాఖ వేసిన కమిటీ దీనిపై చర్చించింది. ఫారెస్టు రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ యీ ప్రాంతంలో ప్రత్యేక జాతులకు చెందిన బల్లులు, రాబందులు, ఎలుగుబంట్లు, పక్షులు, యింతా యితర ప్రాణులు వున్నాయని, తవ్వకాలకు అనుమతి యిస్తే యివన్నీ అంతరిస్తాయని చెప్పింది. విషయం ప్రధాని కార్యాలయం ఆధ్వర్యంలోని ప్రాజెక్టు మానిటారింగ్ గ్రూపు వద్దకు చేరేలోపులే రియో టింటో ఈ ఆగస్టులో 'మేం ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నాం. 2016 డిసెంబరు లోపున అన్నీ సర్దుకుని వెళ్లిపోతాం.' అని ప్రకటించింది. 'ఈ ఆర్థిక సంవత్సరం తొలి సగంలో మా లాభాలు 47% తగ్గాయి. 12 ఏళ్లల్లో యిలాటి పరిస్థితి రావడం ప్రథమం. అందువలన మా యిన్వెస్టర్లకు సరైన రాబడి వచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా వున్న తమ ప్రాజెక్టులన్నిటినీ సమీక్షించుకుంటున్నాం, యిక్కడి ఆలస్యాల వలన యీ ప్రాజెక్టు లాభదాయకం కాదని తేల్చుకుని తప్పుకుంటున్నాం' అని కూడా కంపెనీ అంది.

పుష్కరకాలంగా ఇంత పెట్టుబడి పెట్టి, శ్రమించిన కంపెనీ వజ్రాలు బయటపడే తరుణంలో యిలా తనంతట తానే తప్పుకోవడమేమిటాని పరిశీలకులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. భారతదేశాన్ని మైనింగ్ హబ్‌గా, ఖనిజాల గనిగా రూపుదిద్దే ప్రయత్నంలో భారతప్రభుత్వం రియో టింటోకు అంతర్జాతీయ ప్రత్యర్థి ఐన ఆంగ్లో అమెరికన్ అనే కంపెనీని ఆహ్వానిస్తోందని వార్తలు రావడంతో రియో టింటో యిలా బెదిరింపులకు దిగిందా అనే ప్రశ్న వచ్చింది. ఎందుకంటే వెనుకబడిన బుందేల్‌ఖండ్‌లో ప్రజల జీవితాల్లో వెలుగు నింపే ప్రాజెక్టుగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఇప్పుడు దానికి విఘాతం కలుగుతుంది. విరమించుకుంటూనే కంపెనీ 'మేము యీ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అనుమతితో యింకో కంపెనీ (థర్డ్ పార్టీ)ని భాగస్వామిగా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాము.' అంది. ఇది వింతగా లేదా? ఆ కంపెనీ రిలయన్సు కంపెనీ కావచ్చనే మాటా వినబడుతోంది. రిలయన్సు పేరు వినిపించగానే అన్నీ సందేహాలే! రిలయన్సుకు అవకాశం కల్పించేందుకే రియోకు అనుమతులు తొక్కిపెట్టారా? రిలయన్సును ఆంగ్లో అమెరికన్‌కు భాగస్వామిగా తెచ్చి రియోను హడలగొట్టి పంపేస్తున్నారా? పర్యావరణవేత్తలు, గ్రామప్రజల పోరాటానికి దడిసి వజ్రాల వెలికితీత ఆగిందని యిప్పుడు అనుకుంటున్నాం కానీ, రిలయన్సు భాగస్వామ్యంతో ఏదో ఒక కంపెనీ ద్వారా మళ్లీ మైనింగ్ ప్రారంభమైతే మాత్రం దీనిలో మోసం వుందనుకోవాల్సి వస్తుంది. రిలయన్సు వస్తుందో రాదో కొన్నాళ్లకు కానీ తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 12,13 వీక్లీకై**

## ఎమ్బీయస్ : జయలలిత ఆరోగ్యస్థితి

జయలలితకు ఆరోగ్యం మెరుగుపడుతోందని, ఆమె వైద్యులతో మాట్లాడగలుగుతోందని, ఆసుపత్రిలో మరికొంతకాలం వుండాలని అపోలో ఆసుపత్రి వారు శుక్రవారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. దీపావళి నాటికి యింటికి పంపించేస్తారని ముందురోజు వార్త వచ్చింది కానీ అపోలో వారు ఆ మాట అనలేదు. ఏది ఏమైనా ఐదువారాల పాటు నడిచిన సస్పెన్స్ డ్రామాకు తెరపడుతున్నట్లుంది. ఆవిడ కోలుకోవాలని, ఎప్పటిలాగ తన పనులు తను చేసుకోవాలని ఆశిస్తూనే, అసలింత సస్పెన్స్ ఎందుకు రగిలిందాని ఆలోచించవలసిన అవసరం వుంది. 68 ఏళ్ల మహిళ అనారోగ్యం పాలవడంలో, ఆస్పత్రి పాలవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మరి ఎందుకింత గోప్యం? గోప్యం మేన్‌టేన్ చేసినకొద్దీ ప్రజల్లో అనుమానాలు, పుకార్లు, వాటిని నివృత్తి చేయాలంటూ కోర్టులో పిల్, ఏ రోజు కా రోజు యింకేముంది, అయిపోయింది అని పుకారు రావడంతో దుకాణాలు టైము కంటె ముందే కట్టేయడాలు, స్కూలు పిల్లలను ముందే పంపేయడానికి ఏర్పాట్లు, దుకాణాలు, బంకులు వారం పాటు మూసేసినా ఫర్వాలేనట్లు ఆహారపదార్థాలు, పెట్రోలు పోగేసి దాచుకోవడం, అపోలో ఆసుపత్రి ముందు పూలు, పళ్ల అమ్మకాలు, టీవీ ఛానెళ్లు, పత్రికలు ఎందుకైనా మంచిదని ముందుచూపుతో జయలలితపై అన్ని రకాలుగా కథనాలు తయారుచేసుకోవడాలు... యింత హంగామా అవసరమా అంటే ఆ పరిస్థితిని కల్పించిన జయలలితనే నిందించాలి. గతంలో ఎమ్జీయార్ కూడా యిలాగే తన అనారోగ్యాన్ని దాచుకుని నెత్తిమీదకు తెచ్చుకున్నాడు. ఇప్పుడు జయలలిత పరిస్థితి పరిశీలించిన ఇంగ్లీషు డాక్టర్ రిచర్డ్ బీల్ 'ఈవిణ్ని వారం రోజుల క్రితమే ఆసుపత్రిలో చేర్చి వుండాల్సింది' అన్నాట్ట. ఆసుపత్రిలో చేరడమంటూ చేరితే అనామకమైన ఆసుపత్రిలో చేరితే లాభం లేదు. అపోలో వంటి సకల వసతులు వున్న ఆసుపత్రిలో చేరాలి. అక్కడ చేరితే అందరి కళ్లల్లో పడడం జరుగుతుంది. అది యిష్టం లేక జయలలిత యింటిదగ్గరే వైద్యం చేయించుకుంటూ కాలక్షేపం చేసి ముప్పు తెచ్చుకుంది. చివరకు అపస్మారకస్థితికి చేరాక, ఆమె సన్నిహితురాలు శశికళ, వైద్యులు కలిసి నిర్ణయం తీసుకుని సెప్టెంబరు 22న రాత్రి 8.45కి ఆసుపత్రికి తరలించారు.

అది కూడా డైరక్టుగా ఆస్పత్రికి ఫోన్ చేసి వచ్చేయలేదు. చైర్మన్ ప్రతాపరెడ్డి గారి కుమార్తె, వైస్ చైర్మన్ అయిన ప్రీతా రెడ్డికి ఫోన్ చేస్తే ఆవిడ ఆంబులెన్సు పంపింది కానీ డ్రైవరుకి ఎక్కడికి వెళ్లాలో ముందే చెప్పలేదు. చెప్తే మీడియాకు ఉప్పందిస్తాడనే భయం. కాథెడ్రల్ రోడ్డుకి వెళ్లమని చెప్పి అక్కడికి వెళ్లాక పోయెస్ గార్డెన్‌కి వెళ్లాలని చెప్పారు. స్పృహలో లేని జయలలితకు తోడుగా శశికళ రాగా, ఆమెకు సెక్రటరీగా వ్యవహరిస్తున్న పూంగూంద్రన్ వెనక్కాల వేరే కారులో వచ్చాడు. వాళ్లు ఎమర్జన్సీ రూమ్‌కి వచ్చేసరికే ప్రీతా రెడ్డి కార్డియాలజీ, పల్మనాలజీ, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్టులను సిద్ధంగా వుంచారు. చాలాకాలంగా జయలలిత మధుమేహాన్ని పర్యవేక్షిస్తున్న డయబెటాలజిస్టు డా।। జయశ్రీ అక్కడకు చేరారు. జయలలితకు శీతాకాలంలో నెమ్ము చేసే వ్యాధి కూడా వుంది. అవేళ 'ఏక్యూట్

పల్మనరీ డిస్ట్రెస్ సింద్రోమ్' కేసు కింద ఆమెను హాస్పటల్‌లో చేర్చుకున్నారు. ఊపిరందకపోవడంతో తాత్కాలికంగా పేస్‌మేకర్ పెట్టి, ఊపిరందేట్లు చేసి, తర్వాత మల్టి–డిసిప్లినరీ సిసియు (ఎమ్‌డిసిసియు)కు తరలించారు. ఎమర్జన్సీ రూమ్ అయితే విశాలమైన ప్రదేశంలో రోగులు సులభంగా వచ్చేట్లు నిర్మించారు కాబట్టి ఆనాటి సంఘటనలను కొందరు గమనించగలిగారు. ఎమ్‌డిసిసియు అయితే రెండో ఫ్లోర్‌లో చాలా కట్టుదిట్టమైన సెక్యూరిటీతో వుంది కాబట్టి యిక సమాచారం బయటకు రావడం మానేసింది. ఇక దాంతో ఎవరి చిత్తం వచ్చినట్లు వారు ఊహాగానకచ్చేరీలు చేసేశారు.

ఈ కచ్చేరీలకు అపోలోవారి వాద్యసహకారం కూడా వుంది. ఎందుకంటే వారు ఉన్నదున్నట్లు ఎన్నడూ చెప్పలేదు. చేరిన మర్నాడు సెప్టెంబరు 23న విడుదల చేసిన ప్రెస్ రిలీజులో ముఖ్యమంత్రికి జ్వరం, డీహైడ్రేషన్ మాత్రమే అని చెప్పారు. ఇవాళ్టికి ఆవిడకు జ్వరం తగ్గి సాధారణ ఆహారం తీసుకుంటున్నారు అని కూడా చేర్చారు. ఇది శుద్ధ అబద్ధమని తర్వాతి ఘటనలు తెలిపాయి. సెప్టెంబరు 29న మరో రిలీజు. దాన్లో 'ముఖ్యమంత్రి చికిత్సకు బాగా స్పందిస్తున్నారు. కోలుకోవడానికై ఆసుపత్రిలో మరి కొన్నాళు వుండవలసి వస్తోంది' అని చెప్పారు. అక్టోబరు 2 నాటి ప్రకటనలో 'ఇంగ్లండు డాక్టరు రిచర్డ్ ముఖ్యమంత్రి చికిత్సను పర్యవేక్షించి, సరైన విధానంలోనే చికిత్స జరుగుతోందని అన్నారు.' అని చెప్పారు. అప్పుడే జయలలితకు ఇన్ఫెక్షన్ సోకిందని, యాంటీబయాటిక్స్ వాడుతున్నామని మొదటిసారి ఆసుప్రతివారు ఒప్పుకున్నారు. ఇంతకీ డాఎ రిచర్డ్ స్పెషాలిటీ ఏమిటో చూస్తే ఆవిడకున్న వ్యాధి ఏమిటో కాస్త ఐడియా వస్తుంది. ఆయన పనిచేసే లండన్ బ్రిజ్ హాస్పటల్ వెబ్‌సైట్ ప్రకారం 'ఎక్యూట్ లంగ్ ఇంజరీ, మల్టిపుల్ ఆర్గన్ ఫెయిల్యూర్, జనరల్ యింటెన్సివ్ కేర్' ఆయన ప్రత్యేక రంగాలు. అంటే యీవిడకు వీటిలో కొన్ని కానీ, అన్నీ కానీ వున్నాయన్నమాట. అక్టోబరు 3 నాటి ప్రకటనలో అపోలో వారు మరింత స్పష్టంగా 'యాంటీబయాటిక్స్ వాడుతున్నామని 'రెస్పిరేటరీ సపోర్టు' యిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రెస్పిరేటరీ సపోర్టు అనేది అస్పష్టమైన వర్ణన. ఊపిరి అందనివాళ్లకు పెట్టే ఆక్సిజన్ మాస్క్ నుంచి చాలా క్రిటికల్ కండిషన్‌లో వున్న వాళ్లకు పెట్టే వెంటిలేటరు దాకా ఆ వర్ణనలోకి యిముడుతాయి. ఈవిడకు పెట్టినది ఆక్సిజన్ మాస్కో, వెంటిలేటరో తెలియక, మళ్లీ ఎవరి సత్తువ కొద్దీ వారు వూహలు చేశారు. అక్టోబరు 6 వరకు ఆసుపత్రివాళ్లు అదే పాట పాడుతూ వచ్చారు. ఐసియులో 4 రోజుల కంటె ఎక్కువ వుంచవలసి వస్తే పరిస్థితి బాగా లేనట్లే అని నిపుణులంటారు. అక్టోబరు 9న కాబోలు ఆఖరి హెల్త్ బులెటిన్ యిచ్చారు. మళ్లీ యిన్నాళ్లకు యీ బులెటిన్.

ఉన్న విషయం స్పష్టంగా చెప్పడానికి ఆసుపత్రికి ఏం తీపు తీసింది అనుకోవడం అవివేకం. వాళ్లపై పార్టీ, ప్రభుత్వ ఆంక్షలు వుండి వుంటాయి. ఎందుకంటే పార్టీ వాళ్లు పరిస్థితి మామూలుగానే వుందని చెప్పి ప్రజల్ని మాయ చేయడానికి నిశ్చయించుకుని ఆవిడ పేర రకరకాల ప్రకటనలు విడుదల చేస్తున్నారు. ఆవిడ ఆసుప్రతిలో చేరిన మర్నాడే అరియలూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన 15 మంది గురించి సంతాపం తెలుపుతూ, వారి కుటుంబాలకు పరిహారం యిస్తూ ఒక ప్రకటన వెలువరించారు. రాష్ట్రవ్యాప్తంగా 107 అమ్మా కాంటీన్లు ప్రారంభిస్తూ మరో ప్రకటన కూడా. మూడు రోజుల తర్వాత అంటే సెప్టెంబరు 26 న స్థానిక ఎన్నికలకై ఎడిఎంకె అభ్యర్థుల జాబితా విడుదలైంది. మరో రెండు రోజులకు కావేరీ వివాదంలో సుప్రీం కోర్టు తీర్పును పట్టించుకోనందుకు కర్ణాటక ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉమాభారతి అధ్యక్షతన జరిగిన కావేరీ సూపర్‌వైజరీ కమిటీ సమావేశంలో ఆవిడ తరఫున చీఫ్ సెక్రటరీ చదవవలసిన ప్రసంగాన్ని స్వయంగా డిక్టేట్ చేసిందంటూ నాటకం ఆడారు. సెప్టెంబరు 27న సాయంత్రం 4.30 నుండి గంటపాటు తన ఆసుపత్రి గదిలోనే అధికారులతో కావేరీ సమస్యపై సమావేశం ఏర్పాటు చేశారని చెప్పుకున్నారు. సెప్టెంబరు 28 న ప్రభుత్వోద్యోగులకు బోనస్‌గా 476 కోట్ల రూ.లను ఆమె ఆదేశాలకు మేరకు విడుదల చేశామని చెప్పారు. అదేవారంలో ఇద్దరు ఐయేయస్ అధికారుల విదేశీ ప్రయాణాలను అనుమతిస్తున్నట్లు కూడా ఆదేశాలు జారీ చేశారు. సుప్రీం కోర్టు చెప్పినా కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయనందుకు మోదీకి నిరసన తెలపాలంటూ ఆమె తన పార్టీ ఎంపీలను ఆదేశించిందటూ అక్టోబరు 4 న మరో ప్రకటన విడుదల చేశారు. అనేక మంది నాయకులు వచ్చి జయలలితను పరామర్శించి వెళ్లారంటూ ప్రకటనలు యిస్తున్నారు కానీ, వారెవరూ జయలలిత మంచం వరకు కూడా వెళ్లలేదు. రెండు గేట్ల అవతలి నుంచే చూసి వెళ్లిపోయారట. వాళు వచ్చి వెళ్లినట్లు జయలలితకు తెలియను కూడా తెలియదు. కానీ యిలాటి ప్రకటనలు యిస్తూ 'సబ్ ఠీక్ హై' అనే సినిమా చూపించే ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. వీటివలన అనుమానాలు మరింత పెరిగాయి. వాళ్లెందుకు యిలా ప్రవర్తించాలి అంటే, అలా చేయకపోతే జయలలితకు కోపం వస్తుందేమోనన్న భయం మరి.

నిజానికి జయలలితకు రెండేళ్లగా ఆరోగ్యం బాగా లేదట. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నపుడు కూడా మద్రాసు విడిచి ఓ పూట ప్రచారానికి వేరే వూరు వెళితే సాయంత్రానికల్లా యింటికి వచ్చేయాల్సిందే. నడక కూడా బాగా నెమ్మదించింది. ఈవిడ నడిచే తీరు గురించి, కరుణానిధి చక్రాల కుర్చీలో కదిలే పద్ధతి గురించి విజయకాంత్ ఎన్నికల సభల్లో అనుకరించి చూపించి, ఓటర్లను నవ్వించాడు. ఎన్నికలలో గెలిచాక కూడా జయలలిత బయటివాళ్లను పెద్దగా కలవడం లేదు. కొత్త ప్రాజెక్టులను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానే ఆవిష్కరిస్తోంది. అళందూరులో రెండో మెట్రో రైలు లైను కూడా సెక్రటేరియట్ వీడియో లింకు ద్వారానే ప్రారంభించింది. రామనాథపురం జిల్లాలో అదానీ గ్రూపు నెలకొల్పుతున్న సోలార్ పవర్ ప్రాజెక్టుకూ అదే గతి. అసెంబ్లీలో బజెట్ సమావేశాలు జరిగినప్పుడు ఆమె తన స్థానంలో కూర్చునే వుంది. ఎంత తీవ్రమైన వాగ్వాదాలు జరిగినా సీటులోంచి లేవలేదు. తన ఆరోగ్యం యిలా వున్నపుడు ఆమె పార్టీలో, ప్రభుత్వంలో తన ప్రత్యామ్నాయాలను తయారుచేసి వుండాల్సింది. కానీ అలాటి ఆశలు కల్పిస్తే

ఎలాటి వెన్నుపోటు పొడుస్తారో ఏమవుతుందోనన్న భయంతో ఆమె పూనుకోలేదు. అందుకే తాత్కాలిక ముఖ్యమంత్రిగా వుండడానికి కూడా ఎవరికీ ధైర్యం చాలలేదు. దొంగ సంతకాలతో ఆమె పేరన ప్రకటనలను విడుదల చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినా నోరు మూసుకుని వున్నారు. ఆమె అనే కాదు, దేశంలోని ప్రతి ప్రాంతీయ పార్టీది దాదాపు యిదే పరిస్థితి. అధినేత ఆరోగ్యం చెడిందని తెలిస్తే చాలు, పార్టీ విచ్ఛిన్నమై పోతుందన్న భయం వెంటాడుతోంది. అందుకే అనారోగ్యాలను యింత మర్మంగా వుంచుతున్నారు.

జయలలిత తన వారసులను ప్రకటించలేదు. ఆమె చెలికత్తె శశికళ చేతిలో 60 మంది ఎమ్మెల్యేలు, 12 మంది మంత్రులు వున్నట్లు అంచనా. ఇతర మంత్రుల ఆఫీసు సిబ్బంది నియామకాల్లో కూడా వారి ప్రమేయం వుంటుంది. వారి కార్యాలయాల్లో వీరి గూఢచారులు కూడా వుంటారు. వీళ్లందరినీ కలిపి 'మన్నార్‌గుడి (శశికళ సొంత వూరు) మాఫియా' జయలలిత తిరిగి రాని, తిరిగి వచ్చినా పరిపూర్ణ ఆరోగ్యంతో పనిచేయలేని స్థితి కలిగితే యీ మాఫియా చెలరేగిపోతుందని అందరికీ భయం. అందరికీ ఆ భయం వుందని వాళ్లకూ తెలుసు కాబట్టే అందరికీ ఆమోదయోగ్యుడైన పన్నీరు శెల్వంను ముందుకు తోశారు. షీలా బాలకృష్ణన్ అనే మాజీ ఐయేయస్ అధికారిణి జయలలిత ఆదరాన్ని, నమ్మకాన్ని చూరగొంది కాబట్టి ఆవిడ జోలికి కూడా వీళ్లు వెళ్లటం లేదు. షీలా మాట రాజకీయవర్గాల్లోనే కాదు, అధికార వర్గాల్లో కూడా చెల్లుబాటు అవుతుంది. ఎమ్జీయార్ లాగానే జయలలిత కూడా బ్యూరాక్రసీనే బాగా నమ్ముతుంది. తన ఎమ్మెల్యేల శక్తిసామర్థ్యాలపై కంటె అధికారగణం పాలనాపటిమపైనే ఆమె ఎక్కువగా ఆధారపడుతుంది. తక్కిన రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో బ్యూరాక్రసీకి స్వేచ్ఛ ఎక్కువ. డిఎంకె, ఎడిఎంకె రెండు పార్టీలు తమ పథకాల అమలుకై అధికారులనే ఆశ్రయిస్తాయి. ఎమ్మెల్యేలలో విద్యాధికులు తక్కువ, కుటుంబనేపథ్యమూ అంత గొప్పగా వుండదు. పైగా ముఖ్యమంత్రులు అధికారులను గౌరవిస్తూంటారు. ఆ కారణం చేత సాధారణంగా ఎమ్మెల్యేలు అధికారుల పట్ల గౌరవం చూపుతూంటారు. జయలలితకున్న తెలివితేటలు, త్వరగా అవగాహన చేసుకునే సామర్థ్యం, బహుభాషాపరిజ్ఞానం, ఎమ్మెల్యేల డిమాండ్లకు తలొగ్గకపోవడం వంటి లక్షణాల వలన బ్యూరాక్రసీకి ఆమె అంటే అమిత గౌరవం. ఎమ్మెల్యేల కార్యకలాపాలన్నీ వారు ఆమెకు చేరవేస్తూ వుంటారు. ఆ సమాచారంతో ఆమె వారిని నియంత్రిస్తూ వుంటుంది. ఇప్పుడు ఆమె ఆసుపత్రిలో నిశ్చేతనంగా పడి వున్నా రాష్ట్రం దాని పాటికి అది నడుస్తోందంటే దానికి కారణం బ్యూరాక్రసీయే. మరొక రాష్ట్రమైతే పాలన పడకేసి వుండేదే.

పరిపూర్ణ ఆరోగ్యంతో జయలలిత బయటకు వచ్చిన తర్వాత తన అనారోగ్య వివరాలను యీ మాత్రంగానైనా బయటపెట్టినందుకు పార్టీ అనుచరులపై ఎంత కోపిస్తుందో తెలియదు. తను లేకుండా చూసి తీసుకున్న నిర్ణయాలను తిరగదోడినా తోడవచ్చు. జయలలితకు గుట్టు చాలా ఎక్కువ. తన డయాబెటిస్ పై వార్తలు రాసిన మీడియాపై కేసులు పెట్టిందామె. అందుకే ఆమె అనుచరులు పుకార్లు వ్యాప్తి చేస్తున్నారంటూ అనేకమందిని అరెస్టులు చేస్తున్నారు. ఇప్పుడే ఓ జోక్ చదివాను – 'మా నాన్న పెళ్లాం చచ్చిపోయింది, సెలవు కావాలి' అనడిగాడట ఓ మద్రాసు ఉద్యోగి. 'అమ్మ చచ్చిపోయిందనవచ్చుగా' అని ఆఫీసరు అంటే, 'ఆ ముక్కంటే పోలీసులు అరెస్టు చేస్తారని భయం' అన్నాట్ట ఉద్యోగి! ఈమె అనారోగ్యం సందర్భంగా అనుచరులు, అభిమానులు చేస్తున్న హడావుడి చూస్తూంటే ఎమ్జీయార్ కథ గుర్తుకువస్తుంది. అతనికి సుగర్ వ్యాధి వుంది. డాక్టర్లు వద్దని వారించినా శుబ్బరంగా తినేవాడు. తనకు రోగం వుందని సన్నిహితులకు సైతం ఎవరికీ తెలియనిచ్చేవాడు కాదు. అంతా గుట్టే. చివరకు కిడ్నీలు చెడిపోయాయి. 1984 అక్టోబరులో యిదే అపోలో ఆసుపత్రిలో చేర్చి 16 రోజులు వుంచవలసి వచ్చింది. అప్పట్లో ఆయన వ్యక్తిగత వైద్యుడు, మంత్రి అయిన డాఎం ఎచ్‌వి హండే ఎమ్జీయార్ ఆరోగ్యపరిస్థితి గురించి ప్రెస్ రిలీజులు యిచ్చేవాడు. ఈ రోజు అలాటివాళ్లు కూడా ఎవరూ లేరు. ఎమ్జీయార్ అభిమానుల దృష్టిలో ఎమ్జీయార్ అజేయుడు, మృత్యువు సైతం అతన్ని ఏమీ చేయలేదు. తమ కిడ్నీలు యిస్తామంటూనే సరిగ్గా చికిత్స చేయకపోతే డాక్టర్లను చంపుతామంటూ కూడా టెలిగ్రాంలు పంపేరు. గుళ్లల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రార్థనలు, మొక్కుల మాట సరేసరి. చివరకు అమెరికా వెళ్లి అన్న చక్రపాణి కూతురు యిచ్చిన కిడ్నీతో కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు.

1984 డిసెంబర్లో పార్లమెంటు ఎన్నికలతో బాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. డిఎంకె నాయకులు 'ఎమ్జీయార్ యిప్పటికే చచ్చిపోయాడు. ఆ విషయం బయటపడకుండా వీళ్లు నాటకమాడుతున్నారు.' అని ప్రచారం మొదలుపెట్టారు. ఎమ్జీయార్ పోయాడని, బతికి వున్నా జీవచ్ఛవంలా వున్నాడని, అతనికి పక్షవాతం వచ్చి చెయ్యి, నోరు పడిపోయాయని జనాలు నమ్మసాగారు. ఎమ్జీయార్ లేనిపక్షంలో ఎడిఎంకెకు ఎందుకు ఓటేయ్యాలన్న ప్రశ్న రాసాగింది. ఇందిర సానుభూతిని ఎన్‌క్యాష్ చేసుకోవడానికి ఆమె కొడుకు రాజీవ్ వున్నాడు. ఎమ్జీయార్‌కు పిల్లలు లేరు. ఎమ్జీయార్ బతికే వున్నాడని చూపించడానికి ఆర్ ఎం వీరప్పన్ అనే మంత్రి ఆసుపత్రిలో ఎమ్జీయార్ చికిత్స పొందుతున్న వీడియోను, ఫోటోలను ప్రెస్‌కు రిలీజ్ చేశాడు. ఆసుపత్రిలో బెడ్‌పై కూర్చుని ఎమ్జీయార్ భోజనం చేయడం, పేపరు చదవడం, వచ్చినవాళ్లను పలకరించి మాట్లాడడం (నిజానికి ఎమ్జీయార్‌కు గొంతు పోయింది. ఇండియాకు తిరిగి వచ్చాక చాలా శ్రమ పడితే ఓ మాదిరిగా తిరిగి వచ్చింది. కానీ యీ వీడియోలో కబుర్లు చెపుతున్నట్టు కనబడుతుంది. కనబడుతుంది కానీ వినబడదు. అందువలన అంతా నాటకమనే అనుకోవాలి) అంతా వీడియోలో కనబడుతుంది. ఈ వీడియో ఎన్నికలలో విజయానికి పనికి వచ్చింది కానీ ఎమ్జీయార్ యూత్‌ఫుల్ యిమేజికి దెబ్బ తగిలింది. అది ఎమ్జీయార్‌కు నచ్చలేదట. చివరకు మూడేళ్ల తర్వాత 1987 డిసెంబరులో చచ్చిపోయాడు.

ఇప్పుడు కూడా డిఎంకె నానారకాల పుకార్లు వ్యాప్తి చేస్తోంది. అయినా రాష్ట్రంలో నాయకత్వ శూన్యత ఏర్పడి సంక్షోభం రావాలని, ప్రభుత్వం కూలిపోవాలని కోరుకోవడం లేదు. ఎందుకంటే ఆ సాకు చూపించి బిజెపి నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామి కోరినట్లు

ఏకంగా రాష్ట్రపతి రాష్ట్రపతి పాలన విధిస్తే, కేంద్రంలో వున్న బిజెపి తన చిత్తం వచ్చినట్లు పాలిస్తూ, తను బలపడదామని చూడవచ్చని వారి భయం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**అక్టోబరు 14, 15** **ఎమ్బీయస్ : అఖిలేశ్ తిరుగుబాటు బిజెపికి లాభమా? నష్టమా?**

ఎస్పీ పార్టీ నాయకుల మధ్య గత నెలలో కుదిరిన రాజీపై రాసిన 'బాబాయి-అబ్బాయి.. ఆపై అమర్' అనే వ్యాసంలో యీ యుద్ధవిరమణ ఎంతకాలమో తెలియదు అని ముగించడం జరిగింది. రాజీ కుదిరాక కూడా ములాయం కొడుకుపై పగబట్టినట్లే ప్రవర్తించాడు. అఖిలేశ్ ఎంత మొత్తుకున్నా అమర్ సింగ్‌ను పార్టీ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ సెప్టెంబరు 23న ఒక ఆదేశాన్ని స్వహస్తంతో రాసి విడుదల చేశాడు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో శివపాల్ కూడా అఖిలేశ్‌ని చెడుగుడు ఆడేశాడు. గూండాలు నడిపే క్వామీ ఏక్‌తా దళ్ పార్టీని ఎస్పీలో విలీనం కావడాన్ని ససేమిరా ఒప్పుకోనని అఖిలేశ్ ఎంత మొండికేసినా వినకుండా విలీనం ఎప్పుడో అయిపోయింది పొమ్మనమంటూ ప్రకటించాడు. అఖిలేశ్ మద్దతుదారు, శివపాల్‌కు కజిన్ అయిన రాంగోపాల్ యాదవ్ సహచరులను పార్టీలోంచి బహిష్కరించాడు. అవినీతి కేసులున్న అమర్‌మణి త్రిపాఠీ, ముకేశ్ శ్రీవాస్తవలకు టిక్కెట్లు యివ్వరాదని అఖిలేశ్ ఎంత మొత్తుకున్నా వినకుండా వాళ్లకు టిక్కెట్లిచ్చాడు. టిక్కెట్ల పంపిణీలో తన ప్రమేయం వుండాలని అఖిలేశ్ తండ్రితో వాదించి ఒప్పించినా, ఆచరణకు వచ్చేసరికి శివలాల్ దాన్ని తుంగలోకి తొక్కడమే కాక, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అఖిలేశ్ అనుచరులందరినీ పదవుల్లోంచి ఊడబెరికాడు. అక్టోబరు 6న 81 మంది సభ్యులతో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేసి దాన్ని తన, ములాయం అనుచరులతో నింపేశాడు. అఖిలేశ్ అనుచరులందరినీ తీసేశాడు. అఖిలేశ్‌కు కూడా స్థానం దక్కలేదు. పైగా శివలాల్ గడుసుతనం ఒలకబోస్తూ 'ఈ కమిటీ ములాయం, అఖిలేశ్‌ల అనుమతితో ఏర్పాటు చేయడమైనది' అని ప్రకటించాడు.

శివలాల్ తన కొడుకుని యిలా ఎడాపెడా అవమానిస్తూ వుంటే ములాయం ఏం చేస్తున్నాడన్న అనుమానం వస్తుంది. నిజానికి మనం భారతకాలం నుంచి కొడుకుల్ని వెనకేసుకుని వచ్చే ధృతరాష్ట్రులనే చూస్తూ వచ్చాం. కానీ ములాయం వింతగా కొడుకుని పక్కన పెడుతున్నాడు. బహిరంగంగా అతన్ని యీసడిస్తున్నాడు. తమ్ముణ్ని ఆకాశానికి ఎత్తేస్తున్నాడు. బయటివాడైన అమర్ సింగ్‌ను చంకన వేసుకుని తిరుగుతున్నాడు. ఏమిటీ వింత? నిజానికి ములాయంకు, అఖిలేశ్‌కు 2014 నుంచి పడడం మానేసిందట. రాష్ట్రాన్ని కొడుక్కి అప్పగించి, తను 2014లో ఢిల్లీ వెళ్లి ప్రధాని అయిపోదామని ములాయం ఆశపడ్డాడు. మోదీ హవాకు అందరూ గాలికి కొట్టుకుపోవడంతో, ములాయంకు ఆ పదవి దక్కడం కాదు కదా, పరువు కూడా దక్కలేదు. ఆ ఓటమిని అఖిలేశ్ నెత్తిన రుద్దేసి, తను కనీసం ముఖ్యమంత్రి అవుదామని ఆశపడ్డాడట ములాయం. తప్పుకుని, తన కుర్చీ వప్పగించమని అడిగితే అఖిలేశ్ ఒప్పుకోలేదట. అందుకే ములాయం కత్తికట్టాడు. శివపాల్ యాదవ్ సలహా విని వుంటే 2012లో ముఖ్యమంత్రి, 2014లో ప్రధాని అయిపోయేవాణ్నని, అప్పుడు అఖిలేశ్‌ను ముఖ్యమంత్రి చేయడం పొరపాటైందని ఇటీవల బహిరంగంగా వాపోయాడు.

దానికి తోడు అతనిపై రెండో భార్య సాధన ఒత్తిడి బాగా వుంది. ములాయంకు ఆరోగ్యం అంత బాగా లేకపోవడంతో అతని రెండో భార్య సాధనకు తన 27 ఏళ్ల కొడుకు ప్రతీక్‌కు రాజకీయ భవిష్యత్తు గురించి చింత పట్టుకుంది. సవతి కొడుకు అఖిలేశ్ పార్టీలో, ప్రభుత్వంలో పాతుకుపోతే తన కొడుక్కి గతి లేకుండా పోతుందని ఆమె భయం. అఖిలేశ్ మీద తండ్రి వంటి గూండా ముద్ర, బాబాయి వంటి అవినీతిపరుడి ముద్ర లేదు. ములాయందంతా మొరటు వ్యవహారం. అఖిలేశ్‌ది సున్నితమైన కార్యశైలి. ములాయమే కాదు, శివలాల్ యాదవ్, యితరులు అవినీతిలో, హింసారాజకీయాల్లో ఆరితేరినవారు. కేవలం కులరాజకీయ సమీకరణాలతో నెట్టుకుని వస్తున్నారు. అఖిలేశ్‌పై అవినీతి ఆరోపణలు లేవు. రెండున్నరేళ్ల సమయంలో పాలనా పటిమ చూపలేకపోవడంతో అసమర్థుడనే ముద్ర పడింది. ఆ అసమర్థతకు కారణం కూడా కుటుంబం అతని కాళ్లూచేతులూ కట్టేసిందని కూడా ప్రజలు విశ్వసిస్తున్నారు. యుపికి అయిదున్నర మంది ముఖ్యమంత్రులున్నారు, ఆ అర ముఖ్యమంత్రి అఖిలేశ్ అని అందరూ అతన్ని ఎగతాళి చేశారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు చూశాక అఖిలేశ్ నిద్రలోంచి మేల్కొని, ఉంటే వుంటాం, పోతే పోతాం అనుకుని పార్టీ సీనియర్లను ఎదిరించి, ఆరు బృహత్ పథకాలు చేపట్టి పేరు తెచ్చుకుందామని విపరీతంగా శ్రమించసాగాడు. అది సత్ఫలితాలు యిస్తూ, ప్రజల్లో అతని యిమేజి పెరగసాగింది.

ఇదే కొనసాగితే తమను గుర్తించేవారుండరని శివలాల్ యాదవ్ ప్రభృతులు వ్యాకులం చెందారు. వారితో బాటు సవతి తల్లి సాధన కూడా. ఈ భయంతోనే ఆమె అఖిలేశ్‌పై చేతబడి చేయిస్తోందని అఖిలేశ్‌కు సన్నిహితుడైన ఎమ్మెల్సీ ఉదయవీర్ సింగ్ శుక్రవారం ఆరోపణ చేస్తూ ఏకంగా ములాయంకే లేఖ రాశాడు. ఆమె చెప్పడం బట్టే కాబోలు ములాయం 'అఖిలేశ్ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి కాదు. నెగ్గిన లెజిస్లేటర్లు ఎవర్ని ఎన్నుకుంటే వాళ్లే ముఖ్యమంత్రి' అన్నాడు. నిజానికి ములాయం రాజీ ప్రతిపాదన అంటూ పార్టీ వ్యవస్థ మొత్తాన్ని శివలాల్ చేతిలో పెట్టాడు. అఖిలేశ్‌కు పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు లేవు. శివలాల్ అభ్యర్థులే టిక్కెట్లు సంపాదించుకుని, ఎన్నికైతే యిక అఖిలేశ్‌కు ముఖ్యమత్రి అయ్యే ఛాన్సెక్కడ? ఇలా ఆలోచిస్తే ములాయంలో ధృతరాష్ట్రుడి కంటె కైకేయి మాట వినవలసి వచ్చిన దశరథుడు కనబడతాడు. అఖిలేశ్‌ను తొక్కేసి, రెండో భార్య కొడుకుని గద్దె కెక్కించడానికి అంగీకరించిన శివలాల్‌కు మద్దతు యిస్తూండవచ్చు. అఖిలేశ్‌కు తన క్లీన్ యిమేజి గురించి పాకులాడుతూ పార్టీకి

నిధులు సమకూర్చడం లేదని, అందుకని ఎన్నికలకు ముందు అతన్ని దింపేసి, వేరే వాళ్లని కూర్చోబెట్టి అవినీతికి పాల్పడి, నిధులు సేకరిద్దామనే వూహలో ములాయం వున్నట్లు వార్తలు వచ్చాయి కూడా.

ఇవన్నీ తెలిసి కాబోలు, అఖిలేశ్ యిప్పుడు తెగించాడు. అట్టోపెట్టో తేల్చేద్దామనుకున్నాడు. అక్టోబరు 21 శుక్రవారం నాడు శివలాల్ రాబోయే ఎన్నికలలో పాటించ వలసిన వ్యూహం గురించి జిల్లా స్థాయి పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, మర్యాద కోసం అఖిలేశ్‌ను స్వయంగా ఆహ్వానించాడు. అంతే కాకుండా ముఖ్యమంత్రి అభ్యర్థి అఖిలేశే అని ప్రకటించాడు. అయినా అఖిలేశ్ ఆ సమావేశానికి డుమ్మా కొట్టాడు. అది కాగానే అదే సభ్యులతో తన యింట్లో మరో సమావేశం ఏర్పాటు చేసి, దానికి రమ్మనమని రహస్యంగా కబురు పంపాడు. దాంతో జిల్లా నాయకులు రెండిటికీ హాజరయ్యారు. తన సమావేశంలో అఖిలేశ్ తండ్రి మాట జవదాటనని, తన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో గెలుపు ఖాయమని చెప్పాడు. నవంబరు 3 నుంచి రథయాత్ర ప్రారంభించి తను రాష్ట్రమంతా పర్యటిస్తానని, దానికి జిల్లా నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశాడు. నవంబరు 5న జరిగే పార్టీ రజతోత్సవ సభల్లో తాను పాల్గొనని పరోక్షంగా చెప్పేశాడు. (ఆదివారం తండ్రిని కలిసి మాట్లాడినప్పుడు సభకు వస్తానని చెప్పాట్ట)

ఈ సంఘటనల నేపథ్యంతో ఆదివారం రోజంతా ఉత్కంఠభరితంగా సాగింది. ఉదయమే రాంగోపాల్ యాదవ్ అఖిలేశ్‌ను సమర్థిస్తూ, అఖిలేశ్ వున్నచోట విజయమని చాటుతూ, పార్టీ కార్యకర్తల పేర లేఖ రాసి విడుదల చేయడంతో రగడ ప్రారంభమైంది. అఖిలేశ్‌ను ముఖ్యమంత్రిగా ఒప్పుకున్నాను కదా దానితో చల్లారుతాడులే అనుకున్న శివపాల్ కంగు తినాల్సి వచ్చింది. అఖిలేశ్ చురుగ్గా వ్యవహరించి 175 మంది ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశాడు. 65 మందిని (వారిలో 11 మంది మంత్రులు) పిలవలేదు. అంటే వారు శివపాల్ సన్నిహితులన్నమాట. ఆ సమావేశంలో తను పార్టీ చీల్చనని చెపుతూనే, అమర్ సింగ్‌ను సహించేది లేదని హుంకరించాడు. ఆ సమావేశం కాగానే శివపాల్‌ని, మరో ముగ్గురు మంత్రులను తీసిపారేశాడు. అంతేకాదు, అమర్ సింగ్ సిఫార్సుపై కాబినెట్ హోదా గల ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ పదవిలో వున్న నటీమణి జయప్రదను తొలగించివేశాడు. శివపాల్ ఏమీ చేయలేక రాంగోపాల్ యాదవ్‌ను పార్టీ పదవుల్లోంచి తీసేసి పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించాడు. అతనిపై, అతని కుటుంబసభ్యులపై అవినీతి ఆరోపణలు చేశాడు. రాంగోపాల్ వాటిని ఖండించాడు. అఖిలేశ్, ములాయంతో ముఖాముఖీ భేటీ అయ్యాడు. నీ మాట జవదాటనంటూనే అమర్ సింగ్‌పై, శివలాల్‌పై విరుచుకుపడ్డాడట.

కథ యింకా నడుస్తూనే వుంది. పార్టీ చీలడం ఖాయమనే అనిపిస్తోంది. దీని పర్యవసానాలపై చర్చ జరుగుతోంది కూడా. పార్టీలో యిరు వర్గాల వారు ఒకరిపై మరొకరు బురద చల్లుకోవడం వలన వారి అవినీతిని, కేసులను వారే తవ్వుకుని ప్రజల్లో చులకన కావడం ఖాయం. దానివలన ప్రతిపక్షాలకు లాభం. 2014లో మోదీకి ఓటేసిన బిసిలు యీసారి కూడా బిజెపి అండ చేరవచ్చు. ఎస్పీకి సాంప్రదాయకంగా వుండే ఓటు బ్యాంక్ రెండు ముక్కలుగా చీలిపోయి, బిజెపికి లాభం చేకూరవచ్చు. ఇక్కడే యింకో మాటా గమనించాలి. ముస్లిముల ఓట్లు సాధారణ పరిస్థితుల్లో ఎస్పీ, బియస్పీల మధ్య చీలిపోతే బిజెపికి లాభం. కానీ ఎస్పీ దెబ్బ తినడంతో ముస్లిములు ఎస్పీపై ఆశ విడిచి మొత్తంగా బియస్పీను ఆశ్రయిస్తే బిజెపికి నష్టం. అఖిలేశ్ అభివృద్ధి మోడల్ ఫలితాలు ప్రజలకు ఎంతవరకు చేరాయన్నది అతి ముఖ్యమైన అంశం. మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఏ మాత్రం తీసిపోకుండా అతను పబ్లిసిటీ గుప్పిస్తున్నాడు. దానిలో పావు వంతు వాస్తవమున్నా ప్రజలు అతన్ని ఆదరించవచ్చు. అతని పనికి అడ్డుపడుతున్న ములాయంపై ఆగ్రహాన్ని మళ్లించి, అఖిలేశ్ కొత్త పార్టీ పెడితే అతనికి మద్దతు తెలుపవచ్చు. సమాజంలో పెద్దభార్య కొడుక్కి వున్న గౌరవం రెండో భార్య కొడుక్కి వుండదు. మన కథల్లో సవతి తల్లి ఎప్పుడూ క్రూరురాలే. ఆమె కొడుకు ఎప్పుడూ చవటే. రెండో భార్య మోహంలో పడి ములాయం పెద్ద భార్య సంతానానికి ద్రోహం చేశాడన్న మాట ప్రజల మెదళ్లకు ఎక్కిందంటే అఖిలేశ్ పట్ల సింపతీ పెరిగిపోతుంది. రాజకీయాల్లో రెండో భార్య ప్రమేయం రాజకీయంగా, యిమేజి పరంగా ఎంత చేటో, ఎన్టీయార్ విషయంలో మనం చూశాం. అవినీతికి, హింసకు, కులతత్వానికి పేరుబడిన ములాయం ఒక లెక్కా?

అఖిలేశ్ కొత్తగా పార్టీ పెట్టినా తనంతట తాను అధికారంలో రాగలడా అంటే కష్టమే అని చెప్పాలి. పార్టీ వ్యవస్థపై అతనికి పట్టు లేదు. ఓటర్లను బూతులకు తెచ్చే పార్టీ నిర్మాణం లేదు. ఇప్పుడు అదంతా చూసుకుంటూ కూర్చుంటే పాలన దెబ్బ తింటుంది. పార్టీ చీలిపోతే, ప్రభుత్వం పడిపోయి, రాష్ట్రపతి పాలన విధించవచ్చు. అప్పుడు అతనికి తీరిక చిక్కుతుంది. కానీ అతని ప్రాజెక్టుల ఘనత గాలికి ఎగిరిపోతుంది. కేంద్రమంత్రులు వచ్చి ప్రారంభోత్సవాలు చేస్తారు. మొత్తం మీద అఖిలేశ్ ఏ 100 సీట్లతోనో నెగ్గాడనుకున్నా ఎటూ కాకుండా ఓ పార్టీ నాయకుడిగా మిగులుతాడు తప్ప మళ్లీ ముఖ్యమంత్రి కాలేడు. అఖిలేశ్‌కు ప్రజల మద్దతు వుందన్న నమ్మకం కలిగితే కాంగ్రెసు అతనితో చేతులు కలపవచ్చనే మాట కూడా వినవస్తోంది. వారివురి మధ్య పొత్తు కుదిరితే కాంగ్రెసు నిధులు, పార్టీ యిన్‌ఫ్రాస్ట్రక్చర్, అఖిలేశ్ యిమేజి అన్నీ కలిసి వస్తాయి. ములాయంను ఎలాగైనా అణగదొక్కి బుద్ధి చెప్పాలని తపించే బ్రాహ్మణ, ఠాకూర్ వంటి అగ్రవర్ణాలు ఆ పొత్తుకు అండగా నిలవవచ్చు. అప్పుడు అది బిజెపికి చేటు కలిగిస్తుంది. కథ ఎలా సాగుతుందో రాబోయే రోజులు చెపుతాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 16, 17 వీక్లీకై ఎమ్బీయస్ : చట్టాన్ని చేతిలోకి తీసుకున్న కేరళ న్యాయవాదులు**

గత మూడు నెలలుగా కేరళలోని కోర్టుల్లో మీడియాను అనుమతించటం లేదు. ఆ నిర్ణయం తీసుకున్నది న్యాయాధిపతులు కాదు, న్యాయవాదులు! పత్రికా స్వేచ్ఛను హరించడం సబబు కాదని ముఖ్యమంత్రి కాదు, చీఫ్ జస్టిస్ కాదు ఎవరు చెప్పినా వాళ్లు ఖాతరు చేయడం లేదు. సమాచార సేకరణకై కోర్టు ఆవరణలో రావచ్చో, ఎవరు రాకూడదో వాళ్లే నిర్ణయిస్తారట. దీనికి మూలం జులై 14 నాటి ఒక సంఘటన. ఆ రోజు ధనేశ్ మాత్యూ మంజూరన్ అనే గవర్నమెంటు ప్లీడరు ఎర్నాకులంలోని కాన్వెంట్ జంక్షన్‌లో 45 ఏళ్ల ఒక మహిళపై అత్యాచారం (మోలెస్టేషన్ అన్నారు, ఏ మేరకు అత్యాచారమో తెలియరాలేదు) చేస్తూండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వాళ్లు ఆ మహిళ ఫిర్యాదును నమోదు చేసుకుని దాని ప్రకారం ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి అరెస్టు చేశారు. తర్వాత మంజూరన్ తండ్రి ఆమెను కలిసి క్షమాపణ పత్రం రాసిచ్చి, బహుశా డబ్బో, దస్కమో ముట్టచెప్పి ఆ ఫిర్యాదు వెనక్కి తీసుకోమన్నాడు. ఆమెను కోర్టుకు పిలిచినపుడు నాపై అత్యాచారం చేసినది యితను కాదు, వేరొకరు అని చెప్పింది. దాంతో కేసు ఎగిరిపోయింది.

అక్కడితో అందరూ హమ్మయ్య అనుకుంటే బాగుండేది. కానీ కేరళ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (కెఎచ్‌సిఎఎ) వారు సమావేశమై ప్రాథమిక విచారణ చేయకుండా అమాయకుడైన మంజూరన్‌ను పోలీసులు అనవసరంగా అరెస్టు చేసినందుకు నిరసన తెలుపుతూ పోలీసు స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేయాలని తీర్మానించారు. పోలీసులకు ఒళ్లు మండి ఆ మహిళను అడలగొట్టారు. ఆమె క్షమాపణ పత్రాన్ని చూపించింది. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకుని బహిరంగంగా చూపించారు. ఇక దాంతో అసోసియేషన్ వారు ఏం చేయలేక, వెర్రిమొహం వేసి, పరువు కాచుకోవడానికి 'ప్రదర్శనను వాయిదా వేస్తున్నాం' అని ప్రకటించారు. ఈ విషయాన్ని జులై 19 న రిపోర్టు చేస్తూ ఒక ప్రముఖ ఇంగ్లీషు దినపత్రిక విలేకరి 'అసోసియేషన్ సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపడంతో వాయిదా వేయడానికి నిర్ణయించుకున్నార'ని రాశాడు. అసోసియేషన్‌కు అది రుచించలేదు. 'మా మధ్య అభిప్రాయభేదాలు లేవు, మేమంతా ఏకగ్రీవంగా చేసిన తీర్మానం యిది' అని సవరణ వేయాలని అడిగారు. అతను సరేనన్నాడు.

అయినా కొందరు లాయర్లు పోగడి, అతన్నీ, మరో రిపోర్టరును వెక్కిరించి, తిట్టి, పట్టుకుని కొట్టారు. పనిలో పనిగా 'ఇదే కాదు, యిలా తప్పుడు రిపోర్టింగు చేయడం మీకు అలవాటు అయిపోయిందంటూ మీడియా వారిని చుట్టుముట్టి గొడవ చేశారు. వారిలో కొందరు మహిళా జర్నలిస్టులు కూడా వున్నారు. దాంతో వాళ్లు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులకు కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (కెయుడబ్ల్యుజె) పేర యూనియన్ వుంది కాబట్టి వాళ్లు రంగంలో దిగి జర్నలిస్టులకు జరిగిన అవమానానికి నిరసన తెలుపుతూ కోర్టు ఆవరణకు బయట ప్రదర్శన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇది అడ్వకేట్ అసోసియేషన్ వాళ్లకు కోపం తెప్పించింది. జులై 20న ఎప్పటిలాగా కోర్టు ఆవరణలోని మీడియా రూమును కేరళ హైకోర్టు వారి పబ్లిక్ రిలేషన్స్ శాఖ వారు తెరవగానే వాళ్లు వెళ్లి మూసేయమని గోల చేశారు. మీడియా రూములో వున్న టీవీ, ప్రెస్ రంగాలకు చెందిన కొందరు మహిళా జర్నలిస్టులను అల్లరి పెట్టారు. ఈ రగడ యిక్కడ జరుగుతూండగానే కోర్టుకు బయట జరుగుతున్న జర్నలిస్టు యూనియన్ ప్రదర్శన అదుపు తప్పింది. వాళ్లపై అసోసియేషన్ వాళ్లు రాళ్లు వేయడం, ప్రతిగా వీళ్లూ రాళ్లు విసరడం జరిగాయి. పోలీసులు జర్నలిస్టులను కాపాడదామని చూశారు కానీ వేలాదిగా వున్న లాయర్లు (హైకోర్టులో 6 వేల మంది న్యాయవాదులు, పాతిక దాకా న్యాయమూర్తులు వున్నారు) పోలీసులను చుట్టుముట్టి ఎటూ కదలకుండా చేశారు. అంతేకాదు, మొగుణ్ని కొట్టి, మొగసాల కెక్కిన చందంగా 'తమపై పోలీసులు చేసిన దౌర్జన్యానికి నిరసనగా...' అంటూ తర్వాతి రెండు రోజులూ అంటే జులై 21, 22న కేరళ రాష్ట్రం మొత్తంలో అన్ని కోర్టులలో సమ్మెకు దిగారు.

ఈ సమస్యపై టీవీ వారు నిర్వహించిన చర్చావేదికల్లో పాల్గొన్న కొందరు సీనియర్ న్యాయవాదులు తక్కినవారు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఈ పద్ధతులను నిరసిస్తూ 'అసోసియేషన్ వారు కాస్త ఓరిమి వహించి, న్యాయవాదుల గౌరవాన్ని కాపాడాల'ని అన్నారు. దాంతో అసోసియేషన్ వారు తాము చేపట్టిన 'ఉదాత్తమైన (నోబుల్)' ఉద్యమలక్ష్యాన్ని తప్పుపట్టినందుకు ఆరుగురు సీనియరు లాయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హైకోర్టే కాదు, జిల్లా కోర్టులే కాదు, రాష్ట్రం మొత్తంలో ఏ కోర్టులోనూ మీడియావారు ప్రవేశించడానికి వీల్లేదని హుకుం వేశారు. జడ్జిగారి తీర్పు వచ్చాక ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దాన్నుంచి మాత్రమే వార్తలు తీసుకోవాలి తప్ప వాదోపవాదాల గురించి రిపోర్టు చేయనక్కర లేదన్నారు. మీడియా రూములున్న కోర్టులన్నిటిలో ఆ గదులు మూయించేశారు. ఇది చాలా ఎబ్బెట్టు వ్యవహారంగా పరిణమించడంతో ముఖ్యమంత్రి విజయన్ అసోసియేషన్, బార్ కౌన్సిల్, యూనియన్ ప్రతినిధులతో ఒక కమిటీ వేయమని జులై 30న అడ్వకేట్ జనరల్‌ను ఆదేశించాడు. కమిటీ రెండుసార్లు సమావేశమైంది కానీ అప్పటి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి టిబి రాధాకృష్ణన్, యిప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఐన శాంతన గౌండర్, మరో ఎనిమిది మంది న్యాయాధిపతులతో కలిసి అసోసియేషన్‌తో, యూనియన్‌తో చర్చలు జరిపారు కానీ చర్చలు సఫలం కాలేదు.

ఈ సమావేశాల్లో తమ సమస్యపై పత్రికలు వేసిన కార్టూన్లను, టీవీ చర్చలను ఎత్తిచూపిన అసోసియేషన్ వాటికి మీడియా క్షమాపణ చెప్పి, యికపై అలాటి వేయమని హామీ యివ్వాలని, తమ వృత్తి గురించి వేసే వార్తలన్నిటినీ వడపోయడానికి (స్క్రీన్ చేయడానికి) ఒక వ్యవస్థ వుండాలని, ఏ పత్రికను ఎవరు ప్రతినిధిగా రావాలో నిర్ణయించే హక్కు తమకుండాలని పట్టుబట్టారు. చివరగా రెండు, మూడు దశాబ్దాలుగా కోర్టు వ్యవహారాలు రిపోర్టు చేస్తున్న ఐదుగురు ప్రముఖ లీగల్ కరస్పాండెంట్లు కోర్టు ఆవరణలో అడుగు పెట్టడానికి వీల్లేదని అసోసియేషన్ పట్టుబట్టారు. మీడియావారు యివేమీ కుదరదు పొమ్మన్నారు. తమ సంస్థల తరఫున

ఎవర్ని పంపాలో, ఎవర్ని పంపకూడదో చెప్పడానికి యీ లాయర్లు ఎవరు? పైగా మా వార్తలపై యీ సెన్సార్‌షిప్ ఏమిటి? ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన న్యాయవాదులు, యిలాటి అప్రజాస్వామికమైన డిమాండ్లు ఎలా చేయగలరు అని నిలదీశారు. దశాబ్దాలుగా తాము ఉపయోగిస్తూ వచ్చిన మీడియా రూము తమకు అందుబాటులోకి తేవాలని గట్టిగా అడిగారు. అయితే అసోసియేషన్ ససేమిరా అంది. మీడియా రూము మూసే వుంచుతామని, జడ్జిల ఛాంబర్స్‌కు మీడియా వెళ్లకూడదని (కొందరు జడ్జిలు కొన్ని సందర్భాల్లో న్యాయవాదులను తమ ఛాంబర్స్‌కు రానీయరు. కానీ పాత్రికేయులను రానిస్తారు. దానిపై కినిసిన లాయర్లు యీ షరతు కూడా చేర్చారు), తాము నిషేధించిన వారు తప్ప తక్కిన రిపోర్టర్లు రావచ్చని అసోసియేషన్ అంది.

అలా అన్నా సెప్టెంబరు 30న ఎనిమిది మంది రిపోర్టర్లు హైకోర్టుకి వెళితే లాయర్ల బృందమొకటి వారిని చుట్టుముట్టి, వెళ్లిపోతారా లేకపోతే పట్టుకుని తన్నమంటారా? అని అడిగారు. ఇదెక్కడి అన్యాయం అని అడిగితే 'వాళ్లు పోలీసు రక్షణతో ఎందుకు రావాలి? అందుకే మాకు కోపం వచ్చింది' అని సమాధాన మిస్తున్నారు. 'మేమేమీ పోలీసులను ప్రాధేయపడలేదు. మాకు రక్షణ కల్పించమని కోర్టు రిజిస్ట్రార్ జనరల్ యిచ్చిన ఆదేశాలను వారు అమలు చేస్తున్నారంతే' అంటారు జర్నలిస్టులు. ఈ వ్యవహారమంతా మొదటి నుంచీ గమనిస్తున్న సెబాస్టియన్ పాల్ అనే మాజీ ఎంపీ సెప్టెంబరు 7న ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రెస్ కౌన్సిల్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేసింది. 'కోర్టులోకి ప్రవేశించే హక్కు ప్రతి పౌరుడికి వుంటుంది. దాన్ని నిరాకరించడం తప్పు' అని చీఫ్ జస్టిస్ అన్నా, సామాన్యపౌరులు తమ ప్రవర్తనను ఖండిస్తున్నా న్యాయవాదులు ఖాతరు చేయడం లేదు. ఈ గొడవలన్నీ చేస్తున్నది ప్రాక్టీసు లేని కొందరు యువన్యాయవాదులు తప్ప తక్కినవారు కాదని కొందరంటున్నారు. కానీ వారిని ఏరి పారేసే శక్తి అసోసియేషన్‌కు లేకపోవడం వలన మొత్తం న్యాయవాద వృత్తికే అప్రతిష్ఠ కలుగుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 16,17 వీక్లీకై**

## ఎమ్బీయస్ : రిజర్వేషన్లు చేసే చెఱుపు ఎంత?

ఇటీవలి కాలంలో అనేక రాష్ట్రాలలో కాపు, జాట్, మరాఠా, పటేల్, వణ్నియార్ వంటి సామాజికంగా అగ్ర శూద్రకులాలు తమను కూడా వెనుకబడిన శూద్రకులాలు (బిసి)లుగా మార్చమని కోరడం ఎక్కువైంది. బిసిల్లోకి కులాల్ని చేర్చిన కొద్దీ డిమాండ్లు మరింతగా వస్తున్నాయి. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో దాదాపు 180 కులాలను బిసిల్లో చేర్చారు. ఇప్పుడు అక్కడ పటేళ్లు, కాపులు, వణ్నియార్లు తమను కూడా చేర్చమని ఆందోళన చేస్తున్నారు. మహారాష్ట్రంలో ఏకంగా 261 కులాలను చేర్చారు. దానివలన సమస్య చల్లారలేదు సరికదా అక్కడ మరాఠాలు పెద్దపెట్టున ఆందోళన చేస్తున్నారు. అంటే బిసిలుగా మార్చడంలో పరిష్కారం లేదని గ్రహించాలి.

ఈ కులాల వాళ్లు రిజర్వేషన్ల కోసం యితర బిసిలతో కలహిస్తే అర్థం చేసుకోవచ్చు. కానీ వింతగా దళితులపై వ్యతిరేకత కనబరుస్తున్నారు, ముఖ్యంగా మరాఠాల విషయంలో యిది స్పష్టంగా కనబడుతోంది. రిజర్వేషన్ల కారణంగా దళితులు బలపడ్డారని, అనవసరంగా తమపై అత్యాచార కేసులు పెట్టి అప్రతిష్ఠపాలు చేస్తున్నారనీ అంటున్నారు. రాష్ట్రం మొత్తం మీద పెట్టిన అత్యాచార కేసుల్లో 90% మంది నిందితులు మరాఠాలే అని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు కానీ వాస్తవాలు మరోలా వున్నాయి. మొత్తం ఎఫ్‌ఐఆర్‌లలో దళితులు పెట్టేవి 1% మాత్రమే. ఆ కేసుల్లో కూడా 40% మాత్రమే అత్యాచార చట్టం కింద చేసిన ఫిర్యాదులు. వాటిల్లో కూడా శిక్ష పడినవి అతి తక్కువ. దాదాపు లేవనే చెప్పవచ్చు. ఇప్పుడు మరాఠాల ఆందోళన తర్వాత ఫడ్నవీస్ ప్రభుత్వం ఆ చట్టంలో కొన్ని మార్పులు సూచిస్తోంది. ప్రస్తుతానికి దళితులపై అత్యాచారం వంటి కేసులు పెడితే నిందితుడు బెయిలు కోసం జిల్లా కోర్టుకి వెళ్లలేడు. హైకోర్టుకి వెళ్లి తెచ్చుకోవాలి. దానికి కనీసం రెండు నెలలు పడుతుంది. అప్పటిదాకా కారాగారవాసమే. ఇప్పుడు ప్రభుత్వం జిల్లా కోర్టులు కూడా బెయిలివ్వవచ్చని సవరించబోతోంది. కులం పేరుతో తిట్టాడని పెట్టిన కేసుల్లో వారం కల్లా బెయిలు వచ్చేట్లు చూద్దామనుకుంటోంది.

ముంబయి యూనివర్శిటీలో ఎకనమిక్స్ ప్రొఫెసర్ ఐన నీరజ్ హటేకర్ ప్రకారం '2004 నుంచి 2012 వరకు దేశంలో మధ్యతరగతి బలపడింది. అభివృద్ధి రేటు 6-7% వుండి, గ్రామీణ దారిద్ర్యం తగ్గిపోయి, జీతాలు పెరిగి, దళితుల స్థితిగతులు మెరుగుపడ్డాయి. మరాఠా రైతులకు దళిత వ్యవసాయ కూలీలు దొరకడం మానేశారు. తర్వాతి రోజుల్లో దేశ ఆర్థికస్థితి క్షీణించినా 7,8 ఏళ్ల కాలంలో బాగుపడినవాళ్ల దళితులను చూసి మరాఠాలు అసూయపడ్డారు. చదువుపై, ఉద్యోగాలపై శ్రద్ధ పట్టకుండా కేవలం వ్యవసాయాన్ని నమ్ముకోవడం తాము చేసిన పొరపాటని గుర్తించని మరాఠాలు దళితులపై ఆగ్రహం పెంచుకున్నారు.'

"కాస్ట్ బేస్డ్ రిజర్వేషన్స్ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఎకనమిక్ రిఫార్మ్స్, సోషల్ ఎక్స్‌క్లూజన్" అనే పుస్తకం రాసిన కె.ఎస్.చలం ప్రకారం 'పబ్లిక్ సెక్టార్, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అన్నీ కలిపి చూస్తే యిప్పటివరకు 25 లక్షల మంది దళితులు రిజర్వేషన్ వలన లాభపడ్డారు. జనాభాలో 25 కోట్ల మంది దళితులున్నారనుకుంటే లాభపడినవారి శాతం 1 మాత్రమే అన్నమాట! ఇక ఒబిసిల దగ్గరకి వస్తే 15 లక్షల మంది ఒబిసిలు రిజర్వేషన్ వలన లాభపడ్డారు. పబ్లిక్ సెక్టార్ ఉద్యోగాలు 1990లలో 1.95 కోట్లు వుంటే 2014 నాటికి అవి 1.70 కోట్లకు పడిపోయాయి. ప్రస్తుతం ప్రయివేటు రంగంలోని ఐటీ సెక్టార్, సర్వీసెస్ సెక్టార్‌లలో ఉద్యోగావకాశాలు పెరిగాయి. వాటిల్లో రిజర్వేషన్ నిబంధన లేకపోవడం చేత, బాగా చదువుకున్న

బ్రాహ్మణ, బనియా, యితర సామాజిక అగ్రవర్ణాల వారు ఉద్యోగాలు సంపాదించుకుని యిబ్బడిముబ్బడిగా సంపాదించుకుంటున్నారు.'

అంకెల మాట ఎలా వున్నా చివరి పరిశీలన వాస్తవమే అని చెప్పాలి. ప్రయివేటు సెక్టార్‌లో ఉద్యోగాలు పెరిగినకొద్దీ అవి కులపరంగా కాక, ప్రతిభ, పనిచేసే తీరు వంటి అంశాలపై ఆధారపడుతున్నాయి. ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్ బాదరబందీతో విసిగిన అగ్రవర్ణాలు యీ ఉద్యోగాలకై శ్రమించి చేజిక్కించుకుంటున్నారు. అది దళితులకు, బిసిలకు కన్నెఱ్ఱగా వుంది. పేరుకు రిజర్వేషనే తప్ప, ఆచరణలో తమకు దక్కేది ఏమీ లేదని, నిజంగా బాగుపడుతున్నది అగ్రవర్ణాలే అని వారికి అర్థమవుతోంది. దానికి విరుగుడు ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్ పద్ధతి ప్రవేశపెట్టడమే అని వారి కులాల నాయకులు వారికి నచ్చచెపుతున్నారు. కానీ పెట్టుబడిదారుడి అడుగులకు మడుగులు ఒత్తే యీ రోజుల్లో ప్రభుత్వం యిలాటి నిబంధనలు వారిపై విధిస్తుందా అన్నది సందేహమే. రిస్కు తీసుకుని పెట్టుబడి పెట్టేవాడికి ఉద్యోగులను ఎంచుకునే హక్కు యివ్వకపోతే అతను విసిగి, వేసారి ఫ్యాక్టరీ మూసేస్తానంటే ఏం చేయాలన్న భయం ప్రభుత్వానికి వుంటుంది. ఈ విషయాన్ని ఆ యా కులాల యువత గ్రహిస్తే, తమ ప్రతిభావ్యుత్పత్తులను పెంచుకోవడానికి ప్రభుత్వసాయం అడిగేవారు తప్ప, కాలేజీ సీట్లలో, ఉద్యోగాలలో రిజర్వేషన్లకై పట్టించుకునేవారు కారు. వారు ఆ విషయాన్ని గ్రహించకుండా వారిని కులం పేర ఆవేశకావేషాలలో ముంచెత్తడానికే కులనాయకులు ప్రయత్నిస్తూండడం దురదృష్టకరం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 అక్టోబరు 20** **ఎమ్బీయస్ : మరాఠా ఆందోళన పరిణామాలు**

మహారాష్ట్రలోని అహమద్‌నగర్ జిల్లాలో ఒక మరాఠా బాలికను ముగ్గురు దళితులు అత్యాచారానికి గురిచేసి, చంపివేయడంతో ప్రారంభమైన మరాఠా మౌనప్రదర్శనలు నానాటికీ బలపడుతూ వస్తున్నాయి. వాళ్లు రాజకీయనాయకులను దరి చేయనీయటం లేదు. ముందువరుసలో మహిళలు, వారి వెనుక అడ్వకేట్లు, డాక్టర్లు వంటి వృత్తినిపుణులు, వారి వెనుక రైతులు, చివరగా ఉంటేగింటే రాజకీయ నాయకులు! ఉన్నా వారిని ఉపన్యసించనీయటం లేదు. లక్షలాది మంది మౌనంగా నడుస్తూ ప్రదర్శన ముగిశాక, ఐదుగురు అమ్మాయిలు వెళ్లి జిల్లా కలక్టరుకు మహజరు యిస్తారు – మరాఠాలకు రిజర్వేషన్ కల్పించమని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టాన్ని ఎత్తివేయమని! ఆగస్టు 10 నుంచి అలాటి ప్రదర్శనాలు డజనుకి పైగా జరిగాయి. ఆందోళనకు మద్దతు తెలుపుతూ అక్టోబరు 2న 22 వేల గ్రామసభలు తీర్మానాలు చేశాయి. సతారా జిల్లాలోని గుండేవాడి గ్రామంలో వున్న 1400 మందీ మరాఠాలే కావడంతో తమ ఊరి పేరును మరాఠా నగర్‌గా మార్చేసుకున్నారు. 'మరాఠా' అనే పేరు మీద కొత్త టీవీ ఛానెల్ రాబోతోంది. ఇలా 10 వారాలుగా ఆందోళన తీవ్రంగా నడుస్తున్నా దాన్ని ఎలా హేండిల్ చేయాలో ఎవరికీ తెలియటం లేదు. రాజకీయనాయకులు చొరబడి వుంటే, యీ పాటికి పరిష్కారం చేసి వుండేవారు. శరద్ పవార్ వంటి మరాఠా నాయకుడు కూడా చాటుగా సాయపడుతున్నాడు కానీ ముందుకు రావటం లేదు.

ఈ ఆందోళనలోని మొదటి విషయమైన రిజర్వేషన్ల గురించి చెప్పాలంటే – 1980లలో తొలిసారి యీ డిమాండ్ వచ్చింది. మరాఠాలు, కుంబీలు కలిసి జనాభాలో 34% వున్నారు. మండల్ కమిషన్ కుంబీలను బిసిలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించడంతో వాళ్లు తక్కిన మరాఠాల కంటె ముందుకు వెళ్లారు. నారాయణ రాణే కమిటీ నివేదిక ప్రకారం మరాఠాలు ప్రభుత్వోద్యోగాల్లో 15% వున్నారు. ఉన్నత విద్య చదివేవారిలో వారి శాతం 12 మాత్రమే. సైన్యంలో వారి శాతం 20ట. ఋణగ్రస్తుల్లో 67%, భూములమ్ముకునేవారిలో 50% మరాఠాలే.

వారిని ఊరడించడానికి రాష్ట్రప్రభుత్వం యీ అంశాన్ని పరిశీలించమని బిసి నేషనల్ కమిషన్‌ను కోరింది. 1990 నుంచి 2008 మధ్య మూడు కమిషన్లు దీనిపై చర్చించాయి. 2008 నాటి కమిషన్ మరాఠాలు ఆర్థికంగా కాని, సామాజికంగా కాని, రాజకీయంగా కానీ వెనుకపడి లేరని తేల్చింది. ఈ మాట వాస్తవం కాదని, నిజానికి కొన్ని (169 అని లెక్క కూడా చెప్తున్నారు కొందరు) మరాఠా కుటుంబాలు మాత్రమే బాగుపడ్డాయని, వాళ్లే రాజకీయాలను, కోఆపరేటివ్ రంగాన్ని, చక్కెర వ్యాపారాన్ని, ఉల్లిపాయల వ్యాపారాన్ని హస్తగతం చేసుకున్నారని బీద మరాఠాలు ఆరోపిస్తున్నారు. దళితులను, ప్రభుత్వాన్ని నిరసిస్తున్న యీ తరుణంలోనే పనిలోపనిగా తమ పేరు చెప్పి సకల సౌకర్యాలు అనుభవిస్తున్న ధనిక మరాఠాలకు వ్యతిరేకంగా కూడా ఉద్యమించాలంటున్నారు. శరద్ పవార్ కేంద్రంలో వ్యవసాయ మంత్రిగా వున్న పదేళ్ల కాలంలోనే సగటున రోజుకొక రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, చేసుకున్నవారిలో 36% మంది మరాఠాలేనని ఆందోళన కారుల వాదన. బిజెపి హిందువులను సంఘటితం చేసి విజయాలు సాధిస్తూండడం చూసి మరాఠాలను చీల్చి తమ పక్షాన కూడగట్టడానికి శరద్ పవార్, విలాస్‌రావ్ దేశ్‌ముఖ్‌లు వారి రిజర్వేషన్‌ను 2009లో ఎన్నికల అంశం చేసి, పదవిలోంచి దిగిపోయే ముందు వారికి 16% కోటా యిస్తూ ఆర్డినెన్సు జారీ చేశారు కానీ వ్యవహారం కోర్టులో వుంది. ఎందుకంటే రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు విధించిన 50% పరిమితి (తమిళనాడు, ఆంధ్ర దీన్ని ఉల్లంఘించాయి)ని దాటి మహారాష్ట్ర యిప్పటికే 2% ఎక్కువగా యిస్తోంది.

ఈ కారణాలతో ఆందోళన నడుస్తూంటే కర్మకాలి ఊరేగింపులు జోరుగా సాగుతున్న నాశిక్ జిల్లాలోనే తాలేగావ్ అనే వూళ్లో అక్టోబరు 7న 16,17 ఏళ్ల దళిత బాలుడు, అయిదేళ్ల మరాఠా పాపపై అత్యాచార ప్రయత్నం చేసినట్లు రిపోర్టు వచ్చింది. మరాఠాలు

కాగడాలు చేపట్టి నాశిక్–ముంబయి హైవేపై ట్రక్కులను, బస్సులను, పోలీసు వాహనాలను ఆరు గంటలపాటు తగలబెట్టారు. ఏడెనిమిది దళిత నివాసాలకు నిప్పుపెట్టారు. సోషల్ మీడియా ద్వారా దీనికి ప్రచారం కలిగినకొద్దీ పరిస్థితి మరింత సంక్లిష్టం అయిపోతుందని భయపడిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫద్నవీస్ బస్సులు రద్దు చేసేసి, వారం రోజుల పాటు యింటర్నెట్ సౌకర్యం లేకుండా చేశాడు. మరాఠాలు బిసిలుగా గుర్తింపబడితే తమ రిజర్వేషన్లకు గండి పడుతుందని భయపడిన బిసిలు యిటీవల నాశిక్ జిల్లాలో 4 లక్షల మంది చేరి 'మనీ లాండరింగ్ కేసులో అన్యాయంగా (?) యిరుక్కుని మార్చి నెల నుండి జైల్లో వున్న ఛగన్ భుజబల్ అనే బిసి నాయకుడికి మద్దతుగా..' అనే పేర పెద్ద ప్రదర్శన నిర్వహించారు.

మరాఠాలు బ్రాహ్మణ వ్యతిరేకులు. ఫద్నవీస్ బ్రాహ్మణుడు. అందువలన అతనికి పదవీగండం వుండవచ్చని కొందరంటున్నారు. ఆ భయంతో అతను మరీ రాజీ పడుతున్నాడు. ఇటీవల 'మహారాష్ట్ర భూషణ్' అనే బిరుదును 90 ఏళ్లు పైబడిన బాబాసాహెబ్ పురందరే అనే ప్రసిద్ధ చరిత్రకారుడికి యిచ్చారు. ఖేడేకర్ అనే మరాఠా నాయకుడు 'గత 15 ఏళ్లల్లో 7గురు బ్రాహ్మణులకు యీ బిరుదు యిచ్చారు. మళ్లీ యింకో బ్రాహ్మడికా?' అని నిరసన తెలిపాడు. అతను రాసిన ఒక పుస్తకంలో 'బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులందరికీ శత్రువులే. బ్రాహ్మలందరినీ నరికి పోగులు పెడితే తప్ప దేశం ముందుకి వెళ్లదు' అని రాశాడట. ఇలాటివాణ్ని ఫద్నవీస్ బులధానా జిల్లాలో శివాజీ తల్లికి కట్టబోయే స్మారకచిహ్నం నిర్మాణ కమిటీకి చైర్మన్‌గా వేశాడు. మరాఠాలను చల్లార్చడానికి మరాఠా విద్యార్థులకు ఆర్థికసాయం ప్రకటించాడు. అంతేకాదు, మరాఠాలు అత్యధికంగా వున్న కూలీపనివారి ఉన్నతికై పనిచేస్తున్నామని చెప్పుకునే 'అన్నాసాహెబ్ పాటిల్ ఆర్థిక వికాస్ మహామండల్'కు రూ. 200 కోట్లు సహాయం ప్రకటించాడు. ఇవన్నీ చూసి బ్రాహ్మణులు మేల్కొంటున్నారు. నవంబరులో వారొక సమావేశం ఏర్పాటు చేద్దామనుకుంటున్నారు. చివరికి యిది ఎలాటి పర్యవసానాలకు దారి తీస్తుందో తెలియదు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (అక్టోబరు 2016)**

**2016 వీక్లీకై నవంబరు 01 ఎమ్బీయస్ : ఢిల్లీని పాలించేదెవరు?**

అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో హీరోగా వెలిగే రోజుల్లో అతని ప్రతి మాట వేదవాక్కులా భాసించేది నెటిజన్లకు. అతను కాంగ్రెసును తిట్టినంతకాలం బాగానే వుంది కానీ బిజెపిని, మరీ ముఖ్యంగా మోదీని తిట్టనారంభించేసరికి నెటిజన్లకు అతనిపై మోజు విరిగింది. సగటు రాజకీయాలను తూర్పారబడుతూ పైకి వచ్చే నాయకులందరిలాగానే అరవింద్ కూడా సగటు రాజకీయనాయకుడిగానే తేలేసరికి గ్లామర్ మరింత తగ్గింది. చాలాసార్లు అతను బరితెగించి ఆరోపణలు చేయడంతో ఆ మాటలకు విలువ తగ్గింది. ఢిల్లీని పాలించమని తనను ప్రజలు ఎన్నుకున్నా మోదీ పగబట్టి తనను పాలించనీయటం లేదని, ఎల్‌జి (లెఫ్టినెంట్ గవర్నరు) ద్వారా తన పాలనే ఢిల్లీపై రుద్దుతున్నాడని, తప్పులకు మాత్రం తనను బాధ్యుణ్ని చేస్తున్నాడని అతను చేస్తున్న ఆరోపణలను ఏ మేరకు నమ్మాలి? పెన్షన్ గొడవలో జవాను ఆత్మహత్య విషయంలో రాహుల్ తదితరులపై కంటె అరవింద్‌నే ఢిల్లీ పోలీసులు ఎక్కువగా హింసించారని గమనిస్తే ఢిల్లీ పోలీసులను ఎవరు శాసిస్తున్నారో ఒక అంచనాకు రావచ్చు.

'ఢిల్లీపై అధికారం ఎవరిది? – ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిథులతో ఏర్పడిన ప్రభుత్వానిదా? కేంద్రం నియమించే ఎల్‌జిదా?' అనే సమస్యపై ఢిల్లీ హైకోర్టుకి వెళితే జస్టిస్ జి.రోహిణి, జస్టిస్ జయంత్ నాథ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఆగస్టు 4 న తీర్పు యిస్తూ ఎల్‌జియే ఎడ్మినిస్ట్రేటివ్ హెడ్ అని తీర్పు యిచ్చింది. మరి ముఖ్యమంత్రి ఎందుకయ్యా అంటే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారం మాత్రం అతనిదేట. తక్కిన విషయాల్లో ఎల్‌జీయే బాస్‌ట. ఈ తీర్పు వచ్చాక ఎల్‌జి యిక చెలరేగిపోయాడు. తన ఆమోదం లేకుండా అప్పటిదాకా ఆప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లన్నిటినీ మూడు రోజుల్లోగా తన ఆఫీసుకి తెప్పించుకున్నాడు. అలా చేరిన 400 ఫైళ్లు ఎల్‌జిగారి ఆఫీసులో పడి వున్నాయి. పంపిన ఫైళ్లు వెనక్కి పంపమని మంత్రులు రిమైండర్లు పంపినా ఎల్‌జి ఆఫీసు పలకటం లేదు. ఎక్సయిజ్ శాఖ వసూళ్లు దెబ్బ తిన్నాయి.

వాటి సంగతి చూడడానికి టైము లేదు కానీ పంపని శాఖల పని పడదామనుకున్నాడు. ఆగస్టు 29న మోస్ట్ అర్జంట్ రిమైండర్ పంపిస్తూ 'ఇప్పటికైనా ఫైళ్లు పంపకపోతే ఆయా శాఖాధిపతులను బాధ్యులను చేయడం జరుగుతుంది' అని తెలియపరిచాడు. అదే రోజు ఐయేయస్, యితర ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల పోస్టింగు, బదిలీ వ్యవహారాలన్నిటిపై ఎల్‌జిదే అంతిమ నిర్ణయం అని ఒక ఆదేశం విడుదల చేశాడు. మరి అంతకంటె తక్కువ స్థాయి ఉద్యోగులంటారా, వారి సంగతి చీఫ్ సెక్రటరీ లేదా సర్వీసెస్ సెక్రటరీ చూస్తారు. మరి ముఖ్యమంత్రి ఏం చేయాలిట? ఎల్‌జి కోరితే, తన అభిప్రాయం ఆయనకు చెప్పవచ్చు కానీ అది వినవలసిన అగత్యం ఎల్‌జికి లేదు. ఇది కూడా ఆ ఆదేశంలో స్పష్టంగా చెప్పారు. ముఖ్యమంత్రికే పని లేనప్పుడు యిక మంత్రుల కేముంటుంది? వాళ్ల మాట చెల్లదని తెలిశాక అధికారులు వారికి రిపోర్టు చేయడం మానేశారు. ఎల్‌జిని కలిసి ఆదేశాలు తీసుకుంటున్నారు. ఆయన యిలా చెప్పారు, మేం యిలా చేస్తున్నాం అని కూడా మంత్రులకు చెప్పడం మానేశారు. అందువలన సెక్రటేరియట్ బావురుమంటోంది. వాళ్లను కోర్టులు బిజీగా వుంచుతున్నాయి. ఢిల్లీ పాలనలో లోపం కనబడ్డప్పుడల్లా వాళ్లను పిలిచి తిడుతున్నాయి. ఎల్‌జి ఆగస్టు 30 న త్రిసభ్య కమిటీ ఒకటి వేసి తను తెప్పించుకున్న ఫైళ్లలో ఎల్‌జిని అడగకుండా చేసిన నిర్ణయాలేమిటో కనిపెట్టి సవరించడంతో బాటు, ఆ నిర్ణయాలు తీసుకున్నవారిపై ఎలాటి చర్యలు తీసుకోవాలో తేల్చమని కోరాడు.

ఆప్ ప్రభుత్వానికి పేరు తెచ్చిన ప్రతి ప్రాజెక్టుపై ఎల్‌జి కన్ను పడింది. వాటిని చెడగొట్టడానికే కంకణం కట్టుకున్నాడు. ఆప్‌కు బాగా పేరు వచ్చిన పథకం – మొహల్లా క్లినిక్. మన ప్రైమరీ హెల్త్ సెంటర్లన్నీ పాడుపెట్టి ఆరోగ్యశ్రీ పేరుతో కార్పోరేట్లకు నిధులు కట్టబెడుతున్నారు కానీ ఢిల్లీలో మొహల్లా క్లినిక్‌ల పేర వాటిని బలోపేతం చేస్తున్నారు. ఆ పథకాన్ని పర్యవేక్షించే డా।। తరుణ్ సీమ్ అనే హెల్త్ సర్వీసెస్ డైరక్టరు జనరల్‌ను ఎల్‌జి మహాశయుడు హఠాత్తుగా తీసిపారేశాడు. ఆప్‌కు పేరు తెచ్చిన మరో పథకం విద్యుత్ చార్జీలను నియంత్రించడం. ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్‌గా కృష్ణా సైనీని నియమించి అతని ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేట్లు చూడడానికి, విద్యుత్ వినియోగదారుల హక్కులు కాపాడడానికి ఆప్ ప్రభుత్వం మూడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను నియమాలు పాటించాలని హెచ్చరించింది. వాటిలో రెండిటిలో అనిల్ అంబానీ భాగస్వామ్యం వుండడంతో బిజెపి కేంద్ర ప్రభుత్వం ఎల్‌జి ద్వారా సైనీ నియామకాన్ని రద్దు చేయించింది. రద్దు నిర్ణయంపై ఆప్ ప్రభుత్వం హైకోర్టుకి వెళ్లింది. ఇవే కాదు, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎమ్‌డి, పిడబ్ల్యుడి సెక్రటరీ, ఇండస్ట్రీ సెక్రటరీ వంటి అనేక ముఖ్యమైన పదవులలో ఆప్ నియమించిన అధికారులందరినీ ఎల్‌జి మార్చిపారేస్తున్నారు.

ఎల్‌జి అండ చూసుకుని అతను నియమించిన అధికారులు చెలరేగిపోతున్నారు. యాంటీ కరప్షన్ బ్రాంచ్ (ఎసిబి)కు అధినేతగా వేసిన ఎంకె మీనా వారిలో ఒకరు. మీనా దర్శకత్వంలో ఎసిబి రూ.400 కోట్ల వాటర్ ట్యాంకర్ స్కాములో షీలా దీక్షిత్‌ను తప్పుపడుతూ ఒక నివేదిక సమర్పించింది. ఆ రిపోర్టును ఆప్ ప్రభుత్వం 11 నెలలు ఆలస్యంగా కేంద్రానికి పంపింది. ఆలస్యానికి కారణమేమిటో తెలియరాలేదు కానీ అదో పెద్ద నేరంగా తోచింది బిజెపి నాయకులకు. ఢిల్లీ బిజెపి నాయకుడు వ్రజేంద్ర గుప్తా ఎల్‌జికి ఒక పిటిషన్ పెట్టాడు – నివేదికను తొక్కిపెట్టినందుకు అరవింద్‌పై కూడా చర్య తీసుకోవాలని. ఆ మాత్రం సూచన చాలు, మీనాకు. వెంటనే షీలా దీక్షిత్‌తో బాటు అరవింద్ పేరు కూడా ఎఫ్‌ఐఆర్‌లో చేర్చేశాడు. షీలా దీక్షిత్ ప్రభుత్వంలో మంత్రి కాదు కదా అరవింద్ పేరు ఎందుకు అంటే నివేదిక పై త్వరగా చర్య తీసుకోనందుకట! ఎన్నో కేసుల్లో ప్రభుత్వాలు నివేదికలే బయటపెట్టవు. చర్యలు కూడా ఆలస్యంగా తీసుకుంటాయి. ఆ కారణానికి ఎఫ్‌ఐఆర్‌లో పేరు ఎక్కించేస్తే ముఖ్యమంత్రుల పేర్లే కాదు, ప్రధానుల పేర్లూ కనబడాలి. ఏది ఏమైనా అరవింద్‌ను కేంద్రం ప్రత్యేక దృష్టితో చూస్తూ ఎల్‌జి ద్వారా అతన్ని యిక్కట్లపాలు చేస్తోందన్నది స్పష్టంగా కనబడుతోంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**2016 వీక్లీక్లై నవంబరు 02 ఎమ్బీయస్ : నల్లధనం వెల్లడి.. ఏ మేరకు?**

నల్లధనం చలామణీ అరికట్టడానికి ప్రభుత్వయంత్రాంగాన్ని ప్రభావవంతంగా ఉపయోగించడం ఉత్తమ పద్ధతి. అది చేతకాని పక్షంలో ఎగవేతదారులనే 'బాబ్బాబూ, ఎంత ఎగ్గొట్టేరో మీరే చెప్పేసి, పన్ను కట్టేయండి, మిమ్మల్నేం చెయ్యం, పువ్వుల్లో పెట్టి చూసుకుంటాం' అని అడగడం మరో పద్ధతి. 1997లో అప్పటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం రెండో పద్ధతి అవలంబించి దానికి వాలంటరీ డిస్‌క్లోజర్ ఆఫ్ ఇన్‌కమ్ స్కీమ్ (విడిఐయస్) అని పేరు పెట్టింది. 1997 స్కీము తర్వాత కొందరు ఆడిటర్లు సుప్రీం కోర్టులో కేసు వేశారు – యిలాటి పథకం ద్వారా ఎగవేతదారులను, నిజాయితీగా పన్ను కట్టేవారిని ఒకే గాటన కట్టడం తప్పని, ఇలా అయితే నిజాయితీపరులు కూడా ఎప్పుడో ఒకప్పుడు యిలాటి పథకం వస్తుందని ప్రస్తుతానికి పన్ను కట్టడం మానేస్తారనీ! కోర్టు ఆ వాదనను ఆమోదిస్తూ యిలాటి పథకాలను యికపై చేపట్టవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇన్నాళ్లూ మరే ప్రభుత్వమూ ఆ జోలికి పోలేదు. ప్రభుత్వాధికారుల చేత సమర్థవంతంగా పని చేయించి విదేశాల్లో దాచుకున్న నల్లధనాన్ని వెనక్కి రప్పించి, స్వదేశంలో దాచుకున్న నల్లధనాన్ని వెలికితీస్తారని అనుకున్న నరేంద్ర మోదీకి కూడా రెండో పద్ధతే ఉత్తమంగా తోచడం ఒక వింత. 'న ఖావూంగా, న ఖానే దూంగా' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన మోదీ ఎగవేతదారులను నల్లధనంలో కొంత మేరకు తినడానికి అవకాశం కల్పిస్తూ, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి 'ఇన్‌కమ్ డిక్లరేషన్ స్కీమ్' (ఐడియస్), 2016 ప్రవేశపెట్టారు. మధ్యలో 19 ఏళ్లగా ఏ ప్రభుత్వం కల్పించని వెసులుబాటు నల్లధనికులకు కల్పించి వ్రతం చెరుపుకున్నారు. మరి ఫలం దక్కిందా?

పథకం సఫలమైందో లేదో చూడాలంటే 19 ఏళ్ల క్రితం నాటి స్కీము ఫలితాలతో పోల్చి చూడాల్సిందే. అప్పుడు రూ. 33 వేల కోట్లు బయటపడింది. ఇప్పుడు రూ.65,250 కోట్లు బయటపడింది. 19 ఏళ్లలో పెరిగిన ధరల బట్టి చూస్తే రూ.33 వేల కోట్ల ప్రస్తుత విలువ రూ.116 వేల కోట్లట. దానితో పోలిస్తే యీ 65 వేల కోట్ల యీ మొత్తం చాలా తక్కువనే (56% మాత్రమే) ఒప్పుకోవాలి. దానికి కారణం ఏమిటంటే అప్పుడు 4.75 లక్షల మంది తమ నల్లధనాన్ని ప్రకటించారు. యిప్పుడు దానిలో 7వ వంతు మంది సరిగ్గా చెప్పాలంటే 64,275 మంది మాత్రమే డిక్లేర్ చేశారు. అంటే అప్పటి కంటె నల్లధనంతో వ్యవహరించేవాళ్లు ఏడో వంతు మంది మాత్రమే వున్నారనుకోవాలా? నాన్సెన్స్. నిజానికి అప్పట్లో ధనికుల వద్ద మాత్రమే నల్లధనం వుందనుకుంటే, యిప్పుడు రియల్ ఎస్టేటు లావాదేవీల కారణంగా మధ్యతరగతి వారి వద్ద కూడా నల్లధనం వచ్చి చేరుతోంది. మరి యింతమందే వెల్లడించారేం? అంటే ప్రభుత్వం ఏమీ చేయలేదులే అన్న ధీమానా?

పాత స్కీములో రూ.9,584 కోట్లు ప్రభుత్వానికి పన్నుగా లభించింది. పన్ను రేటు కంపెనీలకు 35%, వ్యక్తులకు 30% అన్నారు. ఈ సారి పన్ను 45% (30% పన్ను ప్లస్ 7.5% కృషి కల్యాణ్ సర్‌చార్జి ప్లస్ 7.5% పెనాల్టీ) అన్నారు. దాని వలన ప్రభుత్వానికి

పన్నుగా, పెనాల్టీగా లభించేది రూ.31,250 కోట్లు. తమ ఆదాయం వెల్లడించిన వారు పన్నులో కనీసం 25% నవంబరు 30లోగా కట్టాలి. మరో 25% 2017 మార్చిలోగా, తక్కిన 50% 2017 సెప్టెంబరులోగా కట్టాలి. పన్ను, పెనాల్టీ రేట్లు అధికంగా వుండడం చేత కూడా స్పందన అంత బాగా లేదని కొందరు పరిశీలకులు అంటున్నారు. 1997 స్కీములో 1987కు ముందు కొన్న ఆస్తులపై కొన్నప్పటి మార్కెట్ వేల్యూని ఆమోదించారు. అంటే స్థిరాస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ బట్టి కాకుండా అవి కొన్న తేదీ నాటి రేటు బట్టి విలువ కడతారు. రాజకీయ నాయకులు ఎన్నికల కమిషనర్ ముందు యిచ్చే అఫిడవిట్‌లు యిలానే వుంటాయి. 'అయితే అప్పటి రేటుకి యిప్పుడు అమ్మేయండి, కొని అక్కడ మా ఆఫీసు పెట్టుకుంటాం' అని యిన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటు వాళ్లు అంటే భలే మజాగా వుంటుంది. బయట చెప్పుకునేటప్పుడు 'అమ్మితే అంత వస్తుంది, యింత వస్తుంది' అని ప్రస్తుత మార్కెటు విలువలో మాట్లాడతారు. అఫిడవిట్ యిచ్చేటప్పుడు యిలా పాత రేట్లలో యిస్తారు. ఏది ఏమైతేనేం, 1997 స్కీములో అది అనుమతించారు కాబట్టి స్పందన బాగుందట. ఈ సారి కరక్టుగా ప్రస్తుత మార్కెట్ వేల్యూ ప్రకారం అనడంతో నల్లధనికులు నీరసించారు.

ఈ స్కీముకి ముందు కితం ఏడాది మోదీ సర్కారు దాచేసిన ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ ఆదాయాన్ని బయటపెట్టే స్కీము ప్రవేశ పెట్టి మూణ్నెళ్ల గడువిస్తే కేవలం 638 మంది స్పందించారు. రూ. 4,147 కోట్లు డిక్లేర్ చేసి 30% పన్నుగా ప్లస్ 30% పెనాల్టీగా రూ.2,488 కోట్లు కట్టారు. అందుకని యీ స్కీమునైనా ఎలాగైనా విజయవంతం చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరక్ట్ టాక్సెస్ అధికారులు విపరీతంగా శ్రమించారు. బిల్లుగిల్లూ వుండని రోడ్డు పక్కన వుండే ధాబాల దగ్గర్నుంచి, ఓ మాదిరి కంపెనీల దాకా అన్ని స్థాయిల వాణిజ్యసంస్థలపై యిన్‌కమ్ టాక్సు దాడులు నిర్వహించి, యిప్పటికైనా నల్లధనాన్ని వెల్లడించకపోతే డిపార్టుమెంటు వూరుకోదనే సంకేతాలు పంపారు. పాన్ నెంబరు యివ్వకుండా అధిక మొత్తంలో లావాదేవీలు చేసిన 7 లక్షల మందికి నోటీసులు పంపారు. రైళ్లల్లో, ఎయిర్‌పోర్టుల్లో, బస్సుల్లో, పత్రికలలో, రేడియోలో, టీవీలో, బయట హోర్డింగులలో అన్ని చోట్లా స్కీము గురించి ప్రకటనలిచ్చారు. అయినా ఆగస్టు రెండో వారం దాకా రూ.4 వేల కోట్లు మాత్రమే వెల్లడయింది. సాధారణంగా యిలాటి వాటిల్లో ఆఖరి నిమిషం దాకా తటపటాయిస్తూనే వుంటారు కాబట్టి తక్కిన 61 వేల కోట్లు కూడా చేరి సెప్టెంబరు నెలాఖరుకి 65 వేల కోట్లకు చేరింది.

నల్లధనం వెల్లడించిన తర్వాత వారిని ఏమీ చేయమని, వారి పేర్లు బయటపెట్టమని ప్రభుత్వం హామీ యిచ్చి, దాన్ని నిలబెట్టుకోకపోతే యిలాటి స్కీములకు అర్థమే వుండదు. అయినా పేర్లు బయటపెట్టమని ప్రభుత్వాన్ని కోరుతూ జగన్ రాశారు. దానికి కారణం పదివేల కోట్ల డిక్లరేషన్ చేసినది మీరంటే కాదు, మీ బినామీయే అంటూ బాబు, జగన్ చేసుకున్న పరస్పర ఆరోపణలే. ఏ ప్రాంతం నుంచి ఎంత వసూలైందో మాత్రం ప్రభుత్వం ఎందుకు చెప్పిందని, మాట తప్పిందని గొడవ బయలుదేరింది. అది ఎలా బయటకి వచ్చిందో ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ "కొత్త పలుకు"లో రాశారు. ఈ స్కీము కింద ఒక వ్యక్తి పదివేల కోట్ల ఒకేసారి డిక్లేర్ చేయడంతో కింది అధికారులు యిది నిజమా, కాదా అని కంగారుపడి యిన్‌చార్జిగా వున్న ఉన్నతాధికారికి ఫోన్ చేసి ఏం చేయాలని అడిగారట. ఆయన ఏ వూరి నుంచి ఆ ఆఫర్ వచ్చింది అని అడిగితే 'హైదరాబాదు' అని చెప్పారట. '25% పన్ను తక్షణం కట్టమని అడగండి. కడితే నిజమే అనుకోవచ్చు' అని వాళ్లతో చెప్పి, ఎదురుగా వున్న విలేకరులు ఏమిటేమిటి అని అడిగితే సంగతి యిదీ అని నోరు జారాడట. అంతే! హైదరాబాదు నుంచి ఒక వ్యక్తి అనగానే అది జగనే అని టిడిపివారు కథలు అల్లేశారు. దానికి జగన్ ఓవర్ రియాక్ట్ అయ్యారు.

మళ్లీ స్కీము విషయానికి వస్తే – టెక్నాలజీ విపరీతంగా పెరిగి, ప్రభుత్వం ప్రతిదానికి ఆధార్, ప్యాన్ లింకు చేస్తున్న యీ రోజుల్లో తమ నల్లధనం బయటపడుతుందేమో భీతి లేకుండా తక్కువ మందే యీ సౌకర్యాన్ని వినియోగించుకున్నారంటే దాని అర్థం – యీ ప్రభుత్వం కానీ వచ్చే ప్రభుత్వం కానీ తమనేమీ చేయదన్న ధీమా! లంచగొండులను, టాక్సు ఎగవేతదారులను అక్కున చేర్చుకుంటూ వాళ్లకు రాయితీలు, క్షమాభిక్షలు, పదవులు కట్టబెడుతున్న బిజెపి తన పాలసీని పునరాలోచించుకోవాల్సిన తరుణం యిది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 03** **ఎమ్బీయస్ : మధ్యప్రదేశ్ బిజెపిలో అంతఃకలహాలు**

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా శివరాజ్ చౌహాన్ 13 ఏళ్లగా ఏలుతూండడంతో ఆ పదవిపై ఆశ పెట్టుకున్నవాళ్లందరూ అతనంటే మండిపడడం సహజం. వ్యాపమ్ కుంభకోణమైనా ఒక కొలిక్కి వచ్చి అతను గద్దె దిగుతాడేమోననుకుంటే అదీ జరగలేదు. కొంతకాలం ముఖ్యమంత్రిగా చేసి, యితని కాబినెట్‌లో హోం మంత్రిగా చేసిన బాబూలాల్ గౌర్‌ను 'నీకు 75 ఏళ్లు నిండాయి కాబట్టి, పదవి నుంచి తప్పుకో' అని దింపేస్తే అతను పళ్లు నూరుకోడూ? అదే కారణం మీద తీసేసిన పిడబ్ల్యుడి మంత్రి సర్తాజ్ సింగ్ "పార్టీ, దాని నాయకులూ అందరూ మారిపోయారు. మేం పార్టీకి పునాదులు వేసినప్పుడు వీరెవ్వరూ లేరు." అని బహిరంగంగా వాపోయాడు.

చౌహాన్ పాలనలోనే 2015 నవంబరులో రట్లామ్–ఝబువా లోకసభ ఉపయెన్నిక జరిగింది. దిలీప్ సింగ్ భూరియా అనే బిజెపి ఎంపీ మరణిస్తే అతని కుమార్తె నిర్మలను బిజెపి అభ్యర్థిగా నిలబెట్టారు. కాంగ్రెస్ తరఫున రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాంతిలాల్ భూరియా నిలబడ్డాడు. చౌహాన్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తను ప్రచారం చేయడమే కాక, 12 మంది కాబినెట్ మంత్రులను, 50 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దింపి, 27 ర్యాలీలు, నాలుగు రోడ్‌షోలు నిర్వహించాడు. ఇంత చేసినా కాంగ్రెసు అభ్యర్థి 88

వేల మెజారిటీతో గెలిచాడు. దీని తర్వాత డిసెంబరులో 8 స్థానికసంస్థల ఎన్నికలు జరిగాయి. వాటిలో 7 బిజెపికి, 1 కాంగ్రెసుకు వుండేవి. ఎన్నికల తర్వాత చూస్తే కాంగ్రెసుకు 5, బిజెపికి 3 వున్నాయి. 179 వార్డుల్లో 93 బిజెపి గెలవగా, కాంగ్రెసుకు 60 దక్కాయి. 2014 పార్లమెంటు ఎన్నికలలో చావుదెబ్బ తిన్న కాంగ్రెసు మళ్లీ బలం పుంజుకోవడానికి కారణం చౌహాన్ అసమర్థ పాలనే అని బిజెపిలో అతని వ్యతిరేకుల భావం. దాన్ని హైలైట్ చేయడానికి ప్రతిపక్షానికి అవకాశం యివ్వడం దేనికి, మనమే చేస్తే పోలేదా? అనుకున్నారు. ఇక అప్పణ్నుంచి బహిరంగంగా వ్యాఖ్యలు చేయసాగారు. వారిలో కొందరు పర్యవసానాలు కూడా అనుభవించారు. వాటి వరస చూడబోతే –

"వచ్చే ఎన్నికలలో బిజెపిని బిజెపియే ఓడిస్తుంది." – బిజెపి ఎమ్మెల్యే పన్నాలాల్ శాఖ్యా

"మావోయిస్టు ప్రభావిత బాలాఘాట్ ప్రాంతంలో ప్రభుత్వం అశాంతిని రగిలిస్తోంది. శాంతి నెలకొల్పుదామని ప్రయత్నిస్తున్న అక్కడి ఆరెస్సెస్ కార్యకర్తలపై వ్యవసాయమంత్రి గౌరీశంకర్ బిసెన్ పోలీసులచే దౌర్జన్యం చేయిస్తున్నారు. అక్కడి యదార్థ పరిస్థితిని సోషల్ మీడియాకు అందచేస్తున్న సురేశ్ యాదవ్ అనే అనే ఆరెస్సెస్ కార్యకర్తను పోలీసులు చావబాదారు. మంత్రి రాజీనామా చేయాలి." – బిజెపి ఎమ్మెల్యే సంజయ్ శర్మ, జాలమ్ సింగ్ పటేల్‌ల డిమాండ్.

ఈ శాఖ్యా, శర్మ, పటేల్‌లకు శర్మకు రాష్ట్ర అధ్యక్షుడు నంద్ కుమార్ చౌహాన్ షోకాజ్ నోటీసు యిచ్చాడు. పనిలో పనిగా సురేశ్ యాదవ్‌ను కొట్టిన ఆరుగురు పోలీసువారిపై, ఒక ఎఎస్‌పిలపై సెక్షన్ 307 కింద కేసు పెట్టారు.

"పార్టీ ద్వితీయశ్రేణి నాయకులను ఎదగనీయటం లేదు, అణచివేస్తోంది. బయటివాళ్లకు పదవులు కట్టబెడుతున్నారు." – బిజెపి వ్యాపారవిభాగం కన్వీనర్, అధికార ప్రతినిథి ప్రకాశ్ మీర్‌చందానీ

"వ్యాపమ్ కుంభకోణంలోని తప్పులకై పార్టీ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. రాబోయే ముఖ్యమంత్రి దళితుడే అని ప్రకటించాలి." – బిజెపి సాంస్కృతిక విభాగం కన్వీనర్ రాజేశ్ భదోరియా

మీర్‌చందానీ, భదోరియాలను పార్టీలోంచి సస్పెండ్ చేశారు.

"బుందేల్‌ఖండ్ ప్రాంతంలో యిసుక మాఫియాను ప్రభుత్వమే కాపాడుతోంది." – బజెట్ సెషన్‌లో బిజెపి ఎమ్మెల్యే రామ్‌దయాళ్ ప్రజాపతి ఆరోపణ.

"బిజెపి కార్యకర్తల పరిస్థితి కాంగ్రెసు హయాంలో కంటె ఘోరంగా వుంది." – గ్రామీణాభివృద్ధి మంత్రి గోపాల్ భార్గవ

ఈ ప్రకటనలు వెనక్కి తీసుకునేట్లా చేశారు.

...ఇప్పుడు యీ క్రింది వ్యాఖ్యలు చూడండి, ఇవన్నీ ఒకరు చేసినవే!

"కరంటు బిల్లు బకాయిలు మాఫీ చేయడం ప్రజలను ఆకర్షించడానికే తప్ప అది ప్రజలకు మంచి చేయదు. నాయకత్వం లోపించిన నాయకులే యిలాటి వాటికి దిగుతారు." – ఓ ఆధ్యాత్మిక సమావేశంలో ప్రసంగం.

"మేం చాలాకాలంగా అధికారంలో వున్నాం. సహజంగానే ప్రభుత్వంలో అవినీతి చొరబడింది. కానీ పోనుపోను అది బొత్తిగా తేటతెల్లంగా కనబడుతోంది. సరిదిద్దుకోకపోతే వచ్చే ఎన్నికలలో యిబ్బందే..." – ఒక టీవీ యింటర్వ్యూలో అభిభాషణం.

"అవినీతి ఎప్పుడూ వుంది. కానీ మొదటి రెండు దఫాల బిజెపి ప్రభుత్వంలో అదుపులో వుండేది. ఇప్పుడు పెచ్చుమీరింది, ముఖ్యంగా క్రింది స్థాయిలో. అడ్డు చెప్పబోయిన పార్టీ కార్యకర్తలను అధికారులు పట్టించుకోవటం లేదు." – అదే యింటర్వ్యూలో..

"2007లో ముఖ్యమంత్రి, ఆయన భార్య యిరుక్కున్న డంపర్ స్కామ్ గురించిన అనేక డాక్యుమెంట్లు, ఆధారాలు అప్పట్లో ఉమాభారతితో పాటు భారతీయ జనశక్తి పార్టీలో వున్న ప్రహ్లాద్ పటేల్ (తర్వాత బిజెపిలో చేరి ఎంపీ అయ్యాడు)కు చిక్కాయి. అతను ఒక పత్రికా సమావేశంలో మాట్లాడబోతే 'కావాలంటే ముఖ్యమంత్రి గురించి మాట్లాడు కానీ ఆయన భార్య గురించి మాట్లాడవద్దు' అంటూ నేను రిక్వెస్టు చేశాను." – అదే యింటర్వ్యూలో...

(ఈ కేసులో చౌహాన్, అతని భార్యకు క్లీన్ చిట్ లభించింది, కానీ యీయన దాని గురించి ప్రస్తావించాడు, యీ మాట నిజమే అని ప్రహ్లాద్ ధృవీకరించాడు)

"ఇండోర్‌లో మెట్రో రైలు తెస్తామని వాగ్దానం చేశాం. కానీ ప్రభుత్వపు పనుల్లో వేగం చూస్తుంటే మెట్రో కాదు కానీ, ఎద్దు బండి దక్కేట్టుంది." – ట్విట్టర్‌లో వ్యాఖ్య (తర్వాత దీన్ని సవరించుకుని అధికారులను తప్పుపట్టాడు)

ఈ వ్యాఖ్యలు చేసిన కైలాశ్ విజయవర్గియాపై మాత్రం బిజెపి అధిష్టానం ఏ చర్యా తీసుకోలేదు. పైగా 'ఇలాటి వ్యాఖ్యలు మానుకోండి, ఢిల్లీ వెళ్లిన తర్వాత మధ్యప్రదేశ్ గురించి మీ అవగాహన సన్నగిల్లినట్టుంది' అని సలహా యిచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు నంద్ కుమార్ చౌహాన్‌కు 'నీ స్థాయి తెలుసుకో. పార్టీ సంగతి చూసుకో, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి భట్రాజు పని మానుకో. పబ్లిక్ రిలేషన్స్ చూసేందుకు వేరేవాళ్లున్నారు' అని ఘాటుగా సమాధానం యిచ్చాడు. చివరకు నంద్ కుమార్ కైలాశ్ యింటికి వెళ్లి క్షమాపణ చెప్పుకోవలసి వచ్చిందంటే కైలాశ్ సత్తా ఏమిటో తెలుస్తుంది.

ఈ సత్తా అతనికి బిజెపి అధ్యక్షుడు అమిత్ షాతో స్నేహం వలన కలిగింది. ఎబివిపి ద్వారా వెలుగులోకి వచ్చిన కైలాశ్ భారతీయ జనతా యువ మోర్చాలో చేరి జాతీయ జనరల్ సెక్రటరీ అయి 1993లో గుజరాత్‌కు యిన్‌చార్జిగా వెళ్లాడు. బహుశా అప్పుడు అమిత్ షాతో పరిచయం కలిగి క్రమేపీ దృఢపడి వుంటుంది. అతనికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిపై కన్నుంది. ప్రస్తుతానికి

అమిత్ అతన్ని జాతీయ జనరల్ సెక్రటరీ చేశాడు. మొన్నటి హరియాణా ఎన్నికలలో ఆ రాష్ట్రానికి యిన్‌చార్జి చేస్తే బిజెపి బలాన్ని 4 నుంచి 47కి పెంచి చూపించాడు కైలాశ్. అందుకని 2015లో బెంగాల్‌కు యిన్‌చార్జిగా చేశారు. ఈ వ్యక్తి ఏం మాట్లాడినా, చౌహాన్‌ను ముకుతాడు వేయాలని కాబోలు, అమిత్ మందలించడం లేదు. కానీ మధ్యలో పార్టీ నాశనమవుతోంది. పార్టీ నాయకులు ఎవరికి వాళ్లు చిత్తం వచ్చినట్లు ఒకరినొకరు పబ్లిగ్గా దూషించుకోవడం కాంగ్రెసు సంస్కృతిగా పేరుబడింది. ఇప్పుడు దాన్ని తను పుణికి పుచ్చుకుందని మధ్యప్రదేశ్ బిజెపి నిరూపించుకుంటోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016) (ఫోటో – కైలాశ్ విజయవర్గియా)**

**నవంబరు 06 న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 103 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఒకే పెన్షన్ – బిజెపి మెస్**

"ఒకే ర్యాంక్, ఒకే పెన్షన్" అమలులో జరిగిన తప్పిదాల వలన ఒక మాజీ సుబేదారు రాంకిషన్ ఆత్మహత్య చేసుకున్న ఉదంతాన్ని బిజెపి వంటి పరిణతి చెందిన రాజకీయ పార్టీ మిస్‌హేండిల్ చేయడం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏదైనా పథకం పెట్టినప్పుడు అమలులో పొరపాట్లు జరగడం, వ్యత్యాసాలు (ఎనామలీస్) చోటుచేసుకోవడం సహజం. ఎంత చిన్న కారణానికైనా ఆత్మహత్య చేసుకునేవాళ్లు వుంటారని అనేక సందర్భాల్లో చూశాం. ప్రజలెవరైనా ఆత్మహత్యలు చేసుకుంటే రాజకీయ నాయకులు పరామర్శ చేయడం సహజాతిసహజం. వాళ్లు వున్నదే అందుకు! మొన్నటిదాకా ఎందుకు, యిప్పటికీ అధికారంలో లేని రాష్ట్రాలలో బిజెపి ఆ పని చేస్తూనే వుంది. పరామర్శకు వెళ్లినంత మాత్రాన మహాపాపం చేసినట్లు రాహుల్, అరవింద్‌లపై దూకుడుగా వెళ్లడంతో వాళ్లకి కొన్ని రోజులపాటైనా జీవం పోసింది బిజెపి. ఇది చాలనట్లు బిజెపి నాయకులు కొన్ని అవాకులు, చెవాకులు వాగి పలుచన అయ్యారు. ఎందరో సీనియర్లున్న పార్టీలో ఎందుకిదంతా అని చెప్పినవారు లేకపోయారా అని ఆశ్చర్యం వేస్తోంది.

ఒఆర్ఒపి (ఒన్ ర్యాంక్, ఒన్ పెన్షన్) యిచ్చేశామని కేంద్రం సంతోషించేస్తున్నా జవాన్లు సంతోషంగా లేరు. ప్రిమెచ్యూర్ రిటైర్‌మెంట్ తీసుకున్నవాళ్లకీ సమాన పెన్షన్ యివ్వాలని, 2014 జులై నుంచి కాకుండా ఏప్రిల్ నుంచి అమలు చేయాలని, ఐదేళ్ల కోసారి కాకుండా ప్రతీ ఏడాది ఈక్వలైజేషన్ చేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అంతేకాదు ప్రభుత్వం 2013 పే స్కేలులో అత్యధిక, అత్యల్ప జీతాలు తీసుకుని సరాసరి కట్టి అది యిస్తానంటే, కాదు, అత్యధికంగా వున్నదాన్నే అందరికీ వర్తింపచేయాలని కూడా అడుగుతున్నారు. ఈ సమస్యలపై జస్టిస్ నరసింహారెడ్డి నేత ృత్వంలో వేసిన కమిటీ తన నివేదికను అక్టోబరు 25కి యిచ్చినా ప్రభుత్వం ఎందుకు తొక్కి పెట్టిందని అడుగుతూ జంతర్‌మంతర్ వద్ద నిరాహారదీక్ష మొదలుపెట్టారు. దానిలో పాల్గొనడానికే రాంకిషన్ ఢిల్లీ వచ్చాడు. పరిస్థితి యింత గంభీరంగా వుంటే బిజెపి సర్కారు ఒఆర్ఒపి అమలు చేసేసి అందర్నీ త ృప్తి పరచామని ఎలా అనుకుంటుంది? అసంతృప్తి ఏదో ఒక విధంగా బయల్పడినపుడు దిద్దుబాటు చర్యలు చేపట్టాలి తప్ప వారిపై విరుచుకుపడితే ఎలా?

నిజానికి కేంద్రం తరఫున తప్పులు జరిగాయి. 20 లక్షల మందికి ఒఆర్ఒపి కింద పెన్షన్ చెల్లించామని రక్షణ శాఖ సెప్టెంబరు 15 న ప్రకటించింది. రూ.5507 కోట్ల రూ.లను రెండు విడదలుగా చెల్లించామని చెప్పుకుంది. ఇప్పుడీ ఆత్మహత్య తర్వాత సాంకేతిక యిబ్బందుల వలన ఆ 20 లక్షల్లో ఒక లక్ష మందికి సవరించడం బకాయి వుండిపోయిందని నవంబరు 3 న ఒప్పుకుంది. 11 వేల కోట్ల ఎరియర్స్ కూడా బకాయి పెట్టామని, రెండు నెలల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పింది. ఈ ముక్క సెప్టెంబరులోనే చెప్పవచ్చుగా! అందరికీ యిచ్చేశామని గొప్పలకు పోవడం వలన రానివాళ్లు యిక రాదేమోనని నిరాశ చెందారు. రాంకిషన్‌కి ఆరవ పే కమిషన్ స్కేలు ప్రకారం 25 వేలు పెన్షన్ వస్తోంది. ఏడో పే కమిషన్ ప్రకారమైతే 30 వేలు రావాలి. రాదేమోననే నిరాశతో ఉసురు తీసుకున్నాడు. నిజానికి ఒఆర్ఒపి పేర మోదీ సర్కారు యిస్తున్నది గతంలో కంటె ఎక్కువ పెన్షన్ తప్ప కేంద్ర ప్రభుత్వోద్యోగులతో సమానస్థాయి పెన్షన్ కాదని రాహుల్ అంటున్నాడు. ఐదారు రోజులైనా దాన్ని కేంద్రం ఖండించలేదు కాబట్టి అతని మాట నిజమేనేమో!

రాంకిషన్‌కు రావలసినదానికంటె తక్కువ పెన్షన్ వచ్చిందని రక్షణమంత్రి ఒప్పుకుంటూనే దానికి కారణం స్టేటుబ్యాంక్ బ్రాంచ్ చేసిన పొరపాటు అనడం అన్యాయం. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తయారుచేసిన పెన్షన్ లిస్టుల ప్రకారం ఖాతాదారుల ఖాతాల్లో పెన్షన్ వేయడం తప్ప బ్యాంకులు చేసేదేమీ వుండదు. అంతెందుకు, బ్యాంకు స్టాఫ్ పెన్షన్ల విషయంలో కూడా ఏదైనా తేడాపాడాలుంటే బ్రాంచ్ వాళ్లు 'పెన్షన్ డిపార్టుమెంటుకి రాసుకుని సరి చేయించుకోండి' అంటారు తప్ప వాళ్లేమీ మార్పులుచేర్పులు చేయరు. గతంలో అయితే పెన్షన్ లిస్టు చూసుకుంటూ లెడ్జర్లలో పోస్టు చేసేవాళ్లు. ఇప్పుడు కంప్యూటరైజ్ అయిపోయాక డైరక్టుగా, బ్రాంచ్ ప్రమేయం లేకుండానే, ఖాతాల్లో వచ్చి పడుతోంది. నవంబరులో లైఫ్ సర్టిఫికెట్లు సేకరించి పంపడం తప్ప బ్యాంకు బ్రాంచ్‌లకు పనే లేదు. అలాటప్పుడు పరికర్ బ్యాంకు బ్రాంచ్‌పై తప్పు ఎలా నెట్టేశాడో తెలియదు. ఆయన్ను కలుసుకుందామని ప్రయత్నించి విఫలం చెందడం చేతన్టే రాంకిషన్ హతాశుడయ్యాడు. మా రికార్డుల్లో ఎపాయింట్‌మెంట్ అడిగినట్లు లేదంటారు, పరికర్ ఆఫీసు సిబ్బంది. ఎపాయింట్‌మెంట్ యివ్వనంత మాత్రాన ఆత్మహత్య చేసుకోవాలా అంటే దానికి సమాధానం లేదు. అతనికి మతిస్థిమితం లేదు అని వికె సింగ్ అనడం అనవసరం. 70 ఏళ్ల వయసులోనైనా సరే మానసికంగా దుర్బలంగా వున్నవాడే ఆత్మహత్య చేసుకుంటాడు.

'40 ఏళ్లగా ఒఆర్ఒపి అమలు చేయని కాంగ్రెసుకు యీ ఆత్మహత్య గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు' అని బిజెపివారు ఒక వింత వాదన చేశారు. వాళ్ల పాలనలో యిచ్చేవి వాళ్లు యిచ్చారు. 1973 నుంచి పే రివిజన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను,

మిలటరీని డీలింక్ చేసేసింది. అందువలన కేంద్ర ఉద్యోగుల జీతాలకు, మిలటరీవారి జీతాలకు తేడా వుంటూ వచ్చింది. మిలటరీలో చేరిన వ్యక్తి కంటె కేంద్రంలో చేరిన వ్యక్తికి సర్వీసు పూర్తయేసరికి ఎక్కువ పెన్షన్ వస్తోంది కాబట్టి సమాన హోదా కలిగిన మిలటరీ వ్యక్తికి కూడా అదే పెన్షన్ యివ్వాలని డిమాండ్ తెచ్చారు మిలటరీవారు. జీతం మాట సరే, మిలటరీవారికి ఎన్నో వెసులుబాట్లు, సౌకర్యాలు వుంటాయి. వాళ్ల పిల్లలను స్కూలుకి తీసుకెళ్లేందుకు కూడా మిలటరీ వ్యాన్‌లు వాడతారు. అవన్నీ కావాలని రేపు కేంద్రోద్యోగులు అడిగితే...? ఈ లాజిక్కులేవీ లాగకుండా మిలటరీ వాళ్ల ఓట్ల కోసం కాంగ్రెసు 2004 ఎన్నికల సమయంలో వాగ్దానం చేసింది కానీ 2008లో సాధ్యం కాదని ప్రకటించింది. దానిపై మిలటరీవారు ఆందోళన చేసినా చలించలేదు. ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నది బిజెపి, అమలు చేయవలసినదీ బిజెపియే. అమలులో అవకతవకలు జరిగితే అడిగే హక్కు బాధితుల నుండి, బాధితుల పక్షాన మాట్లాడే ప్రతి పార్టీకి వుంటుంది. అలాటి హక్కు వుండకూడదని వాదించడం బిజెపి తప్పు.

ప్రతిపక్షంలో వుండగా బిజెపి ఆత్మహత్య చేసుకున్నవారి యింటికి వెళ్లలేదా? ప్రభుత్వనిర్లక్ష్యమే కారణమని నిందించలేదా? తెలంగాణ ఆత్మహత్యల గురించి యిక్కడ కిషన్ రెడ్డి కాంగ్రెసు ప్రభుత్వాన్ని నిందించలేదా? సుష్మా స్వరాజ్ పార్లమెంటులో ఉపన్యాసం దంచలేదా? ఇప్పుడు కూడా తెలంగాణలో రైతు ఆత్మహత్యల గురించి బిజెపి స్పందించకుండానే వుందా? జంతర్‌మంతర్‌లో నిరాహారదీక్ష చేస్తే ఏ ఉద్యమకారుడికీ పేపర్లో కవరేజి రాదు. ఏదో ఒక రాజకీయపార్టీ వచ్చి కలగచేసుకుంటేనే మీడియా ఫోకస్ చేస్తుంది. ఒకే పెన్షన్ అమలులో లోపాలను సరిదిద్దాలంటే రాజకీయపక్షం రంగంలోకి దిగాల్సిందే. ఆ పని ఆప్, కాంగ్రెసు చేసినంత మాత్రాన అది ఘోరకృత్యం అయిపోదు. వికె సింగ్ చెప్పినట్లు ఒకవేళ రాంకిషన్ కాంగ్రెసు వ్యక్తి అయినా, కాకపోయినా ఆందోళన చేసే హక్కు కాంగ్రెసుతో సహా అందరికీ వుంది. అయినా సర్పంచ్‌గా పనిచేసిన రాంకిషన్ పార్టీ వేరు. వికె సింగ్ లాటి సహచరులుంటే శత్రువులక్కరలేదు.

ఆందోళన చేసిన ప్రతిపక్షాల వారిని వ్యాన్ ఎక్కించి పక్క సందులో దింపేస్తూంటారు. వాళ్లు తమ కార్లలో యింటికి వెళ్లిపోయి తనను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించే దృశ్యాన్ని టీవీల్లో చూసి ఆనందిస్తారు. కానీ ఢిల్లీ పోలీసులు ఓవరాక్షన్ చేశారు. నాయకులతో బాటు చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యుల్నీ ఓ చూపు చూశారు. ఇక అరవింద్ కేజ్రీవాల్ నైతే అర్ధరాత్రి దాకా పోలీసు స్టేషన్‌లో వుంచారు. ఢిల్లీ పోలీసులు ఎల్‌జి చేతిలో వున్నారని, ఎల్‌జి కేంద్రం చేతిలో వున్నాడనీ అందరికీ తెలుసు. అందుకని బిజెపియే జవాబుదారీ అయింది. ఈ ఆత్మహత్య సందర్భంగా యీ స్కీము అమలులోని అవకతవకలెన్నో వెలుగులోకి వచ్చాయి. ఏ ప్రభుత్వమైనా అధికారులు చెప్పినది నమ్మి ప్రకటనలు యిస్తూంటుంది. పథకం అమలులో వుండే లోటుపాట్లను ప్రతిపక్షాలు, విమర్శక పాత్ర వహించవలసిన మీడియా ఎత్తి చూపితేనే ప్రభుత్వం లోపాలను సవరించుకోగలుగుతుంది. లోపాన్ని ఎత్తిచూపించినందుకు గాను యింతలా కక్ష సాధిస్తే అంతిమంగా ప్రభుత్వానికే నష్టం. అది గ్రహించకుండా బిజెపివారు గోటితో పోయేదానికి గొడ్డలి వుపయోగించారు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 05** **ఎమ్బీయస్ : ఏకవీరుడు ట్రంప్ గెలిచాడు**

అమెరికా ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. అందరి అంచనాలు తల్లకిందులు చేస్తూ డోనాల్డ్ ట్రంప్ గెలిచేశాడు. తను గెలిస్తే వలసదారుల పని, భారత్‌కు ఔట్‌సోర్సింగ్ చేసే కంపెనీల పనీ పడతానన్నాడు కాబట్టి మన భారతీయ మీడియా అతనిపై కత్తి కట్టేసిందంటే అర్థం చేసుకోవచ్చు. రష్యా, చైనా పేపర్ల సంగతేమో కానీ తక్కిన ప్రపంచమంతా ట్రంప్‌ని వెక్కిరించి వెక్కిరించి వదిలిపెట్టింది. అమెరికాను మళ్లీ ఉన్నత స్థానాలకు తీసుకెళతానన్న అతనిపై అమెరికా మీడియా కక్ష పూనింది. 77 పత్రికలు, టీవీ ఛానెళ్లు వుంటే ఒకటి, రెండు తప్ప మరేవీ అతని పక్షాన నిలవలేదట. తమ ఉదార విధానాలకు అతను విరుద్ధం కాబట్టి వ్యతిరేకిస్తున్నాం అని చెప్పుకున్నా తప్పు లేదు. ప్రజలంతా అతన్ని అసహ్యించుకుంటున్నారంటూ సర్వే ఫలితాలు వెలువరించి వాస్తవాలకు మసిపూశాయి. అది దుర్మార్గం. సుమారు 70 పాయింట్ల తేడాతో ట్రంప్ గెలిచాడంటే అది మామూలు విజయం కాదు. దీని సంకేతం కొన్ని సర్వేలలోనైనా బయటపడి వుండాలి. హిల్లరీపై ఎఫ్‌బిఐ పునర్విచారణ సందర్భంగా ట్రంప్‌కు కాస్త మొగ్గు వుందన్నారు కానీ అంతలోనే పరిస్థితి తారుమారైందన్నారు. 6% మార్జిన్‌తో హిల్లరీ విజయం తథ్యమన్నారు.

స్వభావరీత్యా గుంభనగా వుండే ప్రజలున్న భారత్‌లో సర్వే అంచనాలు తప్పాయంటే అర్థం చేసుకోవచ్చు. 'నేను ముద్దు మాత్రమే పెట్టుకోమన్నాను, అతను బుగ్గ కూడా కొరికాడు' అనే ఫిర్యాదులతో కోర్టుల కెక్కే ప్రజలున్న అమెరికాలో బహిరంగంగా తమ అభిప్రాయాలు వ్యక్తపరచడం సర్వసాధారణ విషయం. అలాటి చోట సర్వేలు యింత దారుణంగా తప్పడమంటే దాని అర్థం సర్వే నిర్వాహకులు కావాలని ఫలితాల్లో చేయి చేసుకున్నారనే! డెమోక్రాటిక్ పార్టీ ట్రంప్ ప్రతిష్ఠ (ఏదైనా వుండి వుంటే, ఎన్నికల్లోకి దిగాక దానిలో ఏదైనా మిగిలి వుంటే) దిగజార్చడానికి చేయని ప్రయత్నం లేదు. దానికి వాచాలతతో ట్రంప్ తన వంతు సాయం తను చేశాడు. వలసదారులు, యితర దేశస్తులు, మైనారిటీలు, హిస్పానిక్స్ వంటి ఎంతమంది మద్దతు వున్నా హిల్లరీ నెగ్గితే తను తొలి మహిళా అధ్యక్షురాలు అనే విషయాన్ని బాగా చాటుకుంది. జనాభాలో సగం మంది స్త్రీలు. 'మన కంటె ఎన్నోవిధాల వెనకబడిన ఇండియాలోనే ఏభై యేళ్ల క్రితమే మహిళ ప్రధాని కాగా లేనిది, మన దేశంలో యిప్పటివరకూ మహిళ ముఖ్యపదవిలో లేకపోవడం

షేమ్‌షేమ్' అని వారిలో సగం మంది అనుకున్నా తన గెలుపు ఖాయ మనుకుంది హిల్లరీ.

తను మహిళ కావడంతో బాటు ట్రంప్ మహిళా వ్యతిరేకి, వారిని చులకనగా చూస్తాడు అనే భావనను ఓటర్ల మెదళ్లలో నాటడానికి హిల్లరీ సకలయత్నాలు చేశారు. అతను కాజువల్‌గా ఆడవాళ్ల గురించి మాట్లాడిన వాటి ఆడియో టేపులు ఎప్పుటెప్పటివో బయటకు లాగి తమ దగ్గర పూరేసి, ఎన్నికల సమయంలో విడుదల చేశారు. మహిళలను వేధించాడని చూపడానికి అనేకమంది మహిళల చేత అర్జంటుగా స్టేటుమెంట్లు యిప్పించారు. ఇక అక్కణ్నుంచి అతని నైతికతపై అందరూ తీర్పులిచ్చేయసాగారు. ట్రంప్ వాగిన వాగుడు అనేకమంది మగాళ్లు వాగే వాగుడే. ఇక అక్కడ గిల్లాడు, యిక్కడ ఒత్తాడు అని యిన్నేళ్ల తర్వాత చెప్పుకున్న ఆడవాళ్ల దగ్గర 'వెంటనే చెంప పగలకొట్ట లేకపోయావా? ఇన్నాళ్లూ ఎందుకు పూరుకున్నావ్?' అని అడిగితే సమాధానం లేదు. ప్రతిఘటిస్తే అప్పుడే ప్రతిఘటించాలి. లేదా ఇప్పుడు మళ్లీ చేయబోతే అప్పుడు పాతది బయటపెట్టాలి. ఇప్పుడేమీ జరగనప్పుడు చెప్పుకోవడం దేనికి? ఎన్నికలలో ఓడించడానికేగా! వ్యాపారపరమైన, ఉద్యోగపరమైన అక్రమాల సంగతి వేరు. అవి దేశానికి, చట్టానికి వ్యతిరేకంగా చేసిన పనులు. ఎప్పుడైనా బయటపెట్టవచ్చు. ఇలాటి వ్యక్తిగతమైన విషయాల విషయంలో కుటుంబసభ్యులది మాత్రమే తలనొప్పి. వాటిపై రాద్ధాంతం చేయడం మాత్రం దురుద్దేశంతో కూడుకున్నదే. సొంత కూతురిపై కూడా అసభ్యవ్యాఖ్యలు చేసిన యిలాటి మనుషులంటే హిల్లరీకి గిట్టదు అనుకుందామంటే క్లింటన్లు, ట్రంప్ బెస్ట్ ఫ్రెండ్సాయె. ఇన్నాళ్లూ స్నేహం చేసి, ఎన్నికల సమయంలోనే మురికి దుప్పట్లన్నీ ఉతకడం మొదలెట్టారు. ట్రంప్ బదులు తీర్చేశాడు – హిల్లరీని 'నేస్టీ ఉమన్' అని. వెంటనే 'అతనికి స్త్రీలపై గౌరవం లేదు' అని గోల మొదలుపెట్టారు. మహిళా ఓటర్లు ఏ మేరకు యీ మాటలు నమ్మారో పూర్తి గణాంకాలు వచ్చాక తెలుస్తుంది.

ట్రంప్ వాచాలత్వం, తెంపరితనం, అసభ్యత, పరుషపదజాలం, తెలివితక్కువ వ్యాఖ్యలు చూసి ప్రజలు అతన్ని అసహ్యించుకుంటున్నారని డెమోక్రాట్లు చేసే ప్రచారం విని, తమ అభ్యర్థి గెలవడనే తీర్మానానికి వచ్చేసి, అనవసరంగా అతనికి టిక్కెట్టిచ్చామని వగచి, రిపబ్లికన్ పార్టీ పెద్దలెందరో అతన్ని సమర్థించడం మానుకున్నారు. అయినా ట్రంప్ జావ కారిపోలేదు. నెగ్గుతా, నెగ్గుతా అంటూ సొంతంగా ఒంటికాయ సొంటికొమ్ములా తిరిగాడు. అటు హిల్లరీకి ఒబామా, బిల్‌లు అండగా నిలిచారు. హిల్లరీ కున్న తెలివితేటల ముందు ట్రంప్‌కున్న విషయ పరిజ్ఞానం శూన్యం అని ఓటర్లకు అర్థమయ్యేట్లు చెప్పారు. ఆ పాయింటు ఓటర్లకు అర్థమైంది. అయినా అతన్నే గెలిపించారు. ఎందుకంటే మాకు తెలివైన పాలకుడు అక్కరలేదు, మనసున్నవాడు, మా మనసెరిగినవాడు చాలు అనేశారు. ప్రచారసందర్భంగా ట్రంప్ చాలా అవాకులూ, చెవాకులూ వాగాడు. అమెరికన్ సమాజాన్ని ముక్కలుముక్కలుగా చూసి, అస్మదీయులు, తస్మదీయులు అంటూ విడగొట్టి మాట్లాడాడు. అమలు చేయలేని విద్వేషపూరిత పథకాలను కటువైన భాషలో వెలిబుచ్చాడు. ఏ రాజకీయనాయకుడూ అలా చేయలేదు. అందరికీ అన్నీ యిస్తానంటూ ఆశపెట్టి ఎవరికీ ఏమీ చేయకపోవడమే అసలైన రా.నా. లక్షణం. సాంప్రదాయ రా.నా. కాదు కాబట్టే ట్రంప్ యీ వర్గానికే చేస్తాను, ఆ వర్గాలకు చేయను అని చెప్పేశాడు. నెగ్గాక యిక అలా అనడనుకోండి, సరిహద్దుల్లో గోడలూ కట్టలేడు, ఎవరినీ తరిమివేయనూ లేడు, ఔట్‌సోర్సింగ్ రాత్రికి రాత్రి ఆపనూ లేడు. ఇవి ఓటర్లకూ తెలుసు. అయినా అతనొక ఫిలాసఫీని ప్రవచించాడు– మనకు గ్లోబలైజేషన్ అనవసరం, యితరుల విషయాల్లో జోక్యం అనవసరం, మన సంగతి మనం చూసుకుంటే, మన ఏడుపు మనం ఏడిస్తే, ప్రపంచ పెత్తనం నెత్తిమీద వేసుకోకుండా ముందు మన యిల్లు మనం దిద్దుకుంటే ఎప్పటికో అప్పటికి బాగుపడతాం – అని.

ఆ ముక్క సాధారణ ఓటరు మనసుకు హత్తుకుంది. చాలా ఏళ్లగా అతను ఫీలవుతున్నదీ అదే. పేరడైమ్ షిఫ్ట్ అంటారే, మౌలిక దృక్కోణంలో మార్పు, అది యితనిలో కనబడింది. హిల్లరీ అయితే ఒబామా వారసత్వం కొనసాగిస్తానని ముందు నుంచీ చెపుతోంది. పదేళ్లగా దాని ఫలితాలు అనుభవిస్తూ ప్రభుత్వ వ్యతిరేకత పెంచుకున్న ప్రజలు, హిల్లరీ 'తప్పయిపోయింది, సరిదిద్దుకుంటాను' అనకుండా దాన్ని యింకా ముందుకు తీసుకుపోతానంటోంది అనడంతో దడిశారు. దశాబ్దాలుగా దేశంలో పెరిగిన సంపదనంతా స్వాహా చేసిన మోతుబరులందరూ హిల్లరీని సమర్థిస్తూ వుండడం వారిలో మరింత భయాన్ని రేపింది. ప్రస్తుత వ్యవస్థలోని అస్తవ్యస్తతను ఎత్తిచూపిన ట్రంప్ తమ మనసులను చదివాడనిపించి అతన్ని సమర్థించారు. ఇప్పుడు యీ ముక్క అందరూ చెప్తారు. ఎన్నికలకు ముందు జరిగిన సర్వేలలో యీ ముక్క ఏ సర్వే ఎందుకు చెప్పలేకపోయింది? లేక కావాలని చెప్పలేదా? ఈ సర్వేలు చూసి ట్రంప్ గుండె జారలేదా? జారకపోవడానికి కారణం ఎన్నికల్లో దిగేందుకు ముందు అతని వ్యక్తిగతంగా చేయించుకున్న సర్వే అంటున్నారు కొందరు. అంటే అది కొన్ని నెలల క్రితం జరిగిన సర్వే. ప్రచారసమయంలో ఎన్నో మార్పులు వస్తాయి. మరి ట్రంప్ ధైర్యం చెదరకపోవడానికి కారణం ఏమిటి? అతనే చెప్పాలి.

సర్వే అంచనాలు తప్పడానికి గల కారణాలు అంటూ కొన్ని చెప్పారు. వాటిల్లో ఎటూ తేల్చనివారు 6% వుండడం ఒకటి, మూడో అభ్యర్థి పట్టుకుపోయే ఓట్ల శాతం ఎంత వుంటుందో అంచనాకు అందకపోవడం మరొకటి, హిస్పానిక్స్, బ్లాక్స్ ఎటు ఓటేస్తారు అన్న సంగతి యింకోటి, అన్నిటికంటె ముఖ్యమైనది ట్రంప్‌ను రహస్యంగా సమర్థించిన వారెందరో తెలియకపోవడం! ట్రంప్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం చూసి దడిచి, 'ఎన్ని అవలక్షణాలున్నా అతనికే ఓటేస్తాను' అని ధైర్యంగా చెప్పలేని వారు గణనీయమైన సంఖ్యలో వున్నారుట. బయటకు చెప్తే 'అయితే నువ్వూ ట్రంప్‌లా సంస్కారహీనుడన్నమాట' అంటారన్న భయం కావచ్చు. వాళ్లంతా తటస్థులుగానో, హిల్లరీ సమర్థకులుగా తమను తాము చెప్పుకుని చివరకు బూతు దగ్గరకి వెళ్లినపుడు మాత్రం తమ ప్రియతమ నాయకుడు, ఆశాజ్యోతి ఐన ట్రంప్‌కు గుద్దేశారు. వారిలో అన్ని వర్గాలు వున్నాయా, లేదా? హిల్లరీకి అధికశాతంలో ఓట్లేలా

వచ్చాయి? అయినా ఆమె ఎందుకు గెలవలేకపోయింది? ట్రంప్ గెలుపు భారతీయ సమాజంపై ఎలాటి ప్రభావం చూపుతుంది? ఇత్యాది అనేక విషయాలను యితర వ్యాసాలలో పరామర్శిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 07-09 వీక్లీ కవర్‌స్టోరీ** **ఎమ్బీయస్ : మంచి నిర్ణయం గందరగోళం పాలు**

నల్లధనాన్ని నియంత్రించడానికి పెద్ద నోట్లను రద్దు చేయడం మంచి నిర్ణయమే. ఎందుకంటే పన్ను కట్టకుండా, బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురాకుండా డబ్బును నేలమాళిగల్లో, గోనెసంచుల్లో దాచుకుందా మనుకునేవారికి పెద్ద నోట్లు చాలా సౌకర్యంగా వుంటాయి. దేశంలో చలామణీలో వున్న డబ్బంతా బినామీల పేరో, సనామీల పేరో బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చినపుడే పాలకులు తీసుకునే ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు సవ్యంగా అమలవుతాయి. తెల్లధనంతో సమానస్థాయిలో, సమాంతరంగా నల్లధనం ప్రవహిస్తూ వుంటే యీ విధానాలకు ఫలితాలు కానరావు. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాని డబ్బు నోట్ల రూపంలోనే వుండదు. బంగారం, అసలు రేటు కన్న తక్కువ విలువ చూపే రియల్ ఎస్టేటు, విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బు.. యిత్యాది రూపాల్లో కూడా వుంటుంది. స్విస్ బ్యాంకుల నుండి డబ్బు పట్టుకుని వచ్చి అందరి ఖాతాలకు పంచిపెట్టడం ఎన్నికల వాగ్దానమంత సులభం కాదని మోదీకి బోధపడినట్లుంది. దాని మాట ఎలా వున్నా, దేశంలో వున్న నల్లధనంపై దృష్టి పెట్టి ఓ స్కీము ప్రకటించి 'మేం మిమ్మల్ని పట్టుకోలేక పోతున్నాం, మీ అంతట మీరే వెల్లడించండి' అని నల్లధనికులను కోరితే వారి స్పందన అంతంతమాత్రంగా వుంది. అది విఫలమైంది కాబట్టే యీ రద్దు తలపెట్టారనడం సరికాదు. ఈ నిర్ణయం, యీ కసరత్తు ఆర్నెల్లగా సాగుతోందట. పెద్ద నోట్ల రద్దు ఒక్కదానితోనే వ్యవస్థ మారిపోదు. అనేక మార్గాల్లో యిది కూడా ఒకటి. దీన్ని ఒక పద్ధతిగా చేయాలి. టైమింగు చూసుకోవాలి. తక్కిన మార్గాలు మూసేసే జాగ్రత్తలు కొన్ని తీసుకోవాలి. అవేమీ లేకుండా మోదీ సర్కారు నాటకీయ ఫక్కీలో చేయడం వలన అంతటా గందరగోళం నెలకొంది. ఈ రద్దు అమలవుతున్న పోకడలు చూస్తూ వుంటే ప్రజలకు యిబ్బంది కలగడం తప్ప అసలు లక్ష్యం నెరవేరకుండా కేవలం పబ్లిసిటీకే పనికి వస్తుందన్న భయం వేస్తోంది.

ప్రజల్లోంచే వచ్చిన మంత్రులకు, యిక్కడే చదువుకున్న అధికారులకు, భారతదేశం విశాల దేశమని తెలుసు, యిక్కడి ప్రజల అలవాట్లు, భయాందోళనలు తెలుసు, ప్రభుత్వ వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలుసు, ఇన్‌ఫ్లేషన్ ధర్మమాని యీ నాడు 500 రూ.ల నోటును 100 రూ.ల స్థాయిలో వాడుతున్నారనీ తెలుసు. ఇన్ని తెలిసి యిలాటి భారీ నిర్ణయం వలన ఎలాటి పరిణామాలు సంభవిస్తాయో వూహించలేకపోవడం వైఫల్యం కాక మరేమిటి? ఊహించలేదని ఎందుంటున్నానంటే పెట్రోలు బంకులు, ఆసుపత్రులు, ప్రభుత్వం ఆమోదించిన పాల బూతులు, రైలు, బస్సు, విమాన కౌంటర్లు, గవర్నమెంటు కన్స్యూమర్ స్టోర్లు, మందుల చీటీ చూపిస్తే మెడికల్ షాపుల వద్ద మాత్రమే పెద్ద నోట్లు చెల్లుతాయి అని మొదట్లో చెప్పారు. తెల్లవారగానే టోల్‌గేట్ల వద్ద కి.మీ.ల కొద్దీ వాహనాలు నిలిచిపోగానే వాళ్లకి వెసులుబాటు యిచ్చారు, ఆ మర్నాడు ప్రభుత్వ పన్నులు కట్టేటప్పుడు తీసుకుంటామన్నారు, యిప్పుడు చీటీ చూపకపోయినా మెడికల్ షాపులు కూడా తీసుకుంటాయట. ఇలా ఒక్కోటీ సడలిస్తూ పోవడం దేనికి? దేనిదేనికి యివ్వాలో ముందే చూసుకోవద్దా?

పెట్రోలు బంకుల్లో ఏం చేస్తున్నారు? నోటు తీసుకుంటాం కానీ చిల్లర యివ్వం అంటున్నారు. టూ వీలర్‌లో 500 రూ.ల పెట్రోలు పోయించుకోవాలంటే తరమా? ఇక ప్రయివేటు ఆసుపత్రుల్లో డబ్బు తీసుకోవటం లేదని అనేక కథనాలు వస్తున్నాయి. నిజమే, యిప్పటిదాకా క్యాష్‌తో వ్యవహారం నడిపేవాళ్లను హఠాత్తుగా అది కుదరదంటే ఎకౌంటింగ్ ఎలా చేయాలో వాళ్లూ తబ్బిబ్బు పడతారు. చికిత్స చేసే, టెస్టులు రాసే డాక్టర్ల వాటా దగ్గర్నుంచి, యిన్‌స్పెక్షన్‌కు వచ్చే అధికారుల లంచాల దగ్గర్నుంచి యిన్నాళ్లూ వాళ్లు డబ్బుతోనే డీల్ చేస్తూ వచ్చారు. అప్పుడు అది రద్దు అన్నారు. వీళ్ల దగ్గర్నుంచి డబ్బు తీసుకుని తమ ఖాతాలో జమ చేస్తే రేపు యిన్‌కమ్‌టాక్స్ వాళ్లు వచ్చి 'ఓహో, నీకు రోజుకి యిన్ని లక్షల వ్యాపారమవుతుందా? చెప్పనే లేదు' అంటూ పీడిస్తారని భయం. వ్యాపారం పోయినా ఫర్వాలేదు, వాళ్ల పాల పడకుండా వుంటే చాలని రోగులను వెనక్కి పంపేస్తున్నారు.

బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో నోట్లు మార్చవచ్చని ప్రకటించేముందు వాళ్ల వ్యవస్థ ఎలా వుందో, వారి సాధకబాధకాలు ఎలా వుంటాయో పాలకులు, అధికారులు ఆలోచించవద్దా? కొరియర్ వ్యవస్థ వచ్చాక, చెవి వున్నవాడి కల్లా కర్ణాభరణంలా సెల్‌ఫోన్ వచ్చి చేరాక ఉత్తరాలు, పార్శిళ్లు వ్యాపారం దెబ్బ తిని పోస్టాఫీసులు మూతపడుతున్నాయి. అక్కడ సిబ్బంది నియామకాలు ఆగిపోయాయి. మీ ప్రాంతంలో పోస్టాఫీసు ఎక్కడుందని అడిగితే చప్పున చెప్పలేని పరిస్థితి. పెళ్లి ఆహ్వానపత్రికలు గంపగుత్తగా పంపించడానికి మాత్రమే దాన్ని వెతుక్కుంటూ వెళుతున్నారు. అందుకని సిబ్బంది తగ్గిపోయారు. స్పీడు పోస్టు అయితే తప్ప, ఉత్తరాల బట్వాడా వారానికి రెండు, మూడు రోజులు జరుగుతోందంతే. ఇప్పుడు హఠాత్తుగా వందలాది మంది జనం వచ్చి పోస్టాఫీసులో ఖాతా తెరుస్తాం, డబ్బు కడతాం అంటే వాళ్ల దగ్గర స్టాఫ్ ఏరి?

ఇక బ్యాంకుల పరిస్థితీ అంతే. కంప్యూటరైజేషన్ జరిగాక స్టాఫ్ తగ్గించేశారు. ఉన్నవాళ్లను యిన్సూరెన్సు పాలసీలు అమ్ము, హోమ్ లోన్స్ అమ్ము అంటూ తిప్పుతున్నారు. పైగా కాష్‌లో పని చేయడం అందరికీ అలవాటుండదు. ఇప్పుడు హఠాత్తుగా కస్టమర్లు కానివాళ్లు కూడా నోట్లతో వెల్లువెత్తితే స్టాఫ్ పుట్టుకుని రారు కదా! శని, ఆదివారాలు పనిచేయాలి, సెలవులు తీసుకోకూడదు అంటే

జరిగే పనేనా? ఎటిఎమ్‌లలో డబ్బు తీసుకోండి అంటున్నారు. మామూలుగానే 20% ఎటిఎమ్‌లు పనిచేయవు. ఓ కాబిన్‌లో రెండుంటే ఒకదానికి ఔట్ ఆఫ్ ఆర్డరు బోర్డు వేళ్లాడుతూ వుంటుంది. పనిచేసే వాటిల్లో చాలా వాటిల్లో క్యాష్ వుండదు. బాలన్సు ఎంత వుందో చెప్తుంది, దగ్గర్లోనే మా బ్యాంకుదే మరో ఏటిఎమ్ వుంది వెళ్లి వెతుక్కో అని చెప్తుంది. ఆదివారం సాయంత్రం చేతులెత్తేసే ఎటిఎమ్‌లెన్నో వున్నాయి. ఇప్పుడు కుప్పలుతిప్పలుగా జనం వచ్చిపడితే ఎటిఎమ్‌లలో డబ్బు నింపేవారు సరిపోతారా?

అబ్బే యివన్నీ తాత్కాలికమైన యిబ్బందులే, మూడు వారాల్లో అన్నీ సర్దుకుంటాయి అంటున్నారు ఆర్థికమంత్రి. ప్రభుత్వపు పని ఏదీ చెప్పిన కాలానికి పూర్తవదు. మూడు వారాల బదులు ఆరువారాలు కూడా కావచ్చు. ఈలోగా బతకడం ఎలా? ఇన్నాళ్లూ అన్నీ డబ్బుతో వ్యవహరించడానికే అలవాటు చేశారు ప్రభువులు. చెక్కులు, కార్డుల ద్వారా చెల్లింపు చేస్తానంటే బజార్లో బట్టలు, సూపర్ మార్కెట్‌లో తప్ప వేరే ఏ సరుకూ కొనలేవు. మామూలు షాపు వాణ్ని బిల్లు యిమ్మంటే పైన కొటేషన్ అని రాసిస్తాడు. ఒన్ ఇయర్ గ్యారంటీ అన్నావు కదా, బిల్లు కావద్దా అంటే, యిది చూపించినా చాలు అంటాడు. కార్డు వాడతానంటే కరంటు లేదంటాడు, నెట్ లేదంటాడు, మిషన్ పని చేయటం లేదంటాడు, 2% ఎక్కువ అంటాడు. పక్కనే ఎటిఎమ్ వుంది, క్యాష్ పట్టుకుని వచ్చి యివ్వండి అంటాడు. కార్డుని నమ్ముకుంటే మీ పిల్లాణ్ని డొనేషన్ యిచ్చి కార్పోరేట్ స్కూలులో చేర్చను కూడా చేర్చలేవు.

బ్రిటన్‌లో చూశాను – ఒక పౌండు ఖర్చుపెట్టినా కార్డుతో చెల్లింపు చేయవచ్చు. నగదు పంపిణీపై అదుపు సాధించాలంటే డెబిట్ లేదా క్రెడిట్ కార్డుతో పే చేస్తే 2% ఎక్కువ కాదు, 2% తక్కువ చెల్లించవచ్చు అని ప్రభుత్వం రూలు పాస్ చేయాలి. లక్షలు పెట్టి బంగారం కొన్నవాళ్లు కూడా పన్నులు చెల్లించం, బిల్లు అక్కరలేదు అని చెప్తే దుకాణదారు అమ్మయ్య అనుకుంటున్నాడు. బిల్లు లేకుండా సరుకు అమ్మితే దుకాణదారుణ్ని జైల్లో పెట్టాలి. చెక్ చేసేందుకు తగినంతమంది పన్ను అధికారులు లేరంటే వాళ్లను నియమించాలి. దుకాణాలు ఒకటే కాదు, డాక్టరు, లాయరు, ఆడిటరు ఎవరూ చెక్కుల నిష్టపడరు. అంతా క్యాష్, క్యాష్! నగదు కార్యకలాపాలను స్తంభింపచేయడానికి ఎంతమందిని కావాలంటే అంతమందిని వేయాలి. ఎటిఎమ్ లావాదేవీలకు చార్జి పెట్టిన తర్వాత మాటిమాటికి డబ్బు తీస్తే ఖర్చు పెరుగుతుంది కదాని ఒకేసారి తీసుకుని యింట్లో పెట్టుకుంటున్నాం. అంటే క్యాష్ చలామణీ పెరిగినట్లే కదా. ఆ చార్జీలు పెట్టేవాళ్లకు యీపాటి ఆలోచన రాదా? అవి ఎత్తేసి, యీ రద్దు గురించి ఆలోచించాలి. దేశం అంత వ్యయం చెల్లించలేదు అంటే నేను నమ్మను. ఈ నోట్లన్నీ రద్దు చేసి, మళ్లీ ముద్రించడానికి రూ. 15 వేల నుండి 20 వేల కోట్లు (చిదంబరం గారి లెక్క) ఖర్చు కావటం లేదా? కార్డు చెల్లింపులను ప్రోత్సహిస్తే నోట్ల ముద్రణ వ్యయంలో ఎంతో ఆదా! అయితే కార్డు వినియోగం పెరగాలంటే విద్యుత్, ఇంటర్‌నెట్ లేదా ఫోను సౌకర్యాలు నిరంతరాయంగా వుండేట్లు చేయాలి.

ఇలాటి పనులు చేయకుండా రద్దు చేస్తే ఏం లాభం? పైగా మళ్లీ 500, 1000 నోట్లు వేయడంతో బాటు 2000 నోటు కూడా తెచ్చారు. పెద్ద నోట్ల కారణంగానే దొంగడబ్బు పోగుపడుతోంది అన్నపుడు 2 వేలు వేయడం ఎంత మూర?త్వం? వాటి కంటె కొత్త డినామినేషన్లు 200, 300ల్లో నోట్లు తెస్తే సరిపోయేది. అమెరికాలో అన్నిటికంటె పెద్ద నోటు 100 డాలర్లు, యుకెలో 100 పౌండ్లు. మనకి మాత్రం 2 వేలెందుకు? ఈ ఒక్క పాయింటుపైనే మోదీ చిత్తశుద్ధిని అందరూ శంకిస్తున్నారు. టీవీ చర్చల్లో బిజెపి సమర్థకులు జవాబు చెప్పుకోలేక ఉక్కిరిబిక్కిరై 'ఇది తాత్కాలికమే, దీన్నీ రద్దు చేస్తారు' అంటున్నారు. రద్దు చేస్తామని చెపితే ఆ నోటు ఎవడైనా తీసుకుంటాడా? విషయమేమిటి బాబూ అని మోదీని అడుగుదామంటే ఆయన యింకో విదేశానికి విజయం చేశారు. వెళ్లేముందు యిచ్చిన ఉపన్యాసంలో 'టెర్రరిజం వ్యాప్తి చేయడానికి పాకిస్తాన్ 500 రూ.ల దొంగనోట్లు చలామణీలో పెట్టింది. ఈ దెబ్బకి వాళ్ల ఖేల్ ఖతమ్' అన్నారు.

ఈ నకిలీ నోట్ల గురించి మనం కొన్ని వాస్తవాలు తెలుసుకోవాలి. ఈ సమస్యపై ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం చేసి ప్రతి పది లక్షల నోట్లలో 250 మాత్రమే నకిలీవి అని 2016 జూన్‌లో చెప్పింది. దేశంలో రూ.400 కోట్ల నకిలీ నోట్లు చలామణీలో వుంటాయట. ఏటా 70 కోట్లు వచ్చి చేరుతూంటాయి. వాటిలో పోలీసులు పట్టుకునేవి మూడో వంతు మాత్రమే. ఇవన్నీ హోం శాఖ కూడా ఒప్పుకుంది. ఇక పాకిస్తాన్ నేపాల్ ద్వారా మన దేశంలో పంపిణీ చేసే దొంగ నోట్ల మాటకు వస్తే – మన ఆర్‌బిఐ రూ.29 ఖర్చు పెట్టి వెయ్యి రూపాయల నోటు వేస్తే పాకిస్తాన్ 39 రూ॥లు ఖర్చు పెట్టి ఆ నోటు వేస్తుందట. దాన్ని రూ.350-400కి అమ్ముతుంది. 2010 నుంచి విదేశాల్లోంచి వచ్చి పడిన నకిలీ నోట్ల విలువ రూ.1600 కోట్లని మన యింటెలిజెన్సు వర్గాలు చెప్తున్నాయి. (మన దగ్గర తయారయ్యే నల్లధనికులు ఎగ్గొట్టే ఆదాయపు పన్ను వలన కలిగే ఆర్థిక నష్టంతో పోలిస్తే యీ 1600 కోట్లు ఒక లెక్కా?) ఈ దొంగనోట్లు యిప్పటికే వినియోగంలో వున్నాయి కాబట్టి మన జేబులో వున్నవాటిల్లో, మనకు ఎటిఎమ్‌లో వచ్చినవాటిల్లో కూడా అవి వుండవచ్చు. వాటిని మార్చుకోబోతే, బ్యాంకువాళ్లు కనిపెడితే (యీ హడావుడిలో ప్రతీ నోటూ చెక్ చేసే సమయం వారికెక్కడిది లెండి), నష్టపోయేది మనం! దొంగనోట్లను అరికట్టలేకపోవడం ప్రభుత్వవైఫల్యం. దండన మాత్రం మనకు! ఇప్పుడు వేస్తున్న కొత్త నోట్లకు మాత్రం నకిలీలు తయారవ్వవన్న గ్యారంటీ వుందా? క్రెడిట్ కార్డులకే క్లోనింగ్ చేసేస్తున్నారు. నెట్‌బ్యాంకింగ్‌లో మోసాలు జరుగుతున్నాయి. క్యాష్ అచ్చేయడం ఓ లెక్కా? మరి అప్పుడీ కసరత్తంతా ఎవరి కోసం?

నిజానికి నల్లధనం అరికట్టాలనే చిత్తశుద్ధే వుంటే రాజకీయ పార్టీలు తమకు విరాళాలు యిచ్చేవారి పేర్లు ప్రకటించాలి. వాళ్లు అది చేయరు. మనం మాత్రం త్యాగాలు చేయాలి. చంద్రబాబుగారు చూడండి. తనకు దీని గురించి ఉప్పు అందగానే (వెంకయ్యనాయుడు ద్వారా అంటున్నారు), యీ సూచన తనే యిస్తున్నట్లు అక్టోబరు 12 న బహిరంగంగా అందరికీ చెప్పారు. బయటకు చెప్పవలసిన

పనేముంది? లేఖ రాసి వూరుకోవచ్చుగా! 'మీ దగ్గరున్న డబ్బును స్థలాల, బంగారం రూపంలో మార్చుకోండి' అని నల్లధనికులను హెచ్చరించడం కాకపోతే! టీవీ చర్చలో తెరాస నాయకుడు భానుప్రసాద్ చెప్పారు – వారం రోజులుగా రాజకీయ నాయకుల మధ్య యీ చర్చ జరుగుతోందని. ఆర్నెల్లగా దీని గురించి చర్యలు తీసుకుంటున్నపుడు ఎక్కడో అక్కడ సమాచారం లీకవడంలో వింతేముంది?

నల్లధనం దాచుకునేందుకు మంచి సాధనం – బంగారం! ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే, అక్కడ నగదు లావాదేవీలను నిషేధించాలి. షాపులపై, స్వర్ణకారులపై నిఘా వేసి, పది గ్రాముల బంగారమైనా సరే ఎవరెవరు కొంటున్నారో వివరాలు సేకరించాలి. అది జరిగిందా? ఇప్పుడు యీ రద్దు తర్వాత 10 గ్రా.ల బంగారం 50 వేల చొప్పున కొనేస్తున్నారట. ఈ నోట్లు తీసుకున్న బంగారం షాపుల వాళ్లందరూ వాటిని ఎలా ఎన్‌క్యాష్ చేసుకోగలరో తెలియటం లేదు. ఏదో ఒక మార్గం వుండే వుంటుంది. లేకపోతే ఎందుకు తీసుకుంటారు? ఇక స్థలాలు, యిళ్లు కొనేటప్పుడు యిష్టం లేకపోయినా నల్లధనం ప్రసక్తి వస్తుంది. దానికి కారణం – విపరీతమైన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు. అది రాష్ట్రప్రభుత్వ పరిధిలోని అంశమే కావచ్చు. కేంద్రం మరోలా పరిహారం యిచ్చి వాటిని అవి తగ్గిస్తే అసలు ధరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆ డబ్బు ప్రధాన స్రవంతిలోకి వస్తుంది. బంగారు నగల కొనుగోళ్లపై పన్ను బాగా తగ్గించిన తర్వాతనే బిల్లు తీసుకోసాగారు చాలామంది. గతంలో అయితే బిల్లు వద్దు బాబోయ్ అనేవారు. అలాగే స్టాంపు డ్యూటీ తగ్గించి, రిజిస్ట్రేషన్లు చెక్కుల ద్వారా జరగాలని రూలు పెట్టాలి.

బంగారం, స్థలాలు కొనడం మధ్యతరగతి వాళ్లకు తెలిసున్న మార్గాలు. భారీ స్థాయిలో ధనికులు దాచుకునేది విదేశాలలో, పన్నులు లేని దేశాల్లో డబ్బు దాచుకోవడం, దాన్నే విదేశీ పెట్టుబడుల రూపంలో మళ్లీ దేశానికి తీసుకుని వచ్చి రాయితీలు పొందడం! ఆహా మా పాలనాసామర్థ్యం చూసి విదేశీయులు యిక్కడ పెట్టుబడి పెట్టేస్తున్నారని పాలకులు జబ్బలు చరుచుకోవడం. పేర్లు చూడబోతే అన్నీ భారతీయుల పేర్లే. ఇవన్నీ పాలకులకు తెలియదా? స్విస్ బ్యాంకులు ఇండియన్ ఖాతాదారుల పేర్లు చెప్పటం లేదు అని వాపోయే బదులు, తక్కిన దేశాల నుండి పెట్టుబడి పెట్టడానికి వచ్చిన భారతీయులను 'ఇక్కడ దాచుకోకుండా అక్కడెందుకు దాచుకున్నావ్?' అని అడగవద్దా? అలా డిపాజిట్ చేసే అవకాశం తీసిపారేస్తే ఆ డబ్బు దేశంలోనే వుంటుంది కదా. ప్రవాస భారతీయులు పెట్టుబడి పెడతానని వచ్చినా 'అసలు నీ ఆదాయమెంత? ఇంత ఎలా దాచుకున్నావ్? మా వాళ్లెవరైనా పట్టుకుని వచ్చి నీకిచ్చారా?' అని అడగవచ్చుగా. అతని ఆదాయానికి, యిక్కడ పెట్టే పెట్టుబడికి లంగరందక పోతే యిక్కడి బ్లాక్‌మనీయే రంగు మార్చుకుని ఆ రూపంలో వస్తోందని యిట్టే పట్టుకోవచ్చు. ఇలాటివి ఎన్నో చేసిన తర్వాత అప్పుడు నోట్ల రద్దు చేపడితే నల్లధనికులను అష్టదిగ్బంధం చేసినట్లయ్యేది. అప్పుడు వాళ్లు ఆ నోట్లను తగలెబట్టుకోవడమో ఏదో చేసేవారు.

అది చేయకుండా పబ్లిసిటీ కోసం చేసినట్లయింది యిది. ఈ హంగామాకు బదులు వెయ్యి రూపాయలను మొదటగా రద్దు చేసి చూడాల్సింది. అది కూడా హఠాత్తుగా చేయనక్కరలేదు, గడువు యివ్వవచ్చు. ఫలానా తేదీలోగా మీ బ్యాంకు ఖాతాల్లో వేసుకోండి, తర్వాత పని చేయదు అని చెప్పవచ్చు. ఆ తర్వాత 500 రూ.లను కూడా గడువిచ్చి రద్దు చేయవచ్చు. గడువిస్తే కొంప మునిగిపోతుంది అనే భయమే అక్కరలేదు. ఇప్పుడు డిసెంబరు 30 వరకు యిచ్చారుగా, (దాన్ని పొడిగించవచ్చు కూడా). యీ లోపున ఏం చేయడానికి సావకాశం వుందో గడువు తర్వాత రద్దు చేసినా అదే ఫలితం! బ్యాంకుల్లో ఎంతైనా డిపాజిట్ చేద్దామంటే కుదరదు. కెవైసి ఫారమ్ పూర్తి చేయకపోతే ఒక లిమిటుకి మించి డిపాజిట్ చేయడానికి లేదు. గడువు యిచ్చి రద్దు చేసి వుంటే యిలాటి కెవైసి వంటి లొసుగులు లేకుండా జనాలు జాగ్రత్తపడేవారు.

ఇలాటి కేసుల్లో నోట్ల మార్పిడికి రకరకాల మార్గాలు పడతారు. ముంబై, కలకత్తాలో సూటుకేసు కంపెనీ వాళ్లు హైదరాబాదు వచ్చి పాతబస్తీ కేంద్రంగా హవాలా నడుపుతున్నారట. మీరిచ్చిన బ్లాక్‌మనీలో సగం భాగాన్ని వాళ్లు బంగారం, డాలర్లు రూపంలో తిరిగి యిస్తారట. తక్కిన 50% వాళ్లది. వాళ్లు కాగితాల మీద కంపెనీలు నడుపుతూంటారు. చేసే బిజినెస్ ఏదీ లేకపోయినా ఖాతాల్లో డబ్బు వేసినట్లు, తీసినట్లు అంకెలు చూపిస్తూ వుంటారు. ఈ నల్లడబ్బును తమ వ్యాపారంలో భాగంగా తీసుకున్నట్లు చూపిస్తారు. ప్రతీ ఏడూ ఇన్‌కమ్‌టాక్స్ కట్టేవేళ కొన్ని ట్రస్టులు కూడా వచ్చి యిలాటి ఆఫర్లు యిస్తాయి. వాళ్లకిచ్చే విరాళాలపై ఐటీ ఎగ్జెమ్షన్ వుంటుంది. మనం విరాళమిస్తే, తమ పేరు వాడుకొన్నందుకు కొంత వుంచుకుని మళ్లీ వెనక్కి యిచ్చేస్తారు. విరాళం మేరకు మనకు టాక్సులో రిబేటు వస్తుంది.

1972లో భూ సంస్కరణలు వచ్చినపుడు చూశాను – రాత్రికి రాత్రి మొగుడూ పెళ్లాం విడిపోయి, మేం వేర్వేరు కుటుంబాలని చూపుకున్నారు. పాలేర్ల, పనివాళ్ల, డ్రైవర్ల పేర ఎకరాల కెకరాలు రాసేశారు. ఇప్పుడూ అదే చేస్తారు. 'ఇదిగో పది వెయ్యి రూ.ల నోట్లు, బ్యాంకు కెళ్లి కూలీ నాలీ చేసి దాచుకున్నదని చెప్పు. కొత్త నోట్లు తీసుకో. 2500 నువ్వుంచుకో, తక్కినది నాకియ్యి' అంటాడు నల్లధనికుడు. అప్పనంగా రెండున్నర వేలు వస్తున్నందుకు పేదవాడు ఖుష్. నా అనుమానం జన్‌ధన్ యోజనా కింద తెరిచిన ఖాతాల్లో యిప్పుడు హఠాత్తుగా యాక్టివిటీస్ పెరిగిపోతాయని. మొన్నటిదాకా దాన్లో ఆపరేషన్స్ లేక, పై అధికారుల ఒత్తిడి తట్టుకోలేక బ్యాంకు అధికారులే రూపాయిరూపాయి చొప్పున వేశారు. ఇప్పుడా అవసరం పడదు. ఆ ఖాతా వున్నవాళ్లందర్నీ నల్లధనికులు వెతికి పట్టుకుని మార్పిడికి వాడుకుంటారు. దీన్ని అరికట్టడం ఎవడి తరం కాదు. వచ్చినవాళ్లను పరిశీలించి, పరీక్షించి, వివరాలు రాసుకుని కానీ నోట్లు మార్చవద్దు అని బ్యాంకు సిబ్బందికి చెప్పినా ఆచరణలో అది సాధ్యం కాదు. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టినపుడు సర్వేయరు వంటింట్లోకి వెళ్లి ఎన్ని సిలండర్లు వున్నాయో కూడా లెక్క పెట్టి రాసుకుంటాడు, పెరట్లోకి వెళ్లి కోళ్లను

లెక్కిస్తాడు అని చెప్పారు. ఆచరణకు వచ్చేసరికి వాళ్లు వంటింటికి కాదు కదా, యింటి గుమ్మంలోకైనా రాలేదు. ఓ కుర్రాడు వీధి చివర బల్ల వేసుకుని కూర్చుని మీరు చెప్పిందే రాసుకున్నాడు.

వ్యవస్థలో లోపాలు సవరించకుండా, తగినంతమంది సిబ్బందిని నియమించకుండా, మెరుపుదాడిలా నోట్ల రద్దు చేపట్టడం జరిగిందని తోస్తోంది. అందుచేత దీని ఫలితం పట్ల అందరికీ సందేహాలున్నాయి. పైన చెప్పిన దగుల్బాజీ మార్గాలు అనేకం వున్నాయి కాబట్టే పెద్ద నోట్ల రద్దు విఫలమౌతోంది. 1978లో జనతా ప్రభుత్వం రద్దు చేసిన తర్వాతి ప్రభుత్వాలన్నీ నల్లధనం అరికట్టడానికి యిది కిట్టుబాటు మార్గం కాదని తేల్చుకుని ఆగిపోయాయి. పెద్ద తలకాయలు ఎలాగో జాగ్రత్త పడి వుంటారు. దీని వలన మధ్యతరగతి, లంచాలు పట్టే ఉద్యోగివర్గం, పన్నులు ఎగ్గొట్టే వ్యాపార, వాణిజ్య వర్గాలు మనీలాండరింగ్ ఖర్చులు భరించాల్సి వస్తుంది కాబట్టి కొంతమేరకు నష్టపోతాయి. పూర్తిగా నష్టపోతాయని మాత్రం నమ్మబుద్ధి కావటం లేదు. బినామీల జోరు పెరిగి ఓ తరహాలో సంపద పంపిణీ జరుగుతుంది. అంటే పైన చెప్పిన ఉదాహరణలో గతంలో నల్లధనికుడి వద్ద పదివేల బ్లాక్‌మనీ వుంటే యిప్పుడది నల్లధనికుడి వద్ద ఏడున్నరవేలు, జన్‌ధన్ యోజనా ఖాతాదారుడి పేర రెండున్నర వేలు వైట్‌మనీగా మారుతుంది. ఈ రద్దు, మళ్లీ ముద్రణ కారణంగా పెద్ద నోట్ల చలామణీ, క్యాష్ వాడకం ఆగదు. నోటు సైజు మారుతోందంతే. ఇంకో ఆర్నెల్లు పోయేసరికి మళ్లీ నల్లధనం పోగుపడవచ్చు. నోట్లను కాకుండా, కాష్ ట్రాన్సాక్షన్లను రద్దు చేయకపోయినా, నియంత్రించినప్పుడే నల్లధనం అదుపులోకి వస్తుంది. ఇక టెర్రరిజాన్ని అరికట్టడానికి వుపయోగపడుతుందన్న వాదనకి వస్తే, నిఘా వ్యవస్థను మెరుగు పరచాలి తప్ప యీ రద్దు వలన టెర్రరిజం మాసిపోతుందంటే ఎలా నమ్మగలం? మనసుండాలే కానీ పాకిస్తాన్ ఉగ్రవాదులకు బంగారం రూపంలోనో, మరో రూపంలోనో నిధులు సమకూర్చలేదా? ఇవన్నీ లెక్క వేసి చూస్తే ప్రస్తుత చర్య పాలకుల పబ్లిసిటీకి, పబ్లిక్ అగచాట్లకూ మాత్రమే పనికి వస్తుందనిపిస్తోంది.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 10, 11** **ఎమ్బీయస్ : ఎఫ్‌బిఐ హిల్లరీని కొంప ముంచిందా?**

..ముంచిందనే అంది హిల్లరీ – తనకు లక్ష డాలర్ల కంటె ఎక్కువ విరాళం యిచ్చిన దాతల నుద్దేశించి శనివారం మాట్లాడుతూ! మొదట్లో తన ఈ మెయిల్స్ గురించి వచ్చిన వివాదం, ట్రంప్ ఆడవాళ్ల గురించి చేసిన అసభ్యవ్యాఖ్యలు క్రమేపీ మరుగున పడ్డాయని, ఆర్థికపరమైన విషయాలే ముందుకు వచ్చాయనే భావనలో వున్న హిల్లరీ ఎఫ్‌బిఐ వారి అక్టోబరు 28 నాటి ప్రకటన, నవంబరు 6 నాటి ప్రకటన తన విజయావకాశాలను దెబ్బ తీశాయని వాపోయింది. నెగ్గబోతూ ఓడిపోయిన ఫీలింగు కలగడంతో ఓటమి దుఃఖాన్ని మింగుకోవడానికి చాలా రోజులే పట్టిందామెకు. నిజానికి హిల్లరీ ఓటమిపాలయినా అనేక వర్గాలు ఆమెను ఆదరించినట్లు ఎగ్జిట్ పోల్స్ ద్వారా తెలుస్తోంది. మగవాళ్లలో 53% మంది ట్రంప్‌కు వేయగా 41% మంది హిల్లరీకి వేశారు. ఆడవాళ్లలో 42% మంది ట్రంప్‌కు వేయగా, 54% మంది హిల్లరీకి వేశారు. (1996 నుంచి ప్రతి ఎన్నికలో 50% కంటె ఎక్కువమంది మహిళలు డెమోక్రాటిక్ అభ్యర్థికే వేస్తున్నారు). నల్లవారిలో 88% హిల్లరీకే వేయగా కేవలం 8% మంది ట్రంప్‌కు వేశారు. హిస్పానిక్స్, లాటినోలలో 65% మంది హిల్లరీకి, 28% మంది ట్రంప్‌కు వేశారు. జనాభాలో 4% వున్న ఆసియన్ ఓటర్లలో డెమోక్రాటిక్ పార్టీకి మద్దతిచ్చేవారు గతంలో కంటె తగ్గినా యీ సారి కూడా 65% హిల్లరీకి వేయగా, 29% మంది మాత్రమే ట్రంప్‌కు వేశారు. యూదుల్లో 71%, ప్రొటెస్టంట్లలో 39%, కాథలిక్స్‌లో 45% హిల్లరీకి వేశారు. అయితే హిల్లరీ దెబ్బ తిన్నదెక్కడంటే శ్వేతజాతీయుల విషయంలో! శ్వేతజాతీయుల్లో హిల్లరీకి 37% మంది మద్దతిస్తే, ట్రంప్‌కు 58% మంది యిచ్చారు.

ఆర్థిక వర్గాల వారీగా చూసినా కింది తరగతికి చెందిన బ్లూకాలర్ ఓటర్లు ట్రంప్‌కి మాత్రమే మద్దతిచ్చారనుకోకూడదు. సిఎన్ఎన్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం 50 వేల కంటె తక్కువ జీతం వచ్చే వర్గంలో హిల్లరీకి ట్రంప్ కంటె 11% ఎక్కువ మద్దతుంది. 50 వేల ఆదాయం కంటె ఎక్కువ సంపాదించే వర్గంలో ట్రంప్ లీడ్ 11% వుంది. ఎందుకంటే ట్రంప్ దిగుమతులపై సుంకాలు విధిస్తానని, కార్పోరేట్ టాక్స్ తగ్గించి కంపెనీలను అమెరికాకు తిరిగి వచ్చేట్లు చేస్తానని హామీ యిచ్చాడు కాబట్టిట. ఇలా ఆర్థికంగా వెనకబడిన వారిలో కొందరు, పై స్థాయిలో వున్నవారు కొందరు ట్రంప్ వెంట వున్నారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలో 80% మంది శ్వేతజాతీయులే. వారిలో చాలామంది బ్లూకాలర్ ఉద్యోగులే. అందువలన ట్రంప్‌కు హిల్లరీ కంటె 6% లీడ్ వుంటుందని సర్వేలు ఊహించాయి. చివరకు వచ్చేసరికి ట్రంప్‌కు 56% మంది ఓటేస్తే, హిల్లరీకి 40% మంది వేశారు. మొత్తం మీద చూస్తే హిల్లరీకి కనీసం 4% లీడ్ వుందని చాలా సర్వేలు చెప్పాయి. మరి ఈ లీడ్ ఎందుకు తారుమారైంది? 1992లో బిల్ క్లింటన్‌కు శ్వేతకార్మికులు అండగా నిలిచారు. ఈ సారి కూడా వాళ్లను ఆకట్టుకోవాలని బిల్ తన భార్యకు సలహా యిచ్చాడు. కానీ హిల్లరీ, ఆమె సహచరులు దాన్ని తిరస్కరించారు. ఇతర జాతులవారు ఎలాగూ తమతో వున్నారు. ఇక శ్వేతజాతీయుల్లో తక్కువగా చదువుకున్న వర్కర్లు ట్రంప్ తరఫున వున్నారు కాబట్టి కాలేజీ చదువులు చదివిన సబర్బన్ శ్వేతజాతి ఓటర్లను ట్రంప్ తిక్కపనులను ఎత్తిచూపి ఆకట్టుకుందామని చూశారు. అది చాలారోజులు బాగానే నడిచింది కానీ ప్రచారం చివరి రోజుల్లో వాళ్లు హిల్లరీకి దూరమయ్యారు. అందుకే యీ ఓటమి అనుకోవచ్చు. వాళ్లు దూరం కావడానికి కారణం ఆమె ఈ మెయిల్ వ్యవహారం!

హిల్లరీ ఈ మెయిల్ వ్యవహారం గురించి చెప్పుకోవాలంటే – హిల్లరీ విదేశాంగ మంత్రిగా వుండగా 2009 మార్చి నుండి 2013

ఫిబ్రవరి వరకు ప్రభుత్వపరంగా చేయవలసిన కార్యకలాపాలను ప్రభుత్వ ఈమెయిల్ ఐడీ ద్వారా కాకుండా, తన వ్యక్తిగత ఈమెయిల్ ఐడి ద్వారా వేలాది మెయిల్స్ పంపింది. అలా చాలామంది చేస్తారుట కానీ యీమె తన కుటుంబానికి చెందిన సొంత వ్యక్తిగత సర్వర్ల ద్వారా ఆ అధికారిక మెయిళ్లు పంపింది. వాటిల్లో క్లాసిఫైడ్ కూడా చాలా వున్నాయి. అది భద్రతాపరమైన నిర్లక్ష్యమే. అంతేకాదు, తన అఫీషియల్ డాక్యుమెంట్లు, రహస్య మెమోలు ప్రింటవుట్ తీసే పనిని తన పనిమనిషి మారినా శాంటోస్‌కి అప్పగించింది. ఆమె ఫిలిప్పీన్స్‌నుంచి వచ్చిన ప్రవాసి. అమె ద్వారా ఆ రహస్యాలు బయటపడే అవకాశం వుంది. 2015 మార్చిలో యీ విషయం బయటపడింది. రాజకీయనాయకురాలిగా ప్రజాజీవితంలో దశాబ్దాలు గడిపి, కొంతకాలం దేశాధ్యక్షుడిగా వున్న వ్యక్తి భార్య యింత అజాగ్రత్తగా వుండడం ఆశ్చర్యకరం.

బెంగాజీ దాడుల గురించి హ్యూమా పాత్రను విచారిస్తున్న హౌస్ సెలెక్ట్ కమిటీ దృష్టికి అనుకోకుండా యీ విషయం వచ్చింది. ఇలా చేయడం ద్వారా హిల్లరీ ప్రభుత్వనియమాలు ఉల్లంఘించారని కమిటీ సభ్యులు వాదించారు. గతంలో కూడా విదేశాంగ మంత్రులు వ్యక్తిగత ఈ మెయిల్ ఐడీలు వాడారని హిల్లరీ వాదించింది. వాళ్లు నీలా సొంత సర్వర్ వాడలేదు కదా అంటూ ఆమె వాదనను తిరస్కరించింది కమిటీ. వ్యక్తిగత ఈ మెయిల్ ఉపయోగించే వారు రూలు ప్రకారం తమ అఫీషియల్ కరస్పాండెన్సును 20 రోజుల్లోగా ప్రభుత్వానికి అప్పగించాలి. ఆ మేరకు నేను యిచ్చేశాను అని హిల్లరీ 2015 ఆగస్టులో అఫిడవిట్ యిచ్చారు. నిజానికి 2014 డిసెంబరు వరకు అప్పగించలేదు. అప్పుడు కూడా 32 వేల ఈమెయిళ్లు డిలీట్ చేసి కేవలం 30 వేలు మాత్రమే అప్పగించింది. డిలీట్ చేసినవి బయటపెట్టాలంటూ ట్రంప్ యాగీ చేశాడు.

మొత్తం వ్యవహారాన్ని ఎఫ్‌బిఐకు అప్పగించారు. అది లోతుగా పరిశోధించి హిల్లరీ కొన్ని ఈమెయిళ్లను అప్పగించలేదని కనుగొంది. అంతే కాదు, కొన్ని ఈ మెయిళ్లు ఎఫ్‌బిఐతో బాటు మరో ఐదు గూఢచారి సంస్థల నుండి వచ్చాయని, హిల్లరీ వాటిపై అన్‌క్లాసిఫైడ్ సిస్టమ్స్ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిందని తేల్చింది. పంపిన తదుపరికాలంలో 2100 మెయిళ్లను క్లాసిఫైడ్‌గా గుర్తించారని, పంపేనాటికి అవి క్లాసిఫైడ్ కావని హిల్లరీ తరఫువారు వాదించారు. ఎఫ్‌బిఐ డెరక్టర్ జేమ్స్ కోమీ 110 ఈమెయిళ్లను గుర్తించి అవి పంపే సమయంలోనే క్లాసిఫైడ్ వంటివే అని ధృవీకరించాడు. వాటిలో 65 సీక్రెట్‌గా పరిగణించాలని, 22టిని టాప్ సీక్రెట్‌గా పరిగణించాలని అన్నాడు. మూడు మెయిళ్లపై 'సి' (కాన్ఫిడెన్షియల్) అనే మార్కు వుంది. హిల్లరీ తనకు 'సి' అంటే ఏమిటో తెలియదని బుకాయించింది. అంత సీనియరు, ఒకప్పటి ఫస్ట్ లేడీ అలా వాదించడం చిత్రంగా వుంది. ఏది ఏమైనా ఎఫ్‌బిఐ ఆమెకు అనుకూలంగా వ్యవహరించింది. స్టేట్ డిపార్టుమెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ 2016 మేలో పదవిలో వున్నవారు ఈమెయిల్ హేండిల్ చేసే తీరుతెన్నుల పట్ల 83 పేజీల రిపోర్టు యిచ్చింది. 2016 జులై 5 న కోమీ ఒక ప్రకటన చేస్తూ 'హిల్లరీ అమిత నిర్లక్ష్యంగా వ్యవహరించింది' అన్నాడు. అంటూనే ఆమెకి ద్రోహబుద్ధి లేదు కాబట్టి అది చర్య తీసుకోదగినంత పెద్ద నేరం కాదన్నాడు. మర్నాడే ఎటార్నీ జనరల్ హిల్లరీపై చర్యలేవీ తీసుకోం అన్నాడు. దానిపై ట్రంప్ చాలా దుమారమే లేపాడు. వ్యక్తిగత సర్వర్ వుపయోగించడం కావాలని చేసింది కాదంటూ హిల్లరీ చెప్పుకుంటే నమ్మినవాళ్లు నమ్మారు. క్రమేపీ ఆ వివాదం మరుగున పడింది.

అయితే అత్యంత నాటకీయ పరిస్థితుల్లో ఈమెయిల్ వివాదం మళ్లీ బయటకు వచ్చింది. అసభ్య సందేశాలు (సెక్స్‌కు టెక్స్టింగ్ కలిపి, సెక్స్టింగ్ అని పేరు పెట్టారు) పంపాడని ఆంథోనీ వీనర్‌పై వివాదం చెలరేగింది. అతను కాంగ్రెసు మాజీ సభ్యుడు కావడమే కాక హిల్లరీకి అత్యంత సన్నిహితురాలైన సహాయకురాలిగా వున్న హ్యూమా అబెదిన్‌కు భర్త కూడా. హ్యూమా తండ్రి అమెరికాలో స్థిరపడిన అవిభక్త భారతీయ ముస్లిము. అతను కాలిఫోర్నియాలో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ముస్లిమ్ మైనారిటీ ఎఫైర్స్' స్థాపించి, దానికి అనుబంధంగా 'ముస్లిము మైనారిటీ ఎఫైర్స్' అనే పత్రిక వెలువరిస్తూ వుండేవాడు. ఈమె 17వ యేట ఆయన పోయాడు. ఆమె తల్లి పాకిస్తానీ మహిళ. సౌదీలో ఓ యూనివర్శిటీలో టీచరుగా పనిచేస్తూంటుంది. సౌదీలో పెరిగిన హ్యూమా 1996లో బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా వుండగా ఆమె వైట్‌హౌస్‌లో ఇంటెర్న్‌గా చేరింది. హిల్లరీకి బాగా నచ్చింది. కూతురిలా చూసుకోసాగింది. అప్పటి నుంచి హ్యూమా హిల్లరీనే అంటిపెట్టుకుని వుంది. ఆంథోనీ వైనర్ అనే యూదుణ్ని 2010లో పెళ్లి చేసుకుని ఓ పిల్లాణ్ని కంది.

అతను డెమోక్రాటిక్ పార్టీ తరఫున 1999 నుండి 2011 దాకా కాంగ్రెస్‌మన్‌గా వున్నాడు. 2011లో తన స్నేహితురాలికి పంపిన అసభ్యకరమైన మెసేజి వెలుగులోకి రావడంతో రాజీనామా చేయవలసి వచ్చింది. అది కాస్త సద్దు మణిగి 2013లో న్యూయార్కు మేయరు పదవికి పోటీ చేస్తే అప్పుడు యింకోటి సెక్స్టింగ్ బయటపడి ఓడిపోయాడు. ఇప్పుడు హిల్లరీ ప్రచారం ఉధృతంగా సాగుతూండగా మొన్న ఆగస్టులో న్యూయార్కు పోస్టు 2015 జులైలో సాగిన మరో సెక్స్టింగ్ ప్రహసనాన్ని బయటపెట్టింది. ఇతను పంపిన అశ్లీలచిత్రాన్ని అందుకున్న యువతి దాన్ని పత్రిక వాళ్లతో పంచుకుంది. పత్రిక మార్కెట్లోకి రాగానే వివాదం చెలరేగింది. వెంటనే ట్రంప్ అందుకున్నాడు – "హిల్లరీకి అతి సన్నిహితంగా వుండే హ్యూమా మతం ఏమిటో, ఆమె తల్లి ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తోందో పరికించండి. హ్యూమా భర్త తనపై తనకే నియంత్రణ లేని 'సిక్' ఫెలో. హిల్లరీ అధ్యక్షురాలైతే హ్యూమా వద్ద దేశభద్రతకు సంబంధించిన అనేక పేపర్లు వుంటాయి. భర్తగా ఆంథోనీకి అవి అందుబాటులో వుంటాయన్న విషయం తలచుకుంటేనే భయం వేస్తోంది." అన్నాడు. ఈ మాట అందరి మనసుల్లో నాటుకుంటుందనే భయంతో కాబోలు హ్యూమా వెంటనే 2016 ఆగస్టు 29న తన భర్తకు విడాకులు యిస్తున్నట్లు ప్రకటించింది.

ఎలాటి మెసేజిలు పంపాడో చూద్దామని ఆంథోనీ ల్యాప్‌టాప్‌ను ఎఫ్‌బిఐ శోధిస్తే, దానిలో ఆరున్నర లక్షల హిల్లరీ ఈమెయిళ్లు

బయటపడ్డాయి. అంటే హిల్లరీ అధికారిక ఈమెయిళ్లను హ్యూమాకు ఫార్వార్డ్ చేస్తే, ఆమె లాప్‌టాప్‌లో అవి వుండిపోయాయి. ఆమె భర్త కూడా ఆ లాప్‌టాప్‌ను ఉపయోగించాడు. అది చట్టవిరుద్ధమైన చర్య కావడంతో యిదంతా వెలుగులోకి వచ్చింది. దాంతో అక్టోబరు 28న అవన్నీ పరిశీలిస్తామని, హిల్లరీ వ్యవహారంపై పునర్విచారణ జరిపిస్తామని ఎఫ్‌బిఐ డైరక్టరు కోమీ ప్రకటించాడు. పాత ఈ మెయిళ్ల వివాదం మర్చిపోతూండగా, కొత్తగా యిది బయటకు రావడంతో హిల్లరీ సమర్థకులు మండిపడ్డారు. ట్రంప్ సమర్థకుల్లో చదువుకోనివాళ్లు ఎక్కువగా వుంటే హిల్లరీ సమర్థకుల్లో చదువుకున్నవాళ్లు ఎక్కువ. దేశభద్రత పట్ల హిల్లరీ యింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వారికి నచ్చలేదు. అప్పణ్నుంచి వారి మద్దతు తగ్గసాగింది.

ఎఫ్‌బిఐ అంతటితో వూరుకున్నా బాగుండేది, ఎన్నికలకు జస్ట్ రెండు రోజుల ముందు నవంబరు 6 న 'మేం ఆరున్నర లక్షల ఈ మెయిళ్లూ పరిశీలించేశాం. హిల్లరీ దుర్బుద్ధితో ప్రవర్తించలేదని జులైలో యిచ్చిన స్టేటుమెంటుకి కట్టుబడి వున్నాం' అంటూ కోమీ మళ్లీ ప్రకటించాడు. ఇది హిల్లరీ అవకాశాలను మరింత డామేజి చేసింది. ఆరున్నర లక్షల ఈ మెయిళ్లను పదిరోజుల్లోపులే పరిశీలించి, పరిశోధించేశారంటే ఎవరు నమ్ముతారు. పైగా అధికారంలో వున్నది హిల్లరీ పార్టీకి చెందిన ప్రభుత్వం. మన సిబిఐ లాగే ఎఫ్‌బిఐ కూడా పాలకుల గూటిచిలక అనే సందేహం ప్రజల్లో వుంటుంది. ట్రంప్ ఆ పాయింటే పట్టుకున్నాడు. ''ఈ సర్టిఫికెట్టు నేను నమ్మలేను. ఇంత తక్కువ సమయంలో ఎలా పరీక్షించారు?' అని అడిగాడు. 'మా స్టాఫ్ యిరవై నాలుగ్గంటలూ పనిచేసి ఈమెయిల్స్ పరిశీలించేశారు.' అని కోమీ జవాబు. ఒకవేళ అది నిజమే అనుకున్నా, అంత హడావుడిగా చేయవలసిన పనేముంది? హిల్లరీని గట్టున పడేయాలన్న తాపత్రయం కాకపోతే అనే అనుమానం అందరిలో మెదిలింది. ఏదో గోల్‌మాల్ జరిగిందని, దాన్ని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారనీ అందరూ అనుకోవడంతో మొదటి స్టేటుమెంటు కంటె రెండో స్టేటుమెంటే ఎక్కువ నష్టం కలిగించిందని హిల్లరీ కూడా అనుకుని వుంటుంది. అందుకనే తన అవకాశాలు దెబ్బ తీసినవి అంటూ తనకు క్లీన్‌చిట్ యిచ్చిన నవంబరు 6 స్టేటుమెంటును కూడా కలిపింది! అక్టోబరు 28 ప్రకటన రాగానే కోమీని హిల్లరీ అనుయాయులు తిట్టారు. నవంబరు 6 ప్రకటన రాగానే ట్రంప్ తిట్టాడు. ఫలితాలు చూశాక హిల్లరీ వేదన తెలిశాక, ట్రంప్ మనసులోనే కామీకి ధన్యవాదాలు చెప్పుకుని వుంటాడు.

ఇంతకీ పెద్దగా చదువుకోని శ్వేతజాతీయులు హిల్లరీ వెంట కాకుండా, ట్రంప్‌వైపు ఎందుకున్నారు? ఆ సంగతి వేరే వ్యాసంలో చూదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 12 – 14** **ఎమ్బీయస్ : అమెరికా– భయాందోళనలే గెలిచాయి...**

ట్రంప్ విజయాన్ని అర్థం చేసుకోవడానికి నేటి అమెరికా సమాజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవలసి వుంది. ట్రంప్ గెలుపును మైనారిటీ వ్యతిరేక, విదేశీ కార్మిక వ్యతిరేక ఓటుగా వర్ణించడం తేలిక. ట్రంప్ వంటి జోకర్‌ను, వదరుబోతును, అహంకారిని, అవినీతిపరుణ్ని, మూర్తీభవించిన అసభ్యతను గెలిపించినది శ్వేతజాత్యహంకారమే తప్ప వేరొకటి కాదని అనేయవచ్చు. కానీ అక్కడి సామాన్యుడి ఆర్థికస్థితిగతులు, సామాజిక పరిస్థితి, ఆశనిరాశలు తెలుసుకుంటే సమాధానం అంత సులభం కాదని తోస్తుంది. నిజానికి నేను అమెరికన్ ఎన్నికల గురించి పెద్దగా పట్టించుకోను. ఎవరు నెగ్గినా అమెరికా సామ్రాజ్యవాదం మారదనే నిస్పృహ నాది. రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య ఉన్నీస్–బీస్ తేడా తప్ప వేరొకటి లేదని, ఎవరు వచ్చిన పాకిస్తాన్‌ను చంకనెక్కించుకుంటారని, గల్ఫ్‌లో పెత్తనం సాగిస్తూ, ప్రపంచంలో దాదాపు 100 చోట్ల సైనిక, నౌకా స్థావరాలను నిర్వహించుకుంటూ, అమెరికా వ్యవస్థను తన గుప్పిట్లో వుంచుకునే ఆయుధాల కంపెనీల మనుగడకై ఏదో ఒక దేశంలో ఏదో ఒక సాకుతో యుద్ధాన్ని రగిలించి పబ్బం గడుపుకుంటారని నాకు ఒళ్లు మంట. ఎవరు గెలిస్తే మనకేంటి? అనే భావన నాది.

కానీ యీసారి ట్రంప్ ఉపన్యాసాలు నాలో ఆసక్తి రగిలించాయి. ఉన్నదున్నట్లు మాట్లాడుతున్నాడే, దీన్ని అమెరికన్ ప్రజలు ఎలా స్వీకరిస్తారు అనే ఉత్సుకతతో అమెరికా గురించి కనబడిన ఆర్టికల్సన్నీ చదవనారంభించాను. ఆ సందర్భంలో అమెరికన్ సమాజం ఎంత కృంగిపోయిందో, సగటు అమెరికన్ ఎంత కునారిల్లుతున్నాడో గమనించాను, కొంత వూహించాను. ఎంతసేపూ ఎవడు గెలిస్తే మన యిండియన్స్‌కు వీసాలిస్తాడా? ఔట్‌సోర్సింగ్ యిస్తాడా అనే ఆలోచనలోంచి బయటపడి, అసలు అమెరికన్లకు ఎలాటి వ్యవస్థ మంచిది అనే కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. పేపర్లు, టీవీలు, సర్వేలు అన్నీ హిల్లరీకే మద్దతు అంటూ వుంటే 'అయితే ట్రంప్‌ది అరణ్యరోదనే అన్నమాట' అనుకున్నాను. కానీ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ట్రంప్ గెలిచాడు. అనేక వర్గాలు అతన్ని దూరం పెట్టాయి. అయినా సగటు అమెరికన్ అతని వెంట నిలిచాడు. ఎందుకో అర్థం చేసుకుందామనే యీ ప్రయత్నం. అయిపోయిన పెళ్లికి బాజాలెందుకు? అనుకోకూడదు. ఎందుకంటే యీ ధోరణి బ్రెగ్జిట్‌లో యిప్పటికే కనబడింది. రాబోయే రోజుల్లో ప్రతిదేశంలోను యిదే తలెత్తవచ్చు. గ్లోబలైజేషన్ కాన్సెప్ట్ వెనకబడి గతకాలంలా స్వీయరక్షణవాదం (ప్రొటెక్షనిజం) ప్రబలవచ్చు. ఆ పరిణామాలు వూహించడానికి యీ విశ్లేషణ వుపయోగపడుతుంది.

ఆసియన్ దేశాల, యితర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లలోకి చొచ్చుకుపోవాలని అమెరికా, యూరోప్ దేశాలు గ్లోబలైజేషన్ ప్రతిపాదన చేశాయి. కానీ వాళ్ల ఆలోచనలు తలకిందులై అమెరికన్ మార్కెట్లను చైనా సరుకులు ముంచెత్తాయి. అమెరికన్ కంపెనీల ఉద్యోగాలను భారతీయులు, యితర ఆసియన్లు కబళించారు. స్థానిక వాణిజ్యం, కర్మాగారాలు మూతపడ్డాయి. అందుకే యూగన్

సర్వేలో 71% మంది అమెరికన్లు విదేశీ కంపెనీల పోటీ నుంచి స్థానిక వాణిజ్యాన్ని రక్షించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాటి రక్షణ ప్రస్తుతం లేకపోవడం చేత ప్రజలు నిరుద్యోగులవుతున్నారు. 50 ఏళ్లగా వలస వస్తున్న వారిలో, నల్లవారిలో ఎక్కువమంది స్థితి ఎప్పుడూ అంతంత మాత్రమే కాబట్టి వారు సర్దుకుపోతున్నారు కానీ ఒకప్పుడు ఘనంగా బతికి యీ రోజు పరిస్థితి తారుమారైనవారు శ్వేతజాతీయులు. ఈనాడు అమెరికన్ జనాభాలో వారి సంఖ్య 62% మాత్రమే. వాళ్లు రాజకీయ భేదాభిప్రాయాలతో వేర్వేరుగా ఓటేస్తూ వుంటే నల్లజాతి, హిస్పానిక్, ఆసియన్ ఓటర్లు మూకుమ్మడిగా ఓట్లేసి డెమోక్రాట్లను తరచుగా గెలిపిస్తున్నారు. ఒబామా స్వేచ్ఛా వాణిజ్యవిధానాలు అమెరికాకు నష్టదాయకంగా పరిణమించాయి. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒబామా తీసుకున్న చర్యలతో అమెరికా గాడిన పడింది కానీ ఆ ఉద్దీపన నిధులు పెద్ద పెద్ద కంపెనీలకు, బ్యాంకులకు చేరాయి.

అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెద్ద లోపం ధనికులకు, పేదలకు మధ్య అంతరం విపరీతంగా పెరిగిపోవడం. దేశంలోని 75% శాతం సంపద 10% మంది వ్యక్తుల వద్ద పోగుపడింది. తక్కిన 25% సంపదని మిగిలిన 90% జనాభా పంచుకుంటున్నారన్నమాట. అత్యంత ధనికులను, అతినిరుపేదలను తయారుచేస్తున్నది భారీ కంపెనీలు, వాటికి మద్దతుగా నిలిచిన ప్రభుత్వ విధానాలు. గత రిపబ్లికన్ ప్రభుత్వాలకు అమెరికన్ సంస్థలకు పన్ను రాయితీలు, ఋణాలు భారీగా యిచ్చాయి కానీ మీరు యిక్కడే పెట్టుబడి పెట్టాలి అనే నిబంధన విధించలేదు. అన్ని సౌకర్యాలూ పొంది రెండు లక్షల కోట్ల డాలర్ల రిజర్వు నిధులు పోగేసుకున్నా ఆ కంపెనీలు తిరిగి అమెరికాలో పెట్టుబడి పెట్టడం లేదు, మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప స్థానికులకు ఉద్యోగాలు యివ్వటం లేదు. అది గమనించాకైనా డెమోక్రాటిక్ ప్రభుత్వాలు విధానాలు సరిదిద్దలేదు. 1952లో అమెరికా ప్రభుత్వాదాయంలో కార్పోరేట్ పన్నుల వాటా 33%. కానీ యిప్పుడది దానిలో మూడోవంతుకి, అంటే 11%కి పడిపోయింది. వీటికి ఫెడరల్ బ్యాంకు నుండి లోన్లు, గ్రాంట్ల రూపంలో ముట్టినది 11 లక్షల కోట్ల డాలర్లు. ఇంత తీసుకుని యివి మాన్యుఫేక్చరింగ్ యూనిట్లను చైనా, మెక్సికో, కొరియా వంటి చౌకవేతనాల దేశాల్లో పెడుతున్నాయి.

పన్నుల విధానంలో అవి ప్రయోజనం ఎలా పొందుతున్నాయో చూపడానికి ఆపిల్ ఓ ఉదాహరణ. అమెరికన్ మల్టీనేషనల్ కంపెనీలు విదేశాల్లో పార్క్ చేసి వుంచిన ధనం 1200 బిలియన్ డాలర్లు కాగా దానిలో 187 బిలియన్ డాలర్లు ఆపిల్‌వే. గత పదేళ్లలో విదేశీ కార్యకలాపాలపై అది 200 బిలియన్ డాలర్లు లాభం సంపాదించింది. అయితే అది దాని మీద కట్టిన పన్ను కేవలం 4%! విదేశీ లాభాల్లో 90% అది అది ఐర్లండ్‌లో పెట్టిన సబ్సిడీ ద్వారా సంపాదించినదే. పోనీ అక్కడైనా పన్ను కడుతోందా అంటే 1991 నాటి ఐరిష్ పన్ను విధానాన్ని తననుగుణంగా మలచుకుని, ఏది స్వదేశీ (రెసిడెంటు) కంపెనీ అనే నిర్వచనం ఐర్లండ్‌లో ఒకలా, అమెరికాలో యింకోలా వుండడంతో ఆ వెసులుబాటు ఉపయోగించుకుని అక్కడా అతి తక్కువ పన్నులు కట్టింది. ఇది యూరోపియన్ యూనియన్ దృష్టికి వచ్చింది. ఇలాటి చర్యలతో లాభాలు సంపాదించి పోటీదారులకు నిలువనీడ లేకుండా చేస్తోందని భావించిన ఇయు దానికి జరిమానా వేసి 1450 కోట్ల యూరోలు చెల్లించమంది, గతంలో తీసుకున్న రాయితీలను కూడా కక్కమంది. ఇది ఆపిల్-ఇయూ వివాదం. అమెరికా ప్రభుత్వానికి దీనిలో జోక్యం ఏముండాలి? కానీ అది ఆపిల్ పక్షాన నిలిచి ఇయుపై మండిపడి, దీనికి ప్రతిగా ఇయు దేశమైన జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంకు మీద 1400 కోట్ల డాలర్ల జరిమానా విధించింది. ఇదీ అమెరికన్ ప్రభుత్వం కంపెనీలకు కొమ్ము కాస్తున్న విధం! ఇదేం పద్ధతంటే – 'మేం పన్నులు తగ్గిస్తే అమెరికాలో పెట్టుబడి పెడదామని ఆపిల్ చూస్తోంది. మీరే పన్నుల రూపంలో అంతా లాగేస్తే అది డబుల్ టాక్సేషన్ కింద వస్తుంది కదా' అంటోంది. ఆపిల్‌పై ఇంత ఔదార్యం అవసరమా? నిజానికి యాపిల్ అమెరికాలో కేవలం 65 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు యిచ్చి, తన ఉత్పాదనలన్నిటినీ చైనాలో తయారుచేస్తోంది. అంటే పేరుకే అవి అమెరికన్ కంపెనీలు తప్ప, వాటి వలన అమెరికా దేశానికి కాని, అక్కడి ప్రజలకు కాని లాభం పూజ్యం.

ఏ మాత్రం సందు దొరికినా కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తీసివేసి, ఆ ఖాళీలను తక్కువ వేతనాలకు లభించే భారత్, యితర దేశస్తులకు కట్టబెట్టడం ఇటీవలి కాలంలో మరీ పెరిగింది. డిస్నీలాండ్‌లో యిలా చేయడం ట్రంప్ ఎన్నికల అంశంగా చేసుకున్నాడు. దాని గురించి మాట్లాడుతూండగానే ఐబిఎం మినియాపాలిస్‌లో 500 ఉద్యోగాలలో అమెరికన్లను తొలగించి మనవాళ్లకు వేసుకోవడం జరిగింది. అది మరో అంశంగా మారింది. ఇదేమీ కాకపోతే పని మొత్తాన్ని ఔట్‌సోర్సు చేసేస్తున్నారు. మన ఇండియన్ కళ్లతో చూసినపుడు యిది మనకు మహదానందాన్ని కలిగిస్తుంది. 'అవును మరి, అమెరికన్లు సరిగ్గా చదువుకోరు, సరిగ్గా పనిచేయరు, మనవాళ్లయితే నిపుణులు, పైగా కష్టపడి పనిచేస్తారు' అని చెప్పుకుంటాం. ఇన్ని శతాబ్దాలుగా అమెరికా అనేక రంగాల్లో పైకి వచ్చిందంటే వాళ్లెవరూ చదువుకోకుండానే, పనిచేయకుండానే వచ్చేసిందా? మనవాళ్లు చెలరేగుతున్నది కొన్ని రంగాల్లోనే అని గుర్తుపెట్టుకోవాలి. మనవాళ్లు సివిలు కిట్టించేసినా, చదువు, అనుభవం విషయంలో బుకాయించేసినా, అమెరికా కంపెనీలు చూసీ చూడనట్లు వూరుకోవడం దేనికంటె చౌకజీతాలకు పని చేయడానికి సిద్ధపడుతున్నాం కాబట్టి! అమెరికన్లతో సమానంగా జీతాలివ్వండి అని అడిగి సాధించిన రోజున మనం కాలరు ఎగరేయవచ్చు. వాళ్లు యిచ్చినంత పుచ్చుకుని ఆ డాలర్లను రూపాయిల్లో మార్చి ఇండియాలో దాచుకుంటేనే మనకు కిట్టుబాటవుతుంది. అదే అమెరికాలో వుంటూ, వాళ్ల జీవనశైలిలోనే బతకాలంటే వాళ్లిచ్చే జీతాలు చాలామందికి చాలవు. అది మనం గ్రహించాలి. ఇక అమెరికా వైపు నుంచి చూస్తే వాళ్లకు అన్యాయం జరుగుతోంది. వాళ్ల ఉద్యోగాలు నానాటికి హరించుకుపోతున్నాయి. 25, 30 ఏళ్లగా వాళ్ల జీవననాణ్యత తగ్గిపోతూ వస్తోంది. అభద్రతా భావం పెరుగుతూ

వస్తోంది.

2007-14 మధ్య వారి ఆదాయాలు 20% పడిపోయాయి. రాజకీయ ప్రాబల్యం కూడా తగ్గిపోయింది. తమను పట్టించుకునేవారు లేరన్న కసితో వున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఉత్పదక రంగం నుంచి సేవల రంగానికి మళ్లింది. కొన్ని చోట్ల బొగ్గుగనులు మూసేశారు. చైనా కరెన్సీ మానిప్యులేషన్‌తో తన వస్తువులను తక్కువ రేటుకే అమ్ముతోంది. 1990లలో మెక్సికో, కెనడాలతో, 2000 సంఎరంలో చైనాతో కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా 20 లక్షల ఉద్యోగాలు పోయాయి. సర్వేల ప్రకారం 50% మంది ఓటర్లు ఆర్థిక కారణాలకే ప్రాధాన్యత యిచ్చారు. ఆర్థిక వ్యవస్థ బాగాలేదని 75% మంది అన్నారు. నాలుగేళ్ల నాటితో పోలిస్తే తమ ఆర్థికస్థితి దిగజారిందని 10% మంది చెప్పారు. మిచిగన్, ఒహాయో, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లు ఒకప్పుడు మ్యాన్యుఫేక్చరింగ్ యూనిట్లకు పెట్టింది పేరు. ఇప్పుడు పరిశ్రమలు తరలిపోవడంతో వాటికి 'రస్ట్ బెల్ట్' అని పేరు వచ్చింది. ప్రపంచ కార్మికులలో అమెరికన్ వర్కర్ల శాతం 1960లలో 25% వుంటే పరిస్థితి మారి 2010 వచ్చేసరికి కేవలం 10% మంది వున్నారు.

దీనికి తోడు పొట్టకూటి కోసం వలస వచ్చినవారు పావలాకు, అర్ధకూ పనిచేయడానికి సిద్ధపడడంతో వీళ్లకు చిన్నాచితకా ఉద్యోగాలు కూడా దొరకడం మానేశాయి. పరదేశం నుండి వచ్చినవాళ్లు ఎలాగైనా, ఎలాటి దుర్భరపరిస్థితుల్లోనైనా బతికేస్తారు. కానీ స్థానికులు కాస్త డీసెంటుగా బతుకుదామని చూస్తారు. అందువలన ఆ జీతాలకు వీళ్లు సిద్ధపడరు. వలస వచ్చినవారిలో సక్రమంగా వచ్చినవారు కొందరైతే, అక్రమంగా వచ్చినవాళ్లు చాలామంది వున్నారు. అసాంకు అక్రమవలసదారులు వచ్చిపడిపోతూ వుంటే మనం వూరుకుంటున్నామా? తరిమివేయాలని చూడడం లేదా? అలాగే వాళ్లూను. మన దేశంలో అయితే గుర్తింపు కార్డు వ్యవస్థ, ఎవరు ఎక్కడివారు అని కనిపెట్టే వ్యవస్థ యిప్పుడిప్పుడే రూపు దిద్దుకుంటోంది. సాంకేతికంగా ఎంతో ముందంజ వేసిన అమెరికాలో ఇల్లీగల్ యిమ్మిగ్రెంట్లను కనుగొనడం అంత కష్టం కాకపోవచ్చు. ప్రభుత్వం చూసీ చూడనట్లు వూరుకోవడం వలననే వారి సంఖ్య పెరుగుతూ వచ్చిందని స్థానికులు అనుకుంటూ అక్రమ వలసదారులపై, వారిని అనుమతించిన ప్రభుత్వంపై గుర్రుగా వున్నారు.

ఒక వ్యాపారవేత్తగా పనివారితో మసలినప్పుడు ట్రంప్ వారి మనోభావాలను బాగా గ్రహించి, వారి కోసమే నిలబడ్డానంటూ ప్రచారం చేసుకున్నాడు. సరైన పత్రాలు లేని 20 లక్షల మంది అక్రమవలసదారులను పంపేస్తానని మాటిచ్చాడు. ఎన్నికల తర్వాత కూడా దాన్ని పునరుద్ఘాటిస్తున్నాడు. ఇతర దేశాల నుంచి ఎడాపెడా దిగుమతులు చేసుకోవడం వలననే స్థానికంగా కర్మాగారాలు మూతపడ్డాయని, ఉద్యోగాలు పోయాయని, దాన్ని సరిదిద్దడానికి దిగుమతి సుంకాలను పెంచుతానని చెప్పాడు. ముఖ్యంగా అమెరికాకు కుప్పలుతిప్పలుగా వస్తున్న చైనా వస్తువులపై 45% సుంకాలు విధిస్తానన్నాడు. అక్రమ వలసదారుల్లో ప్రథమస్థానంలో వున్న మెక్సికో దిగుమతులపై 35% పన్నులు వేస్తానన్నాడు. ఇవన్నీ గ్లోబలైజేషన్ సిద్ధాంతానికి వ్యతిరేకమే కావచ్చు. అయినా 'అమెరికా ఫస్ట్' మన కొంప మనం కాపాడుకుందాం - అనే ట్రంప్ వాదన చాలామందిని ఆకట్టుకుంది.

గోల్డ్ డిగ్గర్స్‌లా అమెరికాకు వెళ్లిన మన భారతీయులకు ఆ దేశం అవకాశాల గనిగా, స్వర్ణభూమిగా, అందమైన మేడిపండులా తోచవచ్చు. కానీ స్థానికులకు తెలుసు - ఆ పండులో ఎన్ని పురుగులు వున్నాయో. హార్వర్డ్ లో చదువుకుని డెమొక్రాటిక్ సెనేటర్‌గా వుంటూ, ట్రంప్‌ను పూర్తిగా వ్యతిరేకించే ఎలిజబెత్ వారెన్ డెమొక్రాటిక్ కన్వెన్షన్ ప్రసంగంలో యిచ్చిన గణాంకాలు చూస్తే 30 ఏళ్లలో పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో తెలుస్తుంది. 'కితం తరంలో ఒంటిజీతంతో బతికే కుటుంబాల కంటె యిద్దరు సంపాదిస్తున్న యీనాటి కుటుంబాలకు అధ్వాన్నంగా వున్నాయి. ఋణం తీసుకున్న కుటుంబాలలో మూడోవంతు మంది అప్పు తిరిగి కట్టలేక అవస్థ పడుతున్నారు. 18 ఏళ్లు వచ్చిన కాలేజీ విద్యార్థులలో 70% నెత్తిపై విద్యాఋణాలున్నాయి. కితం ఏడాది 8,20,000 కుటుంబాలు దివాలా (బాన్‌క్రప్టసీ)కి అప్లయి చేశాయి. ఒకప్పుడు మనం మధ్యతరగతికి ప్రోత్సాహకాలిచ్చాం. క్రమేపీ మనం మధ్యతరగతి నెత్తికొట్టి డబ్బున్నవాళ్లనే నెత్తిమీద పెట్టుకుంటున్నాం.

'1935 నుంచి 1980 వరకు, కొత్తగా సృష్టింపబడే సంపదలో 70% కింది స్థాయిలో వున్న 90% జనాభాకు చేరేది. పై స్థాయిలో వున్న 10%కు 30% దక్కేది. 1980 నుంచి 2016 వరకు సృష్టింపబడిన సంపదలో మొత్తమంతా టాప్ 10%కే పోయింది. అభివృద్ధి ఫలాలు 90% మందికి అందనే లేదు. మరి వీళ్ల గతేమైంది? 30 ఏళ్ల కితం అతను తిండిపై ఖర్చు పెట్టే దాని కంటె యీ నాడు 13% తక్కువ ఖర్చుపెడుతున్నాడు, (ఇన్‌ఫ్లేషన్ ఎడ్జస్టెడ్ ఫిగర్స్ యివి) బట్టల విషయంలో 46%, ఎలక్ట్రానిక్ పరికరాలు (ఐఫోన్ వంటివి కలుపుకున్నా) విషయంలో 48% తక్కువ ఖర్చుపెడుతున్నాడు. అదే సమయంలో ట్రాన్స్‌పోర్టేషన్‌పై 11% ఎక్కువ ఖర్చు పెట్టవలసి వస్తోంది. ఇంటికై 57%, హెల్త్ ఇన్సూరెన్సుపై 104%, కాలేజీ విద్యపై 275%, చైల్డ్ కేర్‌పై 953% ఎక్కువ ఖర్చుపెట్టవలసి వస్తోంది. సామాన్యుడికే కాదు, డబ్బు, పలుకుబడి వున్నవాళ్లకు కూడా ఖర్చులు పెరిగాయి పాపం. లాబీయింగ్‌కై 1980లలో 200 మిలియన్ డాలర్లు ఖర్చుపెడితే సరిపోయేది. 2002 నాటికి 1.8 బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టారు, 2012 కి అది 3.3 బిలియన్ డాలర్లు! అంటే 30 ఏళ్లల్లో (ఇన్‌ఫ్లేషన్‌కి అనుగుణంగా సవరిస్తే) 7 రెట్లు ఖర్చు పెరిగిందన్నమాట.'- యిదీ ఆమె ఉపన్యాసం.

ఇంత చెప్పినా మన భారతీయులు 'అమెరికన్లు సరిగ్గా చదువుకుని వుంటే వాళ్లకూ ఉద్యోగాలు వచ్చి వుండేవి' అని వాదించవచ్చు. అక్కడి విద్యావ్యవస్థ ఎంత ఘోరంగా నడుస్తోందో యీ మధ్యే ఒక వ్యాసం రాశాను. మన దగ్గర కార్పొరేట్ కాలేజీల కంటె అధ్వాన్నంగా అక్కడి కాలేజీలు చదువుల కంటె ప్రచారంపై ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. విద్యాప్రమాణాలు లేవు. పైగా విద్యార్థులను

అప్పులపాలు చేస్తున్నారు. మన దగ్గరైతే పిల్లలకు 30 ఏళ్లు వచ్చినా అప్పోసొప్పో చేసి తలిదండ్రులు చదివించే కుటుంబవ్యవస్థ వుంది. అక్కడది లేదు. పైగా తండ్రికి ఉద్యోగం పోయి ఏడుస్తూవుంటే కొడుకుని ఏం చదివిస్తాడు? ఆదాయం ఎప్పుడైతే తగ్గిందో భార్యాభర్తల మధ్య కీచులాటలు, అవి ముదిరి విడాకులు సహజం. పిల్లలు ఎవరి పంచన చేరతారో, వాళ్లు ఏ మేరకు ఆదుకోగలరో అంతా దైవాధీనం. తక్కువగా చదువుకున్నందుకు పిల్లలకూ చిన్న ఉద్యోగాలే. అవీ పోతున్నాయి. ప్రభుత్వం యిచ్చే భ ృతిపై ఆధారపడాలి. అది ఎవరికీ ఆనందదాయకం కాదు.

తనే కాళ్లు విరక్కొట్టి, ఆ పై చంకకర్రలు ఉదారంగా దానమిచ్చే ప్రభుత్వాలు వున్నంతకాలం ప్రజల్లో ఫ్రస్టేషన్ పెరుగుతూనే వుంటుంది. ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవం వుంటుంది. చేతి నిండా పని కల్పించే ప్రభుత్వం వుంటే తన పని తాను చేసుకుని గర్వంగా బతుకుతాడు. చేతిలో పని లేకుండా, కేవలం ప్రభుత్వం విసిరే ముష్టిపై బతుకుతూంటే నిరాశానిస్ప ృహలలో మునుగుతాడు. మత్తుపదార్థాలకు బానిసవుతాడు. తన కంటె మెరుగైన పరిస్థితుల్లో వున్న యిరుగుపొరుగులను చూసి అసూయ, కోపం పెంచుకుని అవకాశం వచ్చినపుడు వారిపై దాడి చేద్దామని చూస్తాడు. దానివలన సామాజిక అశాంతి. తుపాకీ సంస్కృతికి ఆదరణ. ఇలాటి పరిస్థితుల్లో సరిగ్గా చదువుకోలేదని వాళ్లను ఎద్దేవా చేయడం అనవసరం.

ట్రంప్ వచ్చినంత మాత్రాన అమెరికన్లందరికీ హఠాత్తుగా చదువులు వచ్చేస్తాయని, పెద్ద ఉద్యోగాలు చేయడానికి అర్హులై పోతారని అనుకోలేం. ప్రస్తుత అమెరికన్ వ్యవస్థను దోచుకుంటున్న సంస్థలెన్నో వున్నాయి. విద్యావ్యవస్థ ఒక్కటే కాదు, సబ్‌ప్రైమ్ ఉదంతంలో, వెల్స్ ఫార్గో వుదంతంలో బాంకింగ్ వ్యవస్థకూడా సామాన్యులను దోచుకుంటోందని అర్థమవుతోంది. వీటన్నిటిని అతను సంస్కరించి, అదుపులో పెట్టగలిగిననాడే సగటు అమెరికన్ జీవితం బాగుపడుతుంది. ఇప్పుడున్న వ్యవస్థ అద్భుతంగా వుందని భావించిన హిల్లరీ ఒబామా వారసత్వాన్ని కొనసాగిస్తానని మాట యిచ్చింది. ఓ పక్క మీకు సంక్షేమపథకాలూ పెడతాను, కంపెనీలను బాగుపడనిస్తాను అంది. పెద్ద కంపెనీలతో, కుబేరులతో మమేకమైన హిల్లరీ మాట నమ్మబుద్ధి కాక, యిది నడిచే వ్యవహారంగా తోచక అక్కరలేదు, మహాప్రభో అన్నాడు సగటు అమెరికన్. ట్రంప్ వాళ్లకు ఉద్యోగాలు కల్పిస్తాననంటున్నది సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన పెద్ద ఉద్యోగాలు కాదు. నైపుణ్యం పెద్దగా లేకపోయినా, యూనియన్ బలంతో మంచి జీతాలు తెచ్చుకునే యూరోప్ తరహా ఉద్యోగాలే! గతంలో యివి వాళ్లకుండేవి. కానీ ఓ పక్క టెక్నాలజీ, మరో పక్క గ్లోబలైజేషన్ పెరగడంతో అవి హరించుకు పోయాయి.

గతంలో పాతికేళ్ల క్రితం మాన్యుఫేక్చరింగ్, విద్యుత్, గ్యాస్ వంటి యుటిలిటీస్ రంగాల్లో యిలాటి ఉద్యోగం చేసే అమెరికన్ మగవాడు ఒక్క జీతంతో మధ్యతరగతి జీవితాన్ని గడిపేవాడు. కానీ మొదటి రంగం 30% తగ్గిపోగా, రెండోది 25% క్షీణించింది. ఇంకో పరిణామం ఏం జరిగిందంటే యిదే సమయంలో సాంకేతికత పెరిగి భుజబలం కంటె బుద్ధిబలం, ఓర్పు, కమ్యూనికేషన్ స్కిల్ అవసరం పడే ఉద్యోగాలు పెరిగాయి. అవి ఆడవాళ్లకు అనువుగా వుండి, వాళ్లు పెద్ద ఎత్తున ఉద్యోగాల్లోకి వచ్చారు. విద్య, నర్సింగ్, సోషల్ వర్క్ వంటి రంగాల్లో ఉద్యోగాలు రెట్టింపయ్యాయి. ఈ 'ఆడంగి' ఉద్యోగాలు చేపట్టడం మగవాళ్లు చిన్నతనంగా ఫీలయి దూరంగా వున్నారు. లేదా చిన్న ఉద్యోగాల్లో కుదురుకున్నారు. పెళ్లయి, పిల్లలున్న ఆడవాళ్లలో 23% మంది భర్తల కంటె ఎక్కువ సంపాదిస్తున్నారు. 1960లలో యిది 5% కంటె తక్కువ వుండేది. పిల్లలున్న కుటుంబాలను తీసుకుంటే వాటిలో 40% కుటుంబాలలో మహిళ మాత్రమే సంపాదించడమో, లేక ప్రధాన పోషకురాలిగా (ప్రైమరీ బ్రెడ్‌విన్నర్) వుండడమో జరుగుతోంది.

ఏతావాతా ఇంట్లో భార్యకు ఉద్యోగం వచ్చి, మొగుడికి ఉద్యోగం పోయి మగాళ్ల ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం దెబ్బ తినే పరిస్థితి వచ్చి, అది వారి లైంగిక సామర్థ్యంపై ప్రభావం చూపిందని, అది అనేక సమస్యలకు దారి తీస్తోందని జాన్ హాప్‌కిన్స్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అండ్రూ చెర్లిన్ అన్నారు. మగవాళ్లు యిలా ఆత్మన్యూనతా భావంతో బాధపడుతూ చదువులు కూడా పట్టించుకోవడం మానేశారు. కాలేజీ చదువులు చదువుకున్నవారిలో మహిళలు ఎక్కువగా వున్నారు. గ్రాజువేట్ లెవెల్లో 57% మంది, పోస్ట్ గ్రాజువేట్ లెవెల్లో 63% మంది మహిళలే. వాళ్లు మంచి జీతాలు తెచ్చుకుంటూ, తమలా కాలేజీ చదువులు చదివిన మగాళ్లనే పెళ్లాడుతున్నారు. తమ పిల్లలనూ మంచి చదువులు చదివిస్తున్నారు. వీళ్ల సంస్కారయుతమైన కుటుంబాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ఫ్యామిలీలలో భార్య తనకంటె ఎక్కువ సంపాదిస్తున్నా భర్త కించపడటం లేదు. తాము ఫెమినిస్టులమని చెప్పుకుంటున్నారు. ఈ వర్గాలు హిల్లరీని సమర్థిస్తూ వచ్చాయి.

వారికి భిన్నంగా, చదువు రాక, చేతకాక, అవమానభారంతో క ృంగి, భవిష్యత్తు ఎలా వుంటుందో తెలియని కింది స్థాయి శ్వేతజాతీయుడు ట్రంప్ వెంట నడిచాడు. వాడికి ట్రంప్ తమ గోడు తెలిసిన వ్యక్తిగా తోచాడు. నిజానికి వాళ్లు పార్టీని కాక, ట్రంప్‌ను చూసే ఓటేశారనాలి. అతను ఎలాటి అసభ్యపు కూతలు కూసినా, లెక్కలేనంతమంది ఆడాళ్లను జయించేశానని చెప్పుకున్నా, వికారంగా ప్రవర్తించినా అదంతా 'మగతనం' కిందే తోచింది వాళ్లకు. అతనిలో తమను చూసుకున్నారు కాబట్టే, అతన్ని గెలిపించారు. వాళ్లే కాదు, వాళ్ల భార్యలు కూడా ట్రంప్‌ను ఆమోదించారు. 'మగవాళ్లను మగవాళ్లలా వుంచగలిగితే చాలు. ప్రస్తుతం అమెరికాది 'ఇంట్లో యీగలమోత, బయట పల్లకీల మోత' అన్నట్టుంది. ఇతర దేశాల వ్యవహారాలు చక్కబెట్టేందుకు వెచ్చించే డబ్బును యిక్కడ ఖర్చుపెడితే మా బతుకులు బాగుపడతాయి' అనుకున్నారు వాళ్లు. హిల్లరీ గెలిస్తే యీ పరిస్థితి యింకా అధ్వాన్నమవుతుందని భయాందోళనలు చెందారు. దానికి తగ్గట్టు బ్లాక్స్, హిస్పానిక్స్, ఆసియన్లు అందరూ ఆమెవైపే వున్నారు. ఆమె వాళ్ల పక్షానే మాట్లాడుతోంది కాబట్టి వాళ్లకే మేలు చేస్తుంది తప్ప తమకేమీ చేయదని, తమ పరిస్థితి నానాటికి నాగంభొట్లు అవుతుందని అడలిపోయారు.

అన్ని దేశాలూ నేర్చుకోవాల్సిన పాఠం యిది. గతంలో రష్యాలో యిదే జరిగింది. కమ్యూనిజం వ్యాప్తి చేస్తామంటూ యితర దేశాల్లో చౌకగా పుస్తకాలు అమ్ముతూ, అక్కడి కమ్యూనిస్టు పార్టీలకు తర్ఫీదు యిస్తూ, నిధులిస్తూ, అక్కడ తిరుగుబాట్లు ప్రోత్సహిస్తూ బయట అగ్రరాజ్యంగా పేరు తెచ్చుకున్నారు. కానీ సొంత ప్రజలకు రొట్టెముక్క కూడా యివ్వలేకపోయారు. తిండిపదార్థాల కోసం మైళ్ల కొద్దీ క్యూలలో నిలబడి నిలబడి రష్యన్ ప్రజలు విసిగిపోయారు. గోర్బచేవ్ కొద్దిపాటి సంస్కరణలు చేద్దామనుకుని, ఆంక్షలు కాస్త సడలించేటప్పటికి తిరగబడి పాలకులను తరిమికొట్టారు. రష్యా ముక్కలుముక్కలుగా విడిపోయింది.

అమెరికా కూడా అగ్రరాజ్యంగా వెలుగొందడానికి బయటి దేశాల్లో నానారకాలుగా తలదూర్చి డబ్బులు తగలేస్తోంది కానీ సొంత ప్రజల బాధలు పట్టించుకోవటం లేదు. తన పెట్టుబడిదారీ విధానాలతో ఆర్థిక అసమానతలను పెంచుతూ పోతోంది. (కంపెనీ సిఇఓల జీతాల్లో, వర్కర్ల జీతాల్లో ఎంత అంతరం వుందో, దేశసంపద కొంతమంది చేతుల్లో ఎలా యిరుక్కుందో జులైలో ' ట్రంప్‌కు ఎందుకింత పాప్యులారిటీ?' అనే వ్యాసంలో రాశాను. చూడండి) బతకలేం బాబోయ్ అని సామాన్యుడు గగ్గోలు పెడితే 'ఇదిగో భృతి రూపంలో, యిన్సూరెన్సు రూపంలో, యీ ముష్టి తీసుకుని చస్తూ బతకండి' అంటోంది ప్రభుత్వం. ట్రంప్‌ను గెలిపించడం ద్వారా 'మాకు ముష్టి అక్కరలేదు, ఉద్యోగాలు యివ్వండి, మా ఆత్మగౌరవాన్ని మాకు వెనక్కివ్వండి' అని వాళ్లు చాటి చెప్పారు. వాళ్ల యీ మూడ్ గమనించే ట్రంప్ 'అమెరికా ఫస్ట్', 'లెటజ్ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనే నినాదాలు యిచ్చాడు. ఫోకస్ స్వదేశంపై తిప్పి, శ్వేతజాతి అమెరికన్లకు పాతికేళ్ల నాటి భద్రతను మళ్లీ కల్పిస్తానని నమ్మకం కల్పించాడు. ఆ క్రమంలో శ్వేతజాతీయుల్లో ప్రాంతీయభావాన్ని రెచ్చగొట్టాడు. మైనారిటీలకు, వలస వచ్చినవారికి వ్యతిరేకంగా కారుకూతలు కూశాడు. వారిని వెక్కిరించాడు. ఈసడించాడు. అన్నీ చేసి, తనకంటూ కొందరు గాఢాభిమానులను కూడగట్టుకున్నాడు – అచ్చు మన కెసియార్ లాగానే! కెసియార్‌లాగానే విజయం సాధించాడు కూడా!

మరి సామాన్యుడి యీ భయాందోళనలను కనిపెట్టడంలో సర్వేసంస్థలు ఎందుకు విఫలమయ్యాయి, అమెరికన్ ఎన్నికల వ్యవస్థలో వున్న సంక్లిష్టత ఏమిటి అనేది మరో వ్యాసంలో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 16, 17 న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 104 వీక్లీకై** **ఎమ్బీయస్ : కొరియా శశికళ**

దక్షిణ కొరియా అధ్యక్షురాలైన 64 ఏళ్ల పార్క్ గ్యూయెన్‌హై కి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలు గత వారంలో ఉధృతమయ్యాయి. ఆమె పదవీకాలం 2018 ఫిబ్రవరి వరకు వున్నా ఆమె అర్జంటుగా గద్దె దిగిపోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు, స్కూలు పిల్లలు, కార్మిక యూనియన్ సభ్యులు నిరసన తెలుపుతున్నారు. ఇటీవలి కొన్ని దశాబ్దాలలో యింత పెద్ద ప్రభుత్వవ్యతిరేక ప్రదర్శన జరగలేదట. ఇంతకీ ఆమె సొంతంగా చేసిన అక్రమమేమిటో వాళ్లు చెప్పటం లేదు. 60 ఏళ్ల చోయీ సూన్‌సిల్ అనే ఆమె సహచరిపై కోపమంతా ఆమెపై చూపుతున్నారు. జయలలిత విషయంలో శశికళ ఎలాటిదో యీ చోయీ కూడా అలాటిదే. అధ్యక్షురాలికి సన్నిహితంగా వుంటూ దేశరహస్యాలు సేకరిస్తూ, అవినీతికి పాల్పడుతోందని ప్రజల నమ్మకం. అంతటి ప్రజాగ్రహం వున్నపుడు పార్క్ ఆమెను వదుల్చుకోవచ్చు కదా అనిపిస్తుంది కానీ పట్టుకుని వేళ్లాడడం ఆమెకు తండ్రి నుంచి సంక్రమించిన వారసత్వం.

పార్క్ తండ్రి చుంగ్‌హీ సైనిక నియంత. 1963లో గద్దె కెక్కి దక్షిణ కొరియా ఆధునికతను సంతరించుకునేట్లు చేశాడు. ఆ క్రమంలో మానవహక్కులను హరించాడు. అది కొంతమందికి కష్టం కలిగించింది. అతని భార్యను 1974లో ఉత్తర కొరియాపై పక్షపాతం కలిగిన వ్యక్తి హత్య చేశాడు. అప్పణ్నుంచి కూతురు పార్క్‌ను ఫస్ట్ లేడీగా వ్యవహరించేవారు. ఐదేళ్ల తర్వాత 1979లో చుంగ్‌హీ కూడా హత్యకు గురయ్యాడు. హత్య చేసినది వేరెవరో కాదు అతని గూఢచారి సంస్థ అధినేతే! దానికి కారణం చుంగ్‌హీ తన ఆధ్యాత్మిక గురువు చోయీ తేమిన్ చేతిలో కీలుబొమ్మ కావడమే. అతను బౌద్ధమతస్తుడు, పోలీసు అధికారి. అయితే రోమన్ కాథలిక్ క్రైస్తవం తీసుకుని చర్చ్ ఆఫ్ ఎటర్నల్ లైఫ్ అనే మతపంథాని ప్రారంభించాడు. చుంగ్‌హీ తనను ఆదరించడంతో అతన్ని అడ్డుపెట్టుకుని అధికారం చలాయించసాగాడు, డబ్బులు సంపాదించసాగాడు. కొరియా ప్రజలు అతన్ని రస్‌పుతిన్‌తో పోల్చసాగారు.

గ్రిగరీ రస్‌పుతిన్ (1869–1916) రష్యాలో ఒక పల్లెటూరి నాటు వైద్యుడు, జోస్యుడు. ఆనాటి రష్యా పాలకుడైన జార్ కొడుక్కి వచ్చిన అరుదైన వ్యాధిని నయం చేసి జార్ భార్యకు, తద్వారా జార్‌కు సన్నిహితుడయ్యాడు. అప్పటికే జార్ అధికారం క్షీణించి, తిరుగుబాటులు తలెత్తుతున్నాయి. మానసికంగా గందరగోళపడుతూ రస్‌పుతిన్ చెప్పే జోస్యాలు నమ్మసాగాడు. చక్రవర్తి దగ్గర తనకున్న పలుకుబడిని ఉపయోగించి రస్‌పుతిన్ జమీందార్లను, జాతీయవాదులను ఒక ఆట ఆడించాడు. వ్యక్తిగతంగా విలాసాలతో, భోగాలతో జీవించసాగాడు. జార్‌ను రక్షించుకోవాలంటే రస్‌పుతిన్‌ను తుదముట్టించక తప్పదనే ఉద్దేశంతో జార్ అనుయాయులు అతన్ని చంపివేశారు. కొరియా విషయానికి వస్తే జోస్యుణ్ని కాకుండా జోస్యాలు వినే పాలకుణ్నే చంపివేశారు. ఆ విధంగా తేమిన్ పీడ విరగడైందనుకున్నారు. కానీ వాళ్లకు తెలియదు – అప్పటికే తేమిన్ అధ్యక్షుడి కూతురు పార్క్‌ను బుట్టలో పెట్టేశాడని! తన 22 వ ఏట తల్లిని పోగొట్టుకుని అయోమయంలో వున్న పార్క్‌తో అతను 'మీ అమ్మ నాకు కలలోకి వచ్చి నిన్ను చేరదీయమంది' అని చెప్పి ఆమెను శిష్యురాలిగా చేసుకున్నాడు. తన కంటె 40 ఏళ్లు చిన్నదైన పార్క్‌ను లైంగికంగా కూడా లోబరచుకుని అనధికారికంగా

ఆమెకు ఒక బిడ్డను కూడా ప్రసాదించాడంటారు. అధికారికంగా మాత్రం పార్క్ అవివాహిత. 1994లో తన 82 ఏట చనిపోయే లోపున తేమిన్ ఆరు పెళ్లిళ్లు చేసుకున్నాడు. పార్క్ చేత ప్రభుత్వానికి అనుకూలమైన 'మూవ్‌మెంట్ ఫర్ ఏ న్యూ మైండ్' అనే పేర సామాజిక సంస్థ పెట్టించి, నిర్వాహకురాలిగా తన కూతురు సూన్‌సిల్‌ను పార్క్‌కు తగిలించాడు. అప్పటి నుంచి ఆమె జోస్యాలు చెపుతూ పార్క్‌ను అంటకాగుతోంది. ఆమె చెప్పినట్లు పార్క్ ఆడుతోంది. ఏ రోజు ఏ రంగు, ఏ డిజైను బట్టలు వేసుకోమంటే అవే వేసుకుంటుంది.

తండ్రి మరణానంతరం పార్క్ రాజకీయంగా పోరాడుతూ, ఎదుగుతూ వచ్చింది. తండ్రి పార్టీ అధ్యక్షురాలిగా, ఎంపీగా కొంతకాలం పనిచేసి, చివరకు 2013లో అధ్యక్షురాలిగా ఎన్నికైంది. సూన్‌సిల్‌కు అధికారికంగా ఏ పదవీ లేకపోయినా పార్క్‌ను అంటిపెట్టుకుని వుంటూ వ్యవహారాలు చక్కబెడుతూ వుంది. ప్రభుత్వ రహస్యపత్రాలన్నీ ఆమె చేతుల మీదుగానే నడుస్తున్నాయి. పార్క్ సిబ్బంది అంతా ఆమె ముందు సాష్టాంగపడుతున్నారు. ఆమె భర్త (దరిమిలా విడిపోయింది) పార్క్ వద్ద చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశాడు. ఇద్దరూ కలిసి పార్క్ పేర బాగానే సంపాదించారు. కొరియాకు చెందిన పెద్ద ఫ్యామిలీ గ్రూపు 'కొరియన్ చెబోల్స్' నుండి 774 మిలియన్ అమెరికన్ డాలర్ల లంచాలు తీసుకుని మీర్, కె-స్పోర్ట్ అనే రెండు మీడియా, స్పోర్ట్స్‌లకు సంబంధించిన ఫౌండేషన్లు ఏర్పాటు చేసింది. సూన్‌సిల్‌కు జర్మనీ అశ్వకళ (డ్రెస్సేజ్ అంటారు) నేర్చుకునే కూతురుంది. ఆ ఖర్చంతా లంచాల ద్వారా సంపాదించినదేట. ఆ పిల్ల యూనివర్శిటీలో చేరడానికై ఎడ్మిషన్ ప్రాసెస్‌లో గోల్‌మాల్ చేసిందట. పార్క్‌తో పనిబడిన వాళ్లందరూ సూన్‌సిల్ నెలకొల్పిన ఫౌండేషన్లకు విరాళాలు యివ్వవలసి వస్తోంది. సూన్‌సిల్‌పై ఆరోపణలు పెరిగినకొద్దీ పార్క్‌కు యిబ్బంది కలిగింది. సూన్‌సిల్ చెప్పుడు మాటలు విని ఉత్తర కొరియాతో చేతులు కలపాలని చూసిందని, కొరియా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేసిందని ప్రజలు నిరసన ప్రదర్శనలు చేయసాగారు. పార్క్ ఉపన్యాసాలన్నీ సూన్‌సిల్‌యే ఎడిట్ చేసిందని ఆరోపణలు చేశారు. అదేమీ కాదని బుకాయించినా ఉపన్యాసాలున్న కంప్యూటరు దొరకడంతో చివరకు అక్టోబరు 25న 'సూన్‌సిల్‌కు, నాకు వున్న సాన్నిహిత్యం వుంది. నా ముఖ్యమైన ఉపన్యాసాలను ఎడిట్ చేసే పని ఆమెకు అప్పగించాను. దేశానికి సంబంధించిన రహస్యపత్రాలు ఆమెకు చూపాను. దానికి క్షమాపణ చెపుతున్నాను' అని పార్క్ బహిరంగంగా ప్రకటించింది.

అయినా జనం చల్లబడలేదు. ఆమె రాజీనామా చేయాల్సిందే అన్నారు. దాంతో తన ఆంతరంగిక సిబ్బందిలో చాలామంది ఉద్యోగాలు తీసేసింది. చివరకు తన ప్రధాని హ్వాంగ్ క్యోఆన్ను కూడా తీసేసింది. ఆ తీసేయడం కూడా స్వయంగా పిలిచి చెప్పకుండా టెక్స్ట్ మెసేజీ ద్వారా తొలగించడంతో వివాదగ్రస్తమైంది. ఈ ఆరోపణలు బయటకు వచ్చేసమయానికి సూన్‌సిల్ జర్మనీలో వుంది. తను అమాయకురాలినని చెప్పుకుంది. కొరియాకు తిరిగి వచ్చింది. మరణశిక్ష వేయదగినంత పెద్ద తప్పు చేశాను అని ఒప్పుకుంది. పోలీసులు ఆమెను అరెస్టు చేయడమే కాక ఆమె ట్రస్టులకు నగదు రూపంలో విరాళాలిచ్చిన పెద్ద సంస్థల కూపీ లాగసాగారు. శామ్‌సంగ్ కంపెనీ ఎడ్వర్టయిజింగ్ చూసే చెయిల్ వరల్డ్‌వైడ్ అని వాళ్లకు సంబంధించిన యూనిట్ కూడా యిలా లంచాలిచ్చిందన్న అనుమానంతో వారికి ప్రపంచవ్యాప్తంగా వున్న బ్రాంచిలపై మంగళవారం దాడులు చేశారు. సూన్‌సిల్ వివాదం కారణంగా పార్క్ తలపెట్టిన ఆర్థిక సంస్కరణలు ముందుకు సాగకపోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016) (ఫోటో – చూయి సూన్‌సిల్, అధ్యక్షురాలు పార్క్ గ్యూయెన్‌హై)**

**ఎమ్బీయస్ : అర్ణబ్ గోస్వామి దారెటు?**

టీవీ ఇంగ్లీషు ఛానెల్ ప్రేక్షకుల్లో అర్ణబ్ గోస్వామి తెలియనివారెవరూ వుండి వుండరు. టైమ్స్ నౌ ఛానెల్‌లో అరిచేస్తూ, కాట్లకుక్కలా కరిచేస్తూ, కనీసం ఆరడజను మందిని చుట్టూ పెట్టుకుని, వాళ్లను అదిలిస్తూ, బెదిరిస్తూ, తీర్పులిచ్చేస్తూ, శిక్షలేసేస్తూ, నానా హంగామా చేసేస్తూండడమే అతని ప్రత్యేకత. తక్కిన న్యూస్ ఛానెల్స్‌లో చెప్పిందే చెప్పి బోరు కొడుతూ వుంటే యీ ఛానెల్‌కు వస్తే చాలు, ఏదో జరిగిపోతోందన్న భ్రమ కలిగించేస్తాడు అర్ణబ్. యాంకర్ అన్నవాడు అవతలివాడు చెప్పేది వినాలి, అసలు వాణ్ని చెప్పనివ్వాలి, వాణ్ని ఖండించేవాణ్నీ మాట్లాడనివ్వాలి, వాళ్లు హద్దు మీరుతున్నా, దారి తప్పుతున్నా చర్చను సరైన దారికి మళ్లిస్తూండాలి. ఒకవేళ ప్యానెల్‌లో ఒక సభ్యుడు తప్పు చెపితే, తక్కిన సభ్యులకు అది తప్పని తోచక, ఖండించకపోతే స్వయంగా ఖండించేటంత పరిజ్ఞానం యాంకర్‌కు వుంటే చాలు. అందరి వాదనలను ప్రేక్షకుడికి సరైన రీతిలో చేరేట్లా యాంకర్ చూస్తే చాలు, ప్రేక్షకుడే ఎవరి వాదన సవ్యంగా వుందో తేల్చుకుంటాడు.

అయితే అర్ణబ్ ప్రేక్షకుడికి ఆ ఛాన్సివ్వడు. తన ఏదో ఒక పక్షం తీసుకుని తక్కినవాళ్ల మీద విరుచుకు పడుతూంటాడు. వాళ్లని నోరెత్తనివ్వడు. పైగా తను అనుకున్న మాటలను అవతలి వాళ్లు అనుకున్నట్టుగా చెప్పేసి, దాన్ని ఖండించేందుకు సందివ్వడు. నువ్వు అన్నావు, నేను విన్నాను అంటూ రంకెలు వేసేస్తాడు. సర్కస్‌లో రింగ్ మాస్టర్‌లా వుంటుంది అతని వ్యవహారం. అతనికి ప్యానెల్ సభ్యులపైనా గౌరవం వుండదు, ప్రేక్షకుడిపైనా వుండదు. ప్రేక్షకుల తరఫున వకాల్తా పుచ్చేసుకుని వచ్చినవాళ్లను చీల్చిచెండాడేసి వాళ్లకు వైకేరియస్ ప్లెజర్ (పరోక్షానందం) కలిగిస్తాననుకుంటాడు. చర్చా కార్యక్రమం జరగవలసిన తీరు యిది కాకపోయినా ఆ ''న్యూస్ అవర్'' కార్యక్రమానికి విపరీతమైన రేటింగ్స్ వస్తాయి. దాని కారణంగానే ఐదేళ్లగా టైమ్స్ గ్రూపుకి చెందిన ఆ ఛానెల్‌కు ఆ

సమయంలో టాప్‌మోస్ట్ స్లాట్ అయింది. ఎందుకలా? అంటే పాతకాలం రోమన్లు గుర్తుకు వస్తారు. ఆ కాలంలో సింహాలకు క్రైస్తవులను ఆహారంగా వేస్తూ వుంటే వాళ్లు కేరింతలు కొట్టేవారట.

పైగా అర్ణబ్ తన దూకుడుకు, దురుసుతనానికి దేశభక్తి రంగు పులుముతాడు. మనకు వ్యవస్థను ఎదిరించాలని వుంటుంది. దాని కొమ్ము కాస్తున్న రాజకీయనాయకులందరూ మన దృష్టిలో దుర్మార్గులే. కనబడితే వాళ్లను నోరెత్తనీయకుండా కడిగేద్దామని వుంటుంది. వ్యవస్థను దునుమాడే వ్యక్తిగా మీ బదులు ఆ పని నేను చేసిపెడుతున్నానుగా నాలో మిమ్మల్ని మీరు చూసుకోండి అన్నట్టుంటాడు అర్ణబ్. అందుకని ఏం తోచకపోయినా, లైఫ్ కాస్త డల్‌గా వున్నా, పిల్లల హోంవర్కు చేయించవచ్చు కదా అని భార్య నస పెడుతూంటే అది వినబడకుండా వుండాలన్నా అతని షో ట్యూన్ చేస్తే చాలు.  చాలామంది ప్రేక్షకులు అలా అలవాటు పడ్డారు. పోనుపోను అర్ణబ్ కూడా తన మాయలో తనే పడిపోయాడు. కావాలనుకుంటే ఎవరినైనా ఆకాశానికి ఎత్తేయగలను, అక్కరలేదనుకుంటే పాతాళానికి తొక్కేయగలను అనుకోసాగాడు. అందుకే అతనిలో 'సెల్ఫ్‌రైటియస్ నెస్' (నేనే కరక్టు అనుకోవడం), 'హోలియర్-దేన్-దౌ' (నీ కంటె పుణ్యాత్ముణ్ని) యాటిట్యూడ్ ప్రస్ఫుటంగా కనబడసాగాయి. అతని పరిజ్ఞానానికి మెచ్చుకుంటూనే, అతని ధోరణికి నివ్వెరపోవాల్సి వస్తోంది. అయినా అతని కార్యక్రమం చూస్తూనే వున్నారు.

ఇటువంటి పరిస్థితిలో అర్ణబ్ టైమ్స్ నౌకు ఎడిటర్-ఇన్-చీఫ్ పదవి నుంచి రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. కారణాలు యిప్పటిదాకా తెలియరాలేదు. ఒక పరిశీలనేమిటంటే అర్ణబ్‌కు వచ్చిన గ్లామరంతా అతను వ్యవస్థకు వ్యతిరేకంగా మాట్లాడడం చేతనే! అలాటిది ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి అతని ధోరణిలో మార్పు వచ్చింది. ప్రభుత్వానికి మద్దతిస్తూ దాన్ని విమర్శించినవాళ్లపై విరుచుకుపడుతున్నాడు. గత ఆర్నెల్లగా యిది మరీ ముదిరింది. ప్రభుత్వవ్యతిరేకులకు వున్న గ్లామర్ మద్దతుదారులకు వుండదు. పైగా టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపు యాజమాన్యం ఎటూ మొగ్గు చూపకుండా తటస్థత కనబరచాలని ప్రయత్నిస్తుంది. పాకిస్తాన్ నటీనటులను భారతీయ సినిమాల్లో నటింపచేయడం దేశద్రోహమే అనే స్టాండ్ అర్ణబ్ తీసుకుంటే దాన్ని వ్యతిరేకిస్తూ గ్రూపు ఎండీ వినీత్ జైన్ 'సినిమాలొక్కటేనా? రెండు దేశాల మధ్య రూ.20 వేల కోట్ల బిజినెస్ అవుతోంది. దాన్నీ ఆపేయాలా?' అంటూ ట్వీట్ చేశాడు. సాధారణంగా టైమ్స్ వాళ్లు ఎవరికీ పబ్లికేషన్ కంటె అధిక స్థానం కల్పించరు. అర్ణబ్‌ను స్టార్‌లా చూస్తున్నా ఆ ఛానెల్‌కు 11 ఏళ్లల్లో రూ.553 కోట్ల క్యుములేటివ్ (తెలుగులో సంచిత అనవచ్చా?) నష్టం వచ్చింది. అది యాజమాన్యంకు నచ్చలేదు.

కానీ యిలాటి కారణాలతో అర్ణబ్ ఉద్యోగం మానేయలేదు. అతనికి వేరే చోట నుంచి ఆఫర్లు వచ్చాయట. యుకెలో ఫాక్స్ న్యూస్ నుంచి అని కొందరంటారు. కాదు, రుపర్ట్ మర్డోక్ స్టార్ గ్రూపులో చేరతాడని కొందరంటారు. అబ్బే కాదు, బిజెపికి ఆత్మీయుడైన ఒక పారిశ్రామికవేత్త మద్దతుతో, ఏసియానెట్‌కు సొంతదారు రాజీవ్ చంద్రశేఖర్‌తో కలిసి కొత్త ఛానెల్ పెడతాడట అంటున్నారు. అదేదో తేలేదాకా, మన చెవులకు కొన్నాళ్లు విరామం. **- ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 18, 19, 20** **ఎమ్బీయస్ : అమెరికా - సర్వేలు ఎందుకు తప్పాయి?**

మన దేశంలో ఎన్నికల జోస్యాలు తప్పడం విశేషం కాదు. కానీ సాంకేతికంగా విపరీతంగా అభివృద్ధి చెందిన అమెరికాలో కూడా తప్పింది. కొమ్ములు తిరిగిన పండితులూ ఫలితం వూహించడంలో బోల్తా పడ్డారు. ఎన్నికల రోజున కొంతమంది నిపుణులు కలిసి ప్రెస్ కాన్ఫరెన్సు పెట్టి నెగ్గాక హిల్లరీకి స్వదేశంలో, విదేశీ వ్యవహారాల్లో ఎదురయ్యే యిబ్బందుల గురించి మాట్లాడసాగారు. ట్రంప్ నెగ్గితేనో...? అని ఓ విలేకరి అడిగితే అది ఊహాజనితమైన ప్రశ్న అంటూ కొట్టిపారేశారు. అంత ధీమాగా వున్నారు నిపుణులు! నిజానికి హిల్లరీకి ట్రంప్ కంటె 5 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చినట్లున్నాయి. (తుది ఫలితాలు యింకా రాలేదు) అందువలన హిల్లరీయే ఎక్కువ పాప్యులర్ అనీ, వాళ్ల వూహ కరక్టే అనీ నుకోవచ్చు. కానీ అయినా ఆమె నెగ్గలేదు. ఎందుకంటే ఎలక్టరల్ కాలేజీలో ట్రంప్‌కు హిల్లరీ కంటె దాదాపు 70 ఓట్లు ఎక్కువ వచ్చాయి. గెలవాలంటే మొత్తం 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లలో 270 వచ్చినవాళ్లు గెలుస్తారు. ఒక్కో రాష్ట్రానికి ఓటు విలువ (వెయిటేజి)లో తేడా వుంటుంది. 4 కోట్ల జనాభా వున్న కాలిఫోర్నియా రాష్ట్రంలో 55 ఓట్లు వున్నాయి. అక్కణ్నుంచి అంతమంది ప్రతినిధులు (ఎలక్టర్స్) ఎన్నికవుతారు. 10 లక్షల లోపు జనాభా వున్న అలాస్కా నుంచి  3గ్గురు ఎలక్టోరల్స్ ఎన్నికవుతారు.  వీళ్లు అధ్యక్ష ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థికి ఓట్లేస్తామంటే కుదరదు.  మన దగ్గరైతే నియోజకవర్గాన్ని యూనిట్‌గా చూసి దానిలో మెజారిటీ ఓట్లు ఎవరికి వస్తే వాళ్లు గెలిచారంటాం. అక్కడ రాష్ట్రం మొత్తాన్ని యూనిట్‌గా చూస్తారు. తమ రాష్ట్రంలో మెజారిటీ సాధించిన పార్టీ తాలూకు అధ్యక్ష అభ్యర్థికి ఆ రాష్ట్రంలో ఎన్నికైన అభ్యర్థులందరూ - పార్టీతో సంబంధం లేకుండా - చచ్చినట్లు వేయాల్సిందే. అభ్యర్థికి అమెరికా ఎన్నికల ప్రక్రియలో వున్న చిత్రమే అది.

విలువ ఎక్కువున్న రాష్ట్రాలలో ఎక్కువ ఓట్లు ట్రంప్‌కు రావడంతో అతనికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. 2014 ఆంధ్ర ఎన్నికలలో తమకు టిడిపి కంటె కేవలం 6 లక్షల ఓట్లే తక్కువ వచ్చాయని జగన్ మాటిమాటికి వాపోతూ వుంటారు. ఆయన గ్రహించనిదేమిటంటే ఆయనకు వచ్చిన ఓట్లలో చాలా భాగం ఒకే ప్రాంతం నుంచి వచ్చాయి. కొన్ని జిల్లాలలో అయితే ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. అందుకని గెలిచిన వారికి 46.3% ఓట్లతో 102 సీట్లు రాగా వైసిపికి 44.5% ఓట్లతో 67 సీట్లు మాత్రమే వచ్చాయి. అందువలన

ఓట్ల శాతంలోని తేడా ఉన్న 2% తేడా సీట్ల శాతంలో 20%(టిడిపికి 58% సీట్లు వస్తే, వైసిపికి 38% వచ్చాయి) తేడాగా తర్జుమా అయింది. అమెరికాలో యింకో రకం తిరకాసు. ఏ రాష్ట్రంలో ఎవరు నెగ్గుతారో లెక్కలు వేసి అప్పుడు నిపుణులు ఒక నిర్ణయానికి వస్తే బాగుండేది.

అమెరికన్ ఎన్నికల పద్ధతిలో ఏ రాష్ట్రంలోనైనా సరే మెజారిటీ ఓట్లు తెచ్చుకున్న పార్టీ ఆ రాష్ట్రానికి చెందిన మొత్తం పాయింట్లను తన జేబులో వేసుకుంటుంది కాబట్టి, చాలా రాష్ట్రాలు పార్టీల వారీగా చీలిపోయాయి కాబట్టి ఎవరు ఎటు వేస్తారో ముందే వూహించేసుకుని కచ్చితంగా యిన్ని ఓట్లు వస్తాయి అని పార్టీలు అనేసుకుంటాయి. అయితే 11 రాష్ట్రాలు మాత్రం లోలకంలా ఊగిసలాట ధోరణిలో వుంటాయి. వాటిని 'స్వింగ్ స్టేట్స్' అంటారు. అవి ఫ్లోరిడా (29 ఓట్లు), పెన్సిల్వేనియా (20), న్యూ హ్యాంప్‌షైర్ (4), మిచిగన్ (16), కొలరాడో (9), నార్త్ కరోలినా (15), నెవాడా (6), విస్కాన్సన్ (10), మైన్(4), నెబ్రాస్కా (5) అరిజోనా (11) రాష్ట్రాలు. వీళ్లు ఎటు వుంటే అటే గెలుపు. తక్కిన చోట్ల ఎంత ఎక్కువ సంఖ్యలో ఓట్లు తెచ్చుకున్నా ప్రయోజనం లేదు. 50 రాష్ట్రాలలో 30 ట్రంప్ పక్షాన నిలిచాయి. 20 మాత్రమే హిల్లరీ పక్షాన వున్నాయి. 25% మార్జిన్ కంటె ఎక్కువ తేడాతో రిపబ్లికన్లు 11 రాష్ట్రాల్లో గెలిస్తే డెమోక్రాట్లు 5 రాష్ట్రాలలో మాత్రమే గెలిచారు. 30 కంటె ఎక్కువ తేడాతో గెలిచినవి రిపబ్లికన్లకు 4 వుండే డెమోక్రాట్లకు 1 మాత్రమే వుంది. అత్యధికమైన మార్జిన్ డెమోక్రాట్ల విషయంలో 32.2 కాగా రిపబ్లికన్ల విషయంలో అది 47.6! ఈ స్వింగ్ స్టేట్స్ ఎలా ప్రవర్తించాయో చూడాలి. ఫైనల్‌గా చెప్పాలంటే వీటిలో 96 ఓట్లున్న 6 రాష్ట్రాలు రిపబ్లికన్లను గెలిపించగా, 33 ఓట్లున్న 5 రాష్ట్రాలు డెమోక్రాట్లను గెలిపించాయి.

ఈ సారి సర్వేలు గట్టిగా జరిపి ఈ స్వింగ్ స్టేట్స్‌ను కూడా అటో యిటో వేసుకుంటూ ఒక జాబితా విడుదల చేశారు కొందరు. దాని ప్రకారం చూస్తే రిపబ్లికన్లకు 19 రాష్ట్రాల నుంచి 157 ఓట్లు వున్న కచ్చితంగా వస్తాయని, 47 ఓట్లున్న 5 రాష్ట్రాలు మొగ్గు చూపుతున్నాయని అన్నారు. ఇక డెమోక్రాట్స్ కైతే 17 రాష్ట్రాల నుంచి 200 ఓట్లు కచ్చితంగా వస్తాయని, 68 ఓట్లున్న 5 రాష్ట్రాలు మొగ్గు చూపుతున్నాయని అన్నారు. హోరాహోరీగా పోటీ వున్న 5 రాష్ట్రాల్లో (66 ఓట్లున్నాయి) మాత్రం ఎటూ తేల్చలేమన్నారు. ఫలితాలు వచ్చాక చూస్తే రిపబ్లికన్లు తప్పకుండా గెలుస్తారని, మొగ్గు వుందని చెప్పిన రాష్ట్రాలన్నిటిలో గెలిచారు. డెమోక్రాట్ల విషయానికి వస్తే తప్పకుండా గెలుస్తారని వూహించిన చోట గెలిచినా మొగ్గు వుందని చెప్పిన 5 రాష్ట్రాలలో కొలరాడో, వర్జీనియాలు మాత్రం వాళ్లకు దక్కి మిచిగన్, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లు మాత్రం రిపబ్లికన్ల వశమయ్యాయి. అంటే అక్కడ 46 చేజారాయన్నమాట. ఇక హోరాహోరీ రాష్ట్రాలకు గుర్తించిన వాటిల్లో రిపబ్లికన్లు అరిజోనా, ఫ్లోరిడా, నార్త్ కెరోలినా గెలిచారు. నెవాడా, న్యూహాంప్‌షైర్ మాత్రం డెమోక్రాట్లకు దక్కాయి.

డెమోక్రాట్లకు పట్టున్న మిచిగన్, పెన్సిల్వేనియా, విస్‌కాన్సిన్, నార్త్ కరోలినా, ఫ్లోరిడా, ఒహాయో రాష్ట్రాల్లో యీసారి ట్రంప్‌కు ఎక్కువ ఓట్లు పడడంతో అతను గెలిచాడు. హిల్లరీని బాగా దెబ్బ తీసిన రాష్ట్రాలు మూడున్నాయి – మిచిగన్, పెన్సిల్వేనియా, విస్‌కాన్సిన్! 16 ఎలక్టొరల్ ఓట్లున్న మిచిగన్‌లో ఒబామాకు 2012లో 54.2% ఓట్లు పడితే ఈ సారి హిల్లరీకి 47.3% మాత్రమే పడ్డాయి. అంటే చెప్పాలంటే ట్రంప్ కంటె 0.3% తక్కువ అన్నమాట. 10 ఓట్లున్న విస్కాన్సిన్‌లో గతంలో కంటె 5.9% ఓట్లు తక్కువగా, ట్రంప్ కంటె 1% తక్కువగా 46.9% పడ్డాయి. 20 సీట్లున్న పెన్సిల్వేనియాలో గతంలో కంటె 4.6% తక్కువగా, ట్రంప్ కంటె 1.4% తక్కువగా 47.4% పడ్డాయి. హిల్లరీ కనక యీ మూడిట్లో గెలిచి వుంటే ఆమెకు 274 ఎలక్టొరల్ ఓట్లు పడి గెలిచేది. ఈ రాష్ట్రాలలో ఓటర్లు – చిన్నాచితకా పనులు చేసేవారు, గ్రామీణులు. వలసదారులను ఆపి, ఉద్యోగాలు కల్పిస్తానన్న ట్రంప్ వాగ్దానం వాళ్లను ఆకట్టుకుంది. ప్రైమరీ ఎన్నికలలో బెర్నీ సాండర్స్‌తో పోటీ పడినప్పుడు కింది స్థాయి శ్వేతజాతీయులు సాండర్స్‌కు మద్దతివ్వగా హిల్లరీకి ఆఫ్రికన్–అమెరికన్లు మద్దతిచ్చి గెలిపించారు. తను పార్టీ అభ్యర్థిగా నియమించబడ్డాక కూడా హిల్లరీ శ్వేతజాతీయుల విశ్వాసాన్ని చూరగొనలేకపోయింది. రస్ట్ బెల్ట్ రాష్ట్రపు ఓటర్లలో పెద్దగా చదువుకోని శ్వేతజాతీయులు మూడో వంతు మంది వున్నారు. వారికి ఉద్యోగాలు పోయాయి, వేతనాలు తగ్గాయి. అయినా సర్వేలు మాత్రం పెన్సిల్వేనియా (20 ఓట్లు)లో కూడా హిల్లరీ లీడ్‌లో వుందని చెప్పాయి. వాస్తవాలు వేరేలా వున్నాయని ఫలితాలు చెప్పాయి.

సర్వేలు ఎందుకిలా తప్పు ఫలితాలు చూపించాయి అనే చర్చ చాలా రోజులపాటే సాగుతుంది. ఇప్పటిదాకా అందుబాటులో వున్న సమాచారంతో విశ్లేషిస్తే కొంతవరకు బోధపడుతుంది. మొదటిగా మన అర్థం చేసుకోవలసినది – యీ విశ్లేషకులు, జర్నలిస్టులు వీరంతా సాధారణంగా నగరవాసులై, 'భద్రలోక్' వెరయిటీకి చెంది వుంటారు. వారి కంటూ కొన్ని సిద్ధాంతాలు వుంటాయి. వాటి ప్రకారమే లోకం నడవాలని ఆశిస్తూ, నడిచేస్తోందని భ్రమిస్తూ వుంటారు. ఇందిరా గాంధీ నియంత, మాయావతి అవినీతిపరురాలు, జయలలిత అహంభావి వీళ్లెవరూ గెలవకూడదు, చంద్రబాబు మేధావి గెలవాలి... యిలా తను అనేసుకుని, ప్రజలంతా కూడా తనలాగే అనేసుకుంటున్నారని భ్రమిస్తారు. 2004లో చంద్రబాబు స్థానంలో ప్రజలు వైయస్‌ను గెలిపిస్తారని నేను అస్సలు వూహించలేక పోయాను. వైయస్ మైళ్ల తరబడి పాదయాత్ర చేస్తే ఏమిటి? ప్రజలకేం ఒరిగింది? అని తీసిపారేశాను. కానీ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం దెబ్బతిని, అభివృద్ధి అడుగంటి, ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని వైయస్ గుర్తించి ఎన్‌క్యాష్ చేసుకున్నాడని తెలియలేదు. హైదరాబాదులో వెలుస్తున్న హైటెక్‌సిటీ, ఫ్లయిఓవర్లు చూసి జనం మురిసి ముక్కలవుతున్నారని పొరబడ్డాను. కానీ సామాన్యప్రజలు ఆలోచనాధోరణి వేరే వుంటుంది. వాళ్లు ఇందిర, మాయావతి, జయలలిత, వైయస్ అందర్నీ గెలిపిస్తారు. ట్రంప్

వంటి మొరటుమనిషికి అమెరికా అధ్యక్షుడయ్యే అర్హత లేదని పాత్రికేయులు ముందే అనుకుని, పాలిష్‌డ్‌గా కనబడే హిల్లరీనే నెత్తిన పెట్టుకున్నారు. కానీ ప్రజల దృక్పథం వేరేలా వుంది.

హిల్లరీ మహిళలందరూ తనకే ఓటేస్తారనుకుంది కానీ 54% మందే ఆమెకు ఓటేశారు. 'ఇప్పుడు ట్రంప్ బాధితుల దగ్గరకు వచ్చేసరికి ఫెమినిస్టులా బాగానే మాట్లాడుతున్నావు కానీ నీ భర్త పాలబడిన మహిళల విషయంలో ఏం చేశావ్? బాధితుల పక్షాన నిలవలేదేం? భర్త అధికారం, తద్వారా నీ పలుకుబడి పోతుందన్న భయమా?' అని మహిళలు అనుకున్నారు. హిల్లరీ ప్రచారసరళిలోనే పరస్పరవైరుధ్య అంశాలున్నాయి. తొలి మహిళా అధ్యక్షురాలవుతాను కాబట్టి మీరు ఓటేయండి అని మహిళలకు గట్టిగా చెప్దామనుకుంది కానీ ఆ పాయింటు నొక్కి చెపితే మగవాళ్ల ఓట్లు పోతాయని భయపడింది. సామాన్యుడి కోసం శ్రమిస్తానని చెప్పుకుంది కానీ వాల్‌స్ట్రీట్ ఉపన్యాసాలకై లక్షలాది డాలర్లు పెద్ద కంపెనీల నుంచి వసూలు చేసింది. ప్రజలు ప్రస్తుత వ్యవస్థపై, తెగ బలిసిన వాల్‌స్ట్రీట్ కంపెనీలపై కోపంగా వున్నారు. తన ఉపన్యాసాలకై వారి దగ్గర్నుంచి డబ్బు పుచ్చుకున్న హిల్లరీ వారికి వ్యతిరేకంగా వ్యవహరించదని ప్రజల అనుమానం. ట్రంప్ ఐతే విరాళాలు ఎదురు చూడకుండా సొంత డబ్బుతోనే దిగాడు కాబట్టి కంపెనీలతో మొహమాటా లుండవనుకున్నారు.

లాటినోలు, ఆఫ్రో-అమెరికన్లు ఒబామాకు మద్దతిచ్చారు కాబట్టి, తను ఒబామా వారసత్వాన్ని కొనసాగిస్తానంటోంది కాబట్టి వాళ్లు తనకూ మద్దతిస్తారని హిల్లరీ అంచనా వేసింది. వాళ్లనే దువ్వింది. కానీ వాళ్లు గత స్థాయిలో మద్దతివ్వలేదు. తమ వాడైన ఒబామా అధ్యక్షుడిగా వున్నా నల్లవారిపై దాడులు జరుగుతున్నాయని వారు నిస్పృహ చెందారు. పైగా వాళ్లెక్కడ హిల్లరీని గెలిపిస్తారోనన్న భయంతో కింది స్థాయి శ్వేతజాతీయులు పెద్ద సంఖ్యలో పోలింగు బూతులకు తరలి వచ్చారు. ట్రంప్‌ను సమర్థించేవాళ్లు డిప్లోరబుల్స్ అని హిల్లరీ అనడం వాళ్లను మండించినట్లుంది. వీటన్నిటితో బాటు శ్వేతజాతీయత ప్రధానపాత్ర వహించింది. 1960ల్లో లిండన్ జాన్సన్ యితర దేశస్తులను అమెరికాకు ఆహ్వానించడం మొదలుపెట్టాక పరదేశీయులు తమ దేశానికి వచ్చి పడిపోతూ, బాగు పడిపోతూంటే తమ స్థితి నానాటికి తీసికట్టవడం శ్వేతజాతీయుణ్ని బాధించింది. పోయిన తమ ప్రతిష్ఠ తిరిగి రావాలంటే తమ దేశం యితర దేశాల్లో ఖర్చు పెట్టడం మానేసి, తన దేశంలోనే ఖర్చు పెట్టి పరిశ్రమలు తిరిగి రావాలని కోరుకోసాగారు. తమ ఉద్యోగాలు లాక్కుంటూ వున్న పరదేశస్తులపై నియంత్రణ వుండాలని భావించారు వారు. రాజకీయ అవసరాల కోసం అందరితో మెత్తగా వ్యవహరించే హిల్లరీ కంటె లౌక్యం లేకుండా ఉన్నదున్నట్టు చెప్పే ట్రంప్ వాళ్లకు నచ్చాడు. వ్యాపారవేత్తగా పనివారితో మసలినప్పుడు ట్రంప్ వారి మనోభావాలను బాగా గ్రహించి, వారి కోసమే నిలబడ్డానంటూ ప్రచారం చేసుకున్నాడు.

ఇవన్నీ సర్వే నిర్వాహకుల దృష్టికి వచ్చి వుండాలి. కానీ రాలేదు. ఎందుకంటే సర్వే నిర్వహణలో కూడా లోపాలున్నాయి. గతంలో అయితే కొన్ని కొన్ని నియోజకవర్గాలను ఎంచుకుని ర్యాండమ్ శాంపుల్స్ తీసుకుని లాండ్‌లైన్‌కు ఫోన్ చేసి కంప్యూటరు ద్వారా ప్రశ్నావళిని చదువుతూ అభిప్రాయాలు సేకరించేవారు. ఈ రోజుల్లో జనాలు లాండ్‌లైన్‌లు పెట్టుకోవడం మానేశారు. పెట్టుకున్నా ఫోను ఎత్తడం మానేశారు. అందువలన సెల్‌ఫోన్ల నుంచే చేయాలి. కంప్యూటర్ ద్వారా సెల్‌ఫోన్‌లు చేయడం చట్టవిరుద్ధం. ఎవరైనా వ్యక్తి యిదే పని మీద వుండి ఫోన్లు చేయాలంటే చాలా ఖర్చవుతుంది. అందుకని సులభమైన మార్గంగా ఇంటర్‌నెట్ ద్వారా అభిప్రాయాలు సేకరించసాగారు. అలా ఒక తరహా ఓటర్లనే చేరగలిగారు. పైగా వారందరూ ఒక ప్రాంతానికి, ఒక వర్గానికి చెందినవారేమో కూడా! పాత పద్ధతుల్లో అయితే ఫలానా ఆదాయపరిమితిలో వున్న గ్రామీణ రైతు, యింతకంటె ఎక్కువ సంపాదిస్తున్న నగరమహిళ.. యిలా వివిధ వర్గాల నుంచి శాంపుల్స్ ఏరుకునేవారు. ఈ సారి గ్రామీణ ఓటర్లను పట్టించుకోకపోవడంతో సర్వే ఫలితాలు తప్పాయి. "పాతాళభైరవి" సినిమాను పంపిణీదారులకు ప్రివ్యూ చూపిస్తే వాళ్లు పెదవి విరిచారు. ఆ విషయం నిర్మాతలు చెపితే దర్శకుడు కెవి రెడ్డి గారికి నిర్మాతలపై కోపం వచ్చింది. 'నా ప్రేక్షకులు నిశానీగాళ్లు. వాళ్లకు నచ్చితే చాలు, మధ్యలో యీ మేధావుల అభిప్రాయాలు నాకు అనవసరం' అని. సినిమా విడుదలయ్యాక విజయదుందుభి మోగించింది. అలా మిడిల్‌క్లాస్ మోరల్స్ వున్న ఓటర్లు ట్రంప్‌ను ఎంత యీసడిస్తూ పారేసినా అతని ఓటు బ్యాంకు అతన్నే అంటిపెట్టుకుని వుంది.

వీళ్లిద్దరికి వచ్చిన ఓట్లే కాక వీళ్లతో పాటు నిలబడిన లిబర్టేరియన్ పార్టీ అభ్యర్థి గారీ జాన్సన్ (3.3% ఓట్లు పడ్డాయి), గ్రీన్ పార్టీ అభ్యర్థి జిల్ స్టీన్ (1% ఓట్లు పడ్డాయి) కూడా వున్నారు. వాళ్లు పట్టుకుపోయే ఓట్ల వలన ఎవరు దెబ్బ తింటారో సర్వేలు వూహించలేక పోయాయి. 5 రాష్ట్రాలలో ట్రంప్ గెలుపు మార్జిన్ వీళ్లిద్దరికీ వచ్చిన వచ్చిన మొత్తం ఓట్ల కంటె తక్కువ వుంది. వీళ్ల ఓట్లు హిల్లరీకి కలిపి చూస్తే మిచిగన్, విస్కాన్సిన్‌లలో ఫలితాలు తారుమారయ్యేవి. పెన్సిల్వేనియాలో అయితే జాన్సన్ బరిలో లేకపోతే హిల్లరీ నెగ్గేది. అప్పుడు హిల్లరీకి మొత్తం మీద 278 ఓట్లు వచ్చి వుండేవి. కానీ అలా లెక్క వేయలేం. జాన్సన్ గోదాలో లేకపోతే అతని సమర్థకులు ఇంట్లో కూర్చునేవారేమో. నిజానికి చాలాసార్లుగా డెమోక్రాట్స్‌ను గెలిపిస్తూ వచ్చినవారు యీ సారి హిల్లరీ రాజకీయ కుటిలత తేటతెల్లమై, విసుగు చెంది, యింట్లో కూర్చున్నారు. ఇతర అభ్యర్థులకు 2012లో 1.25% ఓట్లు పడ్డాయి. ఈ సారి మూడున్నర రెట్లు ఎక్కువ పడ్డాయి. ఇది సర్వేలు లెక్కలకి తీసుకోలేక పోయాయి. ట్రంప్ మహిళా వ్యతిరేకి అని విపరీతంగా ప్రచారం జరగడంతో అతనికి ఓటేద్దామనుకున్న మహిళలు ఆ విషయాన్ని గట్టిగా చెప్పలేదు. ఎటూ తేల్చుకోలేదని చెప్పారు. మహిళలే కాదు, మగవారు కూడా తాము ట్రంప్‌కే ఓటేస్తామని ధైర్యంగా చెప్పలేదు. ఎందుకంటే అలా అయితే నువ్వు మైనారిటీ వ్యతిరేకి, శ్వేతజాతి అహంకారి అంటారేమోనని భయం. చేసేదేదో ఎవరికీ చెప్పకుండా చేద్దామనుకున్నారు. అక్టోబరు నెలాఖరు వరకు 11% మంది ఎటూ

తెల్చుకోలేదని చెప్పడంలోని మర్మాన్ని సర్వే నిర్వాహకులు గ్రహించలేకపోయారు. అందువలన కూడా వాళ్ల అంచనాలు తప్పాయి.

వలస వచ్చినవారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు కాబట్టి ట్రంప్‌కు వాళ్లెవరూ ఓటెయ్యరు అనుకోవడం సర్వేకారులు చేసిన పెద్ద పొరపాటు. వలస వచ్చినవారిలో రెండు గ్రూపులున్నాయి. అక్రమంగా వచ్చినవారు కొందరుంటే, చాలాకాలంగా వుంటూ ఉద్యోగాలు, నివాసాలు ఏర్పరచుకున్నవారు కొందరు. అక్రమంగా వచ్చినవారిని ఎవరూ సమర్థించలేరు. వాళ్లు సరైన పత్రాలు లేకుండా దేశంలో వుంటూ ఏ ప్రత్యక్ష పన్నూ కట్టకుండా ప్రభుత్వం తన ప్రజలకు సమకూర్చే సౌకర్యాలన్నీ – రోడ్లు, విద్యుత్, యిత్యాదివి – అనుభవించేస్తున్నారు. గతంలో అక్రమంగా వచ్చి పత్రాలు సంపాదించుకున్నవారు కూడా తమ తర్వాత వచ్చే అక్రమదారులను ప్రోత్సహించరు. సినిమా టిక్కెట్ల క్యూలో నిలబడినప్పుడు చూడండి, నా దాకా టిక్కెట్టు వస్తే చాలు, నా తర్వాతవాళ్లకి రాకపోయినా ఫర్వాలేదు అనుకుంటాం. ఒకసారి వలస సక్రమమై పోయి, అమెరికన్ పౌరుడైపోయాక అతనూ అమెరికన్‌లాగానే ఆలోచిస్తాడు – వీళ్లందరినీ ఎందుకు రానివ్వాలి? అని. ఒబామా హయాంలో అక్రమ వలసదారులు 2008 నుంచి ఐదేళ్లలో వలసదారులు 40% మంది పెరిగితే, 24 లక్షల మందిని వెనక్కి పంపేశాట్ట. 2014లో అమెరికాలోని అక్రమ, సక్రమ వలదారుల సంఖ్య 116 లక్షలు. వీరికి 3 లక్షల మంది పిల్లలు పుట్టారట. వీళ్ల జనాభా యిలా పెరిగిపోతూ వుంటే పౌరులకు బాధగా వుండదా?

వీసాల నియంత్రణ విషయానికి వస్తే 21వ శతాబ్దం వచ్చాక ఐటీ వాళ్లు వెళ్లడం ఉధృతమైంది కానీ అంతకు మూడు దశాబ్దాల నుంచి విద్యావంతులైన, వ్యాపారస్తులైన మన భారతీయులు అక్కడకు వెళ్లి బాగా సంపాదించుకుని స్థిరపడ్డారు. పౌరసత్వం సంపాదించుకుని, ఆస్తులు కూడగట్టి, ఓహో అనుకునే స్థాయిలో వున్నారు. ఎచ్1బి వీసాలు తగ్గించడం వలన వాళ్లు నష్టపోయేదీ ఏమీ లేదు, యిబ్బందీ లేదు – కొత్తగా వెళదామనుకున్నవారికి తప్ప! మన వూరి నుంచి ఇంకా బోల్డు మంది యిక్కడకు వచ్చేసి, దండిగా సంపాదించేసుకుని, నాతో సమానస్థాయిని చేరుకోవాలి అని ఎవరూ అనుకోరు. ఒక టిపికల్ అమెరికన్ లాగానే వాళ్లూ 'వీళ్లందరూ ఊహూ వచ్చి పడాల్సిన అవసరం ఏముంది?' అని ఆలోచిస్తారు. గతంలో నేను చెప్పిన రైల్వే కంపార్ట్‌మెంటాలిటీ థియరీని కొందరు ఆమోదించలేదు. కానీ అది యిక్కడ వర్తిస్తుందని నా గట్టి నమ్మకం. ఆసియన్లు కూడా ట్రంప్‌కు బాగానే ఓటేశారని ఫలితాలు చెప్తున్నాయి. హిల్లరీ కుడిభుజమైన హ్యూమా అబెదిన్ పాకిస్తానీ కావడంతో ఇండియన్లు కొందరు హిల్లరీకి దూరంగా జరిగారనే వాదన కూడా నిజం కావచ్చు. హ్యూమా తండ్రి భారత ముస్లిం అని కొందరంటున్నారు కానీ అతను అవిభక్త భారతదేశంలోని ముస్లిము. అలా లెక్కేస్తే భుట్టో కూడా భారత ముస్లిం అవుతాడు. హిల్లరీ పాక్ పక్షపాతి అని ముందే తెలుసు. ట్రంప్ ముస్లిం వ్యతిరేకిగా కనబడ్డాడు కాబట్టి పాక్‌ను పక్కన పడేసి మనను చంకెక్కించుకుంటాడని కొందరు భావించారేమో కూడా తెలియదు.

హిల్లరీ ఓటమికి ముఖ్యమైన మరో కారణం – ఒబామా కేర్ ! ఒబామా హయాంలో పెట్టిన ఎఫోర్డబుల్ కేర్ యాక్ట్, 2010 ద్వారా పెట్టిన ఒబామాకేర్ ద్వారా ఉద్యోగం ద్వారా హెల్త్ ఇన్సూరెన్సు పొందలేని రెండు కోట్ల మందికి ఆరోగ్య బీమా కలిగిస్తుంది. అయితే దీని ప్రీమియం నానాటికీ పెరుగుతూ పోతూ వుందని ట్రంప్ ప్రచారం ప్రారంభించిన దగ్గర్నుంచి వాదిస్తున్నాడు. హిల్లరీ దీన్ని ప్రవేశ పెట్టడంలో తన పాత్ర వుందని చెప్పుకుంటూ, దీనివలన ఆఫ్రో–అమెరికన్, లాటినో పనివారికి ఎంతో మేలు కలుగుతోందని, వలన చాలామంది మైనారిటీలు లాభపడ్డారని చెపుతూ సమర్థిస్తూ వస్తోంది. రేట్లు పెరుగుతున్నాయి కాబట్టి రాష్ట్రాలు కూడా కొంత భారాన్ని వహించాలని ప్రతిపాదించింది. ట్రంప్ దీన్ని తీసేసి, దీని స్థానంలో జాతీయ స్థాయిలో పోటీదార్లను ప్రవేశపెట్టి రేట్లు తగ్గించేట్లా చూస్తానంటున్నాడు. ఈ చర్చ సాగుతూండగానే 2017 సంవత్సరానికై బెంచ్‌మార్క్ ప్రీమియాన్ని 22% పెంచింది ఒబామా ప్రభుత్వం. దీని వలన ఆదాయ పరిమితి దాటడం చేత ప్రభుత్వ సబ్సిడీ పొందలేని 70 లక్షల మంది తీవ్రంగా నష్టపోయారు. వీళ్లందరికీ ఒబామా కేర్ వలన లాభం కంటె నష్టమని తోచింది. స్కీము తీసేస్తానన్న ట్రంప్‌ను సమర్థించారు. (గెలిచాక ట్రంప్ తనను కలిసినప్పుడు ఒబామా యీ స్కీము కొనసాగించమని ట్రంప్‌ను కోరాడట. అందువలన సాంతం ఎత్తివేయకుండా మార్పులు చేసే ఉద్దేశంలో వున్నాడట ట్రంప్. అప్పటికే వున్న వ్యాధిని కవర్ చేయడం, పిల్లలకు 26 ఏళ్లు వచ్చేవరకు తలితండ్రుల పాలసీపై కవర్ కావడం అనేవి కొనసాగించవచ్చు) ప్రీమియం పెంపు హిల్లరీ విజయావకాశాలను దెబ్బ తీస్తుందని కూడా పాత్రికేయులు వూహించలేకపోవడం విడ్డూరం. ఇలా ఎన్నో విషయాలు ముందే వూహించలేకపోవడం అమెరికన్ మీడియా లోపం. అందుకే హిల్లరీతో బాటు సర్వేకారులు కూడా ఓడారని చెప్పాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 21-24** **ఎమ్బీయస్ : పెద్ద నోట్ల రద్దు – ఓ పెద్ద ఫ్లాప్ షో**

బాపుగారి కార్టూన్ వుంది. భార్యాభర్తలు సినిమాహాల్లోంచి షో తర్వాత లేచి వచ్చేస్తూంటారు. భార్య అంటుంది – 'ఇంతటి అవకతవక కంగాళీ సినిమా నా జన్మలో చూళ్లేదు' అని. తెరపై 'శుభం' అని బదులు 'భశుం' అని వుంటుంది. అంటే చివరికి ఓ రెండు అక్షరాలు కూడా సరిగ్గా రాయలేకపోయారన్నమాట సినిమా తీసినవాళ్లు. నాకూ అనబుద్ధవుతోంది – పుట్టి బుద్దెరిగాక ఏ ప్రభుత్వపథకమూ యింత అవకతవకగా, అస్తవ్యస్తంగా, అసంబద్ధంగా, కంగాళీగా అమలు కావడం చూడలేదని! ఇదో భశుం అని గట్టిగా చెప్పబోతే అయితే నువ్వు నల్లకుబేరుడివన్నమాట, పాక్ టెర్రరిస్టుకు వత్తాసు పలికే దేశద్రోహివన్నమాట అనేస్తున్నారు. అదేమీ

కాదు మొర్రో అంటే 'కొద్దిపాటి కష్టానికైనా ఓర్చుకోలేక పోతే ఎలా? సంస్కరణలన్నాక కొందరు అవస్థలు పడాలి' అని కూకలేస్తున్నారు. నిజమే సంస్కరణలు చేపట్టినపుడు నిజాయితీపరులకు కూడా యిబ్బంది కలుగుతుంది. అంతిమంగా సమాజానికి మేలు కలుగుతుందంటే తన వ్యక్తిగత కష్టం ఏపాటిదిలే అనుకుంటాడు అతడు. కానీ మేలు ఎప్పటికైనా కలుగుతుందా అనేదే ప్రశ్న.

సంస్కరణల్లో నిజాయితీ వుంటోందా?

భూసంస్కరణలప్పుడు చూశాం. కష్టపడి సంపాదించిన భూమి కూడా పరిమితికి మించి వుంది అని ప్రభుత్వం లాగేసుకుంటే కొందరు బిత్తరపోయారు. పక్కింటి మోతుబరులు బినామీల పేర పెట్టి తప్పించుకున్నపుడు విస్తుపోయారు. ఇప్పటికీ తమ పేర వందల ఎకరాలున్నాయని చెప్పుకునేవాళ్లు కనబడుతున్నారు. పరిమితి చట్టం వుండగా ఎలా సాధ్యం? అలాగే పట్టణ భూపరిమితి, అర్బన్ లాండ్ సీలింగ్ (యుఎల్‌సి) చట్టం. లిమిటు కంటె ఎక్కువ వుంటే అప్పచెప్పేయాలన్నారు. కొందరు అప్పచెప్పారు. కొందరు వుంచేసుకున్నారు. ఇప్పటికీ యుఎల్‌సి కేసులు నడుస్తూనే వున్నాయి. ఒక్కో ముఖ్యమంత్రి పదవి దిగిపోతూ కొందరికి మినహాయింపులు దయచేయిస్తాడు. పెంట్‌హౌస్ కట్టడం చట్టవిరుద్ధం, కార్పోరేషన్ కిచ్చిన ప్లాన్ కాస్తయినా మార్చి కట్టడం తప్పు, అదనపు ఫ్లోర్ వేయడం అక్రమం.. అని భయపడుతూ మనం బిక్కుబిక్కుమంటూ రూల్సు పాటిస్తాం. అవేమీ పట్టించుకోనివాడు మనల్ని చూసి నవ్వుతాడు. కట్టిపారేస్తాడు. 'ఎప్పుడో ఒకసారి బిల్డింగ్ రెగ్యులరైజేషన్ పేరు చెప్పి డబ్బు తీసుకుని యివన్నీ సక్రమం చేసి పారేస్తుంది ప్రభుత్వం' అంటాడు. అలా కాకుండా పడగొట్టేస్తే...? అని మన సందేహం. మనం కట్టం, వాడు కడతాడు. తర్వాత ప్రభుత్వం వాడి పక్షానే నిలుస్తుంది. వాడు మనల్ని చూసి హేళన చేస్తాడు.

మనం యిన్‌కమ్‌టాక్స్ భయపడుతూ కట్టేస్తాం. ఎవడ్కిటనా బ్లాక్‌లో డబ్బివ్వాలంటే మన దగ్గరది వైటే కాబట్టి అదే యివ్వగలుగుతాం. పెత్తందారులు పన్ను కట్టరు. వాళ్ల దగ్గర నల్లధనం మేట వేసుకుని పోయినప్పుడు ప్రభుత్వమే వాలంటరీ డిస్‌క్లోజర్ స్కీము అని పెట్టి దొంగలూ దొంగలూ వూళ్లు పంచుకున్నట్లు అక్రమధనాన్ని ప్రభుత్వమూ, బ్లాక్‌మనీదారు పంచుకుంటారు. మా బాగా అయింది, 40% పన్ను కట్టాట్ట అని మనం చంకలు గుద్దుకుంటాం. సక్రమంగా సకాలానికి కట్టి వుంటే దానిపై కట్టే పన్ను యింకా చాలా ఎక్కువ వుంటుంది. ఆ నాటి ధరలతో పోలిస్తే యీనాడు వాడు కట్టేది బహు తక్కువ అని మనం గ్రహించం. ఏ యేడాది కా యేడాది మనమే వాడి కంటె ఎన్నో రెట్లు ఎక్కువ కట్టి వుంటాం. అక్రమమైతే కూల్చిపారేస్తారు, జైల్లో పెట్టి మొత్తం డబ్బు లాగేసుకుంటారు అనే భయం వుంటే యిలాటివి జరగవు. కూల్చడం మొదలుపెట్టగానే కోర్టు ఆపుతుంది, లేకపోతే ఎమ్మెల్యేలు వచ్చి నిరాహారదీక్ష చేస్తారు. బ్లాక్‌మనీ దారులైతే ప్రభుత్వం 'కనబడుటలేదు' ప్రకటనల్లో రాసే పద్ధతిలో 'నాయనా, రమ్ము, నిన్ను ఏమియూ అనము, మీ పేరు బయటపెట్టము' అని హామీ యిచ్చి కాపాడుతుంది. మనం మాత్రం జస్ట్ 2 వేలు ఎక్స్‌ఛేంజ్ చేయాలంటే ఆధార్ కార్డు జిరాక్స్ యివ్వాలి, వేలి మీద చుక్క పెట్టించుకోవాలి!

ఆపరేషన్ మొదలుపెట్టేముందు సరంజామా రెడీగా పెట్టుకున్నారా?

మోదీ ఏం చేసినా అది అద్భుతమే అని నమ్మి, మనను నమ్మించాలని చూసేవారు 'ఇది చాలా పెద్ద ఆపరేషన్, 70 ఏళ్లగా ఎవరూ సీరియస్‌గా చేయని (?) పని మోదీ తలపెట్టాడు. కొన్ని రోజులు బాధకు తట్టుకోవాలి' అని చెప్తున్నారు. నిజమే, ఆపరేషన్ అన్నాక బాధ వుంటుంది, ఓర్చుకోవాలి. కానీ ఆపరేషన్ చేసేముందు కత్తీ, కఠార్ల పదునూ, వాటి స్టెరిలైజేషన్, జరిగే సమయంలో సరైన డోసులో మత్తుమందు, రక్తసరఫరా ఆగిపోకుండా చూడడానికి సపోర్టు ఎక్విప్‌మెంట్, జరిగాక యిన్‌ఫెక్షన్ సోకి రోగం ముదరపెట్టకుండా, యింకో రోగంపాల బడకుండా అవసరమైన మందులు... యివన్నీ చూసుకుని కదా ఆపరేషన్ మొదలుపెట్టాలి. ఈ రద్దు ఆపరేషన్‌లో అలాటివి ఏవీ పట్టించుకోకుండా రంగంలోకి దిగిపోయారని తేటతెల్లమౌతోంది. లేకపోతే రోజుకో క్లారిఫికేషన్ రాదు.

ఆపరేషన్ చేస్తూ చేస్తూ మధ్యలో డాక్టరు గారు పుస్తకం రిఫర్ చేసుకుంటూ, తల గోక్కుని 'ఇది కాదండి పద్ధతి. నిలువుగా కాదు కానీ, అడ్డంగా గాటు పెట్టి చూస్తాను, ఏమౌతుందో చూదాం' అంటే రోగి కెలా వుంటుందో వూహించండి. సాధారణంగా అధికారులు స్కీము ప్రకటించినపుడు దాన్ని విఫలం చేయడానికి జరిగే ప్రయత్నాలను ముందే వూహించి సకల జాగ్రత్తలు తీసుకుని ఒక్కసారే ప్రకటిస్తారు. ఇది ఉపాధి దొరకని వారి కోసం పెట్టిన నరేగా స్కీము వంటిది కాదు. బ్లాక్‌మనీ వున్నవారికోసం పెట్టినది. వారికి పన్నులు ఎగగొట్టడం ఎలాగో చెప్పడానికి గండరగండలైన ఆడిటర్లు అండగా వుంటారు. పథకంలో బెజ్జాలు ఎక్కడున్నాయో కనిపెట్టి వాటిని కంతలుగా, పెద్ద కన్నాలుగా ఎలా చేయాలో నేర్పుతారు. ఇప్పటికే వాట్సప్‌లో అలాటి సలహాలు ఉచితంగా వ్యాప్తి చేస్తున్నారు. దీన్ని అధికారులు వూహించలేదా? అన్న సందేహం వస్తుంది. పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందే వాళ్లు ఎన్నో పనులు చేసి వుండాలి. చేశారా? చేయకపోతే ఎందుకు చేయలేదు? ఎవరు చేయనీయలేదు? అనేవే ప్రశ్నలు.

క్యూలు తగ్గించాలంటే మార్పిడి పరిమితి పెంచాలా? తగ్గించాలా?

చదువురాని వాడి దగ్గర్నుంచి ఎత్తి చూపుతున్న ప్రధానలోపం – వంద, ఏభై నోట్లు దండిగా ముందే ముద్రించి వుండాల్సింది. ఇప్పుడు బ్యాంకుల్లోనే వందలు లేవు. బ్యాంకులంటే డబ్బు రొటేషన్ చేస్తాయి తప్ప వందలు పుట్టించలేవు కదా. ఖాతాల్లో డబ్బు జమ

చేసేవాళ్లందరూ 500, 1000 కడుతున్నారు తప్ప 100, 50 యింట్లోనే దాచుకుంటున్నారు. అందువలన బ్యాంకుల వద్ద వందలుండటం లేదు. కొన్ని బ్యాంకుల్లో ఖాతాదారులకు తప్ప తక్కినవాళ్లకు మార్చమంటున్నారు. రూలు ప్రకారం అలా అనకూడదు. అయినా క్షేత్రస్థాయిలో వుంటున్న యిబ్బందులివి. మరి కొన్ని బ్యాంకుల్లో ఎక్స్‌ఛేంజ్ చేస్తే 4500 యిస్తామని అన్నారు కానీ, వందలై పోతే అబ్బే 4 వేలే అంటూ, 2000 రూ.ల నోట్లు రెండిచ్చి పొమ్మంటున్నారు. రిజర్వ్ బ్యాంకు నుంచి సకాలంలో కొత్త నోట్లు రాకపోవడంతో ("ఈనాడు" వార్త) కాబోలు మారకం పరిమితిని యిప్పుడు 2 వేలకు తగ్గించారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి క్యూలు తగ్గిద్దామని తగ్గించాం అని చెప్తున్నారు శక్తికాంత దాస్. తాడిచెట్టు ఎందుకెక్కావురా అంటే దూడగడ్డి కోసం అన్నట్టుంది. 4 వేలు మార్చుకుందామంటే రెండు రెట్లు ఎక్కువ సార్లు నిల్చోవాలి. అప్పుడు క్యూలు పెరుగుతాయా, తగ్గుతాయా? క్యూలు తగ్గాక వెళ్లి మార్చుకుందామని ఆగినవాళ్ల నెత్తిన పిడుగు వేశారు – డిసెంబరు 30 లోగా ఒక్కసారి మాత్రమే వెళ్లి 2 వేలు మాత్రమే మార్చుకోగలరని! పాత నోట్లు చెల్లవు, కొత్త నోట్లు చేతి కందవు. చేతి కందినవాటిపై కూడా పెన్సిల్ గీతలుంటే చెల్లవట. ఇక ఎలా బతకాలి?

మొదట్లో ఆధార్ కార్డు జిరాక్సు యిస్తే కొత్తనోట్లు యిస్తామన్నారు. ఇప్పుడు కార్డు చూపితే చాలంటున్నారు. అంటూనే మళ్లీమళ్లీ వస్తున్న వ్యక్తులను గుర్తించడానికి వేలి మీద యింకు చుక్క పద్ధతి పెట్టారు. సరే, యింకు ఇంకు చ్కు పెట్టడానికై బ్యాంకు స్టాఫ్ హఠాత్తుగా పెరగరు కదా. ఎన్నికల బూతులో అయితే చుక్కలు పెట్టేదానికి ఒక వ్యక్తి ప్రత్యేకంగా కూర్చుంటాడు. బ్యాంకులో వేరేగా ఎవరినైనా కూర్చోపెట్టేటంత స్టాఫ్ కుషన్ వుంటుందా? డబ్బిచ్చే అతనే పెడుతూ కూర్చుంటే ఆలస్యమై పోయి, క్యూ మరింత పెరగదా? నోట్ల మార్పిడికి అదే మనుష్యులు మళ్లీమళ్లీ వస్తారని ముందెందుకు వూహించలేదు? ఈ వారం రోజుల పాటు కొంతమందికి నల్లధనం మార్చుకునే వెసులుబాటు మీరే కల్పించారు కదా. సరే చచ్చిచెడి నిల్చుంటే డిసెంబరు 30 లోగా మీ చేతికి వచ్చేది 2 వేల నోటు ఒక్కటే. చిల్లర యివ్వటం లేదు. ఆ నోటుతో మీరేం కొనగలరు? కొనాలంటే అవతలివాడి వద్ద పాత వందలు వుండాలి. ఒకటో రెండో వున్నా ఎంతమందికి యివ్వగలడు? అందుచేత ఆ నోటు చేతిలో వున్నా ఎందుకూ ఉపయోగపడటం లేదు.

వెలిసిపోయే 2 వేల నోటు, యిప్పట్లో వెలియని వెయ్యి నోటు

అసలు 2 వేల నోటు తయారీ విషయంలో కూడా కంగాళీతనం కనబడుతోంది. రంగు వూరిపోయే, వెలిసిపోయే నోటెవరైనా ప్రవేశపెడతారా? ప్రపంచంలో అలాటి నోటు వుంటుందనుకోను. వర్షాకాలంలో ఆ నోటు కారణంగా జేబు ఖరాబు, దానితో బాటు పెట్టిన నోట్లకు రంగు అలుముకుంటుంది. నోటు విడుదల చేసేటప్పుడే ఆర్‌బిఐ వారు యీ ముక్క చెప్పాల్సింది. జనాలు గగ్గోలు పడ్డాక చెప్పడమేమిటి? నా అనుమానం మామూలుది తయారుచేస్తే, నాణ్యత లోపించి అది యిలా తయారైందని. గొడవయ్యాక పొరపాటు గుర్తించి, కావాలనే అలా చేశాం అని బుకాయిస్తున్నారేమో!

కొత్త 500, 1000 నోట్లు ప్రవేశపెడతామన్నవారు గురువారం వచ్చేసరికి కొత్త వెయ్యి నోట్లు వుండవు అని చెప్తున్నారు. 500 యిప్పటిదాకా రాలేదు. కొత్త నోట్లు తయారు కావాలంటే 3,4 నెలల కసరత్తు చేయాలి కదా. వెయ్యి నోట్ల విషయంలో చేయలేదా? చేయకపోతే మరి విడుదల చేస్తామని వారం కితం ఎందుకు చెప్పారు? ప్లానింగూ, పాడూ లేదా? లేకపోతే 2 వేల నోటులా దానికి ఆల్‌రెడీ డూప్లికేటు నోటు తయారై పోతే, ఆ విషయం తెలిసి దీన్ని విత్‌హోల్డ్ చేశారా?

ఎనీ టైమ్ నో–మనీలు

ఎటిఎంలలో ట్రేల పరిమాణం పెంచి 100లు అలవాటు చేసి వుండాల్సింది. 30% ఎటిఎంలు పని చేయడం లేదని, పదేళ్ల కోసారి మార్చవలసిన ఎటిఎంలను మార్చకపోవడం వలన క్యాష్ డెలివరీ చాలా ఆలస్యమౌతోందని ఏడాది క్రితమే రిజర్వ్ బ్యాంకు అన్ని బ్యాంకులను హెచ్చరించిందట. ఈ ఆపరేషన్ ద్వారా నల్లధనాన్ని సాధ్యమైనంత మొత్తంలో బ్యాంకింగ్ సిస్టమ్‌లోకి తెచ్చేద్దామని కదా ప్రయత్నం. ఒకసారి లోపలికి వెళ్లినది బయటకు ఎలా వస్తుంది? బ్యాంకులు బ్రాంచ్‌లు పెంచలేవు కదా, స్టాఫ్‌ను హఠాత్తుగా పెంచలేవు కదా. ఎటిఎంల ద్వారానే మళ్లీ డబ్బు ప్రజల్లోకి రావాలి. బ్యాంకులు మరిన్ని ఎటిఎంలను నెలకొల్పడం ద్వారానే అది సాధ్యం. ఉన్నవాటిల్లోనే మూడోవంతు పనిచేయకుండా వున్న పరిస్థితిని చక్కదిద్దకుండా యీ స్కీము ఎలా పెట్టారు? పైగా ఎటిఎంలు పెద్ద నోట్లే యిస్తూ వచ్చాయి. 500 స్థానంలో 100 నోట్లు యివ్వాలంటే లోపల వున్న ట్రే సైజు అయిదు రెట్లు ఎక్కువ వుండాలి. లేకపోతే ఐదో వంతు సమయంలోనే అది ఖాళీ అయిపోతుంది. అదే జరుగుతోంది. పోలింగు రోజున ఇవిఎం (ఓట్ల లెక్కింపు యంత్రాలు)ల లాగానే ఎటిఎంలు మొరాయిస్తున్నాయి. రోజులో చాలాభాగం ఎటిఎం క్యూలలో గడిచిపోతోందని జనం మొత్తుకుంటున్నారు. దాన్లోంచి తీసే మొత్తాన్ని 18 వ తారీకు నుంచి రెట్టింపు చేస్తామన్నారు. కానీ చేయలేమని నాలుగు రోజుల ముందే చేతులెత్తేశారు. ఇదీ మరో ప్లానింగ్ వైఫల్యం. దీనిపై "ది హిందూ"లో సురేంద్ర వేసిన కార్టూన్‌ను వారి సౌజన్యంతో పక్కన యిస్తున్నాను.

కొత్త 2 వేల నోటు పట్టేట్టు ఎటిఎమ్‌లను మారుస్తున్నారట. దేశంలో మొత్తం 2 లక్షల ఎటిఎంలు వుంటే గురువారం నాటికి 22,500 ఎటిఎంలను సంస్కరించారట. అంటే 11% అన్నమాట. పెట్రోలు బంకుల్లో స్టేటు బ్యాంకు పాయింట్ ఆఫ్ సేల్ మెషిన్లు వుంటే అక్కడ 2 వేలు విత్‌డ్రా చేయవచ్చని చెప్తున్నారు. అవి 2500 వున్నాయట. అంటే యింకో 0.12% చేర్చాలన్నమాట. మరి

తక్కిన 88.88% ఎటిఎంలను మార్చేలోపున జనం వెతలు ఎవరు తీరుస్తారు? ఎటిఎం చార్జిలు ఎప్పటికీ ఎత్తేశాం అంటేనే ప్రజలు బ్యాంకుల్లో డబ్బులు వేసుకోవడం అలవాటు చేసుకుంటారు. ప్రస్తుతానికి చార్జి లేదంటున్నారంతే.

బ్యాంకు విత్‌డ్రాయల్స్

బ్యాంకులో డబ్బు వేసుకుని, కావలసి వచ్చినపుడు తీసుకోవడం ఖాతాదారు హక్కు. అది అతని డబ్బు. బ్యాంకునుంచి ఋణంగా తీసుకున్నది కాదు. ఎటిఎంలలోనైతే డబ్బు ముందుగానే పెట్టాలి కాబట్టి పరిమితి పెట్టవచ్చు. అలాగే క్యాష్ రిజర్వ్ ఎక్కువగా పెట్టుకోలేని గ్రామీణ బ్రాంచీల్లో అయితే కూడా డబ్బు తీసేదానికి పరిమితి పెడతారు. అది కూడా లక్షల్లో వుంటుంది. చిన్న పోస్టాఫీసు ఖాతాల్లోంచి అయితే డబ్బు తీయాలంటే, ఎవరైనా మనియార్డర్ కట్టేదాకా ఆగాల్సి వచ్చేది. ఇప్పుడు మామూలు బ్యాంకు బ్రాంచీల్లోంచి డబ్బు తీయడంపై పరిమితి పెడుతున్నారు. ఇది బ్యాంకింగ్ రూలు ప్రకారం చెల్లుతోందో లేదో నాకు డౌటు. వారానికి 10 వేలని మొదలుపెట్టారు. అప్పు అడిగితే ఎందుకోసం అని బ్యాంకు వాళ్లు అడిగినా అర్థముంది. దీర్ఘకాలం వుంచుతానని మాట యిచ్చిన ఫిక్సెడ్ డిపాజిట్ ముందుగా మూసేస్తూ వుంటే అడిగినా ఫర్వాలేదు. సేవింగ్స్ ఖాతాలో నేను దాచుకున్న నా డబ్బును ఎందుకు తీస్తున్నానో, ఎలా ఖర్చు పెడుతున్నానో బాంకుకు చెప్పాలా?

వారానికి 10 వేలు నగదు మాత్రమే ఖర్చు పెట్టాలని మీరెలా చెప్తారు? నా ఖర్చులు నావి. కమ్యూనిస్టు రాజ్యాల్లో కూడా యీ రూలుండదనుకుంటా. పెళ్లిళ్లకు 2.5 లక్షలు తీసుకోవచ్చట. అయినా పెళ్లికొడుకు, పెళ్లికూతురు యిరుపక్షాలు కలిపి ఖర్చు పెట్టాల్సిన మొత్తం 2.5 లక్షలా? దాన్లో పెళ్లి అయిపోతుందా? నిన్ననే నమస్తే తెలంగాణ సిఎండి గారింట్లో పెళ్లి టీవీలో చూపించారు. ఆ అట్టహాసం చూస్తే యీ రూల్సన్నీ సామాన్యులకు తప్ప పెద్ద తలకాయలకు కావనీ, వాళ్లకు జరిగేవన్నీ జరుగుతూనే వున్నాయని అర్థమౌతుంది. వ్యవసాయ కమిటీ వద్ద నమోదు చేసుకున్న వ్యవసాయదారుడికి కూలీల కోసం వారానికి 50 వేలు తీసుకోవచ్చట. రైతులకైతే వారానికి 25 వేలు, పంట అమ్మకాల సొమ్ము చెక్కు ద్వారా వచ్చి వుంటే మరో 25 వేలు తీసుకోవచ్చట. కూలీల కోసం, లేదా ఖర్చుల కోసం అని ఉత్తరాలు రాసి యిస్తారా? అవన్నీ బ్యాంకువాళ్లు దాచి ఇన్‌కమ్ టాక్స్ వాళ్లకు అప్పగిస్తారా?

వెసులుబాట్లు, నియంత్రణలు ముందే ఎందుకాలోచించలేదు?

ఇవన్నీ వెసులుబాట్లు అనుకుంటే యివి ఎప్పుడో పెట్టాల్సింది, జనాలు గగ్గోలు పెట్టాక కాదు. టోల్‌గేట్ వసూళ్లు వసూలు చేయించారు, ఓ రోజు గడిపాక కొన్నాళ్లు ఆపారు, ఫ్రీ అంటూ గడువు పొడిగించారు. ఏమిటీ గందరగోళం? టోల్‌గేట్‌లకు యిన్నాళ్లూ వసూళ్లు పోయాయి కదా, వారి నష్టం ఎవరు పూరిస్తారు? పాట పాడుకున్న కాంట్రాక్టర్లకు అదనంగా మరో నెల్లాళ్లు వసూలు చేసుకోండి అని చెప్తారా? అతను నెల అయిన తర్వాత ఆపేస్తాడా? దాన్ని ఎవరైనా పర్యవేక్షిస్తారా? ఇప్పటికే కాలం తీరిన టోల్‌గేట్ల వద్ద తోలు తీస్తున్నారని రిపోర్టులున్నాయి. ఇవి వేరే విషయాలనుకున్నా, టోల్ గేటు వసూళ్ల దెబ్బ తింటే అంతిమంగా ప్రభుత్వానికే నష్టం కదా!

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలని సామెత. అందర్నీ గడగడలాడించగలిగిన ఆదాయపుపన్ను అధికారుల కళ్లు గప్పి నల్లధనం పోగేసుకున్నవారు కోటి కాకపోయినా పదో, పాతికో ఉపాయాలు ఉపయోగిస్తారని ఆర్థికశాఖ అధికారులు వూహించలేకపోయారా? రైల్వే, బస్సు టిక్కెట్ల వద్ద పాత నోట్లు చెల్లుతాయి అనగానే అందరూ కౌంటర్ల వద్దకు వెళ్లి పాత నోట్లతో ఫస్ట్ క్లాస్ ఎసి టిక్కెట్లు బుక్ చేయడం, మర్నాడు కాన్సిల్ చేసి కొత్త నోట్లు తీసుకోవడం. ఇలా వారం రోజులు జరిగాక తిరిగి యిచ్చేటప్పుడు ఖాతాల్లో వేస్తాం అన్నారు. ఈ పని మొదటి రోజునుంచే చేసి వుండాల్సింది కదా. జన్‌ధన్ యోజనా ఖాతాల్లో డబ్బు వెల్లువెత్తుతుందని ఎవరైనా వూహించవచ్చు. అలాగే జరిగింది కూడా. అలా ఓ ఐదారు రోజులయ్యాక, అప్పుడు 50 వేలకు మించి కూడదని పరిమితి పెట్టారు. అదీ ముందుగానే పెట్టాల్సింది. బంగారం విషయంలో కూడా నియంత్రణ ఆలస్యంగా వచ్చింది. మనీ లాండరింగ్‌కు సహకరించిన ట్రస్టులకు నోటీసులు యిస్తామంటున్నారు. ముందే నిఘా వేసి వుండాల్సింది. జరిగాక యిప్పుడు యిస్తే 'అప్పుడే ఎలా యిస్తారు? ఫైనాన్షియల్ ఇయర్ పూర్తి కాలేదు, రిటర్న్స్ సబ్మిట్ చేయలేదు' అంటారు వాళ్లు.

రెండున్నర లక్షల దాకా అనుమతించడానికి లాజిక్కేమిటి?

సొంత ఖాతాల్లోకి ఎంతయినా వేసుకోవచ్చు అన్నపుడు వైట్ మనీ మాత్రమే రావాలి. అయితే బ్లాక్‌మనీ దాచుకున్నవాళ్లపై ప్రభుత్వానికి హఠాత్తుగా జాలి పుట్టింది. లెక్కల్లో చూపని 2.50 లక్షల డబ్బు తమ ఖాతాల్లో వేసుకున్నా ఏమీ అనం అన్నారు. రైతులు, ఇల్లాళ్లూ అని చెప్పుకుంటే చాలు ఏ ప్రశ్నా వేయం అన్నారు. మన దేశంలో ప్రతి మహిళా యిల్లాల్ని అని చెప్పుకోవచ్చు. నూటికి 90 మంది రైతులమని చెప్పుకోవచ్చు. బ్యాంకు క్యాషియర్ మీ పత్రాలు యివ్వండి అని అడగడు కదా. రైతులు బతికే పరిస్థితి లేదంటున్నారు. ఋణమాఫీ చేయమంటున్నారు. వాళ్ల దగ్గర రెండున్నర లక్షల డబ్బు కుప్పపోసి వుంటుందా? వచ్చినదంతా మా ఆయన తాగేశాడు. మాకు తెల్లకార్డు యివ్వండి, గులాబీ కార్డు యివ్వండి, యిళ్లు కట్టించి యివ్వండి అనే యిల్లాళ్లూ వున్నారు. వీళ్ల దగ్గరా అంత డబ్బుంటుందా?

వీళ్ల పేరు చెప్పి బ్లాక్‌మనీ వైట్ చేసుకోసాగారు. ఏ పేరు చెప్పి ఎవరెవరి పేర డిపాజిట్లు వేసి తప్పించుకోవచ్చో ఆడిటర్లు యిచ్చిన సలహాలు వాట్సప్‌లలో వీరవిహారం చేస్తున్నాయి. వీటికి తోడు జన్‌ధన్ ఖాతాల్లో కూడా వచ్చిపడడంతో బ్యాంకుల్లో డిపాజిట్లు ముంచెత్తాయి. ఇంత డబ్బు వచ్చిపడితే బాంకుల వాళ్లు ఏం చేసుకుంటారు? సరైనవాడికి ఎవరికైనా అప్పిచ్చి వడ్డీ గడిస్తేనే మన డిపాజిట్ల మీద వడ్డీ యివ్వగలరు. నిజాయితీ గలవాళ్లు కనబడకపోతే అప్పులు యివ్వడం ఎలా? అందువలన బ్యాంకులు డిపాజిట్ల పై వడ్డీ రేట్లు తగ్గించేశారు. డిసెంబరు 30 (గడువు పెంచకుండా వుంటే) చివరకు బాంకు వడ్డీలు ఎంత కిందకు వచ్చి చేరతాయో చూడాలి. సామాన్యుడు రేపటికోసం డబ్బు దాచుకోవడానికి బాంకులే శరణు. అవి కూడా యిప్పుడు మరో చెంపదెబ్బ కొడుతున్నాయి.

మనీ లాండరింగ్ జరుగుతోంది

నిజానికి బాంకుల ఎదుట క్యూలు కట్టే సామాన్యుడు అవస్థల పాలవుతున్నాడు. కానీ మనీ లాండరింగ్ చేసే దారులు మాత్రం తెరిచే వున్నాయని అర్థమౌతోంది. నా వద్ద న్యూస్ పేపరు బాయ్ కూడా పాత నోట్లు తీసుకున్నాడు. కిరాణా షాపు వాళ్లూ తీసుకుంటున్నారు. రౌండ్ ఆఫ్ చేసేట్లా వస్తువులు తీసుకోండి, చిల్లర అడక్కండి అంటున్నారంతే. బేరం వదులుకోవడం యిష్టం లేని యితర వ్యాపారస్తులూ తీసుకుంటున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లోనూ తీసుకుంటున్నారు. ఎలా ఎన్‌క్యాష్ చేస్తారని అడిగితే ఏమో సార్, ఆడిటరుగారు చెప్తారట అంటున్నారు. మరీ విపులంగా అడిగితే తీసుకోనంటాడేమోనని భయం. బహుశా అక్టోబరులోనే ట్రాన్సాక్షన్ జరిగినట్లు చూపిస్తారేమో. బ్యాంకులకైతే ఏ రోజు ఎక్కవుంట్లు ఆ రోజు ఆఖరికి క్లోజ్ చేయాలి. ప్రయివేటు పార్టీ అయితే భయమేముంది?

బంగారం విషయంలో ఏం జరిగిందో ఆధారాలతో సహా కథనాలు వచ్చాయి. భారీ ఎత్తున బంగారం కొనుగోళ్లు జరగడం వాస్తవమేగా. పాత నోట్లు చిత్తుకాగితాలగా మారితే, పుచ్చుకోవడానికి వాళ్లేమైనా పిచ్చివాళ్లా? ఎప్పుడైనా బుక్స్ క్లోజ్ చేయవచ్చు. ఎడ్జస్ట్‌మెంట్లు చేయడానికి యింకో ఆర్నెల్లు టైముంది. ఇవన్నీ కనిపెట్టి ఇన్‌కమ్‌టాక్స్ వాడు అడిగినప్పుడు మాట కదా! అయినా యిన్ని పట్టించుకోవడానికి వాళ్లకు తీరికెక్కడ? టాక్స్ రిఫండ్స్, రిటర్న్స్‌పై క్వెరీలు ఎంత లేటుగా చేస్తున్నారో చూస్తున్నాం. ఒకవేళ తప్పు పట్టుకున్నారు అంటే అదేదో అప్పుడే చూసుకోవచ్చు. వాళ్లూ మానవమాత్రులేగా! అనుకుంటారు జనం. బ్యాంకుల్లో కూడా కంప్యూటరైజేషన్ జరగని బ్యాంకుల్లో పాత డేట్లతో ఫిక్సెడ్ డిపాజిట్లు తెరిచేస్తున్నారట. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అదుపు తక్కువ వుంటుంది. పోన్లెద్దురూ అంటూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తారు.

ముందే లీక్ అయిందా?

అయిందని ప్రతిపక్షాలంటున్నాయి. కాలేదని బిజెపి వారనడం సహజం. కొందరు నోరుజారినా సర్దుకుంటున్నారు. కానీ అధిష్టానం వద్ద సరైన సమాధానాలు రావటం లేదు. గుజరాత్ పేపర్లలో ముందే (ఏప్రిల్ 1కే కాదు, ఆగస్టులో కూడా వచ్చిందట) వచ్చిందన్న వార్తను ఖండించలేకపోయారు. జులై–సెప్టెంబరు మధ్య డిపాజిట్లు పెరిగాయని అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణను ఖండించలేదు. అక్టోబరులో యింకా పెరిగి వుంటాయి. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో అప్పు తీర్చినవాళ్లను, డిపాజిట్లు వేసినవాళ్లను తాటిస్తే నిజం బయటకు వస్తుంది. జియో ఉచితంగా యివ్వడం వెనక్కాల కూడా దీని ముందస్తు సమాచారం వుందంటున్నారు. ఒక రాష్ట్రమంత్రి ఎన్నికలకై చేసిన అప్పులన్నీ ప్రకటనకు నెల్లాళ్ల ముందే తీర్చేశాడట. అప్పులవాళ్లను పిలిచి మరీ యిచ్చేశాడట. గుజరాత్‌లో పటేల్ కులస్తులెవరూ కళవెళ పడటం లేదట. అది నిజమైతే ఉప్పందిందనే అనుకోవాలి. నిజంగా లీకు జరిగి వుంటే, ఒక నెల్లాళ్లలో వివరాలతో బయటకు వచ్చేయాలి. సర్జికల్ స్ట్రయిక్స్ మిలటరీ ఆపరేషన్. చాలా తక్కువమందే యిన్వాల్వ్ అవుతారు. దీనిలో వేలాదిమంది వుంటారు. ఎవరు మాట జారినా న్యూస్ బయటకు వచ్చేసి నల్లధనికులు సర్దుకుంటారు.

టెర్రరిజానికి ఉచ్చు పడిందట!!!

ఈ ఆపరేషన్ ఫెయిలందని ఒప్పుకోవడం మోదీ భక్తులకు కష్టంగా వుంది. ఈ చర్య కారణంగా కశ్మీర్‌లో అలజడి తగ్గిపోయిందట. నిజమా? అలా అయితే తక్షణం సైన్యాన్ని ఉపసంహరించమనండి. ఓ వారం రాళ్లేయనంత మాత్రాన ఏవేవో థియరీలు అల్లేస్తే ఎలా? కొత్త నోట్లు లేకపోయినా పచారీ దుకాణం వాడే అరువిస్తున్నాడు. పాక్ ప్రేరేపకులు రోకడా వచ్చేవారం యిస్తాంలే అంటే విద్రోహకారులు కాదంటారా? అయినే డబ్బే యివ్వాలని ఏముంది? తిండి పదార్థాలు, దుస్తులు, మద్యం వగైరాలు యివ్వలేరా? అయినా జిహాదీలు డబ్బుకోసం చేస్తున్నారనుకోవడం తప్పు. పట్టుబడిన వారు చెప్పినదాని ప్రకారం వాళ్లకు ముట్టేది అతి తక్కువ. కేవలం మతోన్మాదమే వాళ్లను నడిపిస్తోంది. మతం ప్రమాదంలో పడిందనే ప్రచారంతోనే వాళ్లను ఆపరేట్ చేస్తున్నారు. ఓ వారం నోట్లు అందలేదు కదాని చప్పబడిపోయే జనాభా కాదది. వారి స్తబ్దతకు కారణమేమిటో విచారించాలి.

హడావుడిగా దిగడానికి కారణం రాజకీయమా?

లీకులు జరిగాయా లేదా, టెర్రరిజం ఆగిందా లేదా యిలాటి మీమాంసలకు యిప్పుడిప్పుడే సమాధానాలు రావు కానీ అందరూ ఒప్పుకోవాల్సిన వాస్తవం – స్కీము ఫెయిలయింది, ప్రజలను యిక్కట్లపాలు చేసింది. కాష్‌లెస్ ట్రాన్సాక్షన్లకు జనం పూర్తిగా సిద్ధపడని

తరుణంలో పెట్టిన యీ పథకం వలన నోట్ల చలామణీ జరగక వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. ప్రభుత్వాలూ గతుక్కుమన్నాయి. జీతాలివ్వడానికి అల్లాడుతున్నాయి. దేశమంతా అల్లకల్లోలంగా వుంది. ముఖ్యమంత్రులకూ గుబులుగా వుంది. సామూహికంగా వెళ్లి ప్రధానిని అడుగుదామంటే భయంలా వుంది. పార్లమెంటులో అడుగుదామంటే మోదీగారి దర్శనం దుర్లభం. వెంకయ్యనాయుడు నోరు పెట్టుకుని పడిపోతారు. ఎదురు మాట్లాడితే దేశద్రోహి అంటారు. ఈ పరిస్థితిని 3 వారాల్లో చక్కదిద్దడం అరుణ్ జేట్లీ తరం కాదనేది సుస్పష్టం. ఫారిన్ ఎక్స్‌ఛేంజి వెల్లడి స్కీము పెడితే ఫెయిలయింది. ఇన్‌కమ్ డిస్‌క్లోజర్ స్కీము (ఐడియస్) పెడితే స్పందన లేక అదీ ఫెయిలయింది. ఇప్పుడీ స్కీము ఆచరణలో ఫెయిలైంది. ఆర్థికశాఖ అధికారులు యింత చేతకానివారా? అంటే నమ్మడం కష్టం. ఐడియస్ విషయంలో చాలా ప్లాన్‌డ్‌గా వెళ్లి కృషి చేశారు. స్పందన లేకపోవడం వేరే విషయం.

అంతటి సమర్థులు, యీ స్కీములోని సాధకబాధకాలను ఆర్థికమంత్రికి పూర్తిగా వివరించి వుంటారు. సరిగ్గా అమలు చేయడానికి కొంత వ్యవధి అడిగి వుంటారు. కానీ ఆర్థికమంత్రి, మోదీ యివ్వలేదని అర్థమౌతోంది. ఎందుకివ్వలేదు? ఇంత ఆదరాబాదరాగా హెూం వర్క్ లేకుండా స్కీము ప్రవేశపెట్టవలసినంత అర్జన్సీ ఏమొచ్చింది? తస్మదీయులకు లీకై వాళ్లు జాగ్రత్తపడసాగారా? పరీక్ష పేపరు లీకయితే పరీక్ష రద్దు చేస్తారు. లీకు జరిగిందని తెలిస్తే స్కీము ప్రవేశపెట్టి వుండేవారు కారు. మరి!? కచ్చితంగా రాజకీయకారణాలు వుండి వుంటాయి. పంజాబ్ ఎన్నికలో, యుపి ఎన్నికలో, మరోటో మరోటో..! అదేమిటో యిప్పుడు స్పష్టంగా తెలియటం లేదు. రోజులు గడిచే కొద్దీ స్పష్టత వస్తుందని ఆశిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 25- 28** **ఎమ్బీయస్ : ట్రంప్ గెలుపు మన కనర్థమా?**

మన దేశంలో చాలామంది ప్రజలు ట్రంప్ విజయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. అమెరికాకు, అది అగ్రరాజ్యం కాబట్టి ప్రపంచానికి శని పట్టిందని వాపోతున్నారు. అమెరికా మీడియా, దాని వలన ప్రభావితమైన భారతీయ మీడియా ట్రంప్ అపజయం ఖాయమని వాళ్లను ఊరిస్తూ రావడంతో ఫలితాలు చూశాక ఉసూరుమన్నారు. ట్రంప్ భారతీయులకు వ్యతిరేకి అని, మన ఉద్యోగాలు పీకేస్తాడనీ, అక్కడకు రానివ్వడని, అసలిప్పుడు అమెరికాకు వెళ్లి చదువు కోవాలంటే మనసు రావటం లేదని ఉస్సురన్నవాళ్లూ వున్నారు. అమెరికన్లు నాగరికులమనుకున్నామని, ట్రంప్ వంటి జోకర్ ప్లస్ విలన్ని ఎన్నుకుంటారని ఊహించలేదని చాలామంది ఖేదపడ్డారు. ట్రంప్ ముస్లిం వ్యతిరేకి కాబట్టి పాకిస్తాన్‌ను, చైనా దిగుమతులను వ్యతిరేకిస్తున్నాడు కాబట్టి చైనాను శత్రువులుగా చూస్తాడని, తద్వారా మన జంట శత్రువుల పీచమణుస్తాడని ఆశ పడుతున్న కొందరు మాత్రం హర్షిస్తున్నారు. మన దేశం ఒక్కటే కాదు, ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెటు ట్రంప్ గెలుపుకి వ్యతిరేకంగా స్పందించింది. ఇండెక్స్ ధడాలున పడిపోయింది. బయటి దేశాల మాట ఎందుకు అమెరికాలోనే చూడండి. నేను నెగ్గితేనే ఎన్నికల ఫలితాన్ని ఆమోదిస్తాను అని ట్రంప్ అనడం కలకలం రేపింది. అతనికి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని అందరూ తిట్టిపోశారు. కానీ ఫలితాలు వచ్చాక ప్రజాస్వామ్యవాదుల మని చెప్పుకునే హిల్లరీ మద్దతుదారులు ట్రంప్ మాటల్ని ఆచరణలో పెట్టి చూపారు. ట్రంప్ మా అధ్యక్షుడు కాదు అంటూ న్యూయార్కుతో సహా 25 ముఖ్యనగరాల్లో కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించి అతని దిష్టిబొమ్మలు తగలేశారు. సిలికాన్ వ్యాలీలో అయితే మరీ ఘోరం. అక్కడి కంపెనీలు ట్రంప్‌కు యిచ్చిన దాని కంటె 114 రెట్లు అధికంగా హిల్లరీకి విరాళాలిచ్చాయి. ఇప్పుడు ఆమె ఓడిపోవడంతో అనేకమంది సిఇఓల మొహాలు మాడిపోయాయి. 9/11 నాటి ఉగ్రవాద దాడి కంటె భయంకరమైనది యీ 11/9 నాటి తీర్పు అంటున్నారు. అసలీ స్థాయిలో ఖేదమోదాలు అవసరమా అన్నది చూద్దాం.

మొదటగా మనం ఆలోచించవలసినది, యీ గెలుపు రైట్ మలుపుకు సంకేతమా? అనే పాయింటు. కొందరు మేధావి పాత్రికేయులు అమెరికా రైట్‌కి టర్నింగు తీసుకుందని ఫీలవుతున్నారు. ప్రస్తుతం అమెరికాలో మైనారిటీల పట్ల, విదేశీయుల పట్ల జాలి, కరుణ కలిగిన ఉదారవాద సోషలిస్టు సమాజం వుందని అనుకునేవాళ్లు మాత్రమే యీ ధోరణిలో ఆలోచించాలి. నిజానికి గత 30 ఏళ్లగా అమెరికాలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయి. సామాన్య ప్రజల స్థితి దిగజారుతూండగా కంపెనీలు విపరీతంగా లాభాలు గడిస్తున్నాయి. ఈ విషయమై అనేక గణాంకాలు చూశాం. ఇది సోషలిజమా? వామపక్షవాదమా? ఇతర విషయాలకు వస్తే ఒబామా 8 ఏళ్ల కాలంలో కంపెనీలను రక్షించడానికి సామాన్యుల నడ్డి విరిచాడు, వలసదారులను భారీ సంఖ్యలో పంపేశాడు, యుద్ధాలు కొనసాగించడంలో, యితర దేశాల వ్యవహారాల్లో తలదూర్చడంలో బుష్‌కు తీసిపోకుండా ప్రవర్తించాడు. మరి అలాటప్పుడు అతను లిబరల్ అనీ, అమెరికాది సోషలిస్టు లేదా ఎగాలిటేరియన్ సమాజం ఎలా అనగలం? ఈ 30 ఏళ్లల్లో పాలించిన రిపబ్లికన్లు, డెమోక్రాట్లు యిద్దరూ కలిసి అమెరికన్ సమాజాన్ని యిలా తగలేశారు. ట్రంప్ వచ్చి సరిదిద్దగలడని చెప్పలేం కానీ యింతకంటె అధ్వాన్నం కానీయడని అనుకోవచ్చు. చదువురాని వాళ్లే అతనికి ఓటేశారని తొలిదశలో అనుకున్నారు కానీ తరచి చూస్తే కాలేజీ చదువు చదివిన మహిళల్లో 45%, మగవాళ్లల్లో 54% అతనికి వేశారని తేలింది. అందుచేత వాళ్ల ఉద్యోగాలు కాపాడవలసిన బాధ్యతా అతనిపై వుంది.

అమెరికా ప్రజల నిరాశానిస్పృహలే ట్రంప్‌కు ఊపిరిగా పనిచేశాయి. 'ప్రభుత్వం నుంచి మీకు వచ్చింది ఎక్కువా? ప్రభుత్వం మీ నుంచి తీసుకున్నది ఎక్కువా?' అని సర్వేలో అడిగితే 72% మంది మేం యిచ్చిందే ఎక్కువ అన్నారు. ప్రభుత్వం పెద్దపెద్ద సంక్షేమ

పథకాలు పెడుతోంది కదా, మీకు ఆనందమేనా? అని అడిగితే 69% మంది 'పథకం బజెట్ పెరిగిన కొద్దీ వ్యర్థా అయ్యేది ఎక్కువవుతుంది' అని అభిప్రాయపడ్డారు. మరి 'పరిస్థితులు మారాలా? ఉన్నదానితో సర్దుకుపోవాలా?' అని అడిగితే డెమోక్రాట్స్‌కు ఓటేసే వారిలో 65% మంది సర్దుకుపోవడం మంచిదన్నారు. రిపబ్లికన్లకు ఓటేసేవారిలో 65% మంది 'రాజీ పడితే లాభం లేదు. ప్రభుత్వం తిక్క కుదర్చాల్సిందే' అన్నారు. ఇలా మార్పు కోరేవాళ్లే ట్రంప్‌ని గెలిపించారు. వీళ్లు మీడియా హిల్లరీ పక్షపాతిగా వుందన్న కోపంతో పోల్ సర్వేలలో పాల్గొనడానికి యిష్టపడకపోవడంతో సర్వే ఫలితాలు అసమగ్రంగా, అసంబద్ధంగా వచ్చాయిట. మార్పు కోరి తనకు పదవి కట్టబెట్టిన తన దేశప్రజల కోసం ట్రంప్ ఏదో ఒకటి చేసి చూపించాలి. లేకపోతే అప్రతిష్ఠ పాలవ్వాలి. దేశప్రజలందర్నీ కలుపుకుని పోతా అంటూనే మెక్సికో సరిహద్దుల్లో కొంతమేర గోడ, మరి కొంతమేర ముళ్ల కంచె పెడతానని పునరుద్ఘాటించాడు. తన విధానాల వలన మెక్సికో ఏమంటుంది, భారత్ ఏమనుకుంటుంది అనేది ట్రంప్‌కు పెద్దగా పట్టకపోవచ్చు. ప్రపంచ నేతలుగా ఎదుగుదామనుకున్నవారు తమ ఖ్యాతి కోసం దేశప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తారు. ట్రంప్‌కు ప్రపంచ సభ్యసమాజంలో అర్జంటుగా పేరు తెచ్చేసుకోవాలనే తాపత్రయం వుందనుకోను. తొలుతగా అమెరికాలో ప్రజలను తృప్తి పరచాలి. అదే అతనికి ముఖ్యం. మన దేశపు ప్రయోజనాలను పక్కనపెట్టి ఆలోచిస్తే నిజానికి అదే మనకూ మంచిది కదా.

గతంలో కమ్యూనిస్టుల గురించి మాట్లాడుతూ జోక్ చేసేవారు, రష్యాలో వాన వస్తే యిక్కడ వాళ్లు గొడుగులు పట్టుకుంటారు అని. ఇప్పుడు అమెరికాలో చల్లగాలి గట్టిగా వీస్తే తెలుగిళ్లల్లో తుమ్ములు రావడం మాత్రం ఖాయం. మన టీవీ ఛానెళ్లు, వెబ్‌సైట్లు, రియల్ ఎస్టేటు వ్యాపారాలు, చిన్న స్థాయి ఐటీ కంపెనీలు అన్నీ అమెరికాలోని తెలుగు ఎన్నారైల స్థితిగతులపై ఆధారపడి వున్నాయి. ఆ మధ్య మెల్ట్‌డౌన్ అయినప్పుడు యిక్కడ భూముల రేట్లపై ప్రభావం చూపింది. ప్రపంచంలో ఏ దేశం ఎటు పోయినా మనకు ఫికర్ లేదు కానీ, అమెరికాలో ఏదైనా జరిగితే మాత్రం దాని ప్రభావం మనవాళ్లపై వుంటుంది. అందువలన అమెరికా చల్లగా, స్థిరంగా వుండాలని కోరుకోవడంలో మన స్వార్థం వుంది. నిజానికి ట్రంప్ అధికారంలోకి రావడం వలన అక్కడ ఎన్నాళ్లగానో పాతుకు పోయిన తెలుగువాళ్లకి ఏ యిబ్బందీ వుండదు. సిటిజన్‌షిప్ వున్నవారికీ వుండదు. కొత్తగా వెళ్లడం మాత్రం కష్టతరం కావచ్చు. అది కూడా ట్రంప్ తన విధానాలను అమలు చేయగలిగితేనే! చేయగలడా?

ప్రస్తుతం సెనేట్‌లో రిపబ్లికన్లు 51 మంది, డెమోక్రాట్లు 46 మంది, యితరులు యిద్దరు వున్నారు. కీలక అంశాలపై 60 మంది మద్దతు వుంటేనే బిల్లు పాసవుతుంది. ఇక ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు 238 మంది వుంటే డెమోక్రాట్లు 193 మంది వున్నారు. 218 మంది మెజారిటీ వుంటేనే బిల్లు పాసవుతుంది. ట్రంప్ తన పార్టీని తన వెంట తీసుకెళ్లడమే కాకుండా, డెమోక్రాట్లలో కొందరిని కూడా ఆకర్షించగలగాలి. డెమోక్రాటిక్ పార్టీ నామినేషన్‌కు హిల్లరీతో పోటీ పడి ఓడిపోయిన సోషలిస్టు బెర్నీ శాండర్స్ కార్మికుల సంక్షేమం కోసం ట్రంప్ చేసే పనులను సమర్థిస్తానన్నాడు. "ప్రస్తుత పరిస్థితులతో విసిగి వేసారిన మధ్యతరగతిలోని నిరాశా నిస్పృహలను ట్రంప్ అర్థం చేసుకున్నాడు. వారికి ఉద్యోగాలు మళ్లీ తెప్పించే పని అతను తలపెడితే నా మద్దతు వుంటుంది" అన్నాడు. లెఫ్ట్ వింగ్ డెమోక్రాట్ నాయకురాలు ఎలిజబెట్ వారెన్ కూడా తనకు ట్రంప్ అంటే యిష్టం లేకపోయినా కార్మికుల జీవితాల్లో మళ్లీ వెలుగు తెచ్చే ఆర్థిక వ్యవస్థను రూపొందిస్తానంటే మాత్రం సమర్థిస్తా అంది.

ఇన్నాళ్లూ అమెరికా యితర ప్రాంతాల్లో పెత్తనం చలాయించడానికై నాటో వుంటి కూటములు ఏర్పరచి, కొన్ని దేశాలతో మిత్రత్వం నెరపి, ఆ పాలకులు నియంతలైనా, సైన్యాధిపతులైనా, ఎవరైనా సరే వారి కాపలాకు తన ఖర్చుతో తన సైన్యాన్ని అక్కడ పెట్టి వారి ప్రయోజనాలను కాపాడేది. దానికి తోడుగా తన సైనిక స్థావరాలను, నిఘా స్థావరాలను నిర్వహించుకోనివ్వాలని కోరేది. ఇప్పుడు 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ముందుకు వచ్చిన ట్రంప్ 'ఇకపై మా సైన్యాలను మీ దేశాల్లో వుంచాలంటే మీరు ఖర్చులు భరించండి. లేకపోతే సైన్యాన్ని వెనక్కి రప్పించేసుకుంటాం' అంటున్నాడు. 12 దేశాలతో అమెరికా ఏర్పరచిన పాన్-పసిఫిక్ ట్రేడ్ పాక్ట్‌ను ట్రంప్ తోసిరాజు అనాలంటున్నాడు. జపాన్, దక్షిణ కొరియాలు అణ్వస్త్రాలు తయారు చేసుకుంటే చేసుకోనివ్వండి అంటున్నాడు. అమెరికా మద్దతుతో ఎందరో నియంతలు దేశాలేలుతున్నారు. ఇప్పుడు హఠాత్తుగా అమెరికా మీ దారి మీరు చూసుకోండంటే వాళు ్లు వూరుకుంటారా? గగ్గోలు పెట్టరా?

ఐసిస్ చెలరేగడానికి ఒబామా సిరియా విషయాల్లో కలగజేసుకోవడమే అని ట్రంప్ కుండ బద్దలు కొట్టాడు. సిరియా అధ్యక్షుడు బషర్ నియంత, సందేహం లేదు. ఈజిప్టు తదితర అరబ్ దేశాల్లో ప్రభుత్వాలు తలకిందులవుతున్నపుడు తన చాప కిందకూ నీరు వస్తుందని అతను భయపడి, పాలనపై మరింత పట్టు బిగించాడు. అతని ప్రతిక్షకులు ఉద్యమాలు మొదలుపెట్టారు. అది వాళ్ల అంతర్గత వ్యవహారం. ఇద్దరూ కొట్టుకుని ఎవరో ఒకరు గెలుస్తారనుకుని వూరుకుంటే బాగుండేది. కానీ అమెరికా తగుదునమ్మా అని తలదూర్చి బషర్‌ని గద్దె దింపడానికి సకల యత్నాలు చేస్తూ, ప్రభుత్వవ్యతిరేకులకు ఆయుధాలందిస్తూ, సిరియా ప్రభుత్వాన్ని బలహీనపరిచింది. బషర్ రష్యా శరణు చొచ్చాడు. అమెరికాకు ప్రతిగా వాళ్లూ రంగంలోకి దిగారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో ఐసిస్ చొరబడి అమెరికా ఆయుధాలు చేజిక్కించుకోసాగింది. సిరియా శరణార్థులు యితర దేశాలకు వలస వెళ్లి స్థానిక కార్మికులకు ముప్పుగా పరిణమించడంతో ఆ దేశాల రాజకీయపరిస్థితి అల్లకల్లోలమైంది. ఇప్పటికైనా మాకెందుకు వచ్చిన గొడవ యిది అని అమెరికా వెనక్కి వెళ్లిపోయిన రోజున ఐసిస్‌ను బషర్, రష్యా కలిసి అణచగలగవచ్చు. ట్రంప్ సిరియా నుంచి తప్పుకుంటాడా? తప్పుకుంటే దేశప్రతిష్ఠ దెబ్బ తిందని డెమోక్రాట్లు అల్లరి చేయకుండా వుంటారా? అమెరికాలో బలమైన ఆయుధవ్యాపారుల లాబీ

ఊరుకుంటుందా?

ప్రతిపక్ష నాయకుడిగా ఏదైనా మాట్లాడవచ్చు కానీ ఒకసారి అధికారంలోకి వచ్చాక, వున్నది మార్చాలంటే చాలా కష్టపడాలి. ఎన్టీయార్ సంప్రదాయ రాజకీయాల్లోంచి రాకపోవడం చేత, సాంకేతిక నిపుణులను సలహాదారులుగా పెట్టుకుని, ఎవరూ వూహించలేని కొత్త పథకాలను రూపొందించారు. రాజకీయ పర్యవసానాలు ఆలోచించకుండా సాహసంతో అమలు చేయగలిగారు. ట్రంప్ కూడా మామూలు రాజకీయ నాయకుడిగా రాలేదు. ఎన్టీయార్ తరహాలో విభిన్నంగా ఆలోచిస్తాడా లేక ప్రస్తుత వ్యవస్థనే కొనసాగిస్తాడా అన్నది కొంతకాలం పోతే తప్ప తెలియదు. కానీ యీ లోపున అతని గెలుపు యితర దేశాలపై ప్రభావం చూపవచ్చు.

బ్రెగ్జిట్‌కై గట్టిగా వాదించిన ఇండిపెన్‌డెన్స్ పార్టీ నాయకుడు నైజిల్ ఫరాగేకు మరింత స్ఫూర్తి నిచ్చినట్లవుతుంది. డిసెంబరు 4 న ఎన్నికల జరగబోతున్న ఆస్ట్రియా అధ్యక్ష ఎన్నికలలో ఫార్-రైట్ విధానాల ఫ్రీడమ్ పార్టీ నాయకుడు నార్బెర్ట్ హోఫర్ గెలవవచ్చు. ఇటలీలో ప్రభుత్వం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణలను వ్యతిరేకిస్తున్న ఫైవ్ స్టార్ మూవ్‌మెంట్ నాయకుడు బెప్పో గ్రిలోను అధికారానికి దగ్గరగా తీసుకురావచ్చు. నెదర్లాండ్స్‌లో మార్చిలో జరిగే ఎన్నికలు జరగబోతున్నాయి. బ్రిటన్ తరహాలో తాము ఈయూ నుండి వైదొలగాలని వాదిస్తున్న ముస్లిం వ్యతిరేక పార్టీ ఐన ఫ్రీడమ్ పార్టీ, అధికారంలో వున్న లిబరల్స్‌తో సమానస్థాయికి చేరుకుంది. ఫ్రాన్స్‌లో 2017 మేలో జరిగే ఎన్నికలలో ఫార్-రైట్ పార్టీ ఐన నేషనల్ ఫ్రంట్ లీడరు మెరీనా లె పెన్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలండ్‌పై గెలుపు సాధించవచ్చు. జర్మనీలో ఆగస్టులో ఎన్నికలు జరగబోతున్నాయి. అక్కడ ఛాన్సెలర్ ఏంజిలా మెర్కెల్ బలం క్షీణించి, ఫ్రాక్ పెట్రీ నాయకత్వంలోని రైటిస్టు పార్టీ ఐన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ బలం పుంజుకుంటోందని సర్వేలు చెపుతున్నాయి.

ఇవన్నీ రైటిస్టు సిద్ధాంతాలపై ప్రపంచ దేశాలు మొగ్గు చూపుతున్నాయన్న భావన కలిగించవచ్చు. కానీ లోతుగా ఆలోచిస్తే, ప్రతీ దేశం తన సొంత ప్రయోజనాల గురించి ఎక్కువగా ఆలోచిస్తోందని అర్థమవుతోంది. గ్లోబలైజేషన్ పేరుతో యితర దేశాలను తమ అదుపులోకి తీసుకోవాలనే ఉద్దేశంతో అమెరికా, దానికి తోకలా వ్యవహరించిన యూరోప్ దేశాలు అనేక దేశాల వ్యవహారాల్లో కలగజేసుకున్నాయి. అమెరికా చేసే సహాయానికి ఆశపడి బ్రిటన్ సద్దాం గురించి చెప్పిన అబద్ధాలను నమ్మినట్లు నటించి ఇరాక్‌పై యుద్ధంలో పాలు పంచుకుంది. అలాగే ఎన్నో దేశాలలో చొరబడి, పెత్తనం చలాయించబూనడంతో సొంతింటి కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. తాము చేసిన పాపాలను కడుక్కోవడానికి శరణార్థులను ఆదరించడంతో స్థానికుల కడుపు మండింది. పాలకులకు బుద్ధి చెప్పారు. యూరోప్‌లోని యితర దేశాల్లో కూడా యిలాటి కారణాల వలననే ప్రాంతీయవాదం ప్రబలుతోంది. ఇయు పేరుతో గ్రీస్ వంటి కట్టుతప్పిన దేశాలను రక్షించడానికి, గట్టున పడెయ్యడానికి తమ దేశ ఆర్థికవ్యవస్థ నాశనమవుతోందని తక్కిన దేశాల ప్రజల ఆవేదన. గ్లోబలైజేషన్ పేరు చెప్పి యితర దేశస్తులు తమ దేశానికి వచ్చి ఉద్యోగాలు సంపాదించుకుని, తమ పొట్ట కొడుతున్నారని ఆక్రోశం. ఈ ఆందోళన లోంచి రక్షణవాదం (ప్రొటెక్షనిజం) పురి విప్పుకుంటుంది. ఇతర దేశాల వస్తువులను, మనుష్యులను స్వేచ్ఛగా రానివ్వకూడదనే నినాదం వూపందుకుంటుంది.

ఇది ఉదారవాదం కాదని పాలకులు ప్రజలను మందలించబోవచ్చు. కానీ ఉదరం నింపుకోవడం కష్టమైనవారికి ఉదారవాదం కబుర్లు తలకెక్కవు. ఇదీ ఒకందుకు, కాదుకాదు, చాలా రకాలుగా మంచిది. ప్రపంచ శాంతి కాపాడడానికి స్వయంగా నియమించుకున్న పోలీసులం అనే భ్రమలు వదల్చుకుని తమ దేశప్రజల ప్రయోజనాలు పట్టించుకుంటే అదే మహ బాగు. ఈ యూరోప్ దేశాలను యిన్నాళ్లూ రెచ్చగొడుతూ వచ్చినది అమెరికాయే, మీకు ఆర్థికసాయం చేస్తానంటూ వాళ్లను వెంటేసుకుని పెత్తనం చేస్తూ ఎక్కడో అక్కడ యుద్ధం జరిగేట్లు చేసింది. ట్రంప్ హయాంలో అమెరికా యీ ధోరణి నుండి మరలితే అంతకంటె ఏం కావాలి? ఆయుధాల సరఫరా ఆగితే శాంతి నెలకొనేందుకు వీలు చిక్కుతుంది. శాంతి మాట ఎలా వున్నా ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదుటపడి, ప్రజలకు తిండి, బట్టా దొరుకుతుంది.

తక్కిన దేశాల సంగతి ఎలా వున్నా, మన దేశంపై ప్రభావం ఎలా వుంటుంది అన్నదే మనకు ఎక్కువ ఆసక్తి కలిగిస్తుంది. భారతీయులు సాధారణంగా డెమోక్రాట్లకే మద్దతిస్తూ వచ్చారు. ఒబామాకు రెండు సార్లుగా ఓటేసినా అతను టెర్రరిజాన్ని అణచలేకపోయాడని ఫీలయి, యీ సారి వారిలో కొందరు ట్రంప్‌కు ఓటేశారు. హిల్లరీ పాకిస్తాన్ పక్షపాతి కావడం, ఆమె ముఖ్య సహచరురాలు హ్యూమా అబేదిన్ పాకిస్తాన్‌కు చెందిన ముస్లిము కావడం చేత పాకిస్తానీ అమెరికన్లు హిల్లరీకి మద్దతు పలకడం వారికి నచ్చలేదు. పన్నులు తగ్గిస్తానని ట్రంప్ చేసిన వాగ్దానం ధనిక భారతీయులను మెప్పించింది. పైగా అమెరికన్ అధ్యక్షులందరిలో తాను భారత్‌కు ఆత్మీయుడిగా వుంటానని ట్రంప్ అనడమూ నచ్చింది.

కానీ మన భారతీయ మీడియా ట్రంప్ గెలుపును యింకా జీర్ణించుకోలేకపోతోందనే చెప్పాలి. వీసా నిబంధనలను కఠినతరం చేస్తాడట, ఔట్‌సోర్సింగ్ అడ్డుకుంటాడట అనే భయపడుతున్నారు. కాస్సేపు మన ద ృక్కోణం పక్కకు పెట్టి చూద్దాం. నిజానికి అమెరికాలో వ్యాపారరంగంలో వున్న భారతీయులకు ఏ ముప్పూ లేదు. చక్కగా చేసుకోవచ్చు. వైద్యులు, యితర సెల్ఫ్ ఎంప్లాయిడ్ కేటగిరిలో యిబ్బంది లేదు. ఇక మిగిలినది ఉద్యోగాల విషయంలోనే – బయటివాళ్లు వచ్చి ఉద్యోగాలు గుంజుకుంటున్నారనేగా దేశంలో అనేక ప్రాంతాల్లో 'భూమిపుత్రులు' ఉద్యమం వచ్చింది. చైనా దిగుమతులను అడ్డుకోవాలని యీ మధ్య దీపావళి సమయంలో మనవాళ్లు ఎంత ప్రచారం చేశారు, దాన్ని తప్పు అనగలమా? ఎవరైనా నార్త్ ఇండియన్ మన దగ్గర ఫ్యాక్టరీ పెట్టి ఏ బిహారీ వాళ్లతోనే

ఉద్యోగాలు భర్తీ చేస్తే గోల చేయమా? 'దుమ్ము మాకు, ఉద్యోగాలు వాళ్లకీనా? స్కిల్ వున్నా లేకపోయినా మాకూ ఉద్యోగాలివ్వాలి, ఆ మాటకొస్తే మాకే యివ్వాలి' అని ఆందోళన చేయమా? ఆ మాటే అమెరికన్లు అడుగుతున్నారు. తప్పేముంది? అమెరికన్ కంపెనీలకు ఋణాలు, పన్ను రాయితీలు ఆ ప్రభుత్వం ఎక్కణ్నుంచి యిస్తోంది? అక్కడ పన్ను కట్టే సామాన్యుడి జేబులోంచే కదా!

అమెరికాలో ఎచ్1 బి వీసాలపై పరిమితి 65 వేలు. దాన్ని పెంచమని కంపెనీలు అడుగుతున్నాయి. ట్రంప్ ఖాయంగా పెంచడు. అమెరికాలో టాలెంటెడ్ ఉద్యోగులు దొరకనప్పుడే ఆ వీసా కింద పరదేశస్తులను దిగుమతి చేసుకోవాలి. దాన్ని నిరూపించడం కష్టం. ఇటీవల ఫ్లోరిడాలోని డిస్నీలాండ్‌లో అమెరికన్లకు తీసివేసి ఇండియన్లను పెట్టారు. నైపుణ్యం పెద్దగా లేని స్థానికులకు కూడా ఉద్యోగాలు యిస్తేనే ఇండియన్ కంపెనీలను అనుమతించే పరిస్థితి రావచ్చు. దీన్ని ట్రంప్ విమర్శించాడు. భారత్ గురించి అతను రెండు రకాలుగానూ మాట్లాడాడు. సాంకేతికత పరిజ్ఞానం ఎక్కువ అవసరంగా వున్న ఉద్యోగాలలో భారతీయులున్నా ఫరవాలేదని, చిన్న ఉద్యోగాల్లో అక్కరలేదని అతని భావం కావచ్చు.

అమెరికాలో ఏటా యిచ్చే 1.40 లక్షల ఎంప్లాయ్‌మెంట్ గ్రీన్‌కార్డుల సెలక్షన్‌లో ఒక్కో దేశ పౌరులకు 7% కోటా చొప్పున యిచ్చే పద్ధతి వుంది. ఉదాహరణకి నేపాల్ నుంచి తక్కువమంది వెళతారు కాబట్టి ఎచ్1 వీసా వున్న నేపాలీకి ఏడాదికే గ్రీన్ కార్డు వచ్చేయవచ్చు. మన దేశం నుంచి చాలామంది వెళతారు కాబట్టి మన ఎచ్1 బి వీసా హోల్డరుకు గ్రీన్ కార్డు రావడానికి 12 ఏళ్లు పట్టవచ్చు. ఈ కోటా సిస్టమ్ మాట ఎలా వున్నా ఎమ్మెస్ చదివేవారిలో 20 వేల మందికి కూడా యిచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తామని హిల్లరీ అంది. 2015-16 సంఎరంలో అమెరికాలో మొత్తం 10.44 లక్షల విదేశీ విద్యార్థులు కాలేజీ, యూనివర్శిటీ స్థాయిలో వున్నారు. వీరు మొత్తం విద్యార్థుల్లో 5%. కితం ఏడాదితో పోలిస్తే 7% విద్యార్థులు పెరిగారు. వీరిలో 1.66 లక్షల మంది భారతీయ విద్యార్థులు కాగా, వారిలో 25% మంది తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లినవారే. నిజానికి మనవాళ్లల్లో ఎమ్మెస్ చదివిన అందరూ హైలీ-స్కిల్‌డ్ జాబ్స్‌లో లేరు. ఎమ్మెస్ చదువుకోవడానికి వెళుతున్నాం అనడం, అక్కడ చట్టవిరుద్ధంగా చిల్లరమల్లర ఉద్యోగాలు చేయడం జరుగుతోంది. దీన్ని ట్రంప్ అడ్డుకోవచ్చు. కాదనలేని పరిస్థితి కదా. బోగస్ యూనివర్శిటీలలో చదువు పేరు చెప్పుకుని అక్కడకు వెళ్లి రూల్సుకు వ్యతిరేకంగా హోటళ్లలో సర్వర్‌గా చేయడమేమిటి? స్థానికులకు ఉద్యోగాలు ఊడగొట్టి, పొట్టకొట్టడం కాకపోతే! అమెరికా వెళ్లిన మనవాళ్లకు ఉద్యోగం పోతే యింటి నుంచి డబ్బు పంపిస్తారు. ఓ ఆర్నెల్లు చూసి యింకా ఉద్యోగం రాకపోతే యింటికి వచ్చేయరా, పొలం చూసుకుందువు గాని అంటారు. అదే అమెరికన్‌కు ఉద్యోగం పోతే ఎక్కడకి వెళ్లగలడు? వాళ్ల సమాజంలో తలిదండ్రులు డబ్బు పంపే విధానం అరుదు కదా!

విదేశాల్లో నెలకొల్పుకున్న సంస్థలపై 35% పన్ను విధిస్తానని ట్రంప్ అంటున్నాడు. అమెరికన్ కంపెనీలు ఎచ్1బి వీసాలిచ్చి విదేశాల నుంచి తెప్పించుకునే ఉద్యోగులకు కనీస వేతనం 60 వేల నుంచి 80 వేలుండాలనే రూలు వుంది. ఇకపై కనీసం లక్ష డాలర్ల వేతనం వున్నవారికే ఆ వీసా యిస్తామన్నే నిబంధన ట్రంప్ పెడతానంటున్నాడు. ఎల్1, బి1 వీసాలున్న మన దేశస్తులు చాలామందికి 45 వేల నుంచి 60 వేల డాలర్ల జీతం మాత్రమే వస్తోందట. ఆ నిబంధన వస్తే సీనియర్ ఉద్యోగులకు మాత్రమే ఆ వీసా ఛాన్సు వస్తుంది. తక్కినవారికి వీసా కష్టమే. అలా అయితే మనవాళ్లు అమెరికాకు వెళ్లడం కష్టమవుతుంది. అదే మన భయం.

కానీ తను చెప్పినవన్నీ ట్రంప్ అమలు చేయగలుగుతాడా లేదా అన్నదే పెద్ద సందేహం. ట్రంప్ కంపెనీల్లోనే ఔట్‌సోర్సింగు చేసుకుంటున్నారు. ఔట్‌సోర్సింగు లేకుండా, భారతీయుల సేవలు అస్సలు వినియోగించుకోకుండా వుండడం బండి లాక్కుని రావడం ఏ అమెరికన్ కంపెనీకైనా ప్రస్తుతం కష్టమే. రాత్రికి రాత్రి మార్పు తీసుకురాలేరు. ట్రంప్ మొండిగా వుంటే క్రమేపీ తగ్గించుకుంటూ, స్థానికులకు తర్ఫీదు యిచ్చుకుంటూ రావాలి. ఇది ఏ రెండు, మూడేళ్లో పట్టే ప్రక్రియ. ఈ లోపున మన కొంపలు మునిగిపోతాయని అనుకోవడం అనవసరం. ఒకవేళ అలాకాకుండా వెంటనే మార్పు వచ్చేస్తుందని, భారతీయులకు అమెరికా ఛాన్సులు క్షణాల్లో యిగిరిపోతాయని, అమెరికన్ ఔట్‌సోర్సింగ్‌పై ఆధారపడిన యిక్కడ ఐటీ పరిశ్రమ దెబ్బతింటుందని అనుకుని ఆలోచిస్తే...?

గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో ఐటీ పరిశ్రమ పుంజుకుంది తప్ప అంతకుముందు మనం బతకలేదా? ఎదగలేదా? నిజానికి ఐటీ ఎదుగుదల మన దేశాన్ని, ముఖ్యంగా మన తెలుగు సమాజాన్ని చాలా ప్రభావితం చేసింది. మనవాళ్లు అమెరికాకు వెళ్లి ఉద్యోగాలు తెచ్చుకోవడం గతంలో అరుదుగా వుండేది. ఐటీ ఉద్యోగాలు వచ్చాక ప్రతీ వూరు నుంచి కనీసం పదిమంది అమెరికా వాసులు కనబడుతున్నారు. స్థానికంగా కూడా ఐటీ, ఐటీ సంబంధిత ఉద్యోగాలు పెరిగి, మనవాళ్లు ఆన్‌సైట్ వెళుతున్నారు. దానివలన మంచే కాదు, చెడూ జరిగింది. ఐటీ ఉద్యోగాల పేర పెద్దగా ప్రతిభ లేనివాళ్లకు సైతం విపరీతంగా జీతాలు రావడంతో, అందరూ తక్కిన ఉద్యోగాలు వదిలేసి వాటిపై పడ్డారు. ఇతర కంపెనీ యజమానులకు ఉద్యోగులు దొరకడం దుర్లభమవుతోంది. ఐటీ తప్ప తక్కిన ఇంజనీరింగు విభాగాలు మూలపడ్డాయి. వాటిలో చదివినవారు కూడా ఆ బ్రాంచ్ వదిలిపెట్టి, ఐటీకి మారిపోయారు. ఐటీకి దారి తీసే ఇంజనీరింగు తప్ప తక్కినవేవీ చదువులు కావనే ధోరణిలో పడ్డారు. బేసిక్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, ఆర్ట్స్, హ్యుమానిటీస్, కామర్స్, లా, సెక్రటరీషిప్ - వీటిలో చదవడం న్యూనతగా భావించసాగారు. చదువు పూర్తవుతూనే నెలకు పాతిక వేల జీతం కళ్ల చూడడంతో కొందరు ఐటీ వాళ్లకు కళ్లు తిరిగి, తక్కిన వృత్తులను చులకనగా చూడసాగారు. ఇలాటి హడావుడి చూసి సమాజంలో వారి పట్ల వ్యతిరేక ధోరణి ప్రబలింది. వాళ్లపై, వాళ్ల జీవనశైలిపై, సంసారాలపై జోకులు పుట్టుకుచ్చాయి.

ఎన్నారైలు యిళ్లకు పంపించే డబ్బు వలన యిక్కడి రియల్ ఎస్టేటు ప్రభావితమైంది. ఉత్తిపుణ్యాన స్థలాల ధరలకు రెక్కలొచ్చి,

తక్కినవారికి అందుబాటులో లేకుండా పోయాయి. ఎన్నారైలు ప్రత్యేక జాతి అనే భావాన్ని కలిగిస్తూ వారి కోసమే కట్టామంటూ కొన్ని వెంచర్లు వెలిశాయి. అది సమాజంలో వారి పట్ల యితరులకు అసూయ పెంచాయి. అమెరికాలో మాంద్యం ఏర్పడినప్పుడు ఆ ప్రభావం యిక్కడా చూపింది. ఎన్నారైల తలిదండ్రులకూ కొమ్ములు వచ్చాయి. పిల్లల పేర ఆస్తులు కొనడమూ, సంరక్షించడమూ, అమ్మడమూ, వాటి గురించి గొప్పలు చెప్పడమూ వారికి ముఖ్యవ్యాపకమైంది. ఓపికున్నంత కాలం అమెరికా వెళ్లి పిల్లలకు పనులు చేసిపెట్టడం, ఓపిక తగ్గాక ఓల్డ్ ఏజ్ హోంలో చేరినప్పుడు వాళ్లని తిట్టుకోవడమూ జరుగుతోంది.

ఐటీ వాళ్ల ఉద్యోగాల్లో కూడా స్థిరత్వం లేకుండా పోయింది. పని చేస్తే అదే చేయడమూ, లేకపోతే బెంచ్‌పై కూర్చోవడమూ, ఉద్యోగంలో ఆటుపోట్లు వస్తే తట్టుకునే మానసిక స్థయిర్యం లేక అఘాయిత్యాలకు పాలుపడడమూ..! ఉద్యోగభద్రత లేకపోవడం చేత ప్రతి చిన్నదానికి ఆందోళన పడి, ఆరోగ్యం చెడగొట్టుకోవడం, కాపురాలు పాడుచేసుకోవడం కూడా తక్కిన వర్గాల్లో కంటె వీరిలో ఎక్కువగా కనబడుతోంది. వచ్చినంతకాలం డబ్బు వచ్చిపడడం తప్ప ఐటీ ఉద్యోగాలలో ఏదో సాధించామన్న తృప్తి పెద్దగా కనబడటం లేదు. మనవాళ్లు ఐటీ రంగంలో యింతమంది వున్నా సాధించిన పేటెంట్లు ఎక్కువగా కనబడవు. రొటీన్ పని చేయడమే తప్ప, సృజనాత్మకంగా పనిచేసేవారు తక్కువ. చైనీయులు గట్టిగా పట్టుబట్టి ఇంగ్లీషు నేర్చుకుని తక్కువ జీతాలకు సిద్ధపడి మనకు పోటీ వస్తే పదేళ్ల తర్వాత మనం యీ రంగంలో ఎక్కడ వుంటామో తెలియదు. ప్రస్తుతం అమెరికా వాళ్ల వుద్యోగాలు వూడగొట్టి అవి మనకిస్తున్న అమెరికా కంపెనీలు, రేపు మనల్ని యింటికి పంపించి చైనావాళ్ల కివ్వవచ్చు. ఈ సినారియోలో ఐటీ ఉద్యోగాలకు మోజు తగ్గితే నష్టమేముంది?

అమెరికా, యితర యూరోప్ దేశాలు గ్లోబలైజేషన్ పక్కనపెట్టి లోకలైజేషన్ (ట్రంప్ అమెరికా ఫస్ట్ అంటున్నాడుగా)కి మరలితే కూడా మనకు నష్టం లేదు. గ్లోబలైజేషన్ వలన మన దేశస్తులు కొందరు విదేశాల్లో డబ్బులు సంపాదించారు కానీ, తక్కిన ప్రజలకు చాలా నష్టమే జరిగింది. పాతికేళ్ల గ్లోబలైజేషన్ వలన మన దగ్గర ఆర్ అండ్ డి (పరిశోధన, అభివృద్ధి) అడుగంటింది. (దాని గురించి వేరే వ్యాసంలో వివరిస్తాను) మాన్యుఫేక్చరింగ్ మానేశాం. మన దగ్గరే ఎచ్ఎంటి, ఆల్విన్ వంటి కంపెనీలు వాచీలు తయారుచేసేవి. అవి మూతపడి, యిప్పుడు ఫారిన్ సరుకులే కొంటున్నాం. ఒకప్పుడు చౌక సరుకులు పంజాబ్, హరియాణాల నుండి వచ్చేవి. ఇప్పుడు వాటి స్థానంలో చైనా వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. మనం సర్వీసెస్‌పై పడి, తయారీ రంగాన్ని అటకెక్కించాం. తాము తయారుచేసిన వస్తువులు కొనేవాళ్లు లేక స్థానిక పరిశ్రమలు మూతపడుతున్నాయి. నిరుద్యోగం ప్రబలింది. సమాజంలో అశాంతి పెరిగింది. విదేశీ శక్తులు మన మార్కెట్‌ను కైవసం చేసుకున్నాయి. బాలన్స్ ఆఫ్ ట్రేడ్ తూకం తప్పి ఎగుమతుల కంటె దిగుమతులు విపరీతంగా పెరిగాయి. ఆర్థికవ్యవస్థ కుంటుపడింది. ద్రవ్యోల్బణం పెరిగింది. మన మార్కెట్‌లో మన సరుకులే ప్రధానంగా అమ్ముడు పోవాలంటే గ్లోబలైజేషన్ నుండి బయటకు రావాలి. ఆ పరిస్థితుల్లో ఎగుమతులు చేయడం కుదరకపోయినా ఫర్వాలేదు. మన సరుకులు అమ్ముడు పోయేటంత పెద్ద మార్కెట్టు మనకే వుంది.

చివరిగా చెప్పేదేమిటంటే – ఏది జరిగినా మన మంచికే. ఆందోళన చెందవలసిన పని లేదు. ట్రంప్ నిజంగా తన వాగ్దానాలు నెరవేర్చి, యితర దేశాల వ్యవహారాల్లో తల దూర్చడం మాని, కంపెనీలకు పన్నులు తగ్గించి, వెనక్కి వచ్చేందుకు ఆకర్షించి, ఔట్‌సోర్సింగ్ విధానంపై ఆంక్షలు పెట్టి, అంతిమంగా స్థానికులకు ఉద్యోగాలు వచ్చేట్లా చేస్తే అమెరికా బాగుపడుతుంది. అది బాగుపడితే ప్రపంచం బాగుపడుతుంది. గ్లోబలైజేషన్ స్థానంలో స్వీయరక్షణవాదం వస్తే మనమూ బాగుపడతాం. దిగుమతులు తగ్గి, పారిశ్రామికీకరణ హెచ్చి, మన దగ్గరా ఉద్యోగాలు పెరుగుతాయి. మనకు కావలసినది నైపుణ్యం పెంచుకోవడం, కష్టపడే స్వభావం వదులుకోకపోవడం, తయారు చేసే వస్తువుల నాణ్యత కాపాడుకోవడం, ఉద్యోగిగానైనా, వ్యాపారిగా నైనా నీతి, నిజాయితీ, క్రమశిక్షణలను నమ్ముకోవడం.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 29-31** **ఎమ్బీయస్ : కీర్తిశేషులు బాలమురళీకృష్ణ**

బాలమురళీకృష్ణగారు యివాళ (2016 నవంబరు 22) వెళ్లిపోయారు. కర్ణాటక సంగీతంలో శిఖరసమానుడైన మహానుభావుడు. చైల్డ్ ప్రాడిజీ. బాల్యంలో మేధావిగా వున్న చాలామంది పెద్దయ్యాక ప్రతిభ కనబర్చడం మానేస్తారు. కానీ ఆయన చివరిదాకా జీనియస్‌గానే వున్నారు. ఆయన గాయకుడే కాదు, వాద్యకారుడు, సంగీతకారుడు, గేయరచయిత కూడా. కొత్తరాగాలు సృష్టించి, వాటిని ప్రాచుర్యంలోకి తెచ్చిన మహానుభావుడు. సాధారణంగా పండితులు జనసామాన్యానికి దూరంగా, కొంతమందికి మాత్రమే నచ్చేట్లా వుంటారు. కానీ యాయన ఆకాశవాణి ద్వారా లలితసంగీతాన్ని జనసామాన్యంలో తీసుకెళ్లారు. విజయవాడ, మద్రాసు, హైదరాబాదు కేంద్రాలలో సంగీత శాఖలో ప్రొడ్యూసర్‌గా పనిచేసి 1950, 60 దశకాల్లో దేవులపల్లి, అడవి బాపిరాజు, బసవరాజు, వింజమూరి శివరామారావు, సినారె, దాశరథి వంటి ఎందరో కవులు రాసిన లలిత గీతాలకు, సంగీత నాటికలకు, రూపకాలకు సంగీతాన్ని సమకూర్చారు. కొన్నిటిని ఆయనే పాడారు. తక్కినవి యితరులచే పాడించారు. ప్రతిభావంతులలో అహంకారం, యితర కళాకారుల పట్ల అసూయ వుంటూండడం చూస్తాం. కానీ బాలమురళి అనేకమంది ప్రతిభామూర్తులతో కలిసి పనిచేశారు. ఎవరితోనూ తగవులు పడలేదు. ఎంతోమందికి తన విద్య పంచారు. దశాబ్దాలుగా ప్రజలను అలరిస్తున్న మోస్ట్ పాప్యులర్ కార్యక్రమం “భక్తిరంజని”ని

మొదలుపెట్టింది ఆయనే.

మనకాలం నాటి వాగ్గేయకారుడు ఎవరంటే బాలమురళీ పేరే ప్రథమంగా తడుతుంది. ఆయన కీర్తనలు, వర్ణాలు, జావళీలు, తిల్లానాలు, లలిత గీతాలు రాశారు. తెలుగునాటే కాదు, తమిళనాట కూడా – ఆ మాట కొస్తే అక్కడే ఎక్కువ – ప్రసిద్ధులు. తెలుగునాట తనకు రావలసినంత పేరు రాలేదన్న కినుక కూడా ఆయన కుంది. ఎన్టీయార్ ఆస్థాన పదవులు రద్దు చేసినపుడు ఆయనకు తిక్కకోపం వచ్చి తెలుగునాట యికపై కచ్చేరీలు చేయనని ప్రకటించారు. కొన్నాళ్లకు కెవి రమణాచారి గారు చాకచక్యంగా యిద్దరి మధ్య మాటలు కలిపి, ఎన్టీయార్ చేత ఆయనను ఆహ్వానించేట్లా చేశారు. అంతే బాలమురళి తన ప్రతిజ్ఞ మర్చిపోయారు. ఆయన సుదీర్ఘజీవితంలో ఎన్నో సన్మానాలు, ఎవార్డులు పొందారు. హిందూస్తానీ సంగీతానికై భీమ్‌సేన్ జోషికి 'భారతరత్న' ఇచ్చారు కాబట్టి, కర్ణాటక సంగీతంలో తనకూ యిస్తారని అభిమానులతో బాటు ఆయనా ఆశించారు. కానీ అది నెరవేరలేదు. పద్మవిభూషణ్ యిచ్చి సరిపెట్టారు. మరణానంతరం యిస్తారేమో చూడాలి.

శాస్త్రీయ సంగీతకారులకు సినిమాపై చిన్నచూపు వుంటూంటుంది. కానీ బాలమురళికి సినిమాలంటే మోజుంది. పాడడమే కాదు, నటించాలని కూడా సరదా. అది కూడా రకరకాల వేషాలు వేయాలనుకున్నారు. కానీ సంగీత విద్వాంసుడి వేషాలే ఎక్కువ వచ్చాయి. దాంతో విసుగేసింది. సినిమా పరిశ్రమ తనను సరిగ్గా వుపయోగించుకోలేదన్న బాధా ఆయనకు వుండేది. డా॥ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారికి 80 ఏళ్లు నిండిన సందర్భంగా కొందరు పెద్దలు ఆయన పేర అభినందన సమితి అని ఏర్పడి 2010లో "మధుమురళి" అనే పేర ఒక సంచిక వెలువరించారు. ఎచ్ఎస్‌వికె రంగారావుగారు ఎడిటరుగా, వరప్రసాద్ (శాంతా బయోటెక్నిక్స్) చైర్మన్‌గా వ్యవహరించారు. 43 మందితో ఏర్పడిన ఎడిటోరియల్ బోర్డులో నేనూ ఒకణ్ని. నిజానికి చాకిరీ చేసినదంతా ఎన్‌వి రమణయ్య (కావలి) మేస్టారే! ఆయన ప్రోద్బలంతో నేను సినిమా రంగంతో బాలమురళి గారి అనుబంధంపై ఒక వ్యాసం రాసి పంపాను. బాలమురళిగారికి ఆ ఆ వ్యాసం బాగా నచ్చిందని మేస్టారు చెప్పారు. బాలమురళి జీవిత విశేషాల గురించి రేపు మీడియాలో మీరు చాలా చదవబోతారు, వినబోతారు. అందుకని ఆ వివరాల జోలికి పోకుండా ఆయనకు స్మృత్యంజలి ఘటిస్తూ, ఆ నాటి వ్యాసాన్ని కింద యిస్తున్నాను.

చిత్రసీమలో మురళీరవం

తెలుగువాళ్లకు సంబంధించినంత వరకు సినిమా సర్వకళల సమాహారం. గత ఏభై సంవత్సరాలుగా యీ మాట మరింత 'ఘట్టిగా' చెప్పవచ్చు. పాతరోజుల్లో నవరాత్రి పందిళ్లల్లో సంగీత కచ్చేరీలుండేవి, కూచిపూడి నృత్యాలుండేవి, పౌరాణిక నాటకాలుండేవి, తోలుబొమ్మ లాటలుండేవి. తర్వాత తర్వాత అవన్నీ పోయి 16 ఎం ఎం స్క్రీన్‌తో సినిమాలు వేయనారంభించారు. ఇప్పుడు వీడియో సిడిలు వచ్చాక మరింత సులభం అయిపోయింది. సినిమాలు లేని చోట సినిమా పాటల 'విభావరులు'ంటాయి. సినిమానృత్యాలను అనుకరించే రికార్డింగ్ డాన్సులుంటాయి.

నవరాత్రి పందిళ్లు, శ్రీరామనవమి పందిళ్లు ఏడాదికి మూడో నాలుగో. నట్టింట్లో వెలసిన టీవీ సంగతే చూడండి. సంగీతం కానీయండి, నృత్యం కానీయండి, హాస్యం కానీయండి – కార్యక్రమాలన్నీ సినిమా చుట్టూనే పరిభ్రమిస్తాయి. నేటి యువత ఏ విషయాన్నైనా సరే యింటర్నెట్ ద్వారానే తెలుసుకుంటున్నట్టు, యిప్పటి ప్రజలకు ఏం చెప్పాలన్నా సినిమా ద్వారానే చెప్పాలి. మన సంస్కృతి పరిరక్షించండి అని చెప్పాలన్నా, మీ పిల్లలకు టీకాలు వేయించండి అని చెప్పాలన్నా ఓ సినిమా యాక్టర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా తీసుకురావాల్సిందే!

ఈనాటి పరిస్థితుల ప్రకారం – సినిమాకు రాసినవాడే రచయిత, సినిమాల్లో వేసినవాడే నటుడు, సినిమాలో పాడినవాడే పాటగాడు, సినిమాలో ఆడినవాడే ఆటగాడు, సినిమాకు బాణీలు కూర్చినవాడే సంగీతకర్త, కళాభిజ్ఞుడు. సగటు తెలుగువాడికి సినిమాను మించిన కళారూపం తెలియదు, తెలిసినా పట్టదు. 'కన్యాశుల్కం'లో బండివాడిలాటి (కాంగ్రెస్సూ, దేశసేవా ఎలా పోతే వాడికేం? వాడి వూరి హెడ్ కనిస్టీపు సంగతి తెలిస్తే చాలు) వాళ్లకోసమే యీ వ్యాసం.

'బాలమురళిగారు అపర త్యాగరాజు, ఆధునిక వాగ్గేయకారుడు అయితే కావచ్చుండి. మాకు తెలియదు. సినిమాల్లో ఏ యే పాటలు పాడారో చెప్పండి. దాన్ని బట్టి ఆయన ఎంత గొప్పవాడో మేమే తేల్చుకుంటాం' అంటారు వీళ్లు.

అప్పుడు "గుప్పెడు మనసు"లో 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా?' విన్నారా? అది పాడినది బాలమురళిగారే" అని వాళ్లలో ఒకడికి మెల్లగా చెప్తా. (https://www.youtube.com/watch?v=zPv2SJ5Q2KY)

"ఓహ్, ఆయనా! హీ యీజ్ వండ్రఫుల్! ఆయనైతే "మేఘ సందేశం"లో కూడా ఓ పాట పాడారండీ, 'పాడనా, వాణి..కల్యాణి, సంథింగ్, సంథింగ్" అంటూ హమ్ చేస్తాడు.

నేను నవ్వుతూ చూస్తాను. అంతలోనే అతను వులిక్కి పడతాడు. "సార్, సార్ .. ఈయన ఓ ఫన్నీ సాంగ్.. అంటే ఫన్నీ అంటే ఫన్నీ కాదనుకోండి. కాస్త వెటకారంగా ఓ పాట పాడారండి. 'పలుకే బంగారమాయెరా అందాలరామా,.. లక్షాధికారులైనా లవణమన్నామే కానీ..' యూనో యిటీజ్ సెటైరికల్.."

పక్క కుర్రాడు సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చి "మామా, యూ ఆర్ మిస్టేకెన్. అది అందాలరామా కాదు, కోదండరామా... రామదాసు కీర్తన. మా ఫాదర్ రోజూ వింటూ వుంటాడు. అది మంగళంపల్లి బాలమురళీకృష్ణ అనే ఆయన పాడారు. అది చాలా 'ఫీల్'తో వుండే సాంగ్. నువ్వేదో ప్యారడీ సాంగ్ పాడి..."

మధ్యలో వున్న పిల్లిగడ్డం పిల్లాడు నవ్వాడు. "బాస్, యూ ఆర్ డబ్లీ మిస్టేకెన్. మంగళంపల్లి అంటే "ఉయ్యాల జంపాల" అనే బ్లాక్ అండ్ వైట్ సినిమాలో బాక్‌గ్రౌండులో ఓ పాట పాడారు 'ఏటిలోని కెరటాలు ఏరు విడిచి పోవు' అని. మంచి హార్ట్ రెండింగ్ సాంగ్‌లే. వింటే ఏడుపు వచ్చేయాల్సిందే! ఆయన్ను పట్టుకెళ్లి నువ్వు కీర్తనలకు కలిపేయకు.."

గొడవ పెరక్కుండా నేను కలగజేసుకుంటాను. "కాస్త ఆగండి. ఈ పాటలన్నీ పాడినది ఒకరే.."

సిగరెట్టు అబ్బాయ్ ఆశ్చర్యపడతాడు "మై గాడ్! మా ఫాదర్ దగ్గర సినిమా క్లాసికల్స్ వున్న రికార్డు వుంది. "నర్తనశాల"లో 'సలలిత రాగ సుధారససారం', (https://www.youtube.com/watch?v=SwMQwBEIBsQ) "కర్ణ"లో 'నీవూ నేనూ వలచితిమి'.. (http://www.saregama.com/song/neevu-nenu-valachitimi_31724)యిలాటివి వున్నాయి. వాయిస్ చాలా ఫెమిలియర్ అనుకున్నా గానీ ఈ కీర్తనలకూ యీ సినిమా సింగర్‌కు రిలేట్ చేయలేదు. అవీ యీయన పాడినవేనా సార్?"

నేను తల వూపి జ్ఞానోదయం కలిగించిన సిద్ధపురుషుడి ముద్ర పట్టడానికి తయారవుతూండగానే చెవికి రింగు తగిలించిన కుఱ్ఱాడు భుజాలు ఎగరేశాడు. "ఐ కాన్ట్ బిలీవిట్. కర్ణ అంటే శివాజీ గణేశన్‌కి యీయన పాడాడా? ఓకే అది డబ్బింగ్ సినిమా అనుకో. కానీ నర్తనశాల!? నర్తనశాల అంటే ఎన్టీయార్. ఎన్టీయార్‌కు ప్లేబ్యాక్ యిచ్చారా ఈయన!? కమాన్..బీ రీజనబుల్ యార్."

నాకు ఉడుకుమోత్తనం వస్తుంది. "శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు" సినిమాలో 'వసంత గాలికి వలపులు రేగ..' (https://www.youtube.com/watch?v=GpascF_7gwM) పాట విన్నారా? దానిలో ఎన్టీయార్‌కి పాడలేదా? "పల్నాటి యుద్ధం"లో 'శీలము కలవారి చినదానా' అంటూ హరనాథ్‌కి పాడలేదా? https://www.youtube.com/watch?v=-wx7k55zBKk–గిని7డి55చిఔచది ఆ మాట కొస్తే ఆయన సినిమా కెరియర్ అక్కినేనికి పాడడంతో ప్రారంభమైంది తెలుసా..?" అంటూ వాళ్లకు క్లాసు తీసుకున్నాను.

---

1957లో బాలమురళి మద్రాసు ఆల్ ఇండియా రేడియోలో వుద్యోగం చేస్తూ వుండగా "సతీ సావిత్రి" సినిమాలో పాడడానికి ఆఫర్ వచ్చింది. ఆ సినిమాలో కథానాయికగా చేసిన ఎస్.వరలక్ష్మి బాలమురళీకి శిష్యురాలు. ఆమె బలవంతం మీద హీరోకి ఓ పద్యం మాత్రం పాడతానని ఒప్పుకున్నారు. ఆ తర్వాత వాళ్ల కోరిక మీద ఎనిమిది పాటలు పాడారు. ఆ సినిమాలో ఒక పాట రాయడంతో బాటు ఓ పాటకి వయొలిన్, మృదంగం వాయిస్తూ పాడారు కూడా. సినిమా హిట్ అయినా బాలమురళీకృష్ణ నాగేశ్వరరావుకి నేపథ్యగాయకుడిగా కొనసాగలేదు.

దానికి కారణం బాలమురళిగారికి సినిమారంగంపై వున్న చిన్నచూపు అనుకుంటే పొరబాటు. ఆయనకు సినిమా మీడియం బలం తెలుసు. సినిమా పట్ల సరదా కూడా వుంది. ఆయన సినిమాల్లో పాటలు పాడడమే కాదు, సంగీతం సమకూర్చారు, నటించారు కూడా. సినిమారంగం కూడా ఆయనను దూరంగా పెట్టలేదు. ఆయనను అప్పుడప్పుడు వుపయోగించుకుంటూనే వచ్చింది. పౌరాణిక నేపథ్యం వున్న ఉన్న సినిమాలలో ఆయన చేత కనీసం ఓ పద్యమైనా పాడించుకుంటూ వచ్చింది. ఆయన స్థాయి పాట యివ్వగలుగుతున్నాం అన్న ధైర్యం కలిగినప్పుడు ఆయననే పిలుస్తోంది.

సినిమా గాయకుడిగా, సినిమా సంగీతదర్శకుడిగా ఆయన జాతీయ అవార్డులు అందుకున్న సందర్భాలు వున్నాయి. మొదటిది "హంసగీతె" (1975) దీనిలో జయదేవుని అష్టపదులకు కొత్తరకంగా రాగాలు కట్టాడాయన. ఉదాహరణకి ఒకటి వినండ (https://www.youtube.com/watch?v=j0udSBZYn-c&index=2&list=PLmlR_D2dvzb_T0wtUQO-qi9MN-Pbn-bXQ) కు కాగా రెండవది "మధ్వాచార్య" (1986)కు. రెండూ కన్నడ సినిమాలే! జి.వి.అయ్యర్ తీసినవే. వీటితో బాటు "ఆదిశంకరాచార్య" (1983) "రామానుజాచార్య" (1989) చిత్రాలకూ సంగీత దర్శకత్వం చేయించుకున్నారు. ఈ సినిమాల్లో బాలమురళి ఎన్నో ప్రయోగాలు చేశారు. "హంసగీతె"లో అష్టపదులకు కొత్త బాణీలు కట్టారు. "మధ్వాచార్య"లో ఆరేడు వాయిద్యాలను మాత్రం వుపయోగించి మధ్వాచార్యుల కాలంలో ప్రాచుర్యంలో వున్న సంగీతాన్ని యిచ్చారు. ఒక బెంగాలీ సినిమాలో పాడిన పాటకు జాతీయ అవార్డు వచ్చింది.

"సంధ్యారాగ" (1974) అనే కన్నడ సినిమాకి ఉత్తమ సంగీతదర్శకుడిగా ప్రాంతీయ బహుమతి లభించింది. తమిళ సినిమా ప్రేక్షకులు బాలమురళి అనగానే 'ఒరునాళ్ పోదుమా' ("తిరువిళ్యాడల్" సినిమాలోనిది) (https://www.youtube.com/watch?v=ppnzHXqT5Sg) పాటను గుర్తు చేసుకుంటారు. అంతేకాదు "తలైవనుక్కొరు తలైవి" అనే సినిమా సంగీతదర్శకత్వం కూడా. "తిరువిలైయాడల్" తీసిన ఎ.పి.నాగరాజన్ "నవరత్నం" అనే తమిళ చిత్రం ఎం.జి.ఆర్ హీరోగా తీస్తూ ఒక పాట పెట్టారు. ఆ పాటలో కర్నాటక, హిందూస్తానీ, పాశ్చాత్య బాణీలతో బాటు స్వచ్ఛమైన జానపద వరస కూడా పాడాలి. ఎం.జి.ఆర్. బాలమురళి

వద్దకు వచ్చి ఆ పాటకు న్యాయం చేయమని అభ్యర్థించారు. బాలమురళి సరేనన్నారు.

దక్షిణాది భాషాచిత్రాలన్నిటిలోనూ పాటలు పాడడమే కాక, బాలమురళి నటించారు కూడా. ఎవిఎం అధినేత ఎవి మెయ్యప్పన్‌గారితో స్నేహం కారణంగా ఆయన కోరిక మేరకు "భక్త ప్రహ్లాద" సినిమాలో నారదుడిగా నటించి, ఎన్నో పాటలు పాడారు. అయితే తర్వాత అనేక సినిమాలలో అటువంటి తరహా పాత్రలే రావడంతో ఆయనకు మొహం మొత్తి నిరాకరించారు. చాలామందికి తెలియకపోవచ్చు – ఆయన "సంధ్య గిదెన సిందూరం" అనే మలయాళ సినిమాలో కథానాయకుడిగా నటించారు.

అది ఒక సంగీతదర్శకుడు, అతని శిష్యురాలి చుట్టూ తిరుగుతుంది. డబ్బుకోసం కచేరీలు చేయడం యిష్టపడని ఓ గురువు ప్రతిభావంతురాలైన ఒక శిష్యురాలిని అభిమానించి ఆమె కోసం ఏమైనా చేయడానికి సిద్ధపడతాడు. ఆమె సినిమాల్లో చేరతానంటే ఆస్తి తెగనమ్మి ఆమెను ప్రమోట్ చేస్తాడు. ఆమెకు ఓ సంగీతదర్శకుడు సినిమాల్లో అవకాశం యిస్తాడు. ఆమె అతన్ని ప్రేమించి గర్భవతి అవుతుంది. ఈ గురువుకి జ్ఞానోదయమై, పరితపించి, క్రమంగా క ృంగి క ృశిస్తాడు. శిష్యురాలిగా సీమ నటించగా గురువుగారిగా బాలమురళి వేశారు.

ఇంతటి బరువైన పాత్రను నటించిన బాలమురళికి సినిమా రంగంపై చిన్నచూపు వుందనుకోవడం సబబు కాదు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే – "మన భావాలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లడానికి సినిమా మంచి మీడియం. ప్రజల మీద సినిమా ప్రభావం అధికం. అంచేత శాస్త్రీయ సంగీతం – అది అంత గొప్పగా లేకున్నా – సినిమా ద్వారా అయితే ప్రజలు వింటారు. చూస్తారు. ప్రభావమూ వుంటుంది. సామాన్య ప్రజానీకం కోసం మంచి చిత్రాలు నిర్మించాలి. వాటిల్లో క్రమంగా కొంత సంప్రదాయ ధోరణుల్ని చేర్చాలి."

బాలమురళి గారికి సినిమారంగంపై యింత పాజిటివ్ ద ృక్పథం వున్నా ఆ రంగం – ముఖ్యంగా తెలుగు సినిమారంగం – ఆయన ప్రతిభను పెద్దగా వుపయోగించుకోకపోవడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. దీనికి కారణాలు ఆలోచిస్తే కొన్ని అంశాలు తడతాయి.

---

సినిమారంగంలో రాజీ పడడం ఎక్కువ. ఎంత ప్రతిభావంతులైనా సరే, తమ స్థాయికి దిగివస్తేనే సినిమా నిర్మాతదర్శకులు సౌకర్యంగా ఫీలవుతారు. సాలూరి రాజేశ్వరరావుగారు ఎంత జీనియస్‌యైనా కానీయండి, నిర్మాత వచ్చి ఫలానా హిందీ ట్యూన్ కాపీ కొట్టండి అంటే కొట్టి తీరవలసినదే. "ఘంటసాలగారూ మీరు భగవద్గీత ఆలపిస్తే ఆలపించవచ్చు. కానీ మా సినిమాలో హీరోది జులాయిపాత్ర. అందుచేత మీరు ఆ రకమైన పాట పాడితీరవలసినదే" అని దర్శకుడు నిర్బంధిస్తే కాదనలేని పరిస్థితి.

ఎకు ఎన్ని రకాల సంగీతాలైనా రానీయండి, లలితసంగీతకారులుగా ముద్ర పడితేనే మీతో సినిమారంగం 'కంఫర్టబుల్'గా ఫీలవుతుంది. శాస్త్రీయ సంగీతకారులుగా ముద్రపడిన వాళ్లంటే సినిమావారికి గౌరవంతో కూడిన బెదురు. సినిమారంగంలోని వ్యక్తులకు తాము ఎటువంటి పరిస్థితుల్లో పనిచేస్తున్నామో తెలుసు. శాస్త్రీయ రంగంలో అత్యున్నత స్థాయికి చేరిన వారిని యిముడ్చుకోలేమనీ తెలుసు. అందుకని వారిని అప్పుడప్పుడు మాత్రమే అరుదుగా వాడుకుంటారు. బడే గులాం ఆలీఖాన్, పండిట్ రవిశంకర్, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్ వసంతకుమారి, శీర్కాళి గోవిందరాజన్– ఎవరైనా కానీయండి అప్పుడప్పుడు పిలిచి, సత్కరించి, సేవలు వుపయోగించుకుని, మర్యాదగా పంపేస్తూండడమే తప్ప తమలో భాగంగా చేసుకోవడానికి సాహసించలేదు. నాట్యం విషయంలోనూ యిటువంటి వుదాహరణలు కనబడతాయి. గోపీక ృష్ణను, రుక్మిణీ అరండేల్‌ను సినిమారంగం హరాయించుకోగలిగిందా?

అదే విధంగా బాలమురళి వంటి తేజోమూర్తిని తెలుగు సినిమారంగం తగుపాటి దూరంలో వుంచే గౌరవించింది. ఎందుకంటే రేడియోల ద్వారా, రికార్డుల ద్వారా బాలమురళీగానం విడిగా అత్యంత ప్రచారం పొంది వున్నది. ఆయన పాడుతుంటే రామారావో, నాగేశ్వరరావో వినబడరు. బాలమురళీయే వినబడతారు. విశ్వనాథ గురించి 'దేశం పట్టని కవి' అన్నట్టు బాలమురళి 'హీరోలకు పట్టనంత గాయకుడు'. అందుకే ఆయన "మేఘసందేశం" సినిమాలో ఆయనే కనబడి పాడుకున్నారు. లేదా "ఉయ్యాల జంపాల", "అందాల రాముడు", "గుప్పెడు మనసు" సినిమాలలో లాగ నేపథ్యగీతాలలో రాణించారు.

---

ఈ అంశాలు చెప్పేసరికి మా యువమిత్రులు అంగీకరిస్తారు – "పరిస్థితులు యిలా వున్నపుడు బాలమురళిగారి జీవితంలో సినిమారంగానికి పెద్ద ప్రాముఖ్యత లేదని ఫీలయి లాభం లేదండి. పరస్పర గౌరవం వున్నా కొన్ని 'సంగతులు' ఓ స్థాయికి మించి ముందుకు సాగవంతే!" అని. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**(దీనితో యిస్తున్న బాలమురళి రేఖాచిత్రం బాపుగారి సోదరుడు శంకరనారాయణగారు గీసినది. ఫోటో "సంధ్యాగిందెన సిందూరం" సినిమాలో సీమ, బాలమురళి)**

బ్లాక్ మనీ అరికట్టడానికి పెద్ద నోట్ల రద్దు చేస్తున్నాం అనే ప్రకటన రాగానే ప్రతివారి ఆలోచనా రియల్ ఎస్టేటు రంగంపైకి పోయింది. ఎందుకంటే బ్లాక్ మనీ అనగానే నోట్ల రూపంలో కంటె బంగారం, రియల్ ఎస్టేటుల్లోనే అధికంగా వుంటుందని అందరికీ తెలుసు. రద్దు చేసిన రాత్రి నుంచే బంగారం 10 గ్రా.లు 50 వేలకు అమ్ముడు పోయిందన్న కథనాలు వచ్చేశాయి. మరి రియల్ ఎస్టేటు సంగతేమిటి? పాత ధరల కంటె ఎక్కువ రేటుకి కొన్నారా? లేక తక్కువ రేటుకి యిమ్మన్నారా? భూములు కొనడానికి అడ్వాన్సు యిచ్చినవారు ముందుకెళుతున్నారా? వెనక్కి పోతున్నారా? రద్దు వలన రేట్లు పెరుగుతాయా. తరుగుతాయా అనే చర్చ ప్రారంభమైంది.

భూమి వ్యాపారవస్తువై పోయింది -

పంట పండించడానికి, నివాస ముండడానికి భూమి కొన్నంతకాలం యిబ్బంది లేకపోయింది. కానీ షేర్‌మార్కెట్టులో షేర్లు కొన్నట్టు భూమిని కూడా భవిష్యత్తులో అధికధరలకు అమ్మడం కోసమే కొనడం మొదలుపెట్టాక అనేక రకాల అనర్థాలు సంభవించాయి. భూములు ధరలకు రెక్కలు వచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో రియల్ ఎస్టేటు రంగానిది 11% వాటా. 2014 అంచనాల ప్రకారం యిది 6.5 లక్షల కోట్ల విలువైన రంగం. ఇంత పెద్ద రంగంలో ప్రతి లావాదేవీలో నల్లధనం ప్రమేయం వుండడంతో నల్లధనం వ్యాప్తి అనూహ్యంగా పెరిగిపోయింది. ఎందుకలా అంటే దానికి ముఖ్యకారణం - ఆర్థిక విధానాల సరళీకరణ తర్వాత 1995 నుంచి పదేళ్లపాటు యీ రంగానికి పెట్టుబడులు కురిసి ఉత్తిపుణ్యాన భూమి ధరలు పెరగసాగాయి. ప్రభుత్వాలు కూడా ఆ ప్రాజెక్టు వస్తోంది, యీ ప్రాజెక్టు వస్తోందని ప్రకటనలు గుప్పించి స్థలాల ధరలు పెరిగేందుకు దోహదపడ్డారు. భూమి ధరలు పెరిగిన రాష్ట్రమే ప్రగతి పథంలో సాగుతున్నట్లు, అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లు అర్థాలు తీయసాగారు. 2005లో ఎఫ్‌డిఐ (ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు) అనుమతించడంతో యీ ట్రెండు యింకా పెరిగింది. 2005-14 మధ్య రూ.69 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చిపడ్డాయి. ఇది 2025 నాటికి 44 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తూ వచ్చారు.

రియాల్టీలో బ్లాక్‌మనీ ఎందుకు అధికం? -

ఇంత వేగంగా పెరిగే రంగంలో కార్యకలాపాలన్నీ వాస్తవధరలకే జరిగి వుంటే బాగుండేది. కానీ జరగకపోవడానికి కారణం - ప్రభుత్వం పెంచుకుంటూ పోతున్న రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ. అది కట్టడానికి యిష్టపడని కొనుగోలుదారుడు భూమి విలువను తక్కువ చేసి, ప్రభుత్వధరకే కొన్నట్లు చూపుతున్నాడు. వాళ్లలా తగ్గించి చూపుతున్నారని, ప్రభుత్వం వాస్తవంగా వున్న మార్కెట్ ధర కంటె ఎక్కువగా కూడా పెంచేసే సందర్భాలూ వున్నాయి. గిరాకీ వున్నచోట్ల ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర కంటె మార్కెట్ ధర రెండింతలు, ఒక్కోసారి మూడు-నాలుగింతలు కూడా వుంటోంది. అంటే ప్రభుత్వం ఓ పక్క నష్టపోతూ వుంది, మరో రకంగా నల్లధనవ్యాప్తికి దోహదపడుతోంది. ఉదాహరణకి మార్కెట్ విలువ గజం లక్ష రూపాయలుంటే, రిజిస్ట్రేషన్ విలువ రూ. 50 వేలుంటే, 500 గజాల స్థలాన్ని కొనేటప్పుడు రెండున్నర కోట్లు నగదు రూపంలో చేతులు మారి అదే నల్లధనంగా మారుతోంది. మార్కెట్ ధరకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ధరను మాటిమాటికి సవరిస్తూ చార్జీలు బాగా తక్కువగా పెడితే నల్లధనానికి ఆస్కారం లేకుండా చేయవచ్చు.

అంతేకాకుండా ఏదైనా ఆస్తిని కొని తిరిగి అమ్మినపుడు, ప్రభుత్వదృష్టిలో సాధారణంగా రావల్సిన సొమ్ము కంటె అధికంగా వచ్చిన సొమ్ము వస్తే కాపిటల్ గెయిన్స్ (మూలధన లాభం) పై 20% పన్ను వేరే చెల్లించాలి. లేదా దాన్ని వేరే చోట పెట్టుబడి పెట్టాలి, అదీ కాకపోతే మూడేళ్ల బాండ్స్‌లో పెట్టాలి. సొమ్ము అమ్మేదే అవసరం కోసం. దాన్ని బాండ్స్‌లో పెట్టమంటే బాధగా వుంటుంది. అందువలన తక్కువ సొమ్ముకే అమ్మానని చూపుతారు. తెలుగు రాష్ట్రాల్లో ఏటా రూ.2 లక్షల కోట్లు నల్లధనంగా మారుతోందని "ఈనాడు" అంచనా. ప్రజలు నిజాయితీగా వ్యవహరించాలంటే స్టాంప్ డ్యూటీ తగ్గించి (రాష్ట్రప్రభుత్వానికి నష్టం) కాపిటల్ గెయిన్స్ చట్టం ఎత్తేసి (కేంద్రానికి నష్టం) చూడాలి. ఆ లోటును వేరేలా పూడ్చాలి.

రియాల్టీ ప్రస్తుత పరిస్థితి -

సరే యిదంతా థియరీ. ప్రస్తుతం రియల్ ఎస్టేటు రంగం ఎలా వుందంటే గత కొద్దికాలంగా విపరీతంగా పెరిగిపోతోందన్న అంచనాలతో డిమాండ్ కంటె సప్లయి పెంచేశారు. ధరలూ పెంచారు. దాంతో జనాలు కొనడం మానేశారు. పెట్టుబడి యిరుక్కుపోవడంతో ఇక గత్యంతరం లేక ధరలు తగ్గించి అమ్మసాగారు. ఆ విధంగా మొత్తం 8 నగరాల్లో (ముంబయి, ఢిల్లీ దాని పరిసర ప్రాంతాలు, పుణె, బెంగుళూరు, చెన్నయ్, హైదరాబాదు, కలకత్తా, అహ్మదాబాదు) 2014 ప్రథమార్ధంలో అమ్ముడుపోని యిళ్లు 7.15 లక్షలుంటే, 2015కి అది కాస్త తగ్గి 7.10 లక్షలైంది. 2016కి 6.60 లక్షలైంది. దేశం మొత్తం మీద జరిగే యిళ్ల లావాదేవీల్లో 35% ముంబయిలోనే జరుగుతాయి. 2012లో అక్కడ ప్రారంభమైన 68 వేల యూనిట్లు కాగా అంతకుముందే ప్రారంభమై అప్పుడు అమ్ముడుపోయినవి 45 వేల యూనిట్లు. 2015కి వచ్చేసరికి ప్రారంభమైనవి 19 వేల యూనిట్లు కాగా అమ్ముడు పోయినవి 29 వేల

యూనిట్లు. పుణె, బెంగుళూరు, చెన్నయ్, హైదరాబాదు, కలకత్తా, అహ్మదాబాదులలో యించుమించు యిదే పరిస్థితి. ఉండడానికంటె మళ్లీ అమ్మడానికే ఫ్లాట్లు కొనే ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో అయితే పరిస్థితి యింకా ఘోరం. దాంతో వాళ్లు 2016లో ధరలు బాగా (కొన్ని చోట్ల 25% వరకు అట) తగ్గించివేశారు. అందువలన కొత్త ప్రాజెక్టులు 29% పెరిగి 24 వేల యూనిట్లు కాగా, అమ్మకాలు 23% పెరిగి 35 వేలు అయ్యాయి.

చాలా నగరాల్లో గత మూడేళ్లల్లో ధరలు పెద్దగా పెరగలేదు. 2013లో రేటు 100 అనుకుంటే 2016 జూన్ నాటికి ఢిల్లీలో అది 104, కలకత్తాలో 105 చెన్నయ్, అహ్మదాబాద్‌లలో 112, పుణెలో 115, హైదరాబాదులో 119, ముంబయిలో 120, బెంగుళూరులో 122కి చేరాయి. బెంగుళూరులో అధికంగా పెరగడానికి కారణమేమిటంటే అక్కడి ప్రజలు తాము నివాసం వుండడానికే కొంటున్నారు. అందువలన క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఢిల్లీలో అవసరం లేకపోయినా స్పెక్యులేషన్ ద ృష్టితో కొంటున్నారు. అందువలన అక్కడ అతి తక్కువగా పెరిగింది. ఈ మూడేళ్లలో ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుంటే ఈ పెరుగుదల చెప్పుకోదగినది కాదు. తాము పెట్టుబడి పెట్టి కట్టిన యిళ్లను ఎలాగోలా అమ్ముకోవడానికి బిల్డర్లు రకరకాల మార్గాలు పడుతున్నారు. ఫ్లాటు స్వాధీనం చేసే వరకు బ్యాంకు ఋణంపై వడ్డీ తాము కడతామని కొందరు బిల్డర్లు అంటూంటే, 'కొద్దిగా చెల్లించి యింట్లో చేరిపోండి, తర్వాత బాంకు ఋణం వచ్చాకనే కట్టండి' అనే రిస్కీ ఆఫర్ యిస్తున్నారు మరి కొందరు. మిడ్-లెవెల్ హౌసింగ్ సెగ్మెంట్‌లోనే కాస్త కదలిక వుండడం గమనించి మధ్యతరగతి ప్రజలను ఆకర్షించడానికి రహేజా వంటి పెద్ద బిల్డర్లు కూడా 5-30% వరకు డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నారు. టాటా హౌసింగ్ వాళ్లయితే తమ ఫైనాన్స్ వింగ్ ద్వారా 8% వడ్డీకే ఋణాలిస్తున్నారు.

రియల్ ఎస్టేటుపై నిఘా వేసిన ప్రభుత్వం -

రియల్ ఎస్టేటు రంగంలో నిబంధనలు ఉల్లంఘించి కట్టేవారు ఎక్కువ కావడంతో ప్రభుత్వం వారిపై శీలలు బిగిస్తోంది. రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ బిల్లు అని మార్చిలో పార్లమెంటులో పాసయి, మేలో చట్టంగా వచ్చింది. దాని ప్రకారం 500 గజాల కంటె ఎక్కువ స్థలంలో కట్టే లేదా 8 అపార్టుమెంట్లు వున్న బ్లాకు కట్టే బిల్డర్లు, రియల్ ఎస్టేటు ఏజంట్లు ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేయించుకుని, డాక్యుమెంట్లలో రిజిస్ట్రేషన్ నెంబరు తెలపాలి. అమ్మేటప్పుడు ఫ్లాట్ ప్లింత్ ఏరియా, సూపర్ బిల్టప్ ఏరియా అని కాకుండా కార్పెట్ ఏరియా (గోడల మధ్య వుండే చోటు) ఎంతో స్పష్టంగా తెలియపరచాలి. కొనేవారి వద్ద నుండి వసూలు చేసిన డబ్బులో 70% నిధులు విడిగా ఎస్క్రో ఖాతాలో జమ చేసి, మరో ప్రాజెక్టుకి మళ్లించకుండా, దీనికే వెచ్చించాలి. కోర్టులు కూడా యిటీవలి కాలంలో మాట తప్పిన చాలామంది బిల్డర్లకు శిక్షలు వేస్తున్నాయి. అందువలన రియల్ ఎస్టేటు వ్యాపారం అంత లాభదాయకంగా లేదని బాధపడుతున్న తరుణంలో యిప్పుడీ నోట్ల రద్దు సమస్య వచ్చింది. బ్లాక్ మనీ ఆపరేషన్స్ ఆగిపోతే రియల్ ఎస్టేటు ఏ మేరకు ప్రభావితమవుతుందో అర్థం కాక అందరూ కళవెళ పడుతున్నారు.

నోట్ల రద్దు ప్రభావం -

ఖాళీస్థలాలు, పొలాలు కొనడానికి బ్యాంకులు ఋణాలివ్వవు. అందువలన ఎంత తక్కువకు కొన్నట్లు చూపినా వాళ్లకు నష్టం వుండదు. బ్లాక్‌మనీ అక్కడ చలామణీ అవుతుంది. అదే ఫ్లాట్ల విషయానికి వస్తే, గృహఋణాలపై ఆదాయపు పన్ను మినహాయింపు వుంటుంది. ఆస్తి విలువను బట్టి, ఋణగ్రహీత సామర్థ్యం బట్టి సాధ్యమైనంత ఎక్కువ ఋణం యిచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి. అందువలన బ్యాంకు లోనుతో ఫ్లాట్‌లు, యిళ్లు కొనేవాళ్లు అసలు ధరను చూపడానికి వెనుకాడరు. అక్కడ నల్లధనం ప్రమేయం తక్కువగా వుంటోంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రధానంగా దెబ్బ తిన్నది స్థలాల మార్కెట్టే. ఈ నోట్ల రద్దు వలన భూమి ధరలు కనీసం 30% పడతాయని అంచనా. ఫ్లాట్ల విషయంలో కూడా తక్కువ ధరలో తయారైన వాటి విషయంలో మార్పు పెద్దగా వుండకపోవచ్చు కానీ లగ్జరీ ఫ్లాట్స్ విషయంలో యింటీరియర్స్‌లో బ్లాక్‌మనీకి ఆస్కారం వుంది కాబట్టి అక్కడా 30-35% ధరలు తగ్గవచ్చని అంచనా. ముంబయిలో రెండున్నర లక్షల ఫ్లాట్లు ఖాళీగా పడి వున్నాయి కాబట్టి వాళ్లు పడిపోయిన రేట్లకు అమ్మలేరు కాబట్టి, కొత్త బిల్డర్లు యిప్పట్లో ముందుకు రారు కాబట్టి, రేటు నిలకడగా వుంటుందని అక్కడి రియల్టర్లు ఆశిస్తున్నారు.

ఈ స్కీము సంగతేదో తేలేదాకా ఆగితే మంచిదనుకున్న విక్రేతలు, క్రయదారులు వాయిదా వేయడానికే నిశ్చయించుకోవడంతో హఠాత్తుగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఆ మేరకు రాష్ట్రప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఒక ఏడాది పాటు స్తబ్దంగా వున్న రియల్ ఎస్టేటు శాంతిభద్రతలకు ఏ లోపం రాలేదని, పరిస్థితి గతంలో లాగానే వుందని అందరూ గ్రహించాక ఏడాది, ఏడాదిన్నరగా బాగా పుంజుకుని దాదాపు 10% గ్రోత్ చూపించింది. మళ్లీ యిప్పుడు యీ దెబ్బ పడింది. నోట్ల రద్దు జరిగేవరకు రిజిస్ట్రేషన్‌పై రోజుకి రూ. 16 కోట్ల ఆదాయం వచ్చేది నవంబరు 14 నాటికి అది సగం కంటె తక్కువకు పడిపోయింది. ఇదే పరిస్థితి మిగతా చోట కూడా వుంది. నవంబరు మొదటి వారంలో గుడ్‌గావ్‌లో 168 సేల్సు డీడ్‌లు రిజిస్టరైతే రెండో వారానికి వచ్చేసరికి అది 78 అయింది. నోయిడాలో నవంబరు 8 వరకు రోజుకి 500-600 రిజిస్ట్రేషన్లు అయితే తర్వాత నుంచి 20-30 అవుతున్నాయి. బెంగుళూరులో ఈ అంకె 1800 నుంచి 200 కి తగ్గింది.

బ్యాంకు సిబ్బంది కష్టాలు –

ఈ స్కీము సఫలమవుతుందా, విఫలమవుతుందా అని రియల్టర్లతో సహా అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ స్కీము అమలులో బ్యాంకుల పాత్ర అతి ముఖ్యం. అవి వాటి పాత్రను ఎలా పోషిస్తున్నాయో గమనిస్తే ఆసక్తికరమైన విషయాలు బయటపడుతున్నాయి. నోట్ల రద్దు బ్యాంకు సిబ్బందికి వరమా? శాపమా? అని అడిగితే కొందరికి వరం, చాలా మందికి శాపం అనే చెప్పాలి. పని విపరీతంగా పెరిగింది. పైనుంచి నోట్లు రావటం లేదు, ప్రజలు చూస్తే నోట్లు లేక అసహనంగా ఫీలవుతున్నారు. మామూలుగానే బ్యాంకు కస్టమర్లలో సహనం తక్కువ. 'మా డబ్బు మేం తీసుకోవడానికి యింతసేపు నిలబడాలా?' అనే భావంతో వుంటారు. ఇప్పుడు రెండు రెండున్నర గంటలు క్యూలో నిలబడి, ఎప్పుడు నో క్యాష్ బోర్డు పెడతారోనన్న ఆందోళన పడి లోపలకి వస్తున్నారు కాబట్టి మరీ కోపంగా వుంటున్నారు. కౌంటర్ వద్దకు వెళ్లిన దాకా వుండి 'మీ ఖాతాలో బాలన్సు వున్నా, రోజుకి పదివేలు, వారానికి 24 వేలు యివ్వాలని రూలున్నా, మా దగ్గర డబ్బు లేదు కాబట్టి అంత యివ్వం. సగమో, పావో యిస్తాం.' అంటే కోపం కట్టలు తెంచుకుంటోంది. 'చూడబోతే ఎటిఎంల్లో యీ వారం లిమిటు పెంచుతానన్నారు, పెంచకపోగా సొంతం మూసిపారేశారు, యిక మా డబ్బులు మా చేతికి ఎలా వస్తాయి?' అంటూ ప్రదర్శించే వారి ఆగ్రహాన్ని తట్టుకోలేక సిబ్బందిలో టెన్షన్ పెరుగుతోంది. ఆ ఆందోళనతోనే రోజుకి 18 గంటలు పనిచేయడంతో 12 రోజుల్లో 11 మంది బ్యాంకు సిబ్బంది మరణించారని వారి సమాఖ్య ఆరోపిస్తోంది. 'రద్దు చేయగానే రూ.2000 నోటు పంపి, రెండు వారాల తర్వాత రూ.500 నోట్లు పంపటమేమిటి? జనాలు ఎక్కువగా వాడేవి 500, 100 అని తెలియదా? నోట్లు చేతిలో ఆడక ఆ కోపాన్ని బ్యాంకువారిపై చూపిస్తున్నార'ని సమాఖ్య అంటోంది.

బ్యాంకు మేనేజర్లు గోల్‌మాల్ ఎలా చేయగలుగుతున్నారు? –

ఇదే సమయంలో బ్యాంకు మేనేజర్లు 20–25% కమిషన్ తీసుకుని దొడ్డిదారిన పాత నోట్లు మార్చేస్తున్నారనే పుకారూ ప్రబలింది. అందరూ అనుమానించేటంత స్థాయిలో కాకపోయినా ఏదో ఒక స్థాయిలో కొందరు వ్యక్తులు దీనికి పాల్పడి వుండవచ్చు. అదెలా సాధ్యం? అని అడిగితే పెద్దమొత్తాల్లో చెల్లింపులు చేయరాదంటూ వచ్చిన ఆదేశాలు నవంబరు 12 వరకు చేతికి రాకపోవడంతో బ్యాంకు మేనేజర్లు 10,11 తారీకుల్లోనే భారీగా డబ్బులు విడుదల చేసేశారట. విత్‌డ్రాయల్స్ రూపంలో కొందరు ఖాతాదారులు తీసేసుకున్నారు. తర్వాత నోట్ల మార్పిడికై వచ్చిన వారికి ఖాతా వుండాలన్న నిబంధన లేదు కాబట్టి ఉన్న కొత్త నోట్ల స్టాకులో సగం వారికిచ్చి, తక్కిన సగం ప్రయివేటుగా మార్చేశారట. గుర్తింపు కార్డు నెంబరు ఏదో ఒకటి రాసేసి, మొత్తమన్నీ ఖాతా లేనివారే మార్చుకున్నారని చూపిస్తున్నారట. 18 నవంబరు వరకు నోట్ల మార్పిడి జరిగినది 33 వేల కోట్లు. వాటిలో ఎన్ని నికార్సయినవో, ఎన్ని కావో తెలియటం లేదు.

పాత నోట్లతో డిమాండ్ డ్రాఫ్టులు తీయించి, మర్నాడు వాటిని కాన్సిల్ చేయించి కొత్త నోట్లు యిచ్చేస్తున్నారట. లావాదేవీలు పెద్దగా జరగని డార్మెంటు ఖాతాల్లో పాత నోట్లు జమ అయినట్లు, కొత్త నోట్లు విత్‌డ్రా చేసుకున్నట్లు చూపించారట. కొంతమంది ఖాతాదారులకి చెప్పి యిలాటి పని చేశారు. వాళ్ల పేరు వుపయోగించుకున్నందుకు గాను తమకు వచ్చిన కమిషన్‌లో కాస్త వాటా ముట్టచెప్పారట. అప్పటికప్పుడే విత్‌డ్రా చేస్తే అనుమానం రావచ్చని ఖాతాలో కొంత వుంచినట్లున్నారు. ఎందుకంటే డిపాజిట్ల రూపంలో 5.12 లక్షల కోట్లు జమ అయితే, ఖాతాల నుంచి, ఎటిఎంల ద్వారా వెనక్కి తీసుకున్నది 1.03 లక్షల కోట్లు మాత్రమే. రికార్డు సరిగ్గా మేన్‌టేన్ చేస్తే యీ వ్యవహారంలో బ్యాంకు మేనేజర్లు, క్యాష్ ఆఫీసర్లు కలిసి చేసినది కనిపెట్టడం కష్టమే. ఎప్పటికైనా పట్టుబడి సస్పెండ్ ఐనా, నిరూపించడమూ కష్టమే. నేషనలైజ్‌డ్ బ్యాంకుల్లో యిలా వుంటే కంప్యూటరైజేషన్ జరగని కోఆపరేటివ్ బ్యాంకుల సంగతి చెప్పనే అక్కర్లేదు. పోస్టాఫీసుల్లో కూడా యిలాటివి జరుగుతున్నాయన్న అనుమానంతో ముఖ్యమైన తపాలా కేంద్రాల్లో హైదరాబాదులో సిబిఐ దాడులు జరిపింది. గ్రామగ్రామాన వున్న పోస్టాఫీసుల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావడం ఎప్పటికైనా జరుగుతుందా?

ముందస్తు సమాచారం – ముందస్తు జాగ్రత్త –

10,11 తారీకుల్లో నల్లధనవంతులు భారీ మొత్తాల్లో విత్‌డ్రా చేసుకోవాలంటే వారి ఖాతాల్లో అంతంత బాలన్సు ముందే వుండాలి కదా. నల్లధనికులు బ్యాంకుల్లో ఎందుకు దాచుకుంటారు అనే సందేహం వస్తుంది. ముందే సమాచారం అందినవారు సెప్టెంబరు నెల నుంచి తమ ఖాతాల్లో డబ్బులు వేయసాగారు. అందుకే 2015 సెప్టెంబరు 16–30 తారీకుల మధ్య బ్యాంకు డిపాజిట్లు 3.56 లక్షల కోట్లు పెరిగాయి. అక్టోబరు నెలలోనూ అదే ధోరణి కొనసాగింది. కేంద్రప్రభుత్వ ఉద్యోగుల జీతాల ఎరియర్స్ దీనికి కారణం అంటే నప్పదు. ఎందుకంటే అది 35 వేల కోట్ల కంటె ఎక్కువ లేవు. ముందస్తు సమాచారం అందిన కొందరు యింకోలా ప్రవర్తించారు. డబ్బు రూపేణా వుంటే ముప్పని, బంగారంగా, భూములుగా మారుద్దామనుకుని తమ ఖాతాల్లోంచి విత్‌డ్రా చేసేశారు. గత ఐదు సంవత్సరాలుగా అక్టోబరు నెల నగదు ఉపసంహరణల సరాసరి రూ. 1.16 లక్షల కోట్లు వుండగా యీ ఏడాది మాత్రం రూ.2.56 లక్షల కోట్లు! అలా తీసిన డబ్బును బంగారం వగైరాలు కొనకపోతే, మళ్లీ పైన చెప్పిన విధంగా ఖాతాల్లో వేసి, కొత్త నోట్లు తెచ్చుకుని వైట్ చేసుకున్నారు. ముందస్తు సమాచారం అందిన మరి కొందరు లిబరలైజ్‌డ్ రెమిటెన్సు స్కీమ్ వాడుకున్నారు. దాని ప్రకారం

గతంలో ఒక వ్యక్తి 75 వేల డాలర్లను తనతో విదేశాలకు తీసుకెళ్లవచ్చు. ప్రతిపక్షంలో వుండగా దీన్ని విమర్శించిన బిజెపి, తమ సర్కారు వచ్చాక 1.25 లక్షలకు, తర్వాత 2.5 లక్షల డాలర్లకు పెంచారు. గత ఏడాది మే నుంచి యీ ఏడాది మే వరకు ఆ స్కీము కింద 30 వేల కోట్ల రూ.లు తరలి వెళ్లింది. అంతకు ముందు ఏడాది కంటె యిది దాదాపు 3 రెట్లు ఎక్కువ.

జన్‌ధన్ ఖాతాలను ధనాధన్‌గా వాడుకున్నారు –

ఇలా తరలించే అవకాశం లేని కొందరు జన్‌ధన్ యోజనా ఖాతాలను వాడుకున్నారు కాబట్టే 13 రోజుల్లో 21 వేల కోట్లు జమ అయింది. రద్దుకు ముందు 26.5 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో 46 వేల కోట్లుంటే యిప్పుడది 67 వేల కోట్లయిపోయింది. అంటే సగటున ఒక్కో ఖాతాలో 79 వేలన్నమాట. మరి 50 వేల పరిమితి మాటేమిటి? ఆ పరిమితి విధించడానికి పట్టిన 3, 4 రోజుల్లోనే లక్షల్లో జమ అయిందన్నమాట! అదెలా సాధ్యం? ఈ రెండు వారాల్లో వాళ్లందరికీ లాటరీ తగిలిందంటే నమ్మలేం కదా! తెలంగాణలో జన్‌ధన్ యోజనా ఖాతాలు మొత్తం 81.71 లక్షలుంటే వాటిల్లో 23.77 ఖాతాల్లో నవంబరు 8 నాటికి ఒక్క రూపాయి కూడా బాలన్స్ లేదు. రూపాయి కూడా బాలన్స్ లేకుండా ఏడాదిన్నరగా పడి వున్న ఈ ఖాతాల్లో అంతలేసి డబ్బులు వచ్చిపడుతుంటే (తెలంగాణ మొత్తంలో జన్‌ధన్ యోజనాలో వెయ్యి కోట్లు వచ్చి వుంటుందని అంచనా) బ్యాంకు సిబ్బందికి సందేహం రాలేదా? బ్యాంకు మేనేజర్లు, కాష్ ఆఫీసర్లు కలిసి యిలాటి వారికి సహకరిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నకొద్దీ బ్యాంకుల్లో, ఎటిఎంలలో 'నో క్యాష్' బోర్డు కనబడగానే ప్రజల్లో అవేశకావేషాలు పెరుగుతున్నాయి. అవి కొన్ని చోట్ల దాడులకు దారి తీస్తున్నాయి. స్కీము ప్రకటించేముందు బ్యాంకు సిబ్బంది యిలా చేసేందుకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పడకపోవడం కేంద్ర ప్రభుత్వం తప్పు. ఇప్పుడు వాళ్లకీ అనుమానం గట్టిగా తగిలినట్టుంది. ఇవాళ్టి నుంచి బ్యాంకులో నోట్ల మార్పిడిని నిలిపివేశారు. వీటివలన సామాన్యులకు కష్టాలే తప్ప డబ్బున్న వాళ్లకు అంతిమంగా మేలు చేసేట్లే వున్నారు. ఎందుకంటే లెక్క చూపని సొమ్ముపై 200% పన్ను, ప్రాసిక్యూషన్ అని ఆర్థిక శాఖ చెప్పడంతో కొందరు నల్లధనికులు దడిసి నోట్లను తగలబెట్టారు. కానీ యిప్పుడు 60% పన్ను కడితే చాలు, కేసూగీసూ వుండదు అని చెప్దాం అని నిన్న కాబినెట్‌లో ప్రతిపాదన వచ్చిందట.

చాలినన్ని ఎటిఎమ్ లేవీ? –

ఇక ఎటిఎమ్‌ల విషయానికి వస్తే దేశం మొత్తంలో వున్నవి 2.20 లక్షలు. వాటిల్లో స్కీము పెట్టిన రెండు వారాల తర్వాత కొత్త నోట్లు పట్టేట్లా రికాలిబ్రేట్ చేసినవి 82,000 మాత్రమే అని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నరంటే, కాదు 1.20 లక్షలు అంటోంది కేంద్రం! వీటిల్లో ఏ లెక్క కరక్టని ప్రజలని అడిగితే వారు విశదంగా చెప్పగలుగుతారు. అన్నీ పనిచేశాయి అనుకున్నా 12700 లక్షల జనాభాకు 2.2 లక్షల ఎటిఎమ్‌లుట! అంటే లక్ష జనాభాకు సరాసరిన 17 ఎటిఎంలు వున్నట్లు! బ్రిక్స్ దేశాలతో పోల్చి చూసుకుంటే మనదే అతి తక్కువ. చైనాలో 55, రష్యాలో 184, బ్రెజిల్‌లో 129, సౌత్ ఆఫ్రికాలో 66 వున్నాయి. మన దేశంలో విడిగా చూస్తే ఢిల్లీలో 43 వుంటే యూపిలో 9, బిహార్‌లో 7 వున్నాయి. ఇలా దేశమంతా ఒకలా లేవు. తెలంగాణలో కంటె ఆంధ్రలో తక్కువ ఎటిఎంలు వున్నాయి.

ఈ ఎటిఎమ్‌లలో 10% కూడా గ్రామాల్లో లేవు. పని చేయాలంటే కరంటు వుండాలి, నెట్ వుండాలి. అందువలన విగ్రహపుష్టి, నైవేద్య నష్టిగా వున్నవి బహుళం. గ్రామీణుల్లో 8% మందికి మాత్రమే బ్యాంకు బ్రాంచీలు అందుబాటులో వున్నాయి. నగరాలలో, పట్టణాల్లో బ్రాంచీలున్నా ఖాతాలు తెరిచిన వారు కూడా తక్కువ. జనాభాలో 53% మందికి మాత్రమే ఖాతాలున్నాయి. వాటిల్లో ఆపరేటివ్ ఎన్నో చూడాలి. కాష్‌లెస్ లావాదేవీలు చేయండి, క్రెడిట్ కార్డులు వుపయోగించండి అంటోంది ప్రభుత్వం. 127 కోట్ల జనాభాలో 50 లక్షల మందికి మాత్రమే కార్డులున్నాయి. ఒకటి కంటె ఎక్కువ కార్డులుండడం చేత 2 కోట్ల కార్డులని అంకె కనబడుతుంది. కార్డున్నా వుపయోగించాలి కదా, కేంద్రమంత్రి సదానంద గౌడ బెంగుళూరులో ప్రైవేటు ఆసుపత్రిలో తన తమ్ముడు చనిపోతే బిల్లు చెల్లించడానికి క్యాష్ వాడదామని చూశారు తప్ప కార్డు వాడదామని చూడలేదు. వాళ్లు పాత నోట్లు పుచ్చుకోమని మొండికేయడంతో వార్త పత్రికల కెక్కింది.

రూల్సు మారుస్తూనే వున్నారు –

ఒప్పుకోనందుకు ఆసుపత్రి వాళ్లనీ తప్పుపట్టి ప్రయోజనం లేదు. ఏ రూలు ఎప్పుడు మారుస్తారో తెలియదు. అది జరిగిన మర్నాడే వెయ్యి రూ.ల నోట్లు మార్చడానికి వీల్లేదని ఆదేశం వచ్చింది. ఖాతాల్లోనే వేయాలట. డిసెంబరు 30 గడువును 15కి తగ్గించేశారు కాబట్టి ఆదరబాదరగా వేద్దామని బ్యాంకు కెటళితే చాంతాడంత క్యూలు. నాకు తెలిసి, ఏ ప్రభుత్వపథకంలోనూ యిన్ని మార్పుచేర్పులు చేయలేదు. ఇవన్నీ ముందే వూహించలేదా అంటే బిజెపి నాయకులు 'ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటూ చైతన్యంతో అలరారుతోంది ఆర్‌బిఐ, మీరు మెచ్చుకోవాలి' అని బుకాయిస్తున్నారు. 'అయ్యవారేం చేస్తున్నారంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు' అనే సామెతలో అయ్యవారు కూడా యిలాగే నిత్యచైతన్యంగా వున్నట్టు భావించాలన్నమాట. ఇన్నాళ్లూ తెలియలేదు. అమలులో పొరపాట్లను మన్‌మోహన్ సింగ్ ప్రస్తావిస్తే ఆ విమర్శ స్వీకరించలేని అరుణ్ జేట్లీ కాంగ్రెసు హయాంలోని స్కాములను

ప్రస్తావించారు. దానికీ దీనికీ సంబంధం ఏమిటి? టీస్టాలు వాళ్ల దగ్గర్నుంచి కార్డులు స్వైప్ చేసేట్లా చేద్దామని మా లక్ష్యం అంటోంది ప్రభుత్వం. మంచిదే, అయితే స్వైప్ మెషిన్లు అందుబాటులో వుంచారా? ఇవాళ కూరల దుకాణంలో 'మీరూ మిషన్లు పెట్టుకోవాలయ్యా' అంటే 'అప్లయి చేశాం సార్, రెండు, మూడు నెలలు పడతాయంటున్నారు' అని జవాబు వచ్చింది. ఇదీ ప్రభుత్వ సన్నద్ధత.

అందరితో చర్చించి వుంటే నష్టమేమిటి? –

అసలు ఉద్దేశం మాట ఎలా వున్నా, యీ పథకం అమలు మాత్రం గత్తరబిత్తరగా జరుగుతోందని, ప్రజలు విసిగి వేసారుతున్నారని మోదీ గుర్తించటం లేదు. ఏవో కొద్దిపాటి యిబ్బందులే, ఓ 50 రోజులు ఓపిక పట్టండి అని అతి చులాగ్గా చెప్తున్నారు. బ్యాంకులను, ఎటిఎంలను వేటినీ సన్నద్ధం చేయకుండా, కాబినెట్ సహచరుల సైతం ఎవర్నీ అడక్కుండా పథకం ప్రవేశపెట్టడ మెందుకో తెలియదు. ముందే తెలిసిపోతే కొంప మునిగిపోయి వుండేదని వాదించేవారు వాస్తవాలను మర్చిపోతున్నారు. బ్లాక్‌మనీ అంటే ఏమిటి? బ్యాంకుల ద్వారా లెక్కలోకి రానిది. అంతే కదా! 2017 మార్చిలోగా బ్యాంకుల్లోకి రాని 500, 1000 నోట్లు చెల్లవు అని చెపితే వచ్చే నష్టమేమీ లేదు. అప్పుడు బినామీ ఖాతాల్లో వేసేస్తారు అనుకుంటే మరి యిప్పుడు జరుగుతున్నదీ అదే కదా! బ్యాంకుల్లోకి డబ్బు వచ్చాక, ఓపిక కొద్దీ ఒక్కో ఖాతాను పరీక్షించి, ఎవరు బినామీయో, ఎవరు సనామీయో తేల్చుకోవాలి.

మోదీలో ఇందిర పోకడలు –

మోదీలో ఇందిరా గాంధీ లక్షణాలు పుష్కలంగా వున్నాయి. ఆవిడా యింతే, కాబినెట్‌లో ఎవర్నీ లెక్క పెట్టేది కాదు. ఆవిడ మాటకు ఎదురాడడానికి లేదు. కొందరు అధికారులను సలహాదారులుగా పెట్టుకుని అనుకున్నది చేసేసేది. ఆవిడంటే భయపడేవారు వంది మాగధుల్లా చేరి భజనలు చేస్తూంటే అదే నిజమనుకునేది. ఎమర్జన్సీ విధించకపోయినా, విధించిన ఆర్నెల్లకు ఎత్తివేసినా ఇందిర ఓడిపోయేదే కాదు. అమోఘంగా వుంది, ప్రజలు హర్షిస్తున్నారు అని చెప్పి ఆవిణ్ని తప్పుదారి పట్టించారు. నిజమే అనుకుని ఎన్నికలు పెట్టి ఘోరంగా ఓడిపోయింది. ఇప్పుడు మోదీ కూడా ఓ యాప్ పెట్టి, 90% జనాభా ఓహో అంటున్నారనే తీర్మానానికి వచ్చేశాడు. సుప్రీం కోర్టుకి ప్రభుత్వం తరఫున దాఖలైన అఫిడవిట్ చూస్తేనే తెలుస్తోంది – సరైన ఏర్పాట్లు జరగలేదు అని ఒప్పుకోవడమే లేదని, ప్రజలు కాస్త యిబ్బంది పడుతున్నారట! అడ్డుకున్నవారందరూ అవినీతిపరులే అని ప్రచారం చేస్తున్నాడు తప్ప యదార్థాలు గ్రహించటం లేదు. 50 రోజులు ఓర్చుకోలేరా అంటున్నారు కానీ యిప్పటికి రెండు వారాలుగా బ్యాంకులు, పోస్టాఫీసులు తక్కిన వ్యాపారాలన్నీ కట్టిపెట్టేసి నష్టపోతున్నాయి. ప్రజలు పనులు మానుకుని గంటల తరబడి క్యూలలో నిలబడడం చేత విలువైన మాన్–అవర్స్ నష్టపోతున్నారు. అది దేశానికి కూడా నష్టమే. ఒక సమ్మె జరిగితే యిన్ని మాన్–అవర్స్ పోయేయని లెక్కలు కట్టే ప్రభుత్వం సొంత డబ్బు తీసుకోవడానికి కూడా ప్రజల్ని క్యూలలో నిల్చోబెడితే జరిగే నష్టాన్ని లెక్కవేయలేదా? ఇంత చేసినా ఆర్నెల్ల తర్వాత కూడా బ్లాక్‌మనీ వేరే రూపంలో ఎదురైతే అప్పుడు ప్రజలు నిస్పృహ చెందుతారు.

భవనాల ధరలు తగ్గుతాయా? –

ఇప్పటిదాకా వున్న పోకడ చూస్తూంటే యీ పథకం విజయవంతమయ్యే సూచనలు కనబడటం లేదు. అవునోకాదో తేలేటప్పటికి ఆర్నెల్లు పడుతుంది. ఈ లోగా రియల్ ఎస్టేటు రంగంలో వున్నవారి కష్టాలు అన్నీయిన్నీ కావు. గతంలో బ్లాక్‌మనీ పెట్టి హెచ్చుధరల్లో స్థలాలు కొన్నవారు యిప్పుడు మొత్తమంతా వైట్‌లో వీరికి అమ్మగలరా? అమ్మితే కాపిటల్ గెయిన్స్ దవడ వాయగొట్టదా? మొత్తం వైట్‌లో యిచ్చేవాడు కూడా దొరకాలి కదా. దొరక్కపోతే తక్కువ ధరకు అమ్ముకోవాలి. గలరా? ఎటూ తేల్చుకోలేక స్తబ్దత వ్యాపించవచ్చు. ఇక ఫ్లాట్ల రేట్లు ఎలా వుండవచ్చు? అసలు భవననిర్మాణ రంగంలో ఎందరు మిగులుతారో చూడాలి. ఎందుకంటే స్థలాలున్నవారు పైన చెప్పిన కారణాల చేత పాత రేట్లకు అమ్మరు. ఇక యిసుక, యిటుక చెల్లింపులు, రోజు కూలీలకు కార్డుల ద్వారా చేస్తామంటే కుదరదు. ఇసుక విషయంలో దొంగతనంగా తవ్వుకుని తెచ్చేదానికి చెక్కు పేమెంటు చేయలేరు. తెప్పించే ప్రతి దానికి బిల్లు అంటే పన్నులు ఎక్కువ కట్టాలి. ఇన్‌కమ్‌టాక్స్ వారి నిఘా వీరిపై వుంటుంది.

ఈ కారణాల చేత కొంతకాలం పాటు నిర్మాణరంగం నుంచి మధ్య స్థాయి బిల్డర్లు తప్పుకోవచ్చు. ఆ పరిస్థితుల్లో యిప్పటికే పూర్తిగానో, ముప్పాతికో నిర్మాణం పూర్తయి అమ్ముడుపోని ఫ్లాట్లు యిప్పుడు అమ్ముడుపోయే అవకాశాలుంటాయి. పాత ఫ్లాట్లకు మార్కెట్ పెరగవచ్చు. సప్లయి తగ్గి డిమాండ్‌కు సరిగ్గా సరిపోతే నిర్మాణరంగంలో మళ్లీ కాసులు గలగలలాడుతాయి. అది మళ్లీ కొందరు కొత్తవారిని ఆకర్షించవచ్చు. అప్పటికి ఏదో ఒక విధంగా స్థలాల విషయంలో కదలిక వస్తేనే వాళ్లకు అవకాశం చిక్కుతుంది. స్థలం లేనిదే, యిళ్లెక్కడ కట్టగలరు? అప్పుడు ప్రభుత్వం గృహనిర్మాణ రంగంలో గతంలోలా చురుగ్గా వ్యవహరించవచ్చు. ప్రభుత్వభూముల్లో యిళ్లు కట్టి మొత్తమంతా వైట్ మనీలో అమ్మచూపవచ్చు. ఇలాటి కరక్షన్ వచ్చేందుకు రెండు, మూడేళ్లు పట్టవచ్చునిపిస్తోంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

**నవంబరు 36, 37 న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 105 వీక్లీకై**

**ఎమ్బీయస్ : వీసాల విషయంలోనూ చెప్పినది చేస్తానంటున్న ట్రంప్**

ఎన్నికలలో ఎన్నో వాగ్దానాలు చేస్తారు. పదవిలోకి వచ్చాక ఎన్ని గుర్తుంటాయో, ఎన్నిటికి మోక్షమిస్తారో ఎవరికీ తెలియదు. భారతీయులు వీసాల పేరుతో వలస వచ్చి, స్థానికుల ఉద్యోగాలను కాజేయడాన్ని నిరోధిస్తానంటూ ప్రచారం చేసుకుని, భారత ఉద్యోగుల యాసను సైతం వెక్కిరించి నెగ్గిన ట్రంప్ విజయం సాధించగానే గతవారం పుణెలోని తన ట్రంప్ టవర్ భాగస్తులతో సమావేశం కావడంతో ప్లేటు ఫిరాయించాడంటూ విమర్శలు వచ్చాయి. అది చాలనట్లు ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో 150 మిలియన్ డాలర్ల ట్రంప్ ప్రాజెక్టులోని భాగస్వామి ఐన జోస్ ఆంటోనియోను ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అమెరికాకు వాణిజ్య, ఆర్థిక వ్యవహారాల రాయబారిగా పంపుతానని ప్రకటించడంతో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత కూడా వ్యాపారస్తుడిగానే వుంటున్నాడని ఎత్తి చూపారు కొందరు. వీటన్నిటికి సమాధానమా అన్నట్లు మంగళవారం నాడు మాట్లాడుతూ ట్రంప్ ట్రాన్స్-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ (టిపిపి) నుండి అమెరికా వైదొలగుతుందని ప్రకటించడంతో బాటు వీసా దురుపయోగాల గురించి కూడా విచారణ జరిపిస్తానన్నాడు. ''వ్యాపారం, ఎనర్జీ, జాతీయ భద్రత, రెగ్యులేషన్, ఇమ్మిగ్రేషన్, ఎథిక్స్ రిఫార్మ్ అనే ఆరు అంశాలపైనే తొలిరోజుల్లో నా ప్రభుత్వపు ఫోకస్ వుంటుందని ప్రకటించాడు.

వాణిజ్యంలో చైనాను ఏకాకి చేయడానికై పసిఫిక్ మహా సముద్రపు అంచుల్లో వున్న 11 దేశాలతో (కెనడా, పెరు, మెక్సికో, చిలీ, వియత్నాం, సింగపూర్, బ్రూనీ, మలేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్) కలిసి ఒబామా ఏర్పాటు చేసినదే టిపిపి. ఈ విధంగా ప్రపంచవాణిజ్య రంగాన్ని అమెరికాయే శాసిస్తుంది తప్ప చైనా శాసించటం లేదని అందరికీ తెలిసి వస్తుందని ఒబామా అభిప్రాయం. 'దీనివలన అమెరికన్ కంపెనీలు ఆ యా దేశాలకు నిధులను, ఉద్యోగాలను తరలించుకుపోవడం వలన యిది మన దేశానికి వినాశకరంగా పరిణమించింది. దీనిలోంచి బయటకు వచ్చేసి ప్రతిదేశంతోను విడివిడిగా ఒప్పందాలు చేసుకుంటూ అమెరికా కంపెనీలను, ఉద్యోగాలను వెనక్కి రప్పించడమే నా లక్ష్యం' అంటాడు ట్రంప్. దీన్ని డెమోక్రాట్ల తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి హిల్లరీతో పోటీ చేసి ఓడిపోయిన బెర్నీ శాండర్స్ మద్దతు ప్రకటించాడు. 'ఏ చర్య చేపట్టినా నేను చూసేది ఒక్కటే – ఉక్కు ఉత్పాదన కానీయండి, కార్ల తయారీ కానీయండి, వైద్యం కానీయండి, వస్తూత్పత్తి అయినా, పరిశోధన అయినా అది మన దగ్గర జరగాలి. అంతే!' అని ట్రంప్ ఘంటాపథంగా చెప్తున్నాడు.

'బొగ్గు, షేల్ గ్యాస్ రంగాల్లో చాలా నిబంధనలు పెట్టి యిక్కడ ఉద్యోగాలను నిర్మూలించారు. నేను ఆ నిబంధనలను సాధ్యమైనంతవరకు తగ్గిస్తాను. సైబర్ ఎటాక్స్‌కు గురై మన అమెరికన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దెబ్బ తింటోంది. దేశరక్షణ ముఖ్యం. ఎటాక్స్‌కు గురి కాకుండా దేశాన్ని కాపాడతాను. తొలి 100 రోజుల్లో నేను యివన్నీ చేస్తాను. చేరిన మొదటి రోజే చేపట్టే పని ఎథిక్స్ (నైతికత) గురించి! ప్రభుత్వోద్యోగాల నుండి ఎగ్జిక్యూటివ్ అఫీషియల్స్ బయటకు వచ్చిన ఐదేళ్ల వరకు లాబీయిస్టులుగా మారడంపై నిషేధం విధిస్తాను. (మన దగ్గర ప్రభుత్వం నుంచి రిటైరైన మాజీ అధికారులు కంపెనీల తరఫున లయజనింగ్ వర్క్ పేరుతో వారి పాత పరిచయాలుపయోగించి పలుకుబడితో, లంచాలతో కంపెనీలకు పనులు చేసి పెట్టి డబ్బు సంపాదిస్తారు. అమెరికాలో దాన్ని లాబీయింగ్ అంటారు. అది చట్టబద్ధమైనది కూడా). విదేశీ ప్రభుత్వాల తరఫున లాబీయింగ్ చేయడంపై జీవితకాల నిషేధం పెడతాను.' అంటున్నాడు.

ఇక ఎచ్1బి వీసాల విషయానికి వస్తే – ఏటా నైపుణ్యం కల 85,000 మందిని ఎచ్1బి వీసాల ద్వారా అమెరికా తన దేశంలోకి రానిస్తుంది. వీరిలో 20 వేల మంది ఉన్నత విద్య అభ్యసించే సాంకేతిక నిపుణులు కాగా, తక్కిన 65 వేలు ఉద్యోగులకై యిస్తారు. వీటికై కంపెనీలు లక్షల్లో అప్లయి చేస్తాయి. ఈ ఏడాది యిప్పటికే 2.36 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వారు లాటరీ తీసి 85 వేలు ఎలాట్ చేస్తారు. ఈ వీసాలు కంపెనీల పేర యిస్తారు. ఏ ఉద్యోగానికై యిస్తున్నారో కూడా చెప్తారు. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీలు మంచి నైపుణ్యం వున్న ఉద్యోగులను, హెచ్చు జీతాలిచ్చి తీసుకుంటారు. వీసాలిచ్చి తెప్పించుకుంటారు. వారికి గ్రీన్‌కార్డు (పౌరసత్వం) వచ్చేందుకు సాయపడతారు కూడా. ఇన్ఫోసిస్, టిసిఎస్ వంటి ఇండియన్ కంపెనీలు యీ వీసాలను తక్కువ జీతాలకు పనిచేసే ఉద్యోగులను తెప్పించుకోవడానికి ఉపయోగించు కుంటున్నాయి. వారిలో చాలామందికి గ్రీన్‌కార్డు రావటం లేదు కూడా. అమెరికన్ కంపెనీలు తమ పని చేయడానికి యీ కంపెనీలకు కాంట్రాక్టు యిచ్చి ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. ఇవి నైపుణ్యం లేని ఉద్యోగులను కూడా యీ ఎచ్1బి వీసాల కింద తెప్పిస్తున్నాయని ఆరోపణలున్నాయి. నైపుణ్యం అనే దాన్ని నిర్వచించడంలో కొంత అస్పష్టత వుంది. దాన్ని వినియోగించుకుని యీ కంపెనీలు తక్కువ జీతాలిచ్చి తమ ఉద్యోగులచే పనిచేయించి లాభాలు సంపాదిస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోతున్నారు. 2013లో ఇన్ఫోసిస్ యిలాటి కేసులో 34 మిలియన్ డాలర్లు చెల్లించవలసి వచ్చింది. ఇటువంటి దుర్వినియోగంపై లేబరు డిపార్టుమెంటు ద్వారా విచారణ జరిపిస్తానని ట్రంప్ చెప్తున్నాడు. ఈ లాటరీ సిస్టమ్‌కు స్వస్తి చెప్పి, పెద్ద జీతాల ఉద్యోగాలిచ్చే కంపెనీలకు వీసాలు జారీ చేసే పద్ధతి పెట్టాలని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూట్ కోరుతోంది.

ఈ వీసాలకు బద్ధవిరోధి ఐన జెఫ్ సెషన్స్‌ను ట్రంప్ ఎటార్నీ జనరల్‌గా నియమిస్తున్నాడు. జెఫ్ గత ఏడాది సదరన్ కాలిఫోర్నియా

ఎడిసన్ కంపెనీ ఎచ్1బి వీసాలను దుర్వినియోగం చేసిందని ఆరోపిస్తూ అటార్నీ జనరల్ ఎరిక్ హెూల్డర్‌ను కోరాడు. ఆ లేఖపై డెమోక్రాట్ పార్టీకి చెందిన బెర్నీ శాండర్స్, మరో యిద్దరూ కూడా సంతకం పెట్టారు. న్యూయార్క్‌కు చెందిన డెమోక్రాటిక్ సెనేటరు చుక్ షూమర్ కూడా యీ వీసాలకు వ్యతిరేకి. అతన్ని డెమోక్రాటిక్ పార్టీ సెనేట్‌లో పార్టీ నాయకుడిగా నియమించింది. శాండర్స్ ఎలాగూ వ్యతిరేకిస్తున్నాడు. అందువలన యీ వీసాల విషయంలో ట్రంప్‌కు ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నుంచి కూడా మద్దతు రావచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016)**

## ఎమ్బీయస్ : రాజమహల్‌పై పగా?

రాజస్థాన్ ముఖ్యమంత్రిణి వసుంధరా రాజేకు, ఆమె ఒకప్పటి స్నేహితురాలు, జయపూర్ రాజమాత ఐన పద్మినీదేవికి మధ్య ఓ రాజమహల్ విషయంలో గొడవ నడుస్తోంది. 1729లో మహారాజా జయ్ సింగ్ తనకై, తన రాణులకై జయపూర్‌లో పెద్ద మహల్ కట్టిస్తూండగా అతని రాణుల్లో ఒకరైన చంద్రా కఉవర్ రణావత్ అనే ఆవిడ తను అందరితో కలిసి వుండనని చెప్పి తనకై ఆ మహల్‌కు 10 కి.మీ. దూరంగా రాజమహల్ ప్యాలెస్ కట్టించమని కోరింది. కట్టక తప్పలేదు రాజుగారికి. మూడు శతాబ్దాలు గడిచాక దాని విలువ రూ.5 వేల కోట్లయింది. ఆ కుటుంబానికి చెందిన పద్మినీదేవి ఆ ఆస్తికి అధిపతి. జయపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జెడిఏ) కమిషనర్ రోడ్డు విస్తరణకు అడ్డుగా వుందన్న మిషతో ఆగస్టు 24న ఆ మహల్‌పై దాడికి వెళ్లడంతో కథ రచ్చకెక్కింది. అంతకు కితం వారం యీ విషయంపై పద్మిని వసుంధర వద్దకు వెళ్లి చర్చలు జరిపింది. ఆగస్టు 24 న కమిషనర్ కూల్చివేతలు తలపెట్టారని తెలిసి 22న పద్మిని ఫోన్ చేస్తే వసుంధర 'మహల్ ముందు రోడ్డు విస్తరణ చేసుకుంటారు తప్ప మరేమీ జరగద'ని హామీ యిచ్చింది. పద్మిని కుమార్తె, బిజెపి పక్షాన సవాయ్ మాధోపూర్ ఎమ్మెల్యే ఐన దియా కుమార్ అగర్వాల్‌తో మాట్లాడింది – 'మా కుటుంబం వాదనలన్నీ విన్నాకనే ఏదైనా తలపెట్టండి.' అని. ఆయన సరే అన్నాడు కానీ 24 న పోలీసులతో సహా 600 మందిని, బుల్‌డోజర్లను వెంటేసుకుని మహల్ ప్రవేశద్వారం ముందున్న ప్రాంతానంతటినీ చుట్టుముట్టి గేటు మూసేసి, సీలు వేసి, అక్కడున్న పురాతన భవనాన్ని కూల్చివేశాడు. ఇదంతా మీడియా ముందే జరిగింది. విధ్వంసం ఆపమని కోరుతూ దియా అక్కడకు వచ్చి కమిషనర్‌ను ప్రాధేయపడడం కూడా మీడియా కవర్ చేసింది. దియా అడగ్గాఅడగ్గా చివరకు కమిషనర్ కూలుద్దామనుకున్న మరో బిల్డింగును అలాగే వదిలేసి, ముఖద్వారానికున్న గేట్లకు తాళం వేసి మరీ వెనుదిరిగారు.

దియా పేరు మీద వున్న ఆ మహల్‌ను ఢిల్లీకి చెందిన జైసాల్ సింగ్ గారి సుజన్ గ్రూపుకి 2014లో 10 సం॥రాల లీజుకి యిచ్చారు. తక్కినది పద్మిని కుటుంబం అజమాయిషీలో వుంది. దానిలో 2700 చ.గ.ల భూమిని, సింహద్వారాన్ని తీసుకుందామని జెడిఏ చూస్తోంది. స్వాతంత్ర్యానంతరం మహారాజాకు, భారత ప్రభుత్వానికి జరిగిన ఒప్పందం ప్రకారం 34 వేల చ.గ.లు ప్రభుత్వానికి వచ్చింది. అది యిప్పుడు జెడిఏ అజమాయిషీలో వుంది. తక్కిన 2700 చ.గ.ల స్థలం కూడా తీసుకుందామని జెడిఏ ప్రయత్నిస్తే పద్మిని కుటుంబం కోర్టుకి వెళ్లింది. 2011లో తీసుకోవడానికి వీల్లేదంటూ కోర్టు ఆర్డరిచ్చింది. ఇప్పుడా కార్నర్ ప్లాట్ రూ.వెయ్యి కోట్ల విలువ చేస్తుంది. దాన్ని స్వాధీనం చేసుకుందామని జెడిఏ ప్రయత్నం. దానికోసం మొరటు పద్ధతులు వుపయోగించింది. ఈ చేష్టకు వ్యతిరేకంగా రాజకుటుంబం ప్రజల మద్దతు కోరింది. రాజకుటుంబంపై గౌరవం కలిగిన ప్రజలు, ముఖ్యంగా రాజపుత్రులు, వారికి అండగా నిలిచారు. 'మాకు ఆరెస్సెస్‌తో చాలాకాలంగా సత్సంబంధాలున్నాయి. మా అమ్మాయి బిజెపి ఎమ్మెల్యే. అయినా మాకిలా జరిగిందంటే దానికి అర్థం ఏమిటి? ముఖ్యమంత్రికి తెలియకుండానే యింత పెద్ద పని జరుగుతుందా? నేను వసుంధర దగ్గరకి వెళ్లి దేబిరించను. న్యాయం ఎవరి పక్షాన వుందో ప్రజలిచ్చే తీర్పే నాకు ముఖ్యం." అంది పద్మిని. కోర్టులో కేసు కూడా పెట్టింది.

తర్వాత బిజెపి అధ్యక్షుడు అమిత్ షా దృష్టికి వివాదాన్ని తీసుకెళ్లింది. అమిత్ వెంటనే వసుంధరకు ఫోన్ చేసి రాచకుటుంబాన్ని యిలా వీధిలోకి యీడిస్తే ఎలా అని మందలించి, బిజెపి నేషనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ సౌదన్ సింగ్‌ను రాయబారానికై జయపూర్ పంపాడు. అతను వసుంధరకు, పద్మినికి మధ్య సమావేశం ఏర్పాటు చేశాడు. తర్వాత సెప్టెంబరు 4న ప్రధానద్వారం వద్ద గేటుకి తాళం తీసేశారు. రెండు రోజుల తర్వాత స్థానిక కోర్టు జెడిఏను తప్పుపట్టి, యథాతథ పరిస్థితి నెలకొల్పమంది. పడగొట్టినవాటిని సొంత ఖర్చుతో నిర్మించి యివ్వమంది. జెడిఏ హైకోర్టుకి అప్పీలుకై వెళ్లింది. హైకోర్టు గేటు తెరవండి కానీ మళ్లీ కట్టాలా లేదా అన్నదానిపై ఆలోచించి చెప్తామంది.

ఉద్రిక్తత చల్లబడింది అనుకుంటూండగా జెడిఏ కమిషనర్ అగర్వాల్ అక్టోబరు 28 రాత్రి తన డిప్యూటీ కమిషనర్‌ను, కొందరు అసిస్టెంట్లను పంపించి జెడిఏ ఆస్తి ఎంతవరకు వుందో మార్కింగ్ చేసి రమ్మన్నాడు. వాళ్లు ఆ పని చేస్తూండగానే పద్మిని అల్లుడు నరేంద్ర సింగ్ మెయిన్‌డోరు గేట్లు మూసేసి తాళం వేసేశాడు. అధికారులు లోపల యిరుక్కుపోయారు. వాళ్ల వాహనాల్లో గాలి తీయించేశాడు నరేంద్ర. అధికారులను రక్షించడానికి పోలీసులు కూడా భయపడ్డారు. చివరకు బిజెపి నాయకులు రాజీ చేసి మర్నాడు ఉదయం అధికారులను విడిపించారు. పద్మినికి వసుంధర పట్ల కోపం పోలేదు. జయపూర్‌లో మెట్రో నిర్మాణ సందర్భంగా కొన్ని పాత గుళ్లు పడగొడుతున్నారు. కొందరు ప్రజలు దాన్ని వ్యతిరేకిస్తూ నవంబరు 15 న బంద్ ప్రకటించారు. పద్మిని దానికి తన మద్దతు ప్రకటించింది.

ఇద్దరు పెద్ద కుటుంబాల మధ్య తగవులో యిరుక్కున్న కమిషనర్ అగర్వాల్‌కు, జెడిఏ సెక్రటరీ పవన్ అరోడాకు నవంబరు 3 న స్థానచలనం జరిగింది. ఇంతలో ఆగస్టు 24 నాటి ఘటనపై వేసిన కేసులో ఒక మేజిస్ట్రేటు అగర్వాల్, అరోడా, మరో ముగ్గురు కమిషనర్ ఆఫీసు ఉద్యోగులపై బెయిలబుల్ అరెస్టు వారంటు జారీ చేశాడు. నవంబరు 25 న కోర్టుకి హాజరు కావాలన్నాడు. ఈ లోగా నవంబరు 9 న నిందితులు, రాజస్థాన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ శర్మ హైకోర్టులో హాజరై సంఘటనల క్రమాన్ని వివరించారు. కేసు విచారణను హైకోర్టు వాయిదా వేసింది. అసలు ఆగస్టు 24 న అంత దూకుడుగా ఎందుకు వెళ్లావని అగర్వాల్‌ని అడిగితే "రాజమహల్ ప్యాలెస్ పక్కనే ఆ 2700 చ.గ.ల స్థలంలో పద్మిని గారు రెసిడెన్షియల్ ఫ్లాట్స్ కట్టడానికి జయపూర్ మునిసిపల్ కార్పోరేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకున్నారు. రాజమహల్ దియా పేరు మీద వుంది కానీ పక్కనున్న యావత్తు స్థలం జెడిఏదే. ఫ్లాట్స్ కట్టడానికి అనుమతి కోరడం ద్వారా వీళ్లు జెడిఏ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించారని అర్థమైంది.' అన్నాడు. "వసుంధర స్వయంగా అడిగి వుంటే ఆ స్థలాన్ని ఉత్తినే, ఏ పరిహారం కోరకుండా యిచ్చేసి వుండేవాళ్లం" అంటాడు పద్మిని అల్లుడు. దాని నిజమైన హక్కుదారులు ఎవరో తేలేదాకా కమిషనర్ చేసినది తప్పని కాని, ఒప్పని కాని అనలేం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2016) (ఫోటో – కూల్చివేత దృశ్యం)**

**డిసెంబరు 01,02 వీక్లీకై**

## ఎమ్బీయస్ : హిందువులు అక్రమవలసదారులు కారా?

బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి మన దేశంలో అక్రమంగా వలస వచ్చినవారికి వ్యతిరేకంగా సరిహద్దుల్లో వున్న రాష్ట్రాలలో ఎప్పుడూ అలజడి రేగుతూనే వుంది. ముఖ్యంగా అసాంలో దీని విషయమై ఆల్ అసాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) అనే విద్యార్థి సంస్థ ఏర్పడింది. ప్రఫుల్ల మొహంత, భృగు పూకన్ అనే యిద్దరు యువకులు దానికి నాయకులుగా రాష్ట్రంలోని కాంగ్రెసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమమే నడిపారు. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడ్డాక అక్రమంగా అసాంకు వచ్చిపడిన బంగ్లాదేశీయులను వెనక్కి పంపేయాలని 1979 నుంచి ఆరేళ్లపాటు హింసాత్మక ఆందోళన నడిపారు. చివరకు రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం 1985లో దిగివచ్చి ఆసుతో, రాష్ట్రప్రభుత్వంతో త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం అమలు చేయాలంటే కాంగ్రెసు వారిని నమ్మడానికి లేదని, తామే రాజకీయాల్లోకి వచ్చి దాన్ని అమలు చేయాలని ప్రచారం చేసుకుని తమ విద్యార్థిసంఘాన్ని అసాం గణపరిషత్ (ఎజిపి) అనే ప్రాంతీయపార్టీగా మార్చారు. దానికి ఎన్‌టి రామారావు ఆర్థికంగా తోడ్పడడమే కాక, ఎన్నికలలో దాని పక్షాన ప్రచారం కూడా చేశారు. ఎజిపి నెగ్గి ప్రఫుల్ల ముఖ్యమంత్రిగా, భృగు ఉపముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత అక్రమంగా వచ్చినవారందరూ – మతంతో సంబంధం లేకుండా – అక్రమవలసదారులే. వారిని వెంటనే గుర్తించి వెనక్కి పంపేయాలి. భారతీయ పాస్‌పోర్టు కానీ విదేశీ ప్రభుత్వంచేత జారీ చేసిన వీసా కానీ లేనివారు, వీసాలో పేర్కొన్న కాలపరిమితికి మించి భారతదేశంలో నివాసం వుంటున్నవారు అక్రమవాసులుగా నిర్వచించబడ్డారు. ఇక రెండో అంశమేమిటంటే అసామీ ప్రజల భాష, సంస్కృతీసంప్రదాయాలు, సామాజికవారసత్వం కాపాడడానికి రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించాలి.

అయితే ఎజిపి రెండుసార్లు వరుసగా అధికారంలోకి వచ్చినా కేంద్రప్రభుత్వం ఉదాసీనత వలన యీ ఒప్పందం సరిగ్గా అమలు కాలేదు. అక్రమవలసలు సాగుతూనే వున్నాయి. స్థానిక రాజకీయనాయకులు తమతమ రాజకీయ ప్రయోజనాల కోసం తమ వర్గానికి చెందిన వలసదారులను రక్షిస్తూ వచ్చారు. అసామీయులు ఎవరో నిర్వచించడం కష్టమై పోవడం వలన రెండో అంశమూ మరుగున పడింది. అక్రమవలసదారులనేది అసాంలో నిరంతర సమస్యగా మారింది. నాయకులందరూ ఎన్నికల సమయంలో ప్రత్యక్షంగా దాన్ని వ్యతిరేకిస్తూ, పరోక్షంగా ప్రోత్సహిస్తూ సమస్యను జటిలం చేశారు. ఈ మధ్య జరిగిన అసాం అసెంబ్లీ ఎన్నికలలో కూడా వలసదారులందరినీ వెళ్లగొడతామనే అందరూ వాగ్దానాలు చేశారు. అయితే అంతిమంగా బిజెపి, దాని మిత్రపక్షాలు నెగ్గాయి. ఇప్పుడు వాళ్లు అక్రమవలసదారుల్లో హిందువులను, ముస్లిములను విడగొట్టాలని చూస్తున్నారు. తమ ఓటు బ్యాంకైన హిందువులకు పౌరసత్వం ప్రసాదించి, యితర పార్టీలకు ఓటేసే ముస్లిములను తరిమివేద్దామని పథకం రచించారు. దానికి కేంద్రంలో వున్న బిజెపి సహకరిస్తోంది. 1955 నాటి పౌరసత్వ చట్టానికి సవరణలు చేయడానికి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. 2016 నాటి యీ సవరణ ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గనిస్తాన్ దేశాలలో మైనారిటీలుగా వున్న హిందువులు, సిఖ్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు భారతదేశానికి వలస వస్తే వారిని అక్రమవలసదారులుగా పరిగణించరు. ఆ దేశాలలో ఇస్లాం మైజారిటీ ప్రజల మతం కాబట్టి ముస్లిములు ఇండియాకు వలస వస్తే మాత్రం అక్రమవలసదారులుగా పరిగణిస్తారు. పౌరసత్వం పొందడానికి అవసరమైన 11 ఏళ్ల కాలపరిమితిని ఈ హిందువులు మొదలైన యీ ఆరు మైనారిటీ వర్గాలకు ఆరేళ్లకు కుదించారు. ఈ చట్టం అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కానీ ఎక్కువ ప్రభావితమయ్యేది అసామే. అందుకే అక్కడ ఆందోళన జరుగుతోంది.

సరైన పత్రాలు లేకుండా వలస వచ్చిన వాళ్లందరినీ, హిందూ, ముస్లిం తేడా లేకుండా వెనక్కి పంపేయాలని ఉద్యమం చేసిన

ఆసు ఉద్యమనాయకుడిగా వుండి బిజెపిలోకి ఫిరాయించిన సర్వానంద్ సోనోవాల్ ముఖ్యమంత్రిగా వుండగానే యీ బిల్లు రంగంమీదకు వచ్చింది. దాంతో అతను దీని గురించి ప్రశ్నలడిగితే తప్పించుకుంటున్నాడు. కాబినెట్‌లో ద్వితీయస్థానంలో వున్న హిమంత విశ్వశర్మ మాత్రం దీన్ని బాహాటంగా సమర్థిస్తున్నాడు. దీనివలన రాష్ట్రంలో హిందువుల సంఖ్య పెరుగుతుందని, ఆ విధంగా ముస్లిములు మెజారిటీగా పరిణమించే దురవస్థ తప్పిపోతుందని అంటున్నాడు. బిజెపి, ఆరెస్సెస్ సహజంగానే యీ బిల్లును సమర్థిస్తున్నాయి. ఆరెస్సెస్ సంపర్క్ ప్రముఖ్ రంజీవ్ కుమార్ శర్మ ''ఆరెస్సెస్ దృష్టిలో భారతదేశం హిందూదేశం. అందువలన ఏ దేశానికి చెందిన హిందువైనా సరే భారతదేశంలో విదేశీయుడిగా పరిగణించకూడదు.'' అని వాదిస్తున్నాడు. విదేశీయులందరి మీద కత్తికట్టిన ఎజిపిలో యిప్పుడు విభేదాలు పొడసూపాయి. బిజెపితో అంటకాగుతున్న ఎజిపి ప్రస్తుత అధ్యక్షుడు, సోనోవాల్ కాబినెట్‌లో మంత్రి ఐన అతుల్ బోరా యీ బిల్లు గురించి వ్యతిరేకత తెలిపి వూరుకోవాలి తప్ప బిజెపిని మరీ ఘాటుగా విమర్శించకూడదని అంటోంది. అయితే ఎజిపిలో మహంత వర్గం మాత్రం దీనిపై గట్టిగా పోరాడాల్సిందే అంటోంది. బిజెపి ప్రభుత్వంలో మరో భాగస్వామి బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ బిల్లును సమర్థిస్తోంది. ఆసు, ఆసాం జాతీయవాదీ యువ ఛాత్ర పరిషత్, కృషక్ ముక్తి సంగ్రామ్ పరిషత్ వంటి సంస్థలు బిల్లును వ్యతిరేకిస్తూ కాగడాల ప్రదర్శన నిర్వహించాయి.

దీనిలో మతపరమైన అంశం ఒకటే కాదు అసాం అస్తిత్వసమస్య కూడా వుంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారు మాట్లాడే భాష బెంగాలీ. బెంగాలీయులు అసాంపై ఆధిపత్యం వహించడానికి సర్వదా ప్రయత్నిస్తూనే వుంటారు. ఆంగ్లప్రభుత్వం వుండే రోజుల్లో దానిలోని బెంగాలీ అధికారులు 1836లో అసాంలో అధికారభాషగా అసామీకి బదులు బెంగాలీని ప్రకటించారు. దాదాపు మూడు దశాబ్దాల పోరాటం తర్వాత 1873లో మళ్లీ అసామీ అధికారభాష అయింది. అప్పణ్నుంచి అసామీయులకు బెంగాలీ ఆధిపత్య ధోరణిపై అనుమానాలున్నాయి. బంగ్లాదేశ్ వలసల కారణంగా 1991లో జనాభాలో 57.81% వున్న అసామీ భాషీయులు 2001 నాటికి 48.80%కి పడిపోయారు. అది కూడా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లిములు మాట్లాడే బెంగాలీ యాసతో కూడిన అసామీని, ఆదివాసుల భాషలను కలిపితే ఆ అంకె వచ్చింది. అదే సమయంలో బెంగాలీ భాషీయుల శాతం 21.67 నుంచి 27.54కి పెరిగింది. ఇప్పుడు హిందువులన్న మిష మీద బిజెపి ప్రభుత్వం బెంగాలీలకు పౌరసత్వం యిచ్చేస్తే తాము భాషపరంగా మైనారిటీలమై పోతామని అసామీయుల భయం. ఇప్పటికే అసాంలోని బెంగాలీ సంఘాలు యీ బిల్లును స్వాగతించాయి.

ఈ బిల్లును 11 వామపక్ష, ప్రజాస్వామ్యపక్షాలు నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెసు గట్టిగా మాట్లాడలేకపోతోంది. 'అవిభక్త భారతదేశంలోని ప్రాంతాల నుండి మతవివక్షత కారణంగా ఆశ్రయం కోరుతూ భారత్ వచ్చిన కాందిశీకుల పట్ల కేంద్రం ఒక వైఖరి తీసుకోవాలని' కోరుతూ మాజీ కాంగ్రెసు ముఖ్యమంత్రి తరుణ్ గొగొయ్ నేతృత్వంలో 2014 జులైలో కాబినెట్ తీర్మానం చేసి వున్నారు. వలసదారులందరినీ తరిమివేయాలని గట్టిగా అనలేదు – వారిలో దొంగతనంగా ఓటుహక్కు సంపాదించినవారి ఓట్లు పోతాయన్న భయం చేత. ఇప్పుడు బిల్లు వచ్చాక రాష్ట్ర కాంగ్రెస్ తరుణ్ నాయకత్వంలో ఓ కమిటీ వేసి బిల్లు పరిణామాలను అధ్యయనం చేసి జాతీయ కమిటీకి నివేదన పంపాలని నిర్ణయించింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

## ఎమ్బీయస్ : ఐర్లండ్‌లో గర్భస్రావ హక్కులకై ఉద్యమం

ఐర్లండ్ ప్రధానంగా కాథలిక్ దేశం. కాథలిక్కులు గర్భస్రావాన్ని నేరంగా పరిగణిస్తారు. అందువలన ఐర్లండ్ తన రాజ్యాంగంలో అబార్షన్‌ను పెద్ద నేరంగా పరిగణించింది. అయితే దానికి ఒక కలరింగ్ యిచ్చింది. సమాజంలో వున్న వ్యక్తికి వుండే జీవించే హక్కు గర్భంలో వున్న శిశువుకు కూడా వుంటుందని, దాన్ని హరించే హక్కు ఎవరికీ లేదని 8వ సవరణ చేసింది. దాన్ని 30 ఏళ్ల క్రితం ఓటింగుకి పెట్టినపుడు పౌరుల్లో అధిక సంఖ్యాకులు బలపరిచారు. తల్లికి ప్రాణాపాయం వుందని తెలిస్తే తప్ప, గర్భస్థ శిశువు రోగగ్రస్తుడని తెలిసినా గర్భస్రావం చేయకూడదని చట్టం. పాతతరం వారు ఆ చట్టాన్ని ఆమోదించినా యీనాటి యువత దానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తోంది. నవంబరులో 99 మంది ఐర్లండ్ నలుమూలల నుండి యువతీయువకులు రాజధాని డబ్లిన్ చేరి ప్రదర్శన నిర్వహించారు. 2017 నాటికి ఉద్యమాన్ని తీవ్రం చేయాలని సంకల్పిస్తున్నారు. వారిని యీ చర్యకు పురికొల్పిన సంఘటనలు రెండు వున్నాయి.

2011 నవంబరులో అమండా మెలెట్ అనే ఒక గర్భిణికి తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు జన్యుసంబంధమైన వ్యాధి వుందని, గర్భంలోనో, పుట్టిన వెంటనేనో చనిపోతుందని తెలిసింది. అప్పటికే గర్భం వచ్చి 21 వారాలైంది. అబార్షన్ చేయించుకోవాలంటే ఐర్లండ్ చట్టాల ప్రకారం అది నేరం. అప్పుడామె ఇంగ్లండు వెళ్లింది. 24 వారాల లోపున అబార్షన్ చేయించుకోవడం అక్కడ చట్టబద్ధమే. ఈమె ప్రయాణపు ఏర్పాట్లు చేసుకునేసరికి ఆ గడువు సరిగ్గా ముగుస్తోంది. గడువు తర్వాత ఇంగ్లండు వుండేటంత డబ్బు ఆమె వద్ద లేదు. దాంతో గర్భస్రావమైన 12 గంటల్లోనే ఆమె ఐర్లండ్‌కు తిరిగి రావలసి వచ్చింది.

2012లో ఐర్లండ్‌లో నివసిస్తున్న భారతీయ సంతతికి ఉద్యోగస్తురాలు సవితా హలప్పనవార్ 17 వారాల గర్భంతో వుండగా ఆమెకు రక్తస్రావం జరిగింది. ఆసుపత్రిలో చేర్చారు. గర్భం ఎలాగూ నిలవదు కాబట్టి అబార్షన్ చేసేయండి అని ఆమె బతిమాలింది. 'లేదు, శిశువు గుండె కొట్టుకుంటోంది, అబార్షన్ చేస్తే నేరమౌతుంది' అని వైద్యులు నిరాకరించారు. రక్తస్రావం తీవ్రంగా జరిగి ఆమె

ఆరోగ్యం పాడై పోయింది. కాంప్లికేషన్స్ వచ్చి రక్తం కలుషితమై పోయి, శరీరం సెప్టిక్ అయి ఐసియులో వుండగానే ఆమె చనిపోయింది. అబార్షన్ చేసేసి వుంటే ఆమె బతికి వుండేదని వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు.

ఈ సంఘటనలు తమ దృష్టికి రావడంతో యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ చర్చించింది. తమ అబార్షన్ చట్టాన్ని మార్చుకోమని ఈ ఏడాది జూన్‌లో ఐర్లండ్‌కు సలహా యిచ్చింది. కానీ ఐర్లండ్ ప్రభుత్వం దానికి సిద్ధపడలేదు. అందుకే యిప్పుడు వీరు ఉద్యమిస్తున్నారు. నిజానికి వారు చాలా రాడికల్‌గా ఆలోచిస్తున్నారు. ప్రపంచంలో మగ-మగ, ఆడ-ఆడ వివాహాలని ఆమోదించిన తొలిదేశంగా ఐర్లండ్ 2015లో పేరు తెచ్చుకోవడానికి కారణం వీరి పట్టుదలే. చర్చి ఎంత వ్యతిరేకించినా వారు పోరాడి గెలిచారు. ఇప్పుడు అబార్షన్‌కు అనుమతి సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

## న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 107 వీక్లీకై డిసెంబరు 03

## ఎమ్బీయస్ : రక్తభూమి కన్నూరు

ఉత్తర కేరళలోని కన్నూరుది రక్తచరిత్ర. ప్రాణాలర్పించడానికి వెఱువని అక్కడి ప్రజల గాథలను మలయాళ జానపద గీతాల్లో 'వడ్కన్ పాట్టు'గా పాడుకుంటారు. ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన సామంతరాజు పాళాసి రాజా కూడా అక్కడివాడే. నిత్యజీవితంలో సీదాసాదాగా వుండే కన్నూరు ప్రజలు పట్టుదలలు వస్తే మాత్రం ప్రాణాలు యివ్వడానికైనా, తీయడానికైనా జంకరు. తిరగబడడం తమ రక్తంలోనే వుందని, పౌరుషానికి తాము పెట్టింది పేరని వారు విశ్వసిస్తారు. స్థానిక పాలకుల దుష్టపాలన కారణంగా అక్కడ బీదరికం విపరీతంగా వుండేది. ఆధునిక కాలంలో వ్యాపారస్తుల దోపిడీ కూడా నిరాఘుంటంగా సాగింది. దాంతో మన దేశంలో కమ్యూనిజం ప్రవేశించినప్పుడు అక్కడ సులభంగా వేళ్లూనుకుంది. కార్మికోద్యమం అనేకమందిని ఆకర్షించింది. 1960లలో ఒక బీడీ ఫ్యాక్టరీలో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని కార్మికసంఘం సమ్మె నిర్వహించింది. దాన్ని ఎదుర్కోవడానికి యాజమాన్యం కమ్యూనిజానికి బద్ధ వ్యతిరేకి ఐన ఆరెస్సెస్ సాయం కోరింది. వాళ్లు యీ అవకాశాన్ని వినియోగించుకుని సమ్మె విఫలం చేశారు. యాజమాన్యం అనేకమంది కార్మికులను తీసేసింది. అప్పుడు కమ్యూనిస్టుల మార్గదర్శకత్వంలో కార్మికులు సహకారపద్ధతిలో పోటీగా బీడీ ఫ్యాక్టరీ పెట్టి విజయం సాధించారు. ఇది పెట్టుబడిదారులను మండించింది.

కన్నూరులో ముస్లిములు కూడా గణనీయమైన సంఖ్యలో వున్నారు. ఫర్నిచర్ వ్యాపారం, చేపల వ్యాపారం వాళ్ల చేతిలోనే వుండేది. కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు వీళ్లకు పొరుగునే వుంటుంది. అక్కడ వున్న హిందూ వ్యాపారస్తులు యీ వ్యాపారాలపై కన్నేశారు. ముస్లిం ప్రాబల్యం తగ్గించడానికి వారు ఆరెస్సెస్‌ను ప్రోత్సహించారు. కమ్యూనిస్టులు స్థానిక ముస్లిము వ్యాపారస్తులకు మద్దతుగా నిలిచారు. ఇక యిరువర్గాల మధ్య కలహాలు పెరిగాయి. ఇది 1971 నాటి తలస్సేరీ మతకలహాలకు దారి తీసింది. కమ్యూనిస్టులు, ముస్లిములు ఒకవైపు, ఆరెస్సెస్ వారు మరోవైపు చేరిన యీ కలహాలు రాజకీయాలతో ఆగలేదు. హింసకు, హత్యలకు దారి తీశాయి. ప్రస్తుతం 25 లక్షలున్న కన్నూరు జిల్లాలో గత నాలుగు దశాబ్దాలలో 230 రాజకీయ హత్యలు జరిగాయి. గ్రామాలకు గ్రామాలు పార్టీల పరంగా విడిపోయాయి. కొట్లాటలకు పెద్ద కారణాలు అవసరం లేదు. పార్టీ జండా చింపారనో, తమ పార్టీకై కేటాయించుకున్న గోడపై ఏదో రాశారనో, తమ పార్టీ నాయకుణ్ని ఏదో అన్నారనో, బస్సు ఎక్కుతూంటే తోశారనో – ఏదో ఒక కారణంతో ప్రారంభమై హత్యల దాకా వెళ్లిపోతున్నాయి.

ప్రతి గ్రామంలోను యీ కలహాల్లో మరణించిన వారికి నివాళిగా 'అమరవీరుల' స్మారకచిహ్నాలు వెలుస్తున్నాయి. ఆరెస్సెస్ తరఫున చనిపోయినవారిని 'బలిదానీ'లుగా వ్యవహరిస్తే కమ్యూనిస్టుల తరఫున చనిపోయినవారిని 'రక్తసాక్షులు'గా వ్యవహరిస్తున్నారు. వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తూన్నారు. ఆ సభల్లో ప్రతీకారం తీర్చుకోవాలంటూ నాయకులు కార్యకర్తలను ఉద్బోధిస్తున్నారు. ప్రస్తుతం బీడీ పరిశ్రమ, చేనేత పరిశ్రమ దెబ్బ తినడంతో ఆ ప్రాంతంలో అభివృద్ధి పెద్దగా లేదు. అది కూడా సామాజిక అశాంతికి దోహదపడుతోంది. యుడిఎఫ్ పాలనలో 2011-16 మధ్య 10 రాజకీయ హత్యలు జరిగితే సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే 6 రాజకీయ హత్యలు జరిగాయి – ముగ్గురు సిపిఎంవారు, ఇద్దరు ఆరెస్సెస్‌వారు, ఒకరు ఎస్‌డిపిఐ కార్యకర్త.

తాజాగా ముఖ్యమంత్రి విజయన్ నియోజకవర్గంలోని పతిరియాడ్ గ్రామంలో అక్టోబరు 10 న మోహనన్ అనే 52 ఏళ్ల సిపిఎం లీడరును ఆరుగురు వ్యక్తులు కత్తులతో 14 సార్లు పొడిచి చంపేశారు. రెండు రోజులు తిరక్కుండా రమిత్ ఉత్తమన్ అనే 27 ఏళ్ల ఆరెస్సెస్ కార్యకర్తను అతని తల్లి, గర్భిణి ఐన సోదరి కళ్లముందు కత్తితో నరికేశారు. ఇది ముఖ్యమంత్రి సొంత గ్రామమైన పినరాయ్‌లోనే జరిగింది. రమిత్ తండ్రి ఉత్తమన్ కూడా 14 ఏళ్ల క్రితం యిటువంటి కలహాల్లోనే ప్రాణాలు వదిలాడు. అతను బస్సు డ్రైవరు. నడిబజారులో సిపిఎం వర్కర్లు అతన్ని బస్సులోంచి కిందకు లాగి, జనమందరూ చూస్తూండగా కత్తితో పొడిచి చంపేశారు. అతని అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తున్న బంధుమిత్రుల జీపులపై కూడా బాంబులు వేశారు. అప్పుడు 70 ఏళ్ల వయసున్న ఉత్తమన్ అత్త, డ్రైవరు చనిపోయారు. రమిత్ హత్య జరిగిన మర్నాడు ఫరూక్ నీర్చల్ అనే 45 ఏళ్ల ఎస్‌డిపిఐ (సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్

ఇండియా) కార్యకర్తను కన్నూరు పట్టణంలో చంపివేశారు. రాడికల్ ముస్లిము సంస్థ ఐన పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా యొక్క రాజకీయ విభాగమే ఎస్‌డిపిఐ. అందరూ ఐయుఎంఎల్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్)ను అనుమానిస్తున్నారు.

ఇవన్నీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి మచ్చ తెచ్చాయి. గవర్నరు పి. సదాశివం హెూం సెక్రటరీని, డిజిపిని పిలిచి కన్నూరులో శాంతిభద్రతల గురించి వాబు చేయడంతో ముఖ్యమంత్రి విజయన్‌కు భయం వేసింది. శాంతిభద్రతల పేరు చెప్పి తన ప్రభుత్వాన్ని రద్దు చేస్తారేమోనని. హత్యలపై విచారణకు ఆదేశించాడు. హత్యలకు ఎదుటివారే కారణమని యిరువర్గాలూ అంటున్నాయి. 'కేరళ కమ్యూనిస్టు ఉద్యమానికి కన్నూరు గుండెకాయ. ఇక్కడ మమ్మల్ని ఫినిష్ చేయాలని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, మోదీ ఆరెస్సెస్ ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఇటీవలి కాలంలో బిజెపి ఓట్ల శాతం పెరిగింది. ఆరెస్సెస్ శాఖల సంఖ్య కూడా పెరిగింది, గమనించండి. 2015లో కన్నూరులో చింతన్ బైఠక్ అని ఏర్పాటు చేసి యీ హత్యారాజకీయాలకు ప్రణాళిక రచించారు." అంటాడు కన్నూరు జిల్లా సిపిఎం నాయకుడు జయరాజన్. అతనిపై 1999లో భార్యాబిడ్డల కళ్లముందే దాడి జరిగింది. కుడిచెయ్యి చచ్చుబడింది. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాజశేఖరన్ "దాడులకు గురవుతున్నది మేము. అధికారంలో వున్న సిపిఎం తలచుకుంటే నిమిషాల్లో శాంతి నెలకొల్పగలదు. కానీ వారికా ఉద్దేశం లేదు." అంటాడు.

తాజావార్త ఏమిటంటే నవంబరు మూడవ వారంలో సిపిఎం నాయకుడు మోహనన్ హత్యకేసులో అరెస్టయిన ఆరెస్సెస్ కార్యకర్త సుభీష్ గతంలో అంటే 2006 అక్టోబరులో తలస్సెరీలో హత్య చేయబడిన ఎన్‌డిఎఫ్ కార్యకర్త మొహమ్మద్ ఫజల్‌ను, 2014లో చిత్తిరపరంబుకు చెందిన సిపిఎం నాయకుడు పవిత్రన్‌ను కూడా తనే హత్య చేశానని రాష్ట్ర పోలీసుల వద్ద ఒప్పుకున్నాడు. ఫజల్ హత్య జరిగినప్పుడు దాన్ని సిబిఐకు అప్పగించారు. ఫజల్ సిపిఎం నుంచి విడిపోయి ఎన్‌డిఎఫ్‌లో చేరాడు కాబట్టి అతనికి బుద్ధి చెప్పడానికి సిపిఎం నాయకులు కరాయి చంద్రశేఖరన్, కరాయి రాజన్‌లు పథకం వేసి ఆరుగురి చేత హత్యను అమలు చేయించారని అభిప్రాయపడిన సిబిఐ వారిపై కేసులు మోపి అరెస్టు చేయించింది. ఇప్పుడు కేరళ పోలీసు అధికారులు సుభీష్ ఒప్పుకోలు పత్రాలను సిబిఐకు అప్పగించారు. కొత్త కేసుల మాట ఎలా వున్నా పాత కేసులు పరిష్కరించబడేట్టున్నాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**డిసెంబరు 04, 05** **ఎమ్బీయస్ : ధీరవనిత జయలలిత**

జయలలిత వెళ్లిపోయారు. విలక్షణ వ్యక్తిత్వంతో ఎప్పుడూ వార్తల్లో వుంటూ వచ్చినామె అంతిమఘట్టం కూడా సంచలనాత్మకంగానే నడిచింది. ఆమె సహజమరణాన్ని కూడా జీర్ణించుకోలేని తమిళ ప్రజలు ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడతారో అన్న భయం తమిళనాడులోనే కాదు, దేశంలోనే ఆసక్తి రగిలించింది. పూర్తిగా కోలుకుని యింటికి వెళ్లిపోతుందను కుంటూండగానే ఆదివారం రాత్రి గుండెపోటు వచ్చింది. సోమవారం ఉదయం 11 గం॥ఎలకే మరణించినా మరణవార్తను మరో పన్నెండు గంటల పాటు తొక్కి వుంచారని అభిజ్ఞవర్గాల భోగట్టా. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సైన్యాన్ని దింపి, సకలవిధాల ఏర్పాట్లు చేసుకుని, అప్పుడు అర్ధరాత్రి ప్రకటించడం తెలివైన పనే.

సత్యసంధతకు కట్టుబడ్డామని అనుకునే తమిళ మీడియాలో ఒక భాగం ఆమె మరణవార్తను ప్రసారం చేసేసి, కాస్త కల్లోలం సృష్టించింది. అప్పుడు ప్రభుత్వం వారు అపోలో ఆసుపత్రి వాళ్ల చేత అబ్బే, అది అబద్ధం అనిపించి, అందరూ యిళ్లకు క్షేమంగా చేరాక అప్పుడు బయటపెట్టి జనాల్ని, దుకాణాల్ని కాపాడారు. అయినా అపోలో ఆసుపత్రిపై దాడులు జరిగాయి. జయలలిత ఆసుపత్రిలో సెప్టెంబరులో చేరిన దగ్గర్నుంచి ఎందుకైనా మంచిదని వాళ్లు తమిళనాడులో అపోలో బ్రాండ్‌తో వున్న ఆసుపత్రులే కాదు, క్లినిక్కులే కాదు, ఫార్మసీలు కూడా యిన్సూర్ చేసి పెట్టుకున్నారట. గతంలో ఎమ్జీయార్ కూడా సహజమరణం పొందినా అల్లర్లు జరిగాయి. ఇక రాజీవ్ హత్య జరిగినప్పుడైతే చెప్పనే అక్కరలేదు. డిఎంకె ఆఫీసులను తగలబెట్టారు. జయలలిత అధికారంలో వుండగా పోయింది కాబట్టి సరిపోయింది కాబట్టి కానీ కరుణానిధి పదవిలో వుండగా పోయి వుంటే అపోలో వాళ్లచేత విషప్రయోగం చేయించాడనే పుకార్లు పుట్టించేది తమిళ మీడియా.

తనపై ఎంత అవినీతి ముద్ర వున్నా, అనారోగ్యంతోనే గత ఎన్నికలలో పోటీ చేసి, పెద్దగా ప్రచారం చేయకుండానే జయలలిత నెగ్గింది. ఆమె సంక్షేమ పథకాలే ఆమెకు ప్రచారం చేసిపెట్టాయి. విపక్షాల అనైక్యత కలిసి వచ్చింది. తన అనారోగ్యం బయటపడితే పార్టీలో అధికారం కోసం కుమ్ములాటలు జరుగుతాయని, తనపై తిరుగుబాటు చెలరేగుతుందనే భయంతో రోగాన్ని దాచుకుని ముప్పు తెచ్చుకుందని వైద్యులన్నారు. ఇప్పుడు ఆ భయాలు నిజమవుతాయని అందరి అంచనా. జయలలిత మరణానంతర పరిణామాల గురించి వూహించే ముందుగా ఆమె గురించి కాస్త గుర్తు చేసుకోవడం భావ్యం. ఆమెలో జీవితం రెండు భాగాలుగా చూడాలి. నటీమణిగా – రాజకీయనాయకురాలిగా. ఆమె రాజకీయాల గురించి చర్చించడానికి చాలా వుంటుంది కానీ నటన గురించి వ్యాఖ్యానించడానికి పెద్దగా లేదు.

ఆమె మంచి నటీమణి. అన్ని రకాల పాత్రలను అనాయాసంగా నటించింది. చిన్ననాటే సినీరంగంలోకి ప్రవేశించి, అతి త్వరగా ముందువరుసకు వెళ్లిపోయి, తమిళ, తెలుగు రంగాలలో అగ్రనటులందరి పక్కనా కథానాయికగా నటించి, సాంఘిక, జానపద,

పౌరాణిక, చారిత్రాత్మక పాత్రల్లో యిమిడిపోయింది. ఏ పాత్ర వేసినా గ్లామరస్‌గా కనబడింది. సాటి నటీనటులతో, టెక్నీషియన్లతో – ఎవరితో వివాదాల్లో చిక్కుకోలేదు. ఎవరితో పోటీ పడలేదు. చిత్రనిర్మాణం అంటూ, దర్శకత్వం అంటూ కాంప్లికేషన్స్ తెచ్చుకోలేదు. తక్కిన భాషల్లో కూడా వేసినా, ప్రధానంగా తమిళ, తెలుగులలో రాణించింది. తెరపై పోకిరి పాత్రలు వేసినా షూటింగు సమయంలో మాత్రం అతి హుందాగా, ప్రొఫెషనల్‌గా వుండేది. విరామాల్లో ఉబుసుపోక కబుర్లు చెప్పకుండా పుస్తకాలు చదువుకుంటూ, ఒక మేధావి యిమేజి మేన్‌టేన్ చేసింది. ఆమె జోలికి ఎవరూ వెళ్లేవారు కారు. ఆమె కూడా కువ్యాఖ్యలు చేసిన సందర్భాలు కనబడవు. చాలా త్వరగా కెరియర్ ప్రారంభించినందు వలన కాబోలు, 30 సం॥ల వయసు వచ్చేసరికే కెరియర్ ముగిసిపోయింది. తను వేయవలసిన పాత్రలు కనబడలేదు. తల్లి పాత్రలు వేయడానికి వయసు చాలదు, వదిన పాత్రలు వేయడానికి మనసు రాలేదు.

ఇక రాజకీయాల్లోకి వచ్చేసరికి ఆమె చేసిన పోరాటం అందరి ద ృష్టినీ ఆకర్షించింది. పోరాటంలో గెలిచాక ఆమె ప్రవర్తన అందర్నీ విస్మయపరచింది. దాంతో ఆమె బాల్యం ఎటువంటిది, ఎటువంటి పరిస్థితుల్లో ఆమె సినిమాల్లోకి నెట్టబడింది, ఎమ్జీయార్ ఆమె పాలిట రక్షకుడిగాను, తక్షకుడిగాను ఎలా తయారయ్యాడు, ఈమె మూడ్ స్వింగ్స్ ఎలా వుండేవి, అహంభావం, తిరగబడే స్వభావం, పోరాటపటిమ, తనను అణచివేసిన సమాజం పట్ల ప్రతీకారేచ్ఛ యివన్నీ చర్చకు వచ్చాయి. ఆమె బాల్యాన్ని తరచితరచి పరామర్శించి, ఆమె మనస్తత్వాన్ని విశ్లేషించడానికి ప్రయత్నించారు. ''తమిళ రాజకీయాలు''లో నేను యివన్నీ విపులంగా రాశాను కాబట్టి యిక్కడ మళ్లీ రాయడం అనవసరం.

రెండు ముక్కల్లో చెప్పాలంటే – సమాజం ఆమె పట్ల అన్యాయంగా ప్రవర్తించింది, అవమానించింది, అవహేళన చేసింది, అణచి వేసింది. ఆమె పగబట్టిన పడుచుగా మారి అంతకంత కసి తీర్చుకుంది. కక్ష సాధించే క్రమంలో ఆమె మేధస్సు, బహుభాషా ప్రావీణ్యం, వాగ్ధోరణి, ఏకసంధాగ్రాహత్వం అన్నీ వెలుగులోకి వచ్చాయి. ఆమె ప్రజలను ఆకర్షించింది, మంత్రముగ్ధులను చేసింది. అధికారంలోకి వచ్చాక అధికారగణాన్ని మెప్పించింది. ఆమె ధోరణులను నిరసించేవారు సైతం ఆమె పరిపాలనా సామర్థ్యాన్ని మెచ్చుకోక తప్పదు. అయితే ఆమె అంతటితో ఆగలేదు. తన యిమేజిని పెంచుకోవడానికి రాష్ట్రోదయంతో నిర్మాణాత్మకమైన పనులు చేపట్టే బదులు లెక్కకు మిక్కిలిగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసింది. ఇది సరికాదని హితవు చెప్పిన శ్రేయోభిలాషులను దూరంగా పెట్టింది. మీడియాపై కక్ష కట్టి కేసులు పెట్టి సతాయించింది. 'నాతో ఏకీభవించకపోతే నువ్వు నా శత్రువువే' అనే భావం ఏర్పరచుకుని, తటస్థులను దూరం చేసుకుని, వందిమాగధులనే తన చుట్టూ ఏర్పరచుకుంది. అందరూ సాగిలపడి సాష్టాంగ నమస్కారాలు చేసేట్లా చేసి తన అహం చల్లార్చుకుంది.

ఆమె ఏం చేసినా చెల్లింది. చెల్లనప్పుడు బాధలు పడింది, సహించింది, తల వంచుకుని పారిపోలేదు. నిల్చి పోరాడింది. ప్రజలు తన పక్షాన వుండేట్లు చూసుకుంది. ఆ మేరకు వారి నాడి పట్టుకుంది. ఆమెకు ఎమ్జీయార్ వారసత్వం వచ్చి ఒళ్లో పడలేదు. తనంతట తనే సాధించింది. తన వారసత్వాన్ని కూడా ఎవరికీ అప్పగించకుండా పోయింది. తన పార్టీ సభ్యుల్లో ఎవరు బలవంతులో వారే నిలుస్తారు, లేకపోతే పడిపోతారు అనుకుంది. ఆమెకు నా అన్నవారంటూ ఎవరూ లేరు, కుటుంబసభ్యులను రాజకీయాల్లోకి తేలేదు. అందువలన వారికి వారసత్వం అప్పగించాలన్న తపన, వారికి అడ్డువచ్చేవారిని తొలగించాలనే తహతహ లేవు. తన తర్వాత పార్టీ నాశనమైనా చింత లేదు.

ఒకసారి ఎన్టీయార్ అన్నారు – 'టిడిపి నాతో పుట్టింది, నాతోనే పోతుంది' అని. కానీ ఆయనతో పోలేదు. ఆయన వుండగానే పార్టీని అల్లుడు లాగేసుకున్నాడు. ప్రతిఘటిస్తూనే ఎన్టీయార్ వెళ్లిపోయారు. దాంతో ఆయన వర్గం అధికారవర్గంలో కలిసిపోయింది. ఆ మార్పును ప్రజలు ఆమోదించారు. టిడిపి అంటే చంద్రబాబే అంటున్నారు. ఇప్పుడు ఆయన వారసుడెవరంటే లోకేశ్ అంటున్నారు. నందమూరి వారసత్వం నారా వారసత్వంగా మారిపోతోంది. ఇందిర వారసత్వ రాజకీయాలను విమర్శిస్తూ ప్రభవించిన ప్రాంతీయపార్టీలన్నీ యీ బాటలోనే నడిచాయి. తమిళనాడులో డిఎంకెది అదే పంథా. అయితే జయలలిత ఎమ్జీయార్‌కు బంధువు కాదు. వారసత్వం ఆటోమెటిక్‌గా రాలేదు. ఇప్పుడు జయలలిత వారసత్వం పన్నీరు శెల్వానికి కాని, శశికళకు కాని తనంతట తానే రాదు. ప్రస్తుతానికి పాలనను పన్నీరు శెల్వం, పార్టీని శశికళ చూసుకోవచ్చు. ఇద్దరూ కలిసి జయలలిత విగ్రహాలను అడుగడుగునా ప్రతిష్ఠాపించవచ్చు. అంత మాత్రం చేత జనాలు నమ్మేయరు. ప్రాంతీయ పార్టీలు వ్యక్తుల చుట్టూ తిరుగుతున్నాయి. అన్నా డిఎంకెలో జయలలిత వంటి కరిజ్మా వున్న వ్యక్తి ప్రస్తుతానికి లేరు. ఇకపై ఎవరైనా ఉద్భవిస్తారేమో తెలియదు.

అప్పటిదాకా ప్రతిపక్షాలు చేతులు ముడుచుకుని కూచుంటాయా? కూచోవు. ఏదో ఒకటి చేస్తాయి. పన్నీరు శెల్వం నాయకత్వం సహించని ఎమ్మెల్యేలలో ఓ 20 మందిని డిఎంకె ప్రలోభపెట్టగలిగితే చాలు. 135 మందిలో 20 మంది దొరక్కపోరు. వాళ్లు ఎడిఎంకె (జయలలిత) పేరుతో వేరే కుంపటి పెట్టి, ప్రభుత్వాన్ని కూలదోయవచ్చు. ఆ తర్వాత స్టాలిన్ గవర్నరు వద్దకు మహజరు పట్టుకుని తయారవుతాడు. ఈ చీలిక గ్రూపు అతనికి మద్దతు యిస్తుంది. కొన్నాళ్లకు ఆ పార్టీలో కలిసిపోతుంది. అధికారాన్ని పోగొట్టుకున్న పక్షం వూరికే కూర్చోదు. కేంద్రంలో వున్న బిజెపిని ఆశ్రయించి యీ ప్రభుత్వాన్ని రద్దు చేసి, గవర్నరు పాలన విధించి, మళ్లీ ఎన్నికలు పెట్టమంటాయి.

చివరకు ఏది ఎలా అవుతుందో ఎవరూ యిప్పుడే చెప్పలేరు. ఒకటి మాత్రం వాస్తవం. తమిళనాడులో యిప్పుడు బలమైన నాయకుడు స్టాలిన్. రాజకీయాల్లో, పార్టీ నిర్వహణలో, పాలనాసామర్థ్యంలో అందె వేసిన చేయి. తండ్రిలాగ, జయలలిత లాగ మరీ

కక్షపూరిత రాజకీయాలు నడపడు కాబట్టి మీడియా కూడా అతని పట్ల ఆదరంగానే వుంటోంది. కరుణానిధి బతికి వుండగానే అతని ప్రత్యర్థులిద్దరు – ఎంజీఆర్, జయలలిత రాలిపోయారు. మళ్లీ అధికారంలోకి వచ్చి జయలలితను జైల్లో పెట్టాలన్న లక్ష్యం నెరవేరలేదు. తనపై వున్న అవినీతి కేసు సుప్రీం కోర్టులో పెండింగులో వుండగానే జయలలిత లోకం విడిచి వెళ్లిపోయింది. కరుణానిధికి యిప్పుడేదైనా లక్ష్యం మిగిలి వుందంటే అన్నాడిఎంకెను ఖండఖండాలుగా చీల్చి, మొత్తాన్ని డిఎంకెగా చేసి స్టాలిన్ చేతిలో పెట్టడమొకటే. కానీ విడిపోయిన 40 ఏళ్లకు మళ్లీ కలవడం సుదూరస్వప్నం. ఏదో ఒక రూపంలో, ఎవరో ఒకరు ఎడిఎంకెను సజీవంగా వుంచుతారు. ఎమ్జీయార్, జయలలితల పేర్లు జపిస్తూ వుంటారు. ప్రజల్లో మనసుల్లో వాళ్లు పాతుకుపోయారు కాబట్టి దాన్ని సొమ్ము చేసుకుందామని చూసేవారు తప్పక వుంటారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**డిసెంబరు 06, 07** **ఎమ్బీయస్ : విదూషకుడు 'చో' కు నివాళి**

రాచపీనుగ తోడు లేందే వెళ్లదంటారు. జయలలిత పోయిన వెంటనే 82 ఏళ్ల చో రామస్వామి కూడా వెళ్లిపోయారు. చో చాలాకాలం జయలలితకు ఆత్మీయుడిగా, సలహాదారుగా వున్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే సామెత నిజమే ననిపిస్తుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి, అఖండమైన తెలివితేటలున్న చోకు 'జయలలిత సలహాదారు' అనే గుర్తింపు చాలా చిన్నది. ఆయన లాయరు, రచయిత, నాటకకర్త, నటుడు, దర్శకుడు, సినిమాలలో, టీవీ సీరియల్స్‌లో నటుడు, నిర్మాత, దర్శకుడు, సంపాదకుడు, పత్రికాధిపతి, రాజకీయ విశ్లేషకుడు, వక్త, రాజకీయ నాయకుడు, రాజ్యసభ ఎంపీ.. యింకా కొన్ని వుండే వుంటాయి. ఇన్ని రకాలుగా తన ప్రతిభను చూపించినా ఆయనను నేను విదూషకుడు అనడానికి కారణం – ఆ పదవిపై నాకున్న గౌరవం. విదూషకుడు గంతులేసి నవ్వించే జోకర్ కాదు. అతనికి వైదుష్యం వుండాలి, సమయస్ఫూర్తి వుండాలి, అప్రియమైనది సభాముఖంగా చెప్పగల ధైర్యం వుండాలి, హాస్యాన్ని రంగరించే చెప్పే ఒడుపు తెలిసి వుండాలి, మనసులో కల్మషం లేకుండా చెపుతున్నాడనే నమ్మకం రాజుకి సైతం కలిగించాలి, విమర్శ హద్దులెరిగి, వికటించకుండా తనను తాను నియంత్రించుకో గలగాలి. తమిళులకు తమ భాష, సంస్కృతి, వారసత్వంపై దురభిమానం హెచ్చు. ఆత్మావలోకనం చేసుకుని, తమను తాము విమర్శించుకునే లక్షణం తక్కువ. అటువంటి తమిళ సమాజంలో పుట్టి తమపై తాము జోకులేసుకునే అలవాటును వాళ్లకు నేర్పడానికి ప్రయత్నించిన వాడు చో. పెద్దాచిన్నా లేకుండా అందరినీ ఆటపట్టించడానికి ప్రయత్నించాడు – తన నాటకాల ద్వారా, "తుగ్లక్" పత్రిక ద్వారా. అతని ప్రశ్నోత్తరాల శీర్షిక ఎంత పాప్యులరో చెప్పనలవి కాదు. డైరక్టు తెలుగు సినిమాల్లో వేయలేదు కాబట్టి తెలుగువాళ్లలో చాలామందికి ఆయన పెద్దగా తెలియకపోవచ్చు. ఆయన సోదరి, తెలుగాయన్ని చేసుకుని నటీమణి రమ్యకృష్ణకు జన్మనిచ్చింది. అందువలన రమ్యకృష్ణ మావయ్యగా గుర్తు పెట్టుకోవచ్చు. ఆయన జీవితం గురించిన పూర్తి వివరాలు రేపటి పేపర్లలో వస్తాయి. ఈ లోపున నాకు తెలిసున్న నాలుగు విషయాలు పంచుకుంటాను.

తెలుగులో "మహమ్మద్ బిన్ తుగ్లక్" సినిమా నాగభూషణం ప్రధాన పాత్రధారిగా 1972లో వచ్చింది. రాజకీయంగా దేశం భ్రష్టుపట్టడం చూసి కడుపు భగ్గుమన్న ఒక స్వాతంత్ర్యయోధుడు ప్రజలపై ఒక ప్రాక్టికల్ జోక్ వేద్దామనుకున్నాడు. తన అనుచరులు యిద్దరికి తుగ్లక్‌గా, అతని సహచరుడు బదూదాగా వేషాలు వేశాడు. మీ యిద్దరూ యీ వేషాల్లో ప్రజాస్వామ్యం ఎంత అపహాస్యంగా నడుస్తోందో జనాలకు సోదాహరణంగా తెలియపరిచి, ఏడాది తర్వాత వేషాలిప్పేసి, వాస్తవాన్ని చెప్పి, వాళ్ల కళ్లు తెరిపించండి అన్నాడు. వాళ్లు సరేనని గుడిలో ప్రమాణం చేశారు. తర్వాత గురువుగారు వాళ్లను ఒక అయోమయం ఆర్కియాలజీ ప్రొఫెసరు తవ్వకాలు జరిపే చోట శవపేటికల్లో పడుక్కోబెట్టాడు. ప్రొఫెసరుకు వాళ్లు కనబడగానే ఎవరు మీరు? అని అడిగాడు. ఫలానా అనగానే యిన్నాళ్లూ సజీవంగా ఎలా వున్నారు? అని అడిగాడు. ఏదో సంజీవనీ వేరులాటి దానివలన అని చెప్పారు. ఇక పేపర్లో పెద్ద వార్త. విపరీతమైన పబ్లిసిటీ. ఆ పబ్లిసిటీతో, విపరీతమైన వాగ్దానాలతో ఎంపీగా గెలిచేశాడు తుగ్లక్. తర్వాత ప్రధాని కావడానికి ఓ పన్నాగం పన్నాడు. విడివిడిగా ఒక్కొణ్నీ పిలిచి 'నాకు మద్దతిస్తే నిన్ను ఉపప్రధానిని చేస్తాను' అన్నాడు. అందరూ సమ్మతించి గెలిపించారు. తీరా చూస్తే తుగ్లక్ ప్రధాని. తక్కినవాళ్లంతా ఉపప్రధానులే. అందరూ కాబినెట్ సభ్యులే. ఇలా తుగ్లక్ రాజ్యం సాగింది. తన పారశీక భాషను అధికారభాషగా డిక్లేర్ చేశాడు. (హిందీని దేశంపై రుద్దడంపై సెటైర్) దాన్ని వ్యతిరేకిస్తూ జనాలు బస్సులు, రైళ్లు తగలబెడితే 'పారశీకం బస్సుల్లో, రైళ్లల్లో వస్తుందా?' అంటూ రేడియోలో ప్రధాని ప్రసంగం. (తమిళులు చేసిన హిందీ వ్యతిరేకోద్యమంపై సెటైర్). ప్రసంగం చివర కమ్మర్షియల్ యాడ్ కూడా ప్రధానే చెప్తాడు (రేడియోల కమ్మర్షియల్ ద ృక్పథంపై సెటైర్) కాబినెట్ మంత్రుల పుట్టినరోజులే దేశమంతా పండగలుగా జరుపుకోమంటాడు. అదేమిటని ఒకరు అభ్యంతర పెడితే ఆ ఫంక్షన్‌కు అవసరమయ్యే కేక్, బుడగలు, లైట్లు, ఆహ్వానపత్రికల ప్రింటింగు, వగైరావగైరా పరిశ్రమల అభివృద్ధి జరుగుతుంది కదాని వాదిస్తాడు. (పుష్కరాలు, శంకుస్థాపనలు, భూమిపూజలు, విగ్రహావిష్కరణలు యీ స్థాయికి చేరడానికి ముందే యీ సెటైరు). ఆహారసమస్య గురించి ఏం చేశారు అని అడిగితే అమెరికా వెళ్లి ఆలోచిస్తానంటాడు. చిలకజోస్యం చెప్పే ఒకమ్మాయిని మంత్రిగా చేస్తారు. ఏ ఫైలుపై సంతకం పెట్టాలో చిలక చేత కార్డు తీయిస్తూ వుంటుంది.

ఇలా రాజకీయాల ఒక్కదానిపైనే విసుర్లు కాదు. సమాజపు పోకడలపై కూడా చాలా వుంటాయి. అన్నా, చెల్లి ఓ సెక్సుబుక్కు గురించి కొట్టుకుంటూ వుంటారు. 'అది నా బుక్ ర్యాక్‌లోది, ఎవరు తీశారు?' అని తండ్రి వాళ్లిద్దరినీ తిట్టి లాక్కున్నాడు. అతని

చేతుల్లోంచి అతని తండ్రి గుంజుకున్నాడు, తను చదువుతానంటూ. అంతా చూస్తూ నిర్లిప్తంగా వున్న వియ్యంకుడితో మీకేమీ యింట్రస్టు లేదా? అని అడుగుతాడు. 'ఎప్పుడో చదివేశా' అంటాడాయన. ఇలా పోనుపోను సమాజం భ్రష్టమై, రాజకీయనాయకత్వమంతా అవినీతిమయమై పోయినా, ప్రజలకు తుగ్లక్ ఆరాధ్యదైవం అయిపోతాడు. ఏడాది అయ్యాక బదూదా వేషధారి తుగ్లక్ వేషధారి వద్దకు వచ్చి తమ ప్రమాణాన్ని గుర్తుచేశాడు. 'ఇక వేషాలిప్పేసి ఇలాటి నాయకుల వలలో పడకండి అని ప్రజలకు సందేశం యిద్దాం. రా' అన్నాడు. అప్పటికే తుగ్లక్ వేషధారి పదవి మరిగాడు. 'మన గురువుగారు చచ్చిపోయారు. వాళ్ల అమ్మాయికి మంత్రి పదవి యిచ్చి లోబరుచుకున్నాం. మన రహస్యం ఎవరికీ తెలియదు. మనల్ని నిజం తుగ్లక్, బదూదా అనుకుంటున్నారు. ఇలాగే కంటిన్యూ అయిపోదాం' అన్నాడు. బదూదా పాత్రధారి ఒప్పుకోలేదు. బయటకు వచ్చి 'ఇదంతా వేషం, మాదంతా నటన' అన్నాడు. తుగ్లక్ పాత్రధారి 'బదూదాకు పిచ్చెక్కింది. పాపం అతన్ని రాళ్లేసి కొట్టకండి, చంపకండి' అంటూ ప్రజలకు ఐడియాలు యిచ్చాడు. తుగ్లక్ మత్తులో వున్న ప్రజలు అతన్ని చంపేశారు. తుగ్లక్ పాలన నిరాఘంటంగా సాగుతుంది.

ఈ సినిమా చూసి నాకు మతిపోయింది. ఎంత గొప్ప ఆలోచన అనిపించింది. ఇది తమిళం నుంచి వచ్చిందని తెలిసి చో రామస్వామి గురించి తెలుసుకున్నాను. దీన్ని ఆయన తమిళంలో 1968లో నాటకంగా రాసి, తర్వాత 1971లో సినిమాగా తీశాడు. దాన్ని చూసి మనవాళ్లు తెలుగులో తీశారు. ఆ నాటకం తమిళంలో ఎంత హిట్ అంటే "తుగ్లక్" పేరుతో ఆయన 1970లో వారపత్రిక స్థాపించి నడుపుతున్నాడు. దాని సర్క్యులేషన్ 75 వేలు. తుగ్లక్ నాటకాన్ని ఆయన చాలాకాలం వేశాడు. కలకత్తాలో వుండగా 1983లో ఆ నాటకాన్ని చూశాను. ఇంటర్వెల్‌లో ఆయనకు సన్మానం జరిగింది. "పాతికేళ్ల కితం రాసిన ఈ నాటకంలో ఒక్క డైలాగు మార్చలేదు. ఇప్పటికి కూడా రిలవెంట్‌గా వుందంటే ఆ ఘనత నాది కాదు. పరిస్థితులు ఏ మాత్రం యింప్రూవ్ చేయని రాజకీయనాయకులది." అన్నాడు. డైలాగులు మార్చలేదేమో కానీ, యింప్రొవైజేషన్ మాత్రం వుందని చెప్పవచ్చు. చోకు ఒత్తయిన జుట్టు వుండేది. ఎలర్జీ ఏదో వచ్చి ఓ పూట నిద్ర లేచేసరికి ఒంటి మీద ఒక్క వెంట్రుక కూడా లేకుండా రాలిపోయింది. అప్పణ్నుంచి తన గుండు మీదే జోకులేసుకుంటూ వచ్చాడు. అసలే ఆయనది కోడిగుడ్డు మొహం. సాసర్ కళ్లు. అమాయకంగా మొహం పెట్టి హాస్యంగా నటించడంలో ఘనుడు. తల బోడిగుండు అయిపోయిన తర్వాత "ఏలిస్ ఇన్ వండర్‌లాండ్"లో కారెక్టరుగా కనబడసాగాడు. ఆ రోజు తుగ్లక్ నాటకంలో యింటర్వెల్ పంచ్ ఏమిటంటే పాత్రికేయులు వచ్చి తుగ్లక్‌ను 'మీ పాలన యిలాగే సాగితే దేశం గతి ఏమవుతుంది?' అని అడుగుతారు. తుగ్లక్ వేషంలోని చో 'దేశం గతా?' అంటూ సాలోచనగా తన తలపాగా తీసి ఓ చేతిలో పట్టుకుని, మరో చేత్తో గుండు రాసుకున్నాడు. హాలంతా చప్పట్లు మారుమ్రోగాయి.

నేను కలకత్తాలో వుండగానే చో మరోసారి వచ్చారు. ఆనంద బజార్ గ్రూపుకి చెందిన "ద టెలిగ్రాఫ్" దినపత్రిక వారు "హేజ్ లెఫ్ట్ ఎనీ ఫ్యూచర్ యిన్ ఇండియా?" అనే మకుటంతో డిబేట్ పెట్టారు. వామపంథాకు ఇండియాలో భవిష్యత్తు వుందని కొందరు, లేదని కొందరు మాట్లాడడానికి వచ్చారు. జార్జి ఫెర్నాండెజ్ వచ్చి ఉందని మాట్లాడాడు. తర్వాతి వంతు కమ్యూనిజానికి బద్ధ వ్యతిరేకి అయిన చో ది. అందుకుంటూనే "ఫెర్నాండెజ్ అద్భుతంగా మాట్లాడారు. ఇక మా పక్షానికి ఫిరాయిస్తారని ఆశిస్తున్నాను." అన్నాడు. ఇక్కడ సందర్భం ఏమిటంటే – 1979లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపప్రధాని చరణ్ సింగ్ కాంగ్రెసుతో కలిసి కుట్ర పన్ని జనతా పార్టీని చీల్చాడు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాడు. ఫెర్నాండెజ్ మొరార్జీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, తమ హయాంలో ఎంత ప్రగతి జరిగిందో గణాంకాలు ఏకరువు పెడుతూ అద్భుతమైన ప్రసంగం చేశాడు. ఆ మర్నాడే పార్టీ ఫిరాయించి చరణ్ సింగ్‌తో చేతులు కలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశాడు. చో దాన్ని గుర్తు చేశాడు. ఫెర్నాండెజ్ మొహం మాడింది. ఆ తర్వాత యిచ్చిన ఉపన్యాసంలో అద్భుతమైన పంచ్‌లైన్ యిచ్చాడు. 30 ఏళ్లు దాటినా నేను దాన్ని మరవలేదు. "ఇఫ్ లెఫ్ట్ హేజ్ ఎనీ ఫ్యూచర్ యిన్ ఇండియా, ఇండియా యీజ్ లెఫ్ట్ విత్ నో ఫ్యూచర్"! (వామపంథాకు ఇండియాలో భవిష్యత్తు వుంటే, ఇండియాకు భవిష్యత్తు లేకుండా పోతుంది). తెలుగులో యింత చప్పగా వచ్చింది కానీ 'లెఫ్ట్' అనే పదంపై చో చేసిన 'పన్' బ్రహ్మాండంగా పేలి, కమ్యూనిస్టు అభిమానులు కూడా పడిపడి నవ్వేట్లు చేసింది. కమ్యూనిస్టులు ఏవేవో ఊహలు చేసేసి, వ్యక్తులపై, సంఘటనలపై తీర్పులు యిచ్చేసి, తీర్మానాలు చేసేసి, ఆ తర్వాత ఏ 20, 30 ఏళ్లకో తాము ఆనాడు చేసినది తప్పు అని ఒప్పుకోవడంపై చో ఎన్ని జోకులు వేశాడో లెక్కే లేదు.

చో జనతా పార్టీ అభిమాని. ఎమర్జన్సీ నడిపే రోజుల్లో అనేక పెద్ద పత్రికలు సెన్సార్‌షిప్‌కు దాసోహం అనగా చో మాత్రం ధైర్యంగా ఎదిరించి, సెన్సార్‌కు దొరక్కుండా వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తూ సెన్సార్ వాళ్లతోనే ఆటలాడుకున్నాడు. 1976 ఫిబ్రవరి 29 మొరార్జీ పుట్టినరోజు సందర్భంగా మొరార్జీ ఫోటో వేసి 'మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డే టు మొరార్జీ' అని వ్యాఖ్య పెట్టి అప్పటి రూలు ప్రకారం పత్రిక విడుదలకు ముందు సెన్సార్ ఆఫీసరుకి సబ్మిట్ చేశాడు. ఆయన టైటిల్ మార్చు అన్నాడు. ఒక మెనీ తీసేసి మెనీ హేపీ... అని పంపాడు. అదీ తీసేయ్ అన్నాడు ఆఫీసరు. హేపీ.. అని పంపాడు. దానికీ అభ్యంతరమే. చివరకు మొరార్జీ ఫోటో వేసి, కింద మొరార్జీ అని పేరు రాసి పత్రికను విడుదల చేశాడు. ఈ ఉదంతాన్ని ఎమర్జన్సీ అత్యాచారాలపై జనతా పార్టీ వేసిన షా కమిషన్ ముందు చో చెప్తుంటే జడ్జి గారి దగ్గర్నుంచి అందరూ పడిపడి నవ్వారు. సెన్సారుకి దొరక్కుండా చేసిన తమాషాలు చాలా వున్నాయి. ప్రశ్నోత్తరాలలో ఓ ప్రశ్న – 'నేను ప్రధాని అయ్యే అవకాశం వుందా?' అని! 'మీ అమ్మ పేరు చెప్పు. ఉందో లేదో అప్పుడు చెప్తాను' అని సమాధానం. ఇది సంజయ్ గాంధీపై విసురు. 1980లో సంజయ్ గాంధీ చచ్చిపోయినపుడు మళ్లీ అధికారంలోకి

వచ్చేసిన ఇందిర అతని పేర ఒక స్టాంపు విడుదల చేసింది. చో తన పత్రిక ద్వారా సంజయ్‌తో పాటు చనిపోయిన కో-పైలట్ సక్సేనా పేర స్టాంపు విడుదల చేశాడు. 'సంజయ్ చేసిన ఘనకార్యం యింతకంటె ఏం లేదు, అవతలివాడు యితనికి ఎందులోనూ తీసిపోడు' అని అనిపించేట్లు. పత్రికలోంచి కత్తిరించి కొందరు తుగ్లక్ ఆఫీసుకి పంపే ఉత్తరాలపై ఆ స్టాంపు అతికించారు. సరిగ్గా చూసుకోని పోస్టాఫీసు వారు దానిపై ముద్ర కొట్టారు కూడా. ఇదీ పోస్టల్ డిపార్టుమెంటు పనిచేసే తీరు అంటూ చో ఆ కాన్సిలేషన్‌ను ఫోటో తీసి అచ్చేశాడు. జనతా పార్టీకి అతను మద్దతు యిచ్చే రోజుల్లో 'మీరు ఆ పార్టీలో చేరవచ్చు కదా' అని ఎవరో అడిగారు. 'ఆ పార్టీకి ఒక సుబ్రహ్మణ్యం స్వామి చాలు. నేను కూడా ఎందుకు?' అని జవాబిచ్చాడు. ప్రతీదాన్ని వివాదం చేసే స్వామిపై విసురు అది. తను విమర్శకుడే తప్ప, నిర్మాణాత్మకంగా ఏమీ చేయలేనని తన మీదా సెటైర్ వేసుకున్నాడు.

ఆ రోజుల్లోనే తనకు దేశవ్యాప్తంగా వచ్చిన పేరును ఉపయోగించుకుందామని తుగ్లక్‌కు యింగ్లీషు వెర్షన్‌గా "పిక్విక్" అనే పత్రిక పెట్టి నడిపాడు. నేను దానికి తొలి సంచిక నుండి చందాదారుణ్ని. రెండేళ్లు కాబోలు నడిచి ఆగిపోయింది. తుగ్లక్ మాత్రం అప్రతిహతంగా సాగింది. ద్రవిడ పార్టీలను ఆయన తెగ విమర్శించాడు. వాళ్లతో విసిగి కాబోలు, తర్వాతి రోజుల్లో బిజెపికి మద్దతుదారుగా వున్నాడు. కాంగ్రెసు అంటే ఎటూ యిష్టం లేదు. బిజెపి ఆయనను 1999లో రాజ్యసభకు పంపింది. 2008లో మోదీని మద్రాసుకి పిల్చి సత్కరించాడు. అలా అని అయనవి ఆరెస్సెస్ భావాలు కావు. రాజకీయ నాయకులందరినీ ఒకే గాటన కట్టి మాట్లాడిన సందర్భాలు ఎక్కువ. పాలిటిక్స్‌పై "యారుక్కు వెట్కమిల్లయ్" (ఎవరికీ సిగ్గు లేదు) అనే డ్రామా, సినిమా వుందాయనది. అనేక సినిమాలకు కథలందించాడు. సినిమా కథలపై సెటైరికల్ ఓ టీవీ సీరియల్ రాసి, దానిలో కథకుడిగా నటించాడు. ఆయన అందర్నీ ఆట పట్టిస్తూనే వున్నాడు. తమిళనాడులో సినిమా, రాజకీయాలు కలిసిపోయి వుంటాయి. కరుణానిధి, ఎమ్జీయార్‌లను విమర్శిస్తే వేషాలు రావని భయపడలేదు. తమాషా ఏమిటంటే ఆయన్ని ఎవరూ శత్రువుగా చూడలేదు. వేషాలిస్తూ పోయారు. ఆరోగ్యకరమైన వ్యంగ్యం అంటే చోదే! వ్యక్తిగతంగా జయలలితకు ఆప్తుడు. ఇద్దరూ కలిసి అనేక సినిమాల్లో నటించారు. ఇద్దరూ మేధావులే. కొంతకాలం యీయన సలహాలు ఆమె వింది. తర్వాతి కాలంలో దూరం పెట్టేసి నష్టపోయింది. తర్వాతి కాలంలో దూరం పెట్టేసి నష్టపోయింది. 1996 ఎన్నికలలో ఆమెకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. మళ్లీ డిఎంకెతో విసిగి 2011లో ఆమెను సమర్థించాడు. ఆ మేధావికి, హాస్యరచయితకు యిదే నా బాష్పాంజలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016) (ఫోటో – చో దంపతులకు నమస్కరిస్తున్న జయలలిత)**

**వీక్లీకై డిసెంబరు 08 ఎమ్బీయస్ : అమెరికా ఎన్నికలలో రీకౌంట్ ప్రహసనం**

పేరులో ప్రజాస్వామ్యం వున్నా అమెరికన్ డెమోక్రాటిక్ పార్టీకి దానిలో నమ్మకం లేనట్టుంది. తప్పక నెగ్గేస్తారని అందరూ ఉబ్బేసిన తమ అభ్యర్థి హిల్లరీ ఓడిపోవడం ఆ పార్టీ జీర్ణించుకోలేక పోతోంది. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించాక కూడా పది రోజుల పాటు వివిధ నగరాల్లో తన మద్దతుదారులచే ప్రదర్శనలు ఏర్పాటు చేయించింది – 'మేం ట్రంప్‌ను అధ్యక్షునిగా గుర్తించం' అంటూ. అలా ఎలా అనగలరో అర్థం కాదు. హిల్లరీకి ఎక్కువ ఓట్లు వస్తే రావచ్చు. కానీ అక్కడ ఎన్నికలకు ఒక పద్ధతి వుంది. దాని ప్రకారం ట్రంప్ గెలిచాడు. నీకు నచ్చుతాడా లేడా అన్నది ప్రశ్న కాదు. పదిరోజులు చేసినా అంబ పలకలేదు. ఇప్పుడు రీకౌంట్ ప్రహసనం మొదలుపెట్టారు. దీనికి వాళ్లు ఎంచుకున్న వ్యక్తి గ్రీన్ పార్టీ అభ్యర్థి జిల్ స్టీన్. ఆమె విస్కాన్సిన్, మిచిగన్, పెన్సిల్వేనియాలలో ఓట్లు మళ్లీ లెక్కించాలని కోరుతోంది. ఈ మూడు రాష్ట్రాలపై హిల్లరీ ఆశ పెట్టుకుంది కానీ అవి కొంప ముంచాయి. మళ్లీ లెక్కించమని అడగడానికి నామోషీ. అందువలన జిల్‌ను ముందుకు తోశారు. మన దగ్గరా రీకౌంట్ అడుగుతూంటారు. ఎవరు? తక్కువ తేడాతో ఓడిపోయినవారు. ఇక్కడ జిల్‌కు ఓట్లలో 1% పడ్డాయి. ఆమె గెలవాలంటే ఎన్ని ఓట్లు పడితే ఆమెకు గెలిచే అవకాశం వుంది చెప్పండి. విస్కాన్సిన్‌లో ట్రంప్ హిల్లరీని 22 వేల ఓట్లతో ఓడించాడు. మిచిగన్‌లో 10,700 ఓట్లతో ఓడించాడు. పెన్సిల్వేనియాలో 71 వేల తేడాతో గెలిచాడు.

సోదిలోకి కూడా లేకుండా పోయిన అభ్యర్థి రీకౌంట్ అడగవచ్చా? అంటే అక్కడి రూలు ప్రకారం అడగవచ్చు. అక్రమాలు జరిగినట్లు నీ దగ్గర సాక్ష్యాలున్నాయా అని అడిగితే 'లేవు కానీ సవ్యంగా జరగలేదనే భయాలు (గ్రేవ్ కన్సర్న్స్) వున్నాయి. అందుకని ఓట్లన్నీ చేత్తో లెక్కపెట్టి మరీ ఫలితం ప్రకటించాలి.' అంది. సరే, ఎన్నికలలో యిటువంటి తింగరి అభ్యర్థులు వుంటారులే అని వూరుకోవచ్చు కానీ ఆ రీకౌంట్ అభ్యర్థన పేరు చెప్పి ఆమె 60 లక్షల డాలర్లు పోగేసింది. ఎందుకంటే విస్కాన్సిన్‌లో 30 లక్షల ఓట్ల రీ కౌంట్ ఖర్చుల నిమిత్తం ఆమె ప్రభుత్వం వారికి 35 లక్షల డాలర్ల ఫీజు కట్టాలి. హిల్లరీ వర్గం వారు తమ వద్దా వ్యతిరేక సాక్ష్యాలు లేకపోయినా, ఆమె డిమాండ్‌ను సమర్థిస్తున్నామని అంటున్నారు. దాంతో ఈ 6 మిలియన్ డాలర్ల విరాళాల వెనక డెమోక్రాటిక్ పార్టీ వుందేమోనన్న సందేహం సహజంగా వస్తోంది. ఈ రీకౌంట్ వలన ఫలితం తారుమారవుతుందా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే అవన్నీ చేత్తో లెక్కపెడుతూ కూర్చుంటే పుణ్యకాలం గడిచిపోతుంది. వాటిని లెక్కలోకి తీసుకోకుండా ఫలితం ప్రకటించాలి. అంటే అప్పుడు ట్రంప్‌కు 260, హిల్లరీకి 232 వస్తాయి. ఎవరికీ 270 రావు. అప్పుడు కాంగ్రెసు ఓట్లు కలిపి చూస్తారు. రాష్ట్రానికి 1 ఓటు చొప్పున కలిపితే ట్రంప్ గెలుస్తాడు. హిల్లరీ ఎలాగూ గెలవదు. మరి ఆ కాడికి ఆమె పార్టీ ఎందుకిదంతా చేస్తోంది అంటే ట్రంప్ సవ్యంగా గెలవలేదని లోకానికి చాటడానికి ! ప్రత్యర్థి కంటె 21 లక్షల ఓట్లు తక్కువ తెచ్చుకున్నాడు పైగా ఎలక్టోరల్ కాలేజీలో కనీస

సంఖ్య 270 గెలుచుకోలేదు అని ఎత్తి చూపడానికి. ఈ భాగ్యానికి చచ్చేట్లు అన్ని ఓట్లూ లెక్కించాలా?

ఇదే ప్రశ్న కోర్టులు కూడా ఆలోచిస్తున్నాయి. విస్కాన్సిన్‌లో రీకౌంట్ ప్రారంభమైనదాకా వుండి దాన్ని అసలు అనుమతించి వుండకూడదు అంటూ ట్రంప్ అభిమానులు ఫెడరల్ కోర్టులో కేసు పడేశారు. దానిపై వాదోపవాదాలు సాగుతున్నాయి. మిచిగన్‌లో 48 లక్షల ఓట్లు మళ్లీ లెక్కించడం ప్రారంభించారు. దీనిమీదా కేసు పడేశారు – ఇదంతా వృథా ప్రయాస అంటూ. దాని మీదా కోర్టు యింకా నిర్ణయం తీసుకోలేదు. ఇవి యిలా వుండగా హిల్లరీ నెగ్గిన నెవాడాలో ఓ స్వతంత్ర అభ్యర్థి ఓట్లు మళ్లీ లెక్కించమని కోరుతున్నాడు. అతనికీ పెద్దగా ఓట్లు రాలేదు. ఇక ట్రంప్ నెగ్గిన ఫ్లోరిడాలో హ్యేకింగ్ కారణంగా, ఓటింగు మిషన్లు సరిగ్గా పనిచేయని కారణంగా ఫలితం తారుమారైంది, మళ్లీ లెక్కించండి అంటూ ముగ్గురు ఓటర్లు మంగళవారం నాడు ఓ పిటిషన్ పడేశారు.

ఇవన్నీ చూసి రీకౌంట్ అడగాలంటే ఓట్లలో కనీసం ఫలానా యింత శాతం వచ్చినవాళ్లే అడగాలి అనే రూలు అమెరికా పెట్టేస్తుందేమో అనిపిస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016) (ఫోటో – గ్రీన్ పార్టీ అభ్యర్థి జిల్ స్టీన్)**

**వీక్లీకై డిసెంబరు 09** **ఎమ్బీయస్ : జయలలిత వారసత్వం**

తను పోయాక తన ఆస్తులు, ఎడిఎంకె పార్టీ, తమిళనాడు ప్రభుత్వం ఏమయిపోతాయని జయలలిత ఆలోచించలేదంటే ఆశ్చర్యంగా వుంటుంది. వీలునామా రాయకుండానే ఆమె చనిపోయిందంటే నమ్మబుద్ధి కాదు. రాసేవుంటుందని, కానీ పాపాలభైరవి శశికళ మాయం చేసేసి వుంటుందని తీర్మానించడం సులభమైన పని. ఆమె, ఆమె ముఠా అవినీతికి పాల్పడి జయలలితకు చెడ్డపేరు తెచ్చారని ఆమె ప్రత్యర్థులైన ఎడిఎంకె నాయకులు యిప్పుడు ఆరోపిస్తున్నారు. అంటే అవినీతి జరిగిందని ఒప్పుకుంటూనే దానికి కారణం శశికళ అంటున్నారు. జయలలితకు తెలియకుండా, అనుమతించకుండా శశికళ కానీ మరొకరు కానీ ఆమె పార్టీలో వ్యవహరించగలరా? ఏది ఏమైనా జయలలిత శశికళను విపరీతంగా నమ్మింది. శశికళ, ఆమె బంధువులు కలిసి తనకు చెడ్డపేరు తెస్తున్నారని అనుమానం తగలగానే 2011లో ఆమెను, వారందరినీ పార్టీలోంచి బహిష్కరించింది. కానీ ఆ బంధువులు తనకు కూడా తెలియకుండా ఆ పనులు చేసివుంటారని, తను నిర్దోషినని శశికళ జయలలితను నమ్మించగలిగింది. మళ్లీ ఆత్మీయురాలైంది. డిసెంబరు 6న, జయలలిత పార్థివదేహం చుట్టూ ఆ బంధువులంతా ప్రత్యక్షమయ్యారు. శశికళ భర్త నటరాజన్ పేరు చెపితేనే జయలలిత మండిపడేది. అతనూ అక్కడ హాజరయ్యాడు.

ఎమ్జీయార్ చనిపోయినపుడు శవం దగ్గర జయలలిత నిలబడితే ఆమెను తరిమివేయడానికి వీరప్పన్ వర్గం శతథా ప్రయత్నించింది. ఈ రోజు శశికళకు అలాటి అవస్థ ఏమీ పట్టలేదు. బంధుసమేతంగా ఆమె శవం చుట్టూ నిలబడితే, ముఖ్యమంత్రి, యితర కాబినెట్ సహచరులు కింద మెట్ల మీద కూర్చున్నారు. వచ్చినవారందరూ శశికళను ఓదార్చి వెళ్లారు. 'జయలలిత కుటుంబసభ్యులకు ప్రాముఖ్యత యివ్వలేదు, శశికళ అక్రమాలను ఎండగడతా' అంటూ జయలలిత మేనకోడలు దీప రంగంలోకి దిగింది. మీడియా తప్ప వేరెవ్వరూ ఆమెను పట్టించుకోవటం లేదు. ఎందుకంటే జయలలిత బతికి వుండగా ఆమె వీళ్లెవరినీ దగ్గరకు రానీయలేదు. వీళ్లూ నోరెత్తలేదు. చచ్చిపోయిన తర్వాత 'మా అత్త పార్టీని రక్షిస్తా' అని చెప్పుకుంటే ఎవరికి పట్టింది? జయలలిత తనకు కుటుంబం వున్నట్లే ఎప్పుడూ చూపుకోలేదు. ఆమెకు డాక్టరీ చదివిన కూతురు వుందని పుకారు వుంది. ఆ కూతురు అంత్యక్రియల్లో ఎక్కడా కనబడినట్లు లేదు, ఆమె పేర ఆస్తులు రాసినట్లూ కనబడటం లేదు.

ఈ రోజు వున్న వాస్తవమేమిటంటే – తమిళనాడులో శశికళ అత్యంత శక్తివంతమైన మహిళగా అవతరించింది. దానికి ఆధారం ఆమెకు జయలలితతో వున్న 30 ఏళ్ల సాన్నిహిత్యం. పార్టీకి జనరల్ సెక్రటరీగా ఆమె కావడం నిశ్చయంగా కనబడుతోంది. పార్టీయే కాదు, ముఖ్యమంత్రి కూడా అవుతానని ఆమె పేచీ పెట్టి రెండు రోజుల తర్వాత వెనక్కి తగ్గింది. ఎందుకు తగ్గింది అనేదానికి కొన్ని కథనాలు వినబడుతున్నాయి. పన్నీరు సెల్వం పార్టీని బిజెపి వైపు నడిపిద్దామని చూస్తున్నాడని, శశికళ కాంగ్రెసు వైపు నడిపిద్దామని చూస్తోందని అంటున్నారు. అంత్యక్రియల్లో శశికళ భర్త నటరాజన్‌తో రాహుల్ గాంధీ మాట్లాడగా, సెల్వంతో మోదీ మాట్లాడారు. సెల్వంను ముఖ్యమంత్రిగా కొనసాగించడానికి శశికళను భయపెట్టాలి. అందుకే టిటిడి శేఖరరెడ్డి, మరో ఫైనాన్సర్‌పై దాడులు జరిగాయట. దాంతో శశికళ వెనక్కి తగ్గిందట. ముఖ్యమంత్రిగా సెల్వం జయలలిత మరణం తర్వాత రాష్ట్రంలో గందరగోళం జరగకుండా సామర్థ్యం చూపాడు. ప్రభుత్వం సెల్వం చేతిలో, పార్టీ శశికళ చేతిలో అనే ఏర్పాటు ఎంతకాలం నడుస్తుందో చూడాలి.

దీనిలో కులకోణం కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. తమిళనాడులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎంపిక నియోజకవర్గంలో అధిక సంఖ్యాకుల కులప్రాతిపదికపై జరిగినా యిన్నాళ్లూ ముఖ్యనాయకులు ప్రధాన కులాలకు చెందనివారై అన్ని కులాల ఆదరాన్నీ పొందినవారు. ఎమ్జీయార్ మలయాళీ మేనోన్, కరుణానిధి తెలుగు ఇసై వెల్లాలర్ (సంఖ్యాపరంగా చాలా తక్కువమంది వున్నారు), జయలలిత అయ్యంగార్ బ్రాహ్మణి. జనాభాలో వణ్నియార్ (18%), గౌండర్ (14%), దేవర్ (26%) అనే బిసి కులాలకు చెందినవారు 58% దాకా వున్నారు. (అంకెలు రమారమివే) వీరిలో ఎవరూ ముఖ్యమంత్రి కాలేదు. పిఎంకె పార్టీ వణ్నియార్ల కోసమే వెలసిన పార్టీ. గౌండర్లు యిటీవలి కాలంలో తమ ఆధిపత్యాన్ని చూపించుకుంటూ దళితులతో కలహిస్తున్నారు. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన సెల్వం,

శశికళ యిద్దరూ దేవర్లే కాబట్టి ఆ కులం గురించి కొంత తెలుసుకోవాలి. దేవర్లను ముక్కులతోర్లు అని కూడా అంటారు. అంటే మూడు కులాల కూటమి అని అర్థం. ఆ మూడు కులాలు – అగముదయార్, కల్లార్, మారవర్! వీరు తాము ఇంద్రుడికి, ఒక అప్సర ద్వారా కలిగిన సంతతి అనుకుంటారు. అగముదయార్‌లు తాము చేర వంశస్తులమని, కల్లార్‌లు తాము చోళ వంశస్తులమని, మారవర్‌లు తాము పాండ్య వంశస్తులమని చెప్పుకుంటూ, యితర ఉపకులాల కంటె తామే అధికులమని అనుకుంటూ వుంటారు.

సెల్వం మారవర్ కాగా, శశికళ కల్లార్. ఏది ఏమైనా యిద్దరూ దేవర్లే కాబట్టి ఎడిఎంకెలో యిక దేవర్ల ప్రభ వెలుగుతుందని అనుకుంటున్నారు. డిఎంకెకు దేవర్ల వ్యతిరేక పార్టీ అనే పేరుంది. దాన్ని సవరిద్దామని స్టాలిన్ యిటీవలే దిండిగల్ పెరియసామి అనే దేవర్‌ను పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా చేశాడు. ఎడిఎంకె ఎప్పణ్నుంచో దేవర్లను దువ్వుతోంది, వారితో పాటు గౌండర్లను కూడా. కాబినెట్‌లో 8 మంది దేవర్లు, 8 మంది గౌండర్లు వున్నారు. గౌండర్లయిన పొన్నియన్, తంబిదురై పార్టీ జనరల్ సెక్రటరీ పదవికి శశికళతో పోటీపడి అంతలోనే వెనక్కి తగ్గారు. కులప్రాతిపదికపై సెల్వం ముఖ్యమంత్రి కాలేదు. జయలలిత అతని విశ్వసనీయతను నమ్మింది కాబట్టి అయ్యాడు. కానీ శశికళ, అతను యిద్దరూ ఒకే కులానికి చెందినా రాజకీయంగా ఎవరికి అండగా నిలవాలన్న విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. ఏది ఏమైనా ఎమ్జీయార్ మరణించాక ఎడిఎంకె జానకి వర్గంగా, జయలలిత వర్గంగా చీలిపోయి నష్టపోయింది. ప్రజామోదం సంపాదించి జయలలిత వారసురాలిగా గుర్తించబడి, పార్టీని ఐక్యం చేయగలిగింది. జయలలిత తదనంతరం పార్టీలో ఏ మాత్రం చీలిక వచ్చినా డిఎంకె లాభపడుతుంది. శశికళ వేసే ఎత్తులపై తర్వాతి కథ ఆధారపడుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**వీక్లీకై డిసెంబరు 10, 11 ఎమ్బీయస్ : కొలంబియా శాంతి ఒప్పందం అమలయ్యేనా?**

కొలంబియా ప్రభుత్వానికి, వామపక్ష గెరిల్లాలకు మధ్య సెప్టెంబరులో కుదిరిన శాంతి ఒప్పందానికి కొలంబియా రాజ్యాంగ కోర్టు 8–1 మెజారిటీతో మంగళవారం నాడు ఆమోదముద్ర వేయడంతో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ అధ్యక్షుడు యురిబే వర్గానికి పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టయింది. ఎందుకంటే పార్లమెంటులో సాధ్యమైనన్ని అవరోధాలు కల్పిస్తూ అది ఆచరణలోకి రాకుండా చేద్దామని అనుకున్నారు వాళ్లు. ఇప్పుడీ కోర్టు తీర్పుతో పార్లమెంటరీ అడ్డంకి తొలగిపోయి, త్వరితమైన అమలుకు మార్గం సుగమం అయింది. కొలంబియా అధ్యక్షుడు జువాన్ మాన్యుయెల్ సాంతోస్‌కు నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేసిన మూడు రోజులకు యీ తీర్పు వెలువడడం గమనార్హం.

ఈ ఒప్పందం గురించి తెలుసుకోవాలంటే కొలంబియా రక్తచరిత్ర గురించి కొద్దిపాటి అవగాహన ఏర్పరచుకోవడం అవసరం. స్పెయిన్ దేశస్తులు దక్షిణ అమెరికాలో చాలా ప్రాంతాలను క్రూరమైన యుద్ధాల ద్వారా గెలిచి, పాలించారు. కొలంబియాలో స్థానిక తెగలను అతి అమానుషంగా మట్టుపెట్టి ప్రజాపీడకులుగా అవతరించారు. ఈ బాధలు భరించలేక సైమన్ బొలీవర్ అనే విప్లవవీరుడు కొద్దిమంది సాహస యువకులతో కలిసి స్పెయిన్ సైన్యంతో పోరాడి వారిని తరిమివేసి దేశానికి 'నూ గ్రనాడా' అని పేరు పెట్టుకున్నాడు. ఇతని స్ఫూర్తితో పక్కనున్న క్విటో (నేటి ఈక్వడార్), వెనెజులా లో విప్లవవీరులు కూడా స్పెయిన్ సైన్యాన్ని ఓడించి స్వతంత్ర దేశాలయ్యాయి. ఈ మూడు, పనామా దేశంతో సహా కలిసి గ్రాన్ కొలంబియా అనే పెద్దదేశంగా 1819లో ఏర్పడి బొలీవర్‌ను అధ్యక్షుడిగా ఎన్నిక చేసుకున్నాయి. 1830లో అతని మరణం తర్వాత యీ దేశాలు విడిపోయాయి. వాటిలో రిపబ్లిక్ ఆఫ్ కొలంబియా ఒకటి. ఈ దేశం ఏర్పడిన దగ్గర్నుంచి అంతర్యుద్ధాలే. 19 వ శతాబ్దంలో జనాభాలో 3.5% మంది అంతర్యుద్ధాలలోనే మరణించారు. 20వ శతాబ్దం వచ్చేసరికి కన్సర్వేటివ్, లిబరల్ పార్టీల మధ్య జరిగిన కలహాల్లో లక్ష మంది చచ్చిపోయారు. 1948లో ప్రగతివాద ఉదారవాద నాయకుడు గైటాన్ అధ్యక్ష ఎన్నికకు నిలబడితే అతన్ని హత్య చేశారు. అక్కణ్నుంచి 1964 వరకు జరిగిన దాడుల్లో, ప్రతిదాడుల్లో 2 లక్షల మంది చచ్చిపోయారు.

1980లు వచ్చేసరికి డ్రగ్స్ (మాదకద్రవ్యాల) వ్యాపారం చేసి వ్యాపారస్తులు, భూస్వాములు, అండర్ వరల్డ్ మాఫియా, బొగ్గు, బంగారం, ఎమెరాల్డ్‌లు మైనింగ్ చేసే వర్గాలు ప్రైవేటు సేనలు తయారుచేసుకుని వాటి ద్వారా తమను అడ్డుకునే వారిని చంపసాగారు. వారిని ఎదుర్కోవడానికి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫ్ కొలంబియా (ఫార్క్), నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్‌ఎన్) పేర వామపక్ష విప్లవవాదులు కొండల్లో, అడవుల్లో, గ్రామాల్లో వుంటూ గెరిల్లా యుద్ధాలు చేయసాగారు. ప్రయివేటు సైన్యం వున్న వర్గాల చేతిలో వున్న మీడియా గెరిల్లాల ద్వారా జరిగిన హింసను ఎత్తిచూపుతూ, తమ వర్గాలు చేసే హింసను తక్కువగా చూపుతుంది. పెట్టుబడిదారీ వర్గాలకే అనుకూలంగా వున్న ప్రభుత్వం గెరిల్లాలను అణచడానికి మాత్రమే సైన్యాన్ని ఉపయోగిస్తూంటుంది. ఈ గొడవల్లో 2,20,000 మంది మరణించారు. చాలామంది కనబడకుండా పోయారు. ఒక అంచనా ప్రకారం లక్ష జనాభాలో 400 మంది చంపబడ్డారు. 1980–2006 మధ్య జరిగిన హత్యలు, ఊచకోతల్లో 62% ప్రయివేటు సేనలు చేసినవే. 11% మిలటరీ చేసినవి. 11.5% గెరిల్లాలు చేసినవి. తక్కినవి ఎవరు చేశారో తెలియలేదు.

ఇలా అంతర్యుద్ధాలు జరుగుతూంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయా అనే సందేహం వస్తుంది. కొలంబియా భౌగోళిక స్వరూపం విపరీతమైన ఎగుడుదిగుడులతో వుంటుంది. ఆర్థికస్వరూపం కూడా అంతే. ధనికులకు, పేదలకు మధ్య విపరీతమైన అంతరం.

2014 సెన్సస్ ప్రకారం ధనిక రైతులు (500 హెక్టార్ల కంటె ఎక్కువ కలవారు) జనాభాలో 1% కానీ మొత్తం భూమిలో 77% వారి వద్దనే వుంది! ఈ వ్యత్యాసం నానాటికీ పెరుగుతూ వస్తోంది. కొలంబియా రాజధాని ఐన బొగాటాలో దక్షిణ భాగంలో నిరుపేదలు నివసిస్తారు. అక్కడ వారికి మునిసిపాలిటీ నుండి అందవలసిన సౌకర్యాలు అందనే అందవు. అదే నగరంలో ఉత్తరం వైపు భాగంలో ధనికులు వుంటారు. దేశంలోని సహజవనరుల ద్వారా వచ్చే లాభాలను అనుభవిస్తూ, పేదల కేసి తొంగి చూడరు కూడా వాళ్లు. ఈ సామాజిక అన్యాయాన్ని ఆలంబనగా చేసుకుని ఫార్క్, ఇఎల్ఎన్ భూస్వాములకు, వ్యాపారస్తులకు వ్యతిరేకంగా జనాలను కూడగట్టసాగారు. వారిపై ప్రయివేటు సేనలు, ప్రభుత్వసైన్యం యిద్దరూ కలిసి పోరాడటంతో వాళ్లు తప్పించుకోవడానికి మధ్యలో గ్రామీణులను అడ్డుపెట్టుకోసాగారు. గెరిల్లాల ఆచూకీ చెప్పమని పోలీసులు, పోలీసుల ఆచూకీ చెప్పమని గెరిల్లాలు హింసించడంతో మధ్యలో ప్రజలు నలిగిపోయారు. ప్రయివేటు సేనలు వీళ్లిద్దరి కంటె క్రూరంగా ప్రవర్తిస్తున్నాయి.

అమెరికాలో కొకైన్ వ్యాపారం చేసేవారు కొలంబియా డ్రగ్ మాఫియాకు అండగా నిలిచారు. కమ్యూనిజాన్ని అడ్డుకుంటున్నానే కారణం చెప్పి అమెరికా కూడా కొలంబియా ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, వారికి మద్దతుగా నిలిచిన మాఫియాకు పరోక్షంగా సాయపడుతూ వచ్చింది. అమెరికా మద్దతుదారుడు అల్వారో యురిబే కొలంబియాకు అధ్యక్షుడుగా వున్న కాలంలో బిల్ క్లింటన్ "ప్లాన్ కొలంబియా" పేర అతని సైన్యానికి ఆయుధాలు, నిధులు సమకూర్చాడు. అంతేకాదు, రైతుల కోకా పొలాలపై విషపదార్థాలు జల్లి పంటలు నాశనం చేశాడు. విపరీతమైన సైన్యబలంతో తిరుగుబాటు దారులపై హత్యాకాండ జరిపించాడు. తర్వాత వచ్చిన అమెరికా అధ్యక్షులు కూడా దాన్ని కొనసాగించారు. ఎంత చేసినా ప్రజల్లో అశాంతి తగ్గలేదు, విప్లవకారుల బలమూ తగ్గలేదు. విప్లవకారులు ఆర్థికంగా బలపడడానికి కొకైన్ వ్యాపారాన్ని శాసించసాగారు. ఒకప్పుడు వారి క్యాడర్ 20 వేలమంది వుండేవారు. ప్రభుత్వం, ప్రైవేటు ఆర్మీల దాడులతో అది తగ్గిపోతూ వుండగా (ప్రస్తుతం 6 వేల మంది మిగిలారు) దాన్ని పూరించుకోవడానికి గ్రామాలపై పడి చిన్నపిల్లలను కిడ్నాప్ చేసి, తమలో కలుపుకోసాగారు. ప్రభుత్వ, ప్రయివేటు సేనలు ఒక వైపు, గెరిల్లాలు మరొకవైపు పీడించడంతో సామాన్య ప్రజలు నలిగిపోయారు. అందుచేత హింసావిధానం సరైనది కాదని అధ్యక్షుడు యురిబో కాబినెట్‌లో రక్షణ మంత్రిగా పనిచేసిన శాంతోస్ అభిప్రాయపడ్డాడు. యురిబోతో విభేదించి బయటకు వచ్చాడు. అధ్యక్షుడయ్యాడు. అప్పటినుంచి ఫార్క్‌తో శాంతి చర్చలు జరపాలని క్యూబా అధ్యక్షుడు రౌల్ఫ్ కాస్ట్రో సహాయాన్ని అర్థించాడు.

రౌల్ మధ్యవర్తిత్వంతో నాలుగేళ్లపాటు శాంతి చర్చలు జరిగి చివరకు ఈ ఏడాది జూన్ 23న యుద్ధవిరమణ చేశారు. సెప్టెంబరు 26న క్యూబా రాజధాని హవానాలో ఒక ఒప్పందానికి వచ్చారు. దానిపై ప్రభుత్వం తరఫున శాంతోస్, ఫార్క్ తరఫున రోడ్రిగో లండనో సంతకాలు చేశారు. దాన్ని యురిబో, అతనికి మద్దతు యిచ్చే డ్రగ్, క్రైమ్ మాఫియా, ప్రయివేటు సైన్యాలు తిరస్కరించాయి. ఒప్పందంపై శాంతోస్ అక్టోబరు 2న ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాడు. మాఫియాకు భయపడో ఏమో 37% మంది మాత్రమే ఓటింగులో పాల్గొన్నారు. దానిలో 50.2% మంది తిరస్కరించగా, 49.8% మంది ఆమోదించారు. 0.4% తేడాతో ఒప్పందం ఓడిపోయింది. అయితే శాంతోస్ పట్టుదలగా దాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాడు. పెట్టబోయే ముందు ఒప్పందాన్ని కాదన్నవారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని కొన్ని మార్పులు చేశాడు. 50 అంశాల్లో విప్లవకారులను మరిన్ని షరతులకు ఒప్పించి, నవంబరు 24న మళ్లీ ఒక ఒప్పందం చేసుకుని మళ్లీ ప్లెబిసైటుకి వెళ్లకుండా సరాసరి పార్లమెంటు ఆమోదం కోరాడు. ప్లెబిసైట్‌లో మళ్లీ ఓడిద్దామని ఆశపడిన యుబిరో వర్గం యీ సవరణలతో తృప్తి పడలేదు. పార్లమెంటులో వాకౌట్ చేసింది. కాంగ్రెసు ఆమోదించిన తర్వాత కూడా పూర్తిగా అమలవ్వాలంటే అనేక చట్టాలు చేయాలి. వాటికి కాలయాపన జరుగుతుంది. సమయం గడిచిన కొద్దీ 6 వేల మంది వున్న ఫార్క్ క్యాడర్ కూడా ఒప్పందం నుంచి వెనక్కి మరలవచ్చని, ఆరేళ్లపాటు కష్టపడి చేసినది వ్యృథా అవుతుందని శాంతోస్ భయం. అందుకే కోర్టుకి వెళ్లాడు. కోర్టు అతనికి అనుకూలంగా తీర్పు నిచ్చి రక్షించింది.

ఇది కొలంబియా ప్రజలను కూడా ఎంతో సంతోషపెట్టింది. 52 ఏళ్లగా జరుగుతున్న హింసతో వారు విసిగిపోయారు. ప్రతి బుధవారం రాజధానిలో అన్ని వర్గాల ప్రజలు ఒప్పందం వెంటనే అమలు కావాలంటూ వీధుల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వారిలో యువతీయువకులు, వృద్ధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, బాగా ఆర్జించే ప్రొఫెషనల్స్, ట్రేడ్ యూనియనిస్టులు, పనివారు, ఆరోగ్యవంతులు, వికలాంగులు, నగరవాసులు, గ్రామీణులు, హింసాత్మక ఘటనల్లో చనిపోయినవారి కుటుంబసభ్యులు, మిత్రులు – అందరూ వున్నారు. 70 లక్షల మందిని యిళ్లు విడిచి పారిపోయేలా చేసిన హింసావాతావరణం యీ ఒప్పందంలో భాగంగా జరిగిన యుద్ధవిరమణ కారణంగా చల్లారింది. ఒప్పందం విఫలమైతే మళ్లీ యుద్ధం ప్రారంభమవుతుందన్న ఆందోళన వారిది. ఒప్పందాన్ని అడ్డుకునే వర్గాలు ఒప్పందంపై సంతకం జరిగిన సెప్టెంబరు 26 నుంచి నవంబరు 30 లోపున 13 మంది ప్రజాహక్కులకై పోరాడే నాయకులను చంపాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఫార్క్‌తో ఒప్పందం నెగ్గితే మరో విప్లవసంస్థ ఇఎల్ఎన్‌తో హవానాలో జరిగే చర్చలు సఫలమవుతాయనే ఆశ కూడా వుంది.

ఇంతకీ యీ ఒప్పందంలో ఏముందని రైటిస్టు వర్గాలు దాన్ని అంతగా వ్యతిరేకిస్తున్నాయి? ఒప్పందం ప్రకారం గెరిల్లాలు ఆయుధాలు విసర్జించాలి. ఆరునెలల వ్యవధిలో, అంటే ఏప్రిల్ 30 నాటికి ఐక్యరాజ్యసమితి ఏర్పరచే క్యాంపుల్లో యీ ఆయుధాలు ఒప్పగించాలి. దానికి బదులుగా ప్రభుత్వం వారిని జనజీవన స్రవంతిలోకి రానిస్తుంది. గ్రామాల్లో భూములు పంపిణీ చేసి, ఆ భూములను అభివృద్ధి చేసుకోవడానికి ఆర్థికసాయం చేస్తుంది. అంతేకాదు, రాజకీయ పక్షంగా మారి ఎన్నికలలో పోటీ చేయనిస్తుంది.

గెరిల్లాల హింస మాత్రమే కాక, ప్రయివేటు ఆర్మీల హింస గురించి కూడా నిజానిజాలు నిర్ధారించడానికి, ఆ సేనలను నిర్మూలించడానికి, జనాలపై జరిపిన అక్రమాలకై శిక్షించడానికి ప్రభుత్వం తరఫున ఎటార్నీ జనరల్ ఒక స్పెషల్ యిన్వెస్టిగేషన్ టీమును నియమిస్తారు. రాజకీయపరంగా జరిగిన హత్యలకు మాఫీ వుంటుంది కానీ, అమాయక ప్రజలపై జరిపిన మారణకాండకు శిక్ష తప్పదు. ఒప్పందాన్ని వ్యతిరేకించేవారు గెరిల్లాలను రాజకీయాల్లోకి రానీయకూడదనే షరతు పెట్టాలంటున్నారు. అది తమకు ఆమోదం కాదంటున్నారు గెరిల్లాలు. అందుకని ఒప్పందంలో దాన్ని చేర్చలేదు.

యురిబేకు యిదంతా నచ్చలేదు. 2018లో మళ్లీ ఎన్నికలు రానున్నాయి. రెండుసార్లు అధ్యక్షపదవి నిర్వహించిన కారణంగా తను మళ్లీ ఎన్నిక కాలేకపోయినా, తన తరఫు అభ్యర్థి ఎన్నిక కావాలి. ప్రయివేటు ఆర్మీలను నిర్మూలించివేస్తే ఆ గెలుపు కష్టం. ఎందుకంటే 2006 ఎన్నికలో తను గెలిచినది ఆ సేనల మద్దతుతోనే, ఆ సేనలన్నీ తన ఛత్రం కింద తీసుకువచ్చిన యునైటెడ్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్సెస్ ఆఫ్ కొలంబియా అనే ఫెడరేషన్ మద్దతుతోనే! అసలు అతని తమ్ముడికే పెద్ద సేన వుంది. ఇప్పుడు గెరిల్లాలు రాజకీయాల్లోకి వచ్చేస్తే, వారు శాంతోస్‌తో చేతులు కలిపి తమ వర్గాన్ని ఓడించవచ్చు. ఇప్పటికే లండనో ఒప్పందాన్ని అమలు చేసే ప్రభుత్వాన్నే వచ్చే ఎన్నికలలో గెలిపించండని పిలుపు నిస్తున్నాడు. శాంతోస్ కూడా రెండు సార్లు అధ్యక్షుడిగా చేశాడు కాబట్టి ఒప్పందం కుదర్చడంలో ముఖ్యభూమిక నిర్వహించిన హంబర్టో కాలేనే అభ్యర్థిగా నిలపవచ్చు. ఈ ఒప్పందం పట్ల అమెరికా దృక్పథం ఎలా వుంది అనేదానిపై దాని విజయం చాలావరకు ఆధారపడుతుంది. నిజానికి కొలంబియాలో శాంతి నెలకొని మత్తుపదార్థాల వ్యాపారాన్ని ఆ ప్రభుత్వం అరికట్టగలిగితే అమెరికాలో మత్తుపదార్థాల వాడకం తగ్గుతుంది. అమెరికా-కొలంబియాల మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం వుంది కాబట్టి అమెరికా కొలంబియాకు ఆర్థికంగా బలపడడానికి సాయం చేసి, ఆర్థిక అసమానతలు పోగొట్టడానికి కృషి చేయవచ్చు. అసమానతలు పోయి, సంపద అందరికీ అందుబాటులోకి వచ్చినపుడు అప్రయత్నంగానే శాంతి నెలకొంటుంది. ఇతర లాటిన్ అమెరికా దేశాల్లో కూడా మత్తుపదార్థాల సాగు సాగుతోంది. కొలంబియాను పరిపుష్టం చేసి దాని ద్వారా వాటిలో కూడా నార్కోటిక్ వ్యాపారాన్ని నాశనం చేసే అవకాశం వుంది. అమెరికా యిలా చేస్తుందో లేక కొలంబియాలోని పెట్టుబడిదారీ వర్గాల కొమ్ము కాసి ఒప్పందాన్ని కాలరాయడానికి సాయపడుతుందో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016) (ఫోటో – హవానాలో శాంతి ఒప్పందం సంతకాల వేళ శాంతోస్, కాస్ట్రో, లండనో)**

**డిసెంబరు 12-15** **ఎమ్బీయస్ : టాటా వివాదంలో మిస్త్రీ తప్పుందా?**

టాటా గ్రూపులో వివాదం అక్టోబరు నుంచి నడుస్తోంది. రాజీ సూచనలు ఎక్కడా కనబడకపోగా డిసెంబరు 11 ఆదివారం నాడు రతన్ టాటా సైరస్ మిస్త్రీపై బహిరంగంగా విరుచుకు పడ్డారు – అసలు సైరస్ సెలక్ట్ కమిటీని తప్పుదోవ పట్టించి చైర్మన్ అయ్యాడని, టాటా గ్రూపును లాభాల బాట పట్టించే అద్భుత ప్రణాళికలు తన దగ్గర వున్నాయని బుకాయించి, చైర్మన్‌గా సెలక్టయిపోయాడని ఆరోపించారు. ఇది వింటే నవ్వు వస్తుంది. టాటా అంటే చాలా ప్రొఫెషనల్‌గా నడిచే సంస్థ అనుకుంటాం. నిష్ణాతులతో కూడిన ఓ కమిటీ రెండేళ్లపాటు సరైన వ్యక్తి కోసం వెతికివెతికి చివరకు ఓ కోతలరాయుడికి అప్పగించామని రతన్ ఒప్పుకుంటున్నారా? సైరస్ బోగస్ అని నాలుగేళ్ల తర్వాత తెలిసిందా? మరి తీసేయడానికి నాలుగు నెలల క్రితమే సైరస్ పనితీరును మెచ్చుకుంటూ, జీతం పెంచాలని బోర్డు తీర్మానం ఎందుకు చేసింది? అంతేకాదు, అతని 2025 నాటికి టాటా గ్రూపు ఎలా వుండాలో అంటూ వేసిన 2025 ప్లానును కూడా ఆమోదించిందెందుకు? తనను సెలక్టు చేసిన కమిటీ చైర్మన్ లార్డ్ కుమార్ భట్టాచార్య ఆర్నెల్ల కితం కూడా తనను ప్రశంసించాడని సైరస్ చెప్పాడు.

దీనితో బాటు తన కుటుంబ వ్యాపార సంస్థ ఐన షాపుర్జీ పలోంజీకి దూరంగా వుంటానని చెప్పి మాట నిలబెట్టుకోలేదని కూడా రతన్ ఆరోపించారు. దీనికి సైరస్ సమాధానం చెపుతూ తను చైర్మన్ అయ్యాక షాపుర్జీ కంపెనీ బోర్డుల్లో పాలుపంచుకోలేదని ఉద్ఘాటించాడు. వివాదం తొలినాళ్లలో సైరస్ షాపుర్జీ కంపెనీకి మేలు చేసేడని రతన్ వర్గం ఆరోపించింది. తను చైర్మన్ అవుతూనే షాపుర్జీ కంపెనీకి కాంట్రాక్టులు యివ్వకూడదని తను టాటా గ్రూపు అంతటికీ ఆదేశాలిచ్చానని సైరస్ చెప్పాడు. దాన్ని వీళ్లు ఖండించలేదు. మరి యిలాటి ఆరోపణలు చేయడం రతన్ స్థాయి వ్యక్తికి తగునా? ఈ వివాదంలో సైరస్ తప్పు ఎంత వుంది?

టాటా గ్రూపులో 29 లిస్టెడ్ కంపెనీలు, 70కి పైగా అన్‌లిస్టెడ్ కంపెనీలు వున్నాయి. అన్ని కంపెనీలకు కలిపి మొత్తం 41 లక్షల మంది షేర్ హోల్డర్లు వున్నారు. టాటా గ్రూప్ కంపెనీలకు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ అక్టోబరు 24 నాటి బోర్డు సమావేశంలో ఆ బోర్డు తన చైర్మన్ సైరస్ మిస్త్రీని అత్యంత అగౌరవమైన రీతిలో తొలగించింది. అజెండాలో ముందే ప్రస్తావించకుండా, 'ఇతర విషయాలు..' (ఎనీ అదర్ బిజినెస్) అని హెడింగ్ కింద చైర్మన్ తొలగింపు వంటి ముఖ్య అంశాన్ని చేపట్టి ముగించింది. సమావేశం 2.30కి ప్రారంభం కానుండగా ఒక్క నిమిషం ముందు రతన్, నితిన్ నోహ్రియా అనే డైరక్టరు మిస్త్రీ గదిలోకి వచ్చి 'నీ అంతట నువ్వు రాజీనామా చేస్తే మంచిది, లేకపోతే మేమే తీసేయాల్సి వుంటుంది' అని చెప్పారట. 'నేను దిగిపోను. మీరు చేసుకోవాలనుకున్నది చేసుకోండి' అన్నాడు సైరస్. సమావేశంలో మొత్తం 9 మంది డైరక్టర్లలో 6గురు మద్దతు తెలిపారు. ఇద్దరు రాలేదు. మిగిలిన వ్యక్తి సైరస్సే.

ఆ తర్వాత టాటా సన్స్‌లో బోర్డు డైరక్టర్లుగా వున్న టివిఎస్‌కి చెందిన వేణు శ్రీనివాసన్, బెయిన్ క్యాపిటల్‌కు చెందిన అమిత్ చంద్ర, మాజీ రాయబారి రోనెన్ సేన్‌లతో బాటు స్వతంత్ర సభ్యుడు బ్రిటిష్ ఎంపీ లార్డ్ కుమార్ భట్టాచార్య, మరొకరు సభ్యులుగా వుండే ఒక అన్వేషణ కమిటీ వేసి కొత్త చైర్మన్ కోసం వెతికించి నాలుగు నెలల్లో కొత్త చైర్మన్‌ను వేస్తామని అప్పటివరకు 78 ఏళ్ల రతన్ టాటాను తాత్కాలిక చైర్మన్‌గా అప్పటికప్పుడే నియమించింది. కొందరు చెప్పేదేమిటంటే ఏడాదిగా రతన్ సైరస్‌పై చిర్రుబుర్రు లాడుతూనే వున్నాడట. తన అసంతృప్తిని గుర్తించి సైరస్ తనంతట తనే వెళ్లిపోతాడేమోనని పదినెలలు ఓపిక పట్టాడట. చివరకు రెండు నెలలుగా ఎలా తీసేయాలా అని పథకం రచించాడు. న్యాయసలహా తీసుకుంటే సైరస్ తనంతట తనే రాజీనామా చేయాలి లేకపోతే బోర్డులో అధిక సంఖ్యాకులు అతన్ని తీర్మానం ద్వారా తీసేయాలి అని చెప్పారు. కొందరు డైరక్టర్లను విశ్వాసంలోకి తీసుకుని పథకం గురించి చెప్పి ఆఖరి ఛాన్సుగా అక్టోబరు 23న రతన్ సైరస్‌కు కబురు పంపాడు – నీ అంతట నువ్వే రాజీనామా చేస్తే మర్యాదగా వుంటుంది అని. తన తరఫు వాదన వినిపించడానికి బోర్డు సమావేశాన్ని వేదికగా వుపయోగించుకోదలచిన సైరస్ దానికి ఒప్పుకోలేదు. అయితే సైరస్‌కు మాట్లాడే అవకాశం కూడా యివ్వకుండా కుట్ర పన్ని తీసేశారు.

ఇప్పుడు అవమానకరంగా తీసేయడంతో సైరస్ తిరగబడ్డాడు. బోర్డు సభ్యులకు ఒక ఈమెయిల్ రాశాడు. అది మీడియాకు లీకయింది. సైరసే లీక్ చేశాడని రతన్ గ్రూపు అంటుంది. ఆ ఈమెయిల్‌లో సైరస్ చాలా ఆరోపణలే చేశాడు. రతన్ తనను స్వతంత్రంగా పని చేయనీయలేదన్నది ప్రధాన ఆరోపణ. టాటా సన్స్ బోర్డు సమావేశాలకు గత నాలుగేళ్లగా తను హాజరు కాకపోవడం మిస్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ యిచ్చేదానికే అంటాడు రతన్. రాకపోయినా వెనక్కాల నుంచి కథ నడిపించేవాడనీ, ఓ సారి ఓ మీటింగు మధ్యలో యిద్దరు టాటా ట్రస్టు డైరక్టర్లు బయటకు వెళ్లిపోయి, రతన్ ఆదేశాలు తీసుకుని వెనక్కి రావడానికి గంట పట్టిందని సైరస్ అన్నాడు. రతన్ హయాంలో చేసిన విదేశీ కొనుగోళ్ల కారణంగా గ్రూపులోని 5 కంపెనీలలో రూ. 1.96 లక్షల కోట్లను పోసినా రూ. 1.18 లక్షల కోట్ల పెట్టుబడి నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని, వాటిని యిప్పుడు రైటాఫ్ చేయవలసి వస్తోందని అంటాడు సైరస్. రతన్ యివన్నీ తిప్పికొడుతూ తరతరాలుగా వున్న టాటా సిద్ధాంతాల ప్రకారం సైరస్ నడవలేదని, గ్రూపు భవిష్యత్తుకై అతన్ని తప్పించక తప్పలేదని అన్నాడు. టాటా సిద్ధాంతాలు అనే మంత్రాన్ని రతన్ ఎన్నిసార్లు జపిస్తున్నాడో లెక్కలేదు.

లాభాల్లో వున్న కంపెనీలపైనే సైరస్ మిస్త్రీ దృష్టి పెట్టారని, నష్టాల్లో వున్నవాటిని వదుల్చుకోవాలని చూసి, ఉద్యోగులను సాగనంపి టాటా ఫిలాసఫీకే ఎసరు పెట్టాడని సైరస్‌పై రతన్ వర్గం ఆరోపణ. ప్రధాన కంపెనీలపై పెత్తనం చేద్దామని కూడా సైరస్ ప్రయత్నించాడని మరో ఆరోపణ. టాటా సన్స్ చైర్మన్‌గా వున్న వ్యక్తి కంపెనీలన్నిటిలోను కామన్‌గా డైరక్టరుగా వుండాలంటూ నిబంధనలు మార్చాడని, యిప్పుడది మారుస్తామని అంటున్నారు. టాటా సన్స్‌కు కొన్ని కంపెనీల్లో వాటా పెద్దగా వుంది. కొన్నిటిలో లేదు. వాటా పెద్దగా వున్న చోటల్లా సైరస్‌ను తీసేస్తున్నారు. అయితే ఇండియన్ హెూటల్స్ కంపెనీ, టాటా కెమికల్స్ బోర్డు సైరస్‌కు వత్తాసుగా నిలబడడం, స్వతంత్ర డైరక్టర్లయిన దీపక్ పరేఖ్, నుస్లీ వాడియా, నాదిర్ గోద్రెజ్ వంటి ప్రముఖులు సైరస్‌ను సమర్థించడం చూసి రతన్ వర్గం సైరస్ వారిని తన వైపు తిప్పుకున్నాడంటూ ఆరోపించింది. ఆ పెద్దమనుషులను బజారు కీడ్చే చర్యలకు పాల్పడుతున్నారని సైరస్ వర్గం ధ్వజమెత్తింది. అసాధారణ జనరల్‌బాడీ మీటింగ్ పెట్టి సైరస్‌ను తీసేయాలని రతన్ వర్గం కంకణం కట్టుకుంది.

అసలు మిస్త్రీని తెచ్చినదే మాజీ చైర్మన్ రతన్ టాటా! 2012 డిసెంబరు 29 నాటికి తనకు 75 ఏళ్లు పూర్తవుతాయి కాబట్టి తన స్థానంలో మరొకరు రావాలని రతన్ అన్నాడు. ఆ వారసుణ్ని వెతికే పనిని 5గురు సభ్యుల సెర్చ్ కమిటీకి అప్పగించాడు. వాళ్లు రెండేళ్ల పాటు అన్వేషించి అప్పటికి 44 ఏళ్ల సైరస్ మిస్త్రీని ఎంపిక చేశారు. అతను లండన్‌లో సివిల్ ఇంజనీరింగ్ చేసి లండన్ బిజినెస్ స్కూలులో ఎంబిఏ చేశాడు. 1991లో తండ్రి షాపుర్‌జీ స్థాపించిన షాపుర్‌జీ పల్లోంజీ గ్రూపులో తన కెరియర్ ప్రారంభించాడు. ఆ గ్రూపుకి టాటా సన్స్‌లో అందరి కంటె ఎక్కువగా 18.4% వాటా వుంది. ఆ గ్రూపు ప్రతినిథిగా 2006లో తన తండ్రి రిటైరైన దగ్గర్నుంచి సైరస్ టాటా సన్స్‌లో డైరక్టరుగా వున్నాడు. సైరస్ సోదరి ఆలూ, రతన్ సవతి సోదరుడైన నోయల్ టాటా భార్య. ఆ విధంగా రతన్‌తో బంధుత్వం కూడా వుంది. సైరస్ 2011 నవంబరులో రతన్ కింద డిప్యూటీ చైర్మన్‌గా పదవి చేపట్టి, ఆయన రిటైరయ్యా 2012 డిసెంబరులో చైర్మన్ అయ్యాడు. ఇప్పుడు తన శిష్యుడి మీదనే గురువు పగ బట్టి చాలా దారుణంగా వ్యవహరిస్తున్నాడు.

అసలు రతన్ టాటా స్వభావం ఎటువంటిది? టాటా గ్రూపుపై అతనికి అంత పట్టు ఎలా వచ్చింది? టాటా గ్రూపులోని కంపెనీలకు స్వతంత్ర ప్రతిపత్తి వున్నప్పటికి అవన్నీ హెూల్డింగ్ కంపెనీ ఐన టాటా సన్స్ ఆదేశాలను గౌరవిస్తాయి. టాటా సన్స్‌లో 66% వాటా రెండు ట్రస్టులది. అవి సర్ దొరాబ్జీ టాటా ట్రస్టు, సర్ రతన్ టాటా ట్రస్టు. ఈ రెండు ట్రస్టులకు జీవితకాలపు చైర్మన్ రతన్ టాటాయే. ఆ విధంగా రతన్ టాటా సన్స్‌పై తన పట్టుపోకుండా చూసుకున్నాడు. గతంలో రతన్ టాటా సన్స్‌కు కూడా చైర్మన్‌గా వుండగా సెలక్షన్ కమిటీలో ట్రస్టు నామినేట్ చేసిన డైరక్టర్లిద్దరూ, బోర్డు డైరక్టర్లిద్దరూ, బోర్డు నియమించిన బయటి డైరక్టరు ఒకడు మొత్తం ఐదుగురు వుండేవారు. టాటా సన్స్‌కు ఎవరు చైర్మన్‌గా వుండాలి అనేది నిర్ణయించగల అధికారం యీ కమిటీకి వుంటుంది. తను పదవిలో దిగిపోవడానికి కొద్ది రోజులు ముందుగా 2012, డిసెంబరు 6న కమిటీ ఏర్పాటును మార్చేశాడు. ట్రస్టు డైరక్టర్ల సంఖ్య రెండు నుంచి మూడుకు పెంచి, బోర్డు డైరక్టర్ల సంఖ్యను రెండు నుంచి ఒకటికి తగ్గించాడు. ఆ విధంగా ట్రస్టు డైరక్టర్ల మాటే చెల్లేట్లు చూశాడు. ఆ ట్రస్టులు తన చేతిలో వుండేట్లు చూసుకున్నాడు.

ఇలాటి విద్యలు రతన్‌కు కొత్త కాదు. 1991లో టాటా సన్స్‌కు తను కొత్తగా చైర్మన్ అయినప్పుడు అప్పట్లో దిగ్గజాలుగా వున్న

రూసీ మోదీ, దర్బారీ సేఠ్, అజిత్ కేర్కర్, నానీ ఫల్కీవాలాలను తన దారికి అడ్డుగా భావించాడు. అంతే డైరక్టర్ల రిటైర్‌మెంట్ వయసును తగ్గించేసి వాళ్లను యింటికి పంపేశాడు. వాళ్లు వెళ్లిపోయాక మళ్లీ వయోపరిమితి పెంచేశాడు. ఇప్పుడు సైరస్‌తో పోట్లాట సందర్భంగా తనకు మద్దతుగా యూనియన్లను లాక్కుని వచ్చాడు. 16 వేల మంది ఉద్యోగులకు ప్రాతినిథ్యం వహిస్తున్న పుణె, జంషెడ్‌పుర్ యూనిట్లకు చెందిన రెండు ఉద్యోగసంఘాలు రతన్‌కే తమ మద్దతు అని ప్రకటించాయి. మేనేజ్‌మెంట్‌తో తమ సంబంధాలు మిస్త్రీ కారణంగా గత 14 నెలల్లో బాగా క్షీణించాయని యూనియన్ లీడర్లు ప్రకటించారు.

సైరస్ చేరిన ఒక ఏడాది వరకు రతన్‌తో సంబంధబాంధవ్యాలు బాగానే వుండేవి. సైరస్ వ్యవస్థలో ఏ మార్పుచేర్పులూ చేయకుండా తన విధానాలే కొనసాగించడంతో, ప్రతిదానికీ తనను సంప్రదించడంతో రతన్‌కు నచ్చాడు. ట్రస్టుల్లో తనకున్న పలుకుబడితో టాటా సన్స్‌లో సైరస్‌కు ఏ యిబ్బందీ రాకుండా చూసేవాడు. ఒక దశలో సైరస్‌కు ట్రస్టుల్లో కూడా స్థానమిద్దామా అని ఆలోచించాడట. అయితే క్రమేపీ సైరస్ కొత్తరకంగా ప్రయత్నిద్దామని చూశాడు. గ్రూపు కార్యకలాపాలు ఎలా సాగాలో స్ట్రాటజీ నిర్ణయించేందుకు జిఇసి (కౌన్సిల్) పేర ఒక సలహా మండలిని ఏర్పాటు చేసి తనకు మాత్రమే రిపోర్టు చేయాలన్నాడు. మధు కణ్ణన్, ముకుంద్ రాజన్, ఎన్ఎస్ రాజన్, నిర్మాల్య కుమార్, హరీష్ భట్‌లు దానిలో సభ్యులు. అందరూ 45-55 ఏళ్ల మధ్య వాళ్లు. అంతకుముందు రతన్ చైర్మన్‌గిరీలో రెండు సలహా మండళ్లు వుండేవి. గ్రూప్ కార్పోరేట్ కౌన్సిల్ అని ప్రణాళికలు రచించడానికి, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ అని ప్రణాళికలను అమలు చేయడానికి వుండేవి. ఆ మండళ్లలో వుండేవాళ్లు 60,70ల వయసులో వుండేవారు. వాళ్లందరినీ ట్రస్టుల్లో కొనసాగిస్తూనే సలహా కమిటీలోంచి రిటైర్ చేయించాడు సైరస్. రతన్ వర్గం సైరస్‌ను దింపుతూనే యీ కౌన్సిల్‌ని రద్దు చేసేశారు. ఓ యిద్దర్ని తప్ప తక్కిన వారిని యింటికి పంపేశారు.

జిఇసితో బాటు సైరస్ టాటా బిజినెస్ ఎక్సలెన్స్ మోడల్ (టిబిఇఎమ్) అని ఏర్పరచాడు. వాళ్లు ఏడాది కోసారి గ్రూపు కంపెనీల నిర్మాణాన్ని, వ్యవహారశైలిని సమీక్షిస్తారు. ఇది ఆ సమీక్షలు కంపెనీల సిఇఓలకు నచ్చేవి కావు. టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా కెమికల్స్, టాటా పవర్, టిసిఎస్ నడిపే సీనియర్ అధికారులు జిఇసితో, టిబిఇఎమ్‌తో విభేదిస్తూ, 'మీదంతా థియరీ మాత్రమే. బిజినెస్ డైనమిక్స్ మీకు అర్థం కావు' అని వాదించేవారు. సైరస్ హయాంలో టాటా స్టీల్, టాటా మోటార్స్, ఇండియన్ హోటల్స్ యొక్క సిఇఓలు మారారు. టాటా స్టీల్ సిఇఓ రిటైర్ కాగా టాటా మోటార్స్ సిఇఓ చనిపోయాడు. ఇండియన్ హోటల్స్ సిఇఓ సైరస్‌తో విభేదించి రాజీనామా చేశాడు. అతను రతన్‌కు బాగా సన్నిహితుడు. సైరస్ నానో మూసేయడానికి ప్రయత్నించడం, టాటా స్టీల్ యుకె నష్టాలను తగ్గించడానికి చూడడం, ఇండియన్ హోటల్స్ ద్వారా భారీగా ఇండియాలో, విదేశాలలో కొనుగోళ్లు చేయడం, టాటా పవర్‌లో వెల్‌స్పన్ ఎనర్జీ కొనడం – యివన్నీ రతన్‌కు కోపం తెప్పించాయి.

సైరస్ 2012 డిసెంబరులో బాధ్యత చేపట్టాడు. 2011-12లో టాటా గ్రూపు టర్నోవర్ 101 బిలియన్ డాలర్లు.వుండగా 2015-16 నాటికి అది 103 బిలియన్ డాలర్లు అయింది. ఇది చాలా తక్కువ అంటుంది రతన్ గ్రూపు. మార్కెట్ కాపిటలైజేషన్‌ను రూ. 4.9 లక్షల కోట్ల నుంచి రూ. 8.5 లక్షల కోట్లు (125 బిలియన్ డాలర్లు) కు తెచ్చాడు అంటుంది సైరస్ గ్రూపు. రతన్ వర్గం ప్రకారం సైరస్ హయాంలో గ్రూపులోని 40 కంపెనీల్లో యిన్వెస్టర్లకు డివిడెండ్లు తగ్గిపోయాయి. టిసిఎస్‌ను పక్కన పెట్టి చూస్తే డివిడెండ్లు రూ.1000 కోట్ల నుండి రూ.780 కోట్లకు తగ్గాయి. వ్యయాలు మాత్రం రూ.84 కోట్ల నుంచి రూ.180 కోట్లకు పెరిగిపోయాయి. నాలుగేళ్ల క్రితం రూ.సుమారు 70 వేల కోట్ల గ్రూపు ఋణం యిప్పుడు రూ.2.26 లక్షల కోట్లయింది.

సాధారణంగా తరాల మధ్య అంతరం వుంటుంది. తండ్రి నుంచి కొడుక్కి కంపెనీ చేతులు మారినప్పుడు కూడా విధానాల్లో మార్పు వుంటుంది. కింద సంస్థల వారీగా యిస్తున్న సమాచారం గమనిస్తే రతన్ చాలా విషయాల్లో గొప్పలకు పోయి, దూకుడుగా వెళ్లాడని అర్థమవుతుంది. నష్టాలు వచ్చినా వాటిని మేన్‌టేన్ చేస్తూ పోయాడు. అయితే సైరస్ కొత్తతరం వాడు. నష్టాల్లో వున్నవాటిని సవ్యమైన బాట పట్టించాలని కొద్దికాలం చూడడం, అప్పటికీ బాగు పడకపోతే మూసేసి, నష్టాలు తగ్గించడం మంచిదని భావించి అమలు చేయసాగాడు. వీటి కారణంగా గతంలో రతన్ తీసుకున్న నిర్ణయాలు పొరపాటు అని రుజువౌతోంది. అది తన ప్రతిష్ఠను దెబ్బ తీస్తోందని రతన్ బాధ.

ఇప్పుడు ఒక్కో విభాగం గురించి కాస్తకాస్త సమాచారం –

టాటా మోటార్స్ – రతన్ టాటా 2008లో జాగ్వార్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్)ను 2.3 బిలియన్ డాలర్లకు టాటా మోటార్స్ చేత కొనిపించాడు. నష్టాల్లో వున్న కంపెనీ టర్న్ ఎరౌండ్ అయి లాభాలు ఆర్జించసాగింది. దేశీయంగా టాటా తెచ్చిన కార్లు ఫెయిలయ్యాయి. అయినా జాగ్వార్ లాభాలతో నష్టాలు కొంత పూడుస్తోంది. కానీ జాగ్వార్‌కు అతి పెద్ద మార్కెట్ ఐన చైనాలో ఆటోమొబైల్స్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. అందువలన యీ లాభాలు ఎంతకాలం వుంటాయో తెలియదు. టాటా మోటార్స్ ద్వారా ఏటా రెండు కార్లు తీసుకుని వస్తానని సైరస్ హామీ యిచ్చి తప్పాడని రతన్ గ్రూపు ఆరోపణ. ఇప్పటికే విడుదల చేసిన టియాగో (జికా పేరు మారింది), బోల్టులు కూడా నిరాశ పర్చాయి. బ్రెగ్జిట్ కారణంగా జాగ్వార్ పైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. నానో గుదిబండగా మారిందని సైరస్ అంటాడు. టర్న్ ఎరౌండ్ చేయడం చేతకాలేదని రతన్ వర్గం అంటోంది. మూడేళ్లల్లో కార్ల దేశీ మార్కెట్‌లో వాటా 13% నుంచి 5%కి, వాణిజ్యవాహనాల మార్కెట్‌లో 60% నుంచి 40%కి పడిపోయింది. నానో విషయంలో ఆ మోడల్ ఫెయిలై వెయ్యి

కోట్ల నష్టం వచ్చిందంటాడు సైరస్. 'దాన్ని మూసేద్దామంటే రతన్ ఒప్పుకోడు. ఎందుకంటే ఆయనకు వాటా వున్న ఎలక్ట్రిక్ కార్ల కంపెనీకి నానో గ్లయిడర్లను సప్లయి చేస్తోంది. నానో మూసేస్తే ఆ కంపెనీకి కష్టం' అన్నాడు. అతని ఆరోపణలకు రతన్ వర్గం సమాధానం చెప్పలేదు.

టాటా పవర్ – రతన్ హయాంలో 2006లో ముంద్రా అల్ట్రా పవర్ ప్రాజెక్టును అధిక ధరకు బిడ్ చేసిందని, దీనివలన భారీ మొత్తంలో పెట్టుబడులను రైట్ డౌన్ చేయాల్సి వస్తోందంటూ సైరస్ ఆరోపణ. ఈ ఏడాది సైరస్ వెల్‌స్పన్ రెన్యూవబుల్ ఎనర్జీని రూ.9300 కోట్లకు కొన్నాడు. ఆ విషయం మాకు చెప్పలేదు అంటుంది రతన్ వర్గం. 'చెప్పకపోవడమేం, ఏడాది మొదట్లోనే టాటా సన్స్ మీటింగులో ఒక ప్రజంటేషన్ యిచ్చాం. మే 31 న రతన్ టాటాకు, టాటా సన్స్ బోర్డుకు నోట్ పంపడం జరగడం జరిగింది. ఇది అయ్యాక జూన్ 12 న అగ్రిమెంటుపై సంతకాలు జరిగాయి. తర్వాత రతన్, ఎన్ ఎ సూనావాలా అనే ట్రస్టీ సమక్షంలో అనేక చర్చలు జరిగాయి.' అంటోంది సైరస్ వర్గం.

టాటా హెూటల్స్ – సీ రాక్ హెూటల్‌ను అనవసరంగా ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేశారంటాడు సైరస్. న్యూయార్క్‌లోని పియరీ హెూటల్ లీజు కూడా ఎంత క్లిష్టంగా వుందంటే, దానిలోంచి బయటపడడమూ కష్టమట.

టెట్లీ – టెట్లీ అనేది ఇంగ్లండు, కెనడాలలో టీ వ్యాపారం చేసే బ్రిటిష్ కంపెనీ. రతన్ 2000 సం।।రంలో బ్రిటిష్ కంపెనీ టెట్లీని 45 కోట్ల డాలర్లకు కొన్నాడు. ఆసియాలో దాని వ్యాపారాన్ని టాటా టీతో కలిపేశారు. ప్రపంచస్థాయిలో యూనిలివర్ తర్వాత అతి పెద్ద కంపెనీగా చేసి 2006లో దాన్ని టాటా గ్లోబల్ బెవరేజెస్‌గా పేరు పెట్టారు. దానికి ఇండియా వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయి కానీ యూరోప్, ఉత్తర అమెరికాలలో వచ్చే లాభాలతో పూడ్చుకున్నారు. ఇండియాలో కనీస వేతనాలైనా చెల్లించని టీ ఎస్టేట్ల నుండి టాటా కంపెనీ టీ ఆకులు కొంటోందని 2014లో ఆరోపణలు వచ్చాయి. దానిపై విచారణ జరిపిస్తామని టాటా గ్రూపు అంది. తర్వాత అలాటి ఎస్టేట్లలో కొన్నదాన్ని ఇండియాలోనే అమ్ముతున్నామని, ఎగుమతి చేసే సరుకులో యిలాటి తిరకాసులు లేవని అంది.

టాటా ఏవియేషన్ – టాటా గ్రూపులో ఏవియేషన్స్ విభాగంలో కూడా చాలా అవకతవకలు జరిగాయని కూడా చెప్పుకొచ్చాడు. ఏవియేషన్ సెక్టార్ క్లిష్టకాలంలో వున్నపుడే టాటా ఎయిర్ ఏసియా బెర్‌హాద్, అరుణ్ భాటియాలతో కలిసి పెట్టిన జాయింటు వెంచర్ – ఎయిర్ ఏసియా ఇండియా. ఇదీ, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన విస్తారా అనే జాయింటు వెంచర్ రెండూ ఫెయిలయ్యాయి. ఎయిర్ ఏసియా ఇండియా నష్టాలు రూ.20 కోట్లు కాగా, విస్తారా నష్టాలు రూ. 400 కోట్లు. ఎయిర్ ఏసియా ఇండియా ఏర్పరచడానికి దేశంలో ఊరు పేరు లేని కొందరికి రూ. 22 కోట్లు చెల్లించారని సైరస్ ఆరోపించాడు. ఈ విమానరంగంలో రావడం రతన్ ఒత్తిడి వల్లనే జరిగిందని సైరస్ ఆరోపణ. ఈ జాయింటు వెంచర్ ఏర్పాటు ఒప్పంద సమయంలో ఎయిర్ ఏసియా తన బ్రాండ్ ఈక్విటీ ఎగ్రిమెంట్ వివరాలను వెల్లడించకపోవడం ఎఫ్‌డిఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) విధానానికి వ్యతిరేకమని, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆరోపించింది. వారికి యిచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ 2014 ఏప్రిల్‌లో ఢిల్లీ హైకోర్టుకి వెళ్లింది. హైకోర్టు 17 సార్లు వాయిదాలు వేస్తూ ఆలస్యం చేయడంతో ఆ సంగతి చూడమంటూ సుప్రీం కోర్టు తలుపు తట్టింది.

టాటా స్టీల్ – కోరస్ – రతన్ టాటా 2007లో టాటా స్టీల్ ద్వారా 1310 కోట్ల డాలర్లు వెచ్చించి ఆంగ్లో డచ్ కంపెనీ ఐన కోరస్ కంపెనీని కొని టాటా స్టీల్ యుకెగా పేరు మార్చాడు. అది ప్రపంచంలో కల్లా పెద్ద స్టీలు కంపెనీ అయింది. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా స్టీలు ధర పడిపోవడంతో అది నష్టాల్లో మునిగిపోయింది. సైరస్ చెప్పేదాని ప్రకారం 10 బిలియన్ డాలర్ల నష్టం వుంది. సైరస్ దాని ఆస్తులను రైట్ ఆఫ్ చేసి అమ్మేయడం, రతన్‌కు నచ్చలేదు. 'టర్న్ ఎరౌండ్ చేసి వుండాల్సింది. సైరస్ అమ్మేసిన ఆస్తులు కొన్న కంపెనీ ఏడాదిలోనే టర్న్ ఎరౌండ్ చేసింది' అంటాడు. 2016 తొలి క్వార్టర్‌లో టాటా స్టీల్‌కు రూ. 3 వేల కోట్ల భారీ నష్టం వచ్చింది. దానికి కారణం యుకె విభాగమే. టాటా స్టీలులో డైరక్టరైన నుస్లీ వాడియా సైరస్ పక్షాన నిలవగా అతనితో తక్కిన స్వతంత్ర డైరక్టర్లు కలిసి రాలేదు.

టాటా–డొకొమో వివాదం – జపాన్‌కు చెందిన ఎన్‌టిటి డొకొమో కంపెనీ 2009 నవంబరులో టాటా టెలీ సర్వీసెస్ ఒక షేరుకు రూ.117 చొప్పున రూ.12700 కోట్లు యిచ్చి ఈక్విటీలో 26.5% వాటాను తీసుకుంది. వ్యాపారం సరిగ్గా సాగక ఐదేళ్ల లోపు విత్‌డ్రా అయ్యేటట్టయితే షేరుకి న్యాయమైన ధర యిచ్చి తిరిగి తీసుకుంటానని (బై బ్యాక్) టాటా ఒప్పుకుంది. కనీసం రూ. 58 (కొన్నదానిలో 50%) యిచ్చి తీసుకుంటానంది. ఈ ఒప్పందం రతన్ హయాంలో జరిగింది. నిజానికి రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం విదేశీ పెట్టుబడుల విషయంలో బై బ్యాక్‌కు ముందే ఒక ధరను నిర్ణయించరాదు. ఎవరైనా రిజిస్టర్డ్ మర్చంట్ బ్యాంకర్ రిటర్న్ ఆన్ ఈక్విటీ ఆధారంగా ఏది సవ్యమైన ధరో నిర్ణయించాక, దాన్ని మాత్రమే చెల్లించాలి. ఈ విషయాన్ని రెండు కంపెనీలు ఎలా విస్మరించాయో తెలియదు. జాయింటు వెంచర్ అనుకున్న విధంగా విజయవంతం కాకపోవడంతో, ఐదేళ్లు పూర్తవడానికి ఆర్నెల్ల ముందే 2014 ఏప్రిల్‌లో 'నేను తప్పుకుంటాను, 58 రూ.ల రేటు చొప్పున రూ.6350 కోట్లు డబ్బు వాపసు యిచ్చేయండి' అంది డొకొమో. అప్పటికి సైరస్ చైర్మన్‌గా వచ్చాడు. 'రిజర్వ్ బ్యాంకు నిబంధన ప్రకారం షేరుకు రూ. 23.34 కంటె చెల్లించడానికి వీల్లేదు. కాబట్టి మేం యింతకంటె యివ్వలేం' అన్నాడు. వ్యవహారాన్ని డొకొమో బ్రిటన్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టుకి లాగింది. మాట తప్పినందుకు గాను రూ.7839 కోట్లు నష్టపరిహారం యివ్వాలని ఆ కోర్టు 2016 జూన్‌లో టాటాను ఆదేశించింది.

ఆ తీర్పు కాపీని ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసింది డొకొమో. దాంతో బాటు లండన్ కమ్మర్షియల్ కోర్టులో తీర్పు అమలుకై అప్పీలు చేస్తూ, యుకెలోని టాటా షేర్లున్న జాగ్వార్, టాటా స్టీల్ ఆస్తులను ఎటాచ్ చేయాలని కోరింది. ఈ లోగా టాటా సన్స్ రూ.7839 కోట్లను ఢిల్లీ హైకోర్టులో ధరావత్తుగా పెట్టింది. డొకొమోకు ఆ మొత్తాన్ని చెల్లించేందుకు ఆర్‌బిఐ అనుమతి కోరింది. కానీ ఆర్‌బిఐ అనుమతి యివ్వలేదు. 'ఇవ్వందే మేమెలా డబ్బు చెల్లించగలం, భారతీయ చట్టాలనే గౌరవించి యిక్కడి రూల్సు ప్రకారమే చెల్లింపులు చేస్తామ'ని సైరస్ స్పష్టం చేశాడు. ఆర్‌బిఐని రిక్వెస్ట్ చేయడానికి తమతో కలిసి రమ్మనమని డొకొమోను కోరాడు. అయితే డొకొమోకు ఆర్‌బిఐ ఏం చెపుతుందో తెలుసు. టాటా వాళ్లు యిచ్చిన డబ్బును తమ దేశానికి తీసుకోపోమని, యిక్కడే పెట్టుబడిగా పెడతామని (నాన్-రిపాట్రియేషన్) జపాన్ కంపెనీ హామీ యిస్తే సమస్య తీరిపోతుంది.

కానీ రిజర్వ్ బ్యాంకు పెట్టిన యీ రూలు మార్చాలని జపాన్ కంపెనీ పట్టుబడుతోంది. మార్చకపోతే ఇండియాలో పెట్టుబడి పెట్టే విదేశీ కంపెనీలు వెనుకాడతాయని సంకేతాలు పంపుతోంది. కానీ ఆర్‌బిఐ యిప్పటివరకు బెసకలేదు. అందువలన డొకొమో అంతర్జాతీయ కోర్టుల్లోనే పోరాడుతోంది. ఈ వ్యవహారంలో సైరస్ సరిగ్గా వ్యవహరించటం లేదని ఆరోపిస్తున్న రతన్ తనైతే ఎలా చేస్తాడో చెప్పటం లేదు. ఆలోచిస్తే సైరస్ మాత్రం చేయగలిగేదేముంది? ఒప్పందం కుదుర్చుకునేటప్పుడు రతనే సరిగ్గా చూసుకుని వుండాల్సింది. సగం రేటు వాపసు యిస్తామని రాసిచ్చి వుండకూడదు. డొకొమో వివాదాన్ని పక్కన పెడితే టాటా టెలిసర్వీసెస్ నిర్వహణ కూడా నష్టాలు తెస్తోందని దాన్ని మూసేసినా లేక ఎవరికైనా అమ్మేయాలని చూసినా 400-500 కోట్ల డాలర్ల నష్టమంటాడు సైరస్.

ఈ వ్యాసం అసమగ్రమే. పొరపాట్లూ వుండవచ్చు. కానీ టాటా వివాదం గురించి బొత్తిగా తెలియనివారికి కొద్దిపాటి అవగాహన కలిగిస్తుంది. ఇకపై టాటా గ్రూపు వార్తలు చదివేటప్పుడు, వారి ఆరోపణ-ప్రత్యారోపణల గురించి విన్నప్పుడు, కథ ఎన్ని మలుపులు తిరుగుతోందో అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. టాటా గ్రూపు అనేది లాభనష్టాల లెక్కలు వేసే సంస్థ కాదని, దానికో ఫిలాసఫీ వుందని, సైరస్‌కు ఆ ఫిలాసఫీ వంటబట్టలేదని రతన్ మాటిమాటికి ఎత్తిపొడుస్తున్నాడు. అప్పు చేసి పప్పుకూడు తినడం, నష్టాలు వచ్చినా గొప్పలకు పోయి కంపెనీ నడపడం టాటా ఫిలాసఫీయా అనేది రతనే చెప్పాలి. ఏ కంపెనీ యాజమాన్యమైనా షేర్ హెూల్డర్లకు జవాబుదారీ. పెట్టుబడి పెట్టినవాడు డివిడెండ్లు ఆశిస్తాడు. వీటన్నిటిలో 41 లక్షల మంది ప్రజల కష్టార్జితం వుంది. తన భేషజం కోసం ప్రజలు నష్టపోవాలనుకోవడం, అదేమంటే టాటా గ్రూపు సిద్ధాంతం, ఆదర్శం వంటి కబుర్లు చెప్పడం రతన్‌కే చెల్లింది. నీరా రాడియా టేపులు విన్నపుడే రతన్ టాటా ఎంత 'మేలి' రత్నమో తెలిసిపోయింది. ఇప్పుడు రతన్ సైరస్‌పై పగబట్టి అతన్ని ఒక్కో కంపెనీ నుంచి తొలగించడానికి కుట్రలు పన్నుతున్నాడు. మరొకరైతే రతన్ తడాఖాకు పారిపోయేవారు. కానీ సైరస్ నిలబడ్డాడు. నిలబడి పోరాడుతున్నాడు. అంతిమంగా తనకున్న పలుకుబడితో, మూకబలంతో రతనే జయించవచ్చు. కానీ సైరస్ సంధిస్తున్న అనేక ప్రశ్నలకు రతన్ వద్ద సమాధానాలు లేవు. ఈ పోరాటం చాలా కాలమే సాగేట్లుంది.**- ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**న్యూస్, వ్యూస్, రివ్యూస్ - 109 వీక్లీకై డిసెంబరు 16-17**

## ఎమ్బీయస్ : ఆనే ఫ్రాంక్ ఎలా పట్టుబడింది?

"ద డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్" అనే తన డైరీ ద్వారా ప్రపంచంలో చాలామందికి తెలిసిన ఆనే ఫ్రాంక్ గురించి కొత్త పరిశోధన వెలుగులోకి వచ్చింది. హిట్లర్ యూదులను వేటాడుతున్నపుడు యీ యూదు బాలిక తన కుటుంబంతో సహా ఆమ్‌స్టర్‌డామ్‌లో ఓ భవనపు అటకలో 1942 జూన్ నుంచి 1944 ఆగస్టు వరకు రెండేళ్లపాటు దాగుంది. అప్పటి తన అనుభవాలకు, ఆలోచనలకు డైరీ రూపంలో అక్షర రూపం యిచ్చింది. తర్వాత నాజీలకు పట్టుబడి కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులో మరణించింది. అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన ఆమె తండ్రికి యీ డైరీ దొరికింది. దాన్ని ప్రచురణలకు యిచ్చాడు. ఇప్పటికి అది 67 భాషల్లో 3 కోట్ల కాపీలు అమ్ముడుపోయింది. ఆ విధంగా ఆనే ఫ్రాంక్ ఎంతోమంది చదువరులకు పరిచితమైన పేరు. అందుకే ఆమె గురించిన ఏ కొత్త విషయమైనా ఆసక్తి కలిగిస్తుంది.

జర్మనీలో హిట్లర్ యూదులను ఎలా హింసించాడో దాదాపుగా అందరికీ తెలుసు. నాజీల ప్రాభవం పెరుగుతున్న కొద్దీ తమకు కలగబోయే ముప్పు ఊహించిన ఆనే తండ్రి ఆటో ఫ్రాంక్ జర్మనీలో తన వ్యాపారాన్ని వదిలేసి 1933లో భార్య, యిద్దరు కూతుళ్లతో సహా హాలండ్‌కి వలసపోయి ఆమ్‌స్టర్‌డామ్‌లో స్థిరపడి అక్కడ మళ్లీ వ్యాపారం సాగిస్తూ డబ్బు గడించాడు. అయితే హిట్లర్ 1936 నుంచి యిరుగుపొరుగు దేశాలను ఆక్రమించుకోవడం మొదలుపెట్టాడు. 1939లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభించి, 1940 నాటికి హాలండ్‌ను తన అధీనంలోకి తెచ్చుకుని యూదులపై నానా రకాల ఆంక్షలు పెట్టి, ఆస్తులు లాక్కుని కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులకు పంపసాగాడు. పరిస్థితి గ్రహించి, ఆటో ఫ్రాంక్ మరొక కుటుంబంతో సహా తన భాగస్వాములకు సంబంధించిన మూడు అంతస్తుల ఆఫీసులో పై అంతస్తులో రహస్యంగా తలదాచుకున్నాడు. ఒక పుస్తకాల షెల్ఫు వెనక్కాల రహస్యంగా వున్న మెట్ల మీదుగా అటకకు చేరవచ్చు. యూదులకు ఆశ్రయం యిస్తే తమ ప్రాణాలకు కూడా ముప్పని తెలిసీ ఆ డచ్చి కుటుంబాల వారు వీరిని ఆదుకున్నారు.

ఆనే 13 వ పుట్టినరోజు నాడు 1942 మే 12న ఆమె తండ్రి డైరీ బహుమతిగా యిచ్చాడు. అప్పటి నుంచి ఆమె క్రమం తప్పకుండా దాన్ని రాస్తూ వచ్చింది. నెల తిరక్కుండా అటకలో రెండు గదుల్లో తలితండ్రులు, అక్కతో సహా దాక్కోవలసి వచ్చింది. వీరితో పాటు తండ్రికి స్నేహితుడైన వాన్‌డాన్, అతని భార్య, 16 ఏళ్ల కొడుకు మరో రెండు గదుల్లో దాక్కున్నారు. కొన్నాళ్లకు డాక్టర్ డస్సెల్ అనే దంతవైద్యుడు కూడా వచ్చి చేరాడు. పగటివేళ కింద ఆఫీసులో పని జరుగుతూ వుంటుంది. ఉద్యోగులకు ఎవరికీ అనుమానం రాకుండా, శబ్దాలు చేయకుండా, కాంతి బయట పడకుండా అతి జాగ్రత్తగా వుండాలి. రాత్రి సద్దు మణిగాక డాబా మీదకు రావచ్చు.

బడి లేక, ఆటలు లేక, సమవయస్కులు ఎవరూ లేక ఒంటరిగా గడపవలసి వచ్చిన ఆనే డైరీనే స్నేహితురాలిగా భావించి ఎన్నో వూసులు చెప్పింది. కొన్ని సార్లు పోలీసులకు పట్టుబడి పోయే సందర్భాలు కూడా వచ్చాయి. మూడు సార్లు దొంగలు పడ్డారు. పైన అటకలో అలికిడి విని వాడు పారిపోయాడు కానీ, వెళ్లి పోలీసులకు చెప్తాడేమోనని వీళ్ల భయం. ఇంకోసారి ఒకడు వీళ్ల కళ్లెదురుగుండానే డబ్బు ఎత్తుకుపోయాడు కానీ వీళ్లు 'తేలు కుట్టిన దొంగలు'లా మౌనంగా వుండిపోయారు. దొంగతనం జరిగాక పోలీసులు వచ్చి మూలమూలలా వెతికారు. కానీ షెల్ఫ్ వెనక్కాల మెట్లు వున్నాయని గ్రహించలేకపోయారు. వీళ్లకు భయంకరమైన టెన్షన్. ఒకసారి బిల్డింగు కొనుక్కోవడానికి కొత్త యజమాని వచ్చాడు. పై అంతస్తుకి ఎలా వెళ్లాలి అంటే మెట్ల గది తాళం చెవులు మర్చిపోయానని వీళ్ల డచ్చి ఫ్రెండు చెప్పాడు. వాళ్లే వీళ్లకు ఆహారం సరఫరా చేసేవారు. బ్లాక్‌మార్కెట్‌లో సంపాయించిన రేషన్ కార్డులతో రొట్టె, వెన్న కొనుక్కుని వచ్చి ఎవరికీ తెలియకుండా పట్టుకుని వచ్చి యిస్తూ వుంటారు. బఠాణీలు, బంగాళాదుంపలు, చిక్కుళ్లు తెస్తే వీళ్లు వారాల తరబడి అవే తినాలి. కూరల తుక్కు పారేస్తే అనుమానం వస్తుంది. అందుకని కాల్చేయాలి. ఇలా ఎన్నో కష్టాలు, అన్నిటినీ మించి అవే మొహాలను రోజంతా, ఏడాదంతా చూస్తూ కూర్చోవడం ఎంత కష్టం!

వీళ్లు యిలా దాగుని వుండగానే యుద్ధంలో మిత్రదేశాలు విజయం సాగించసాగాయి. వీళ్లకో రేడియో వుంది. రాత్రుళ్లు మెల్లగా పెట్టుకుని వినవచ్చు. నాజీలు ఓడిపోతున్నారని విని వీళ్లు ఆశలు పెట్టుకున్నారు. హాలండ్‌ని మిత్రపక్షాలు కైవసం చేసుకుని జర్మన్ సేనలను తరిమివేస్తారని వీళ్లు కలలు కంటూండగానే 1944 ఆగస్టు 4న యీ కుటుంబాలు పట్టుబడిపోయాయి. వీళ్లకు ఆశ్రయం యిచ్చిన డచ్ వారిని హింసించి, డచ్ కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపుకు తరలించారు. ఈ ఎనిమిది మందిని పోలండ్‌లోని భయంకరమైన ఆష్విజ్ క్యాంపుకి పట్టుకుని వెళ్లారు. వాన్‌డూన్‌ను గాస్ చాంబర్‌లో చంపేశారు. ఆటో ఫ్రాంక్‌ను రెండు సార్లు అక్కడ దాకా తీసుకువెళ్లారు కానీ అదృష్టం కొద్దీ లోపలకి పంపలేదు. అనారోగ్యకారణంతో ఆసుపత్రిలో చేరాడు. వాన్‌డూన్ భార్య, కొడుకు, డెంటిస్టు ఎప్పుడు పోయారో ఆ తేదీలు యిప్పటిదాకా తెలియలేదు. ఆనే తల్లి ఆ క్యాంప్‌లోనే 1945 జనవరిలో చనిపోయింది. అంతకు రెండు నెలల ముందు ఆనేను, తన అక్కను వేరే క్యాంప్‌కు పంపారు. 1945 ఫిబ్రవరిలో యిద్దరికీ టైఫాయిడ్ వచ్చింది. కొన్ని రోజులకు అక్క నీరసంలో మెట్ల మీద నుంచి జారిపడి చనిపోయింది. నీరసం, అనారోగ్యం, రెండేళ్ల ఖైదు జీవితం, అన్నిటినీ మించి అక్కను కోల్పోవడం – వీటితో ఆనే కృంగిపోయి యింకో రెండు నెలలకు చనిపోయింది.

ఇంతలో రష్యన్లు పోలండ్‌ను ఆక్రమించుకున్నారు. ఆటో ఫ్రాంక్‌ను యింకో 11 వేల మంది యూదులను విడిపించారు. తమను కాపాడిన కుటుంబాలకు ధన్యవాదాలు చెప్పడానికి ఆమ్‌స్టర్‌డామ్ వచ్చాడు. నాజీలు ఆనే కుటుంబాన్ని పట్టుకుపోయినప్పుడు సామాను, కాగితాలు అన్నీ చెల్లాచెదురు చేశారు. ఈ డైరీ ఎక్కడో మూల పడిపోయింది. డచ్ యింటావిడ దాన్ని తీసి జాగ్రత్త పెట్టి తండ్రికి యిచ్చింది. తండ్రి దాన్ని 1947 లోకానికి వెల్లడించడంతో ఆనే ప్రపంచ ప్రజలందరికీ ఆత్మీయురాలై పోయింది. ఆమె పేర ఆ బిల్డింగులో మ్యూజియం వెలసింది. ఇంతకీ ఫ్రాంక్ కుటుంబం ఎలా పట్టుబడింది అనేది యిప్పటి వరకు స్పష్టంగా తెలియదు. ఎవరో కిట్టనివాళ్లు సమాచారం యిచ్చారని అనుకుంటూ వచ్చారు. అదేమీ కాదని, కాకతాళీయంగా పట్టుబడ్డారని ఆనే పేర వెలసిన మ్యూజియం క్యూరేటర్లు యిప్పుడు అంటున్నారు. అప్పట్లో డూప్లికేట్ రేషన్ కూపన్లు ముద్రించి అమ్ముతూ వుండేవారు. అలాటి గ్యాంగు ఆ బిల్డింగులో వుండేది. వాళ్ల కోసం వెతుకుతూ జర్మన్ సెక్యూరిటీ సర్వీసెస్ వారు బిల్డింగును అణువణువు గాలించినపుడు యీ కుటుంబాలు దొరికాయట. ఏది ఏమైనా యుద్ధం కొద్ది నెలల్లో ముగుస్తోందనగా ఆనే చనిపోవడం గుండెలు బరువెక్కిస్తుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**వీక్లీకై డిసెంబరు 16-17 ఎమ్బీయస్ : చైనా సరుకులు వాడడం మానేశామా?**

దీపావళికి ఓ రెండు నెలల ముందు నుంచి మనవాళ్లలో ఆవేశం ఆవహించింది. ఉగ్రవాదానికి పుట్టిల్లు పాకిస్తాన్. దాన్ని మేనమామలా కాపాడుతున్నది చైనా. కాబట్టి యీ దీపావళికి చైనా బాణసంచా కొనకుండా వాళ్లకు ఆర్థిక నష్టం చేకూర్చి మన ఇండియాతో పెట్టుకుంటే వాళ్ల కెంత చేటో తెలియచెప్పాలి – అని మెసేజిలు, వాట్సాప్ ఫార్వార్డులు గుప్పించారు. చిత్రమేమిటంటే యివన్నీ పంపించినది చైనాలో తయారైన సెల్‌ఫోన్ల ద్వారానే! మన రాష్ట్రాలన్నీ విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి వివిధ దేశాల వ్యాపారస్తులను ఆహ్వానిస్తూ వుంటాయి. మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం కూడా అక్టోబరు 20న ఓ సమావేశం జరిపి, చైనా వాళ్లను కూడా పిలిచింది. దానిపై కినిసిన స్వదేశీ జాగరణ్ మంచ్ అనే ఆరెస్సెస్ ఆర్థిక విభాగం మంత్రుల దిష్టిబొమ్మలు తగలేసింది. దీపావళి జరిగిన రెండు వారాలకు తమ ఉద్యమం సఫలమైందని గుజరాత్, పంజాబ్, న్యూఢిల్లీలలో చైనా బాణసంచా కొనుగోళ్లు

20% మేరకు తగ్గాయని ప్రకటించుకుంది. అందువలన మనం చైనావాళ్ల డ్రాగన్ కాటుకి చెప్పుదెబ్బ కొట్టినట్లే సంతోషించవచ్చా?

నవంబరు 8 న ప్రభుత్వ వర్గాలు విడుదల చేసిన గణాంకాల ప్రకారం చైనా నుండి మన దిగుమతులు గతంలో కంటె 7% పెరిగాయి. జూన్‌లో మన దిగుమతులు ఎంత వున్నాయో అక్టోబరులోనూ అంతే వున్నాయి. అంటే మనం చైనా సరుకులు కొనడం మానలేదన్నమాట! నిజానికి చైనా నుండి మనం దిగుమతి చేసుకునే వస్తువుల్లో బాణసంచా వంటి చిల్లర సరుకులు, చీప్ సరుకుల వాటా కేవలం 1–2%! అంకెల్లో చెప్పాలంటే 10 లక్షల డాలర్ల కంటె లోపు. చైనా నుండి చేసుకునే ఎలక్ట్రానిక్ దిగుమతులు 2,000 కోట్ల డాలర్లు, న్యూక్లియార్ రియాక్టర్లు, మెషినరీ 1,500 కోట్ల డాలర్లు, కెమికల్స్ 600 కోట్ల డాలర్లు, ఉక్కు 230 కోట్ల డాలర్లు. మనం అమెరికా, సౌదీ అరేబియా, యుఎఇల నుంచి దిగుమతి చేసుకునే మొత్తం చైనా నుంచి చేసుకునేదానితో దాదాపు సమానంగా వుంటుంది. అందువలన చైనా చౌకసరుకులు మనం పూర్తిగా వాడడం మానేసినా తేడా ఏమీ రాదు.

చైనాతో మన వ్యాపారం పెరుగుతోంది – అది కూడా చైనాకు అనుకూలంగా. 2015–16లో మొత్తం ద్వైపాక్షిక వ్యాపారం 7100 కోట్ల డాలర్లయితే మనం ఎగుమతి చేసినది 1800 కోట్ల డాలర్లు, దిగుమతి చేసుకున్నది 5300 కోట్ల డాలర్లు. 'మనం టెలికామ్, పవర్ రంగాలలో విస్తరిస్తున్నాం కాబట్టి చైనా నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకోవలసి వస్తోంది. చైనా సరుకులు నిషేధించాలనే డిమాండ్ అర్థరహితం. మనమూ, చైనా డబ్ల్యుటిఓలో సభ్యులం. దిగుమతులపై ఆంక్షలు విధించడానికి వీలు లేదు.” అని పార్లమెంటులో నిర్మలా సీతారామన్ వివరించారు. మనం దేశభక్తి పేర చైనాకు వ్యతిరేకంగా గొంతు చించుకుంటున్నాం కానీ వాస్తవాలు మరోలా వున్నాయి. పేటిఎమ్ వాడమని ప్రభుత్వం తన ఖర్చుతో ప్రకటనలు యిచ్చి ఊదరగొడుతోందా? చైనా ఈ–కామెర్స్ దిగ్గజం ఆలీబాబాకు దానిలో 40% వాటా వుంది! స్థానిక టాక్సీ కంపెనీలను నిరాదరించి మనం ఎక్కుతున్న ఓలాలో కూడా చైనా వారి పెట్టుబడులున్నాయి. ప్రజాదరణ పొందిన మేక్‌మైట్రిప్ అనే ట్రావెల్ వెబ్‌సైట్‌లో కూడా. ఈ ఆగస్టులోనే ముంబయిలో మీడియా డాట్ నెట్ అనే స్టార్టప్ కంపెనీలో చైనీస్ కన్సార్షియం (ఋణదాతల సమూహం) 90 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టింది. చైనావాళ్లు మన వస్తువులు లేకుండా బతకగలరు కానీ, మనం చైనావాళ్ల వస్తువులు లేకుండా బతకలేం.

ఎందుకలా అంటే గ్లోబలైజేషన్ పేరు చెప్పి మనం దేశంలో ఉత్పత్తి మానేశాం, రీసెర్చి అటకెక్కించాం. అన్నిటా విదేశీ సామానులే వాడుతున్నాం. మరి చైనా? స్వదేశంలోనే అన్నీ ఉత్పత్తి చేసుకుంటూ పోయారు. ప్రపంచానికే మాన్యుఫేక్చరింగ్ కేంద్రంగా అవతరించారు. ప్రపంచంలోని కంప్యూటర్లలో సగం అక్కడే తయారవుతున్నాయి, డివిడిలలో మూడింట రెండు వంతులు అక్కడే. ఇక ఆటబొమ్మల సంగతి చెప్పనే అక్కరలేదు. ఇటీవలి కాలంలో మన యిళ్లల్లో ఫర్నిచర్ కూడా చైనాకి వెళ్లి కొనుక్కుంటున్నాం. దక్షిణ చైనాలోని ఈవూ పట్టణానికి ఏటా 3–4 లక్షల మంది ఇండియన్లు వెళ్లి సరుకులు కొంటారట. అక్కడ మన ఇండియన్ దేవుళ్ల విగ్రహాలు, మన తరహా జ్యూయలరీ తయారుచేసి ఇండియా కంటె 40% తక్కువ ధరలో అమ్ముతున్నారు. ఇండియన్ ఫార్మా పరిశ్రమ చైనా దిగుమతులపై ఆధారపడి నడుస్తోంది. తయారీ రంగంలో చైనా ఎందుకు దూసుకుపోతోంది అనే విషయంపై మన దేశం తరఫున 2011లో అధ్యయనం జరిగింది. అప్పటికే ఇండియన్ టెలికాం దిగుమతుల్లో 62% చైనావి. ఇప్పుడు 3జి, 4జి కూడా వచ్చాయి కాబట్టి 75% దాటి వుంటుంది. ఇండియా మాన్యుఫేక్చరింగ్ జిడిపిలో చైనా వాటా 2011లో 26% వుందని, ఐదేళ్లలో అది 75%కు చేరవచ్చని అధ్యయన బృందం అంచనా వేసింది. వారిని నిరోధించడం కంటె ఇండియాలో పెట్టుబడి పెట్టి, మీరు సాధించిన అనుభవంతో ఆ వస్తువులేవో యిక్కడే తయారుచేసి, మా వాళ్లకు ఉద్యోగాలు కల్పించండి అని అడగడం మేలని ప్రభుత్వం భావిస్తోంది.

చైనా వస్తువులు వాడవద్దని వాట్సాప్ మెసేజి ఫార్వార్డ్ పంపడంతో దేశానికి మేలు కలగదు. జాతి గౌరవం వుందని నిరూపించడానికి బలవంతంగా సినిమా హాల్లో (అక్కడే ఎందుకో నా కర్థం కాదు, కళ్యాణమంటపంలో అయితే యింకా ఎక్కువమంది పోగడతారు) జాతీయగీతం వినిపించి, లేచి నిల్చోనివాళ్లను అరెస్టు చేయనక్కర లేదు. గాంధీగారు విదేశీ వస్తుబహిష్కారంతో జాతీయభావాన్ని రగిలించారు. ఇప్పటికిప్పుడు బహిష్కరిద్దామంటే వీలుపడని పరిస్థితి. ఇప్పటికైనా స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించాలి. మన వస్తువులు ఎగుమతి కాకపోయినా ఫరవాలేదు. మన మార్కెట్లలో మన వస్తువులున్నా చాలు, కంపెనీలు నిలదొక్కుకుంటాయి. మనం ఆర్థికంగా బలపడితే చైనా కాదు, పాకిస్తాన్ కాదు, ఎవరికైనా జవాబు చెప్పగలం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**డిసెంబరు 18** **ఎమ్బీయస్ : ట్రంప్ గెలుపులో పుతిన్ హస్తం వుందా?**

ఉందనే అంటోంది సిఐఏ. అవునవునంటూ వంత పాడుతోంది అమెరికన్ మీడియా. ట్రంప్ ఓడిపోవడం తథ్యమనీ, హిల్లరీ గెలుపు దేశానికి అత్యావశ్యకమని నమ్మి ఆ విధంగా ప్రచారం చేసిన మీడియా అతని గెలుపును హరాయించుకోలేక పోతోంది. పుతిన్ వ్యక్తిగత ఆదేశాల మేరకు రష్యన్ హాకర్లు డెమోక్రాటిక్ పార్టీ నాయకుల ఈ–మెయిళ్లు హ్యాక్ చేసి, వికీలీక్స్‌కు ద్వారా బహిరంగ పరచి, ట్రంప్ విజయానికి సాయపడ్డారని వాళ్లు కథనాలు రాస్తున్నారు. సైబర్ ఎటాక్స్ చేయడం రష్యాకు, అమెరికాకు కొత్త కాదు. విదేశాల్లో ఎన్నికల ఫలితాలు ప్రభావితం చేయడానికి అమెరికా గతంలో హ్యాకింగ్ బాట పట్టింది. అలాగే రష్యా కూడా ఉక్రెయిన్‌లో, యూరోప్‌లోని కొన్ని దేశాల్లో యీ ఆయధాన్ని ప్రయోగించి చూసింది. ఇది కనబడని, ప్రయోగించాక కూడా కనిపెట్టలేని ఆయుధం, పైగా చవకైనది. అయితే యీ ఆయుధాన్ని పుతిన్ అమెరికాపై ప్రయోగించడానికి కారణం? అతనికి హిల్లరీపై వ్యక్తిగతమైన కక్ష

అంటున్నారు. ఆమె స్టేట్ సెక్రటరీ పదవిలో వున్నపుడు 2011 రష్యాలో ఎన్నికలు జరిగి పుతిన్ నెగ్గాడు. అవి సక్రమంగా జరగలేదని ఆమె బహిరంగంగా వ్యాఖ్యానించి అతనికి వ్యతిరేకంగా రష్యా వీధుల్లో ప్రదర్శనలకు కారకురాలైంది. అందువలన పుతిన్ ఆమెకు బుద్ధి చెప్పదలచాడు. అది కాకుండా ఇంకో కారణం ఏమిటంటే – ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని గొప్పలు చెప్పుకునే అమెరికన్ మేడిపండు పొట్ట విప్పి చూస్తే ఎలా వుంటుందో లోకానికి చూపదలచాడు. అమెరికన్ మీడియా కానీ, సిఐఏ కానీ, ఒబామా ప్రభుత్వం కానీ రష్యా డెమోక్రాటిక్ పార్టీ తాలూకు రహస్య సంభాషణలు దొంగిలించి, తమ ముసుగులు లాగేసిందని వాపోతున్నారు కానీ రష్యా అబద్ధాలు సృష్టించిందని ఒక్కరూ అనలేదు. ఇప్పుడు సిఐఏ ప్రతీకారం తీర్చుకోవడానికి హ్యాకర్లను నియమించి పుతిన్ వ్యక్తిగత ఐశ్వర్యం తాలూకు వివరాలు బయటకు లాగుతారట. శుభం.

రష్యన్ హ్యాకర్లు యిలా అధికార పార్టీ నాయకుల ఈ మెయిళ్లు హ్యాక్ చేసేస్తూ వుంటే అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశపు ప్రభుత్వం కనుక్కోలేక పోయిందా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. "న్యూయార్క్ టైమ్స్" దానిపై కథనం వేసింది. దాని ప్రకారం – డెమోక్రాటిక్ నేషనల్ కమిటీ (డిఎన్‌సి) ఆఫీసుకి టెక్నికల్ సపోర్టు అందించే కాంట్రాక్టరు యారెడ్ టామేన్ అనే అతనికి సైబర్ ఎటాక్స్‌లో అనుభవం తక్కువ. 2015 సెప్టెంబరులో ఎఫ్‌బిఐ స్పెషల్ ఏజంట్ ఎడ్రాయిన్ హాకిన్స్ అనే అతను ఫోన్ చేసి "మీ కంప్యూటర్ సిస్టమ్స్‌లో కనీసం ఒకటైనా హ్యాకింగ్‌కు గురవుతోంది. రష్యాతో సంబంధాలున్న "ద డ్యూక్స్" అనే కోడ్ పేరుతో పనిచేసే హ్యాకర్ల బృందం అన్‌క్లాసిఫైడ్ ఈ మెయిల్స్‌ను చదివేస్తోంది. జాగ్రత్త పడండి." అని చెప్పాడు. ఈ హెచ్చరికను ఎంత సీరియస్‌గా తీసుకోవాలో టామేన్‌కు అర్థం కాలేదు. ఏదో ఆకతాయి కాల్ చేసి ఉత్తుత్తినే హడలగొడుతున్నాడేమో అనుకున్నాడు. ఎందుకంటే ఆ ఎఫ్‌బిఐ ఏజంటుతో అతనికి పరిచయం లేదు. అయినా ఎందుకైనా మంచిదని గూగుల్‌లో "ద డ్యూక్స్" కోసం సెర్చ్ చేశాడు. అక్కడ వున్న కొన్ని హెచ్చరికలను నోట్ చేసుకుని తమ కంప్యూటర్ సిస్టమ్‌లో వున్నాయేమో ఓ సారి చెక్ చేసుకుని వూరుకున్నాడు. ఆ తర్వాతి వారాల్లో కూడా ఏజంట్ హాకిన్స్ అప్పుడప్పుడు ఫోన్ చేసి హెచ్చరిస్తూనే వున్నా, ఇతను పెద్దగా వర్రీ కాలేదు. ఆ హ్యార్లు మన దగ్గరనుంచి ఏమైనా సమాచారం కోసం తాపత్రయ పడుతున్నారేమో అనుకుని వూరుకున్నాడు. ఆ విధంగా ఏడు నెలల పాటు హ్యాకర్లు వీరవిహారం చేయడానికి వీలు చిక్కింది.

ఆ తర్వాత వాళ్లు ఒక్కోటి బయటపెడుతూ వుంటే డిఎన్‌సి అధికారులు ఒక్కోరూ మేలుకోసాగారు. సైబర్ ఎక్స్‌పర్టులను పిలిపించి తమ సిస్టమ్స్‌కు రక్షణ కల్పించుకోసాగారు. ఆ పాటికి హ్యాకర్లు డిఎన్‌సి నుంచి తక్కిన డెమోక్రాటిక్ నాయకుల కంప్యూటర్లకు విస్తరించారు. హిల్లరీ తెలివితక్కువగా రహస్య సమాచారాన్ని కూడా అన్‌క్లాసిఫైడ్‌గా చూడడంతో కొంప మునిగింది. ప్రయివేటు మెయిళ్లు, కాన్ఫిడెన్షియల్ డాక్యుమెంట్లు కూడా రోజువారీ వికీలీక్స్‌లో దర్శనమియ్యసాగాయి. హిల్లరీ క్లింటన్ కాంపెయిన్ చైర్మన్ జాన్ పోడెస్టా ప్రయివేటు ఈ మెయిలు కూడా హ్యాక్ అయింది. హిల్లరీ ఈ మెయిళ్లు బహిర్గతం కావడంతో ఆమె యిమేజి మసకబారింది. తమపై నుంచి దృష్టి మరల్చడానికి ఆమె వర్గం ట్రంప్‌ను రష్యన్ ఏజంటు అనసాగింది. నిజానికి గతంలో బిల్–హిల్లరీ క్లింటన్ ఫౌండేషన్‌కు రష్యన్ ప్రభుత్వ ఏజన్సీల నుండి విరాళాలు అందినందుకు విమర్శలు వచ్చాయి. కానీ యిప్పుడు "ట్రంప్ రష్యాకు ఫేవరేట్" అనే పల్లవి అందుకుంది హిల్లరీ క్యాంప్. ఆ ఈ మెయిళ్లపై విచారణ జరపడం, హిల్లరీకి క్లీన్‌చిట్ రావడం.. యివన్నీ గందరగోళంగా తయారై ఆమె రాజకీయంగా నిజాయితీపరురాలు కాదనే సందేశాన్ని ఓటర్లకు యిచ్చాయి. ఆమె ఓటమికి యిది ఒక ప్రధాన కారణమైంది.

ఇప్పుడు సిఐఏ కాంగ్రెస్‌కు ఒక నివేదిక సమర్పిస్తూ రష్యన్ ప్రభుత్వం ట్రంప్‌ను గెలిపించడానికే యిదంతా చేసిందని గట్టిగా వాదించింది. ఒబామా తక్షణమే విచారణకు ఆదేశించాడు. ట్రంప్ అధ్యక్ష పదవి అలంకరించే జనవరి 20 లోగా ఆ విచారణ ఫలితాలను బహిరంగ పర్చాలన్నాడు. సిఐఏ యిచ్చిన వివరణను రష్యా ప్రభుత్వమే కాదు, ట్రంప్ కూడా కొట్టి పారేశాడు. "నన్ను గెలిపించడానికి వారిదంతా చేశారనడం అర్థరహితం. హ్యాక్ చేసిన వాళ్లు రష్యావాడు కావచ్చు, చైనావాడు కావచ్చు, న్యూజెర్సీలో కూర్చున్న అమెరికా వాడూ కావచ్చు." అన్నాడు. అతని వర్గం వారు యింకాస్త ముందుకు వెళ్లి "వీళ్ల నివేదికలు యిలాగే అఘోరిస్తాయి. గతంలో సద్దాం హుస్సేన్ వద్ద మారణాయుధాలున్నాయని వీళ్లే రిపోర్టు యిచ్చారు. అదెంత నిజమో చూశాం." అని తీసిపారేశారు. అయినా ట్రంప్‌కు, పుతిన్‌కు సత్సంబంధాలే వున్నాయని సాధారణ అమెరికన్ ప్రజలకే కాదు, రిపబ్లికన్ నాయకులకూ సందేహాలున్నాయి. ఎందుకంటే తన సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా ట్రంప్ నియమించిన ఎక్సాన్ మోబిల్ అధినేత రెక్స్ టిల్లర్‌సన్ పుతిన్‌కు ఆత్మీయుడు. విదేశీయులకు రష్యా యిచ్చే అత్యున్నత పురస్కారం – ఎవార్డ్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ – అందుకున్నవాడు. ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా రష్యాపై అమెరికా ఆర్థికపరమైన ఆంక్షలు విధించినపుడు తన కంపెనీకి బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లితే యిరు దేశాల మధ్య సాధారణ పరిస్థితులు నెలకొనాలని పిలుపు యిచ్చినవాడు. టిల్లర్‌సన్ నియామకం ద్వారా ట్రంప్ పుతిన్‌కు స్నేహహస్తం చాస్తున్నాడని పరిశీలకులు భావిస్తున్నారు. హిల్లరీ ఓటమి మాట ఎలా వున్నా ఎలాగోలా అమెరికా, రష్యా మధ్య కోల్డ్‌వార్ అంతమై ప్రపంచంలో శాంతి నెలకొంటే అంతే చాలు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 110 వీక్లీకై డిసెంబరు 18**

## ఎమ్బీయస్ : దేవేంద్ర దరహాసం

మహారాష్ట్రలో మరాఠా ఆందోళన ప్రారంభమయ్యాక ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు గుబులు ప్రారంభమైంది – మరాఠాలను తృప్తి పరచడానికి బ్రాహ్మణుడైన తనని దింపివేస్తారేమోనని! "కొంతమంది యీ పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకుందామని చూస్తున్నారు." అని సెప్టెంబరులో బహిరంగ ప్రకటన చేశాడు. దానికి తగ్గట్టే అమిత్ షా దేవేంద్ర స్థానంలో మరాఠా ఐన రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్‌ను కూర్చోబెడతాడని కొందరు బిజెపి నాయకులు గుసగుసలాడసాగారు. వెంటనే దేవేంద్ర మోదీ వద్దకు వెళ్లి తన గోడు వెళ్లబోసుకుని అభయం పొందాడు. అమిత్‌కు దేవేంద్ర అంటే పడకపోవడానికి ఓ కారణం వుంది. శివసేనకు బుద్ధి చెప్పి, దాని పొగరు అణచాలని అమిత్‌కు మహా ఆశ. ఇప్పటిదాకా శివసేన హెడ్‌క్వార్టర్సుకి వెళ్లని బిజెపి అధ్యక్షుడు ఎవరైనా వున్నారా అంటే అది అమిత్ ఒక్కడే! 123 మంది సభ్యులు మాత్రమే వున్న బిజెపికి ప్రభుత్వం నడపాలంటే కనీసం యింకో 25 మంది ఎమ్మెల్యేల అవసరం వుంది. అందుకే శివసేనతో పొత్తు పెట్టుకుంది. శివసేనకు కోపం వస్తే బిజెపి ప్రభుత్వం, అనగా తన ప్రభుత్వం కూలిపోతుంది కాబట్టి దేవేంద్ర శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే వద్దకు మాటిమాటికీ వెళ్లి వస్తూ వుంటాడు.

ఇది అమిత్‌కు నచ్చదు. శివసేన మద్దతు లేకుండా బండి నడపడానికి ఆ పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలను గోడ దూకుతారా? అని అడిగించాడట. ఉద్ధవ్‌కు చెప్పేస్తాడేమోనన్న శంక చేత యీ రాయబారం సంగతి దేవేంద్రతో చెప్పలేదు, అయితే ఆ 20 మందిలో ఒక ఎమ్మెల్యే స్వయంగా తనకు చెప్పడంతో దేవేంద్రకు విషయం తెలిసింది. తద్వారా ఉద్ధవ్‌కు కూడా తెలిసిందేమో తెలియదు కానీ యీ ఫిరాయింపుల పర్వం ప్రస్తుతానికి ఆగింది. తను చెప్పిన పనులు కొన్ని చేయలేదని అమిత్‌కు దేవేంద్రపై కినుకతో బాటు, తన అత్తవారి వూరైన కొల్హాపూరుకే చెందిన చంద్రకాంత్ పాటిల్ అంటే ఆదరమూ వుంది. కాబినెట్‌లో అతని కంటె సీనియర్లయిన సుధీర్ ముంగంటివార్, పాండురంగ్ ఫూండ్‌కర్, వినోద్ తావడే వున్నా అతన్నే నెంబరు 2 గా పెట్టాడు అమిత్. తాజాగా మరాఠా ఆందోళన పేరుతో తనకు ఉద్వాసన తప్పదని దేవేంద్ర భయపడుతున్న సమయంలో స్థానిక ఎన్నికలు వచ్చాయి.

సరిగ్గా యిదే సమయానికి బిజెపి కార్యకర్తలు కూడా దేవేంద్రపై మండిపడుతున్నారు. అతను వ్యక్తిగతంగా తన యిమేజి పెంచుకోవడానికి మొత్తం 288 నియోజకవర్గాల్లో 'అనులోమ్' పేర వాలంటీర్లను ఏర్పాటు చేసి నెలకు 27 వేల రూ.ల జీతం యివ్వసాగాడు. వాళ్ల పనేమిటంటే ముఖ్యమంత్రి చేపట్టిన పథకాల గురించి ప్రజలకు మొబైళ్ల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలి. వీళ్లంతా పార్టీ నాయకులకు కూడా రిపోర్టు చేయనక్కరలేదు. ముఖ్యమంత్రి ఆఫీసులో శ్రీకాంత్ భారతీయా అనే అధికారికి తమ కార్యకలాపాల గురించి, ఫీడ్‌బ్యాక్ గురించి చెప్తే చాలు. ఈ వ్యవహారం పార్టీ నాయకులకు నచ్చలేదు. "మేం యిన్నాళ్లూ యిలాటి పనులన్నీ ఉత్తినే చేస్తూ వచ్చాం. దానికి గాను మాకు మెప్పు, పదవీ ఏమీ లేదు. అతి సులభంగా యివ్వగల పదవులు సైతం యివ్వకుండా ఆ ఖాళీలు భర్తీ చేయకుండా వుంచారు. ఆయనకు పార్టీ మీద నమ్మకం లేదు. అధికారుల ద్వారానే పని నడిపిద్దామని చూస్తున్నాడు. అధికారులు కూడా ఆయన్ను చేతిలో పెట్టుకుని ఆడిస్తున్నారు. మనం వెళ్లి పథకాల్లో లోపాలను వివరించబోతే అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని ముద్ర కొడుతున్నారు." అని ఫిర్యాదులు చేస్తున్న తరుణంలో ఎన్నికలు వచ్చాయి.

నోట్ల రద్దు తర్వాత సామాన్యప్రజలు మోదీపై ఆగ్రహం వెళ్లగక్కుతున్నారనీ, సహజమైన శాంతస్వభావం చేత వెనిజువాలాలోలా తిరుగుబాటు చేయకపోయినా, ఓటు ద్వారా తమ అసమ్మతి వ్యక్తం చేస్తారనీ అందరూ ఎదురు చూసే సమయంలో స్థానిక ఎన్నికల ఫలితాలు వచ్చాయి. చండీగఢ్ మునిసిపల్ ఎన్నికలలో బిజెపి-అకాలీదళ్ విజయపతాకాన్ని ఎగరేశాయి. గుజరాత్ ఎన్నికలలో అయితే 16 జిల్లాలలో మునిసిపాలిటీ, జిల్లా పంచాయితీలలో 126 స్థానాలకు ఉపయెన్నికలు జరిగితే 109 గెలిచి కాంగ్రెసును చావుదెబ్బ తీసింది. మహారాష్ట్రలో రాష్ట్రవ్యాప్తంగా వున్న 147 మునిసిపల్ కౌన్సిళ్ల అధ్యక్ష పదవుల్లో బిజెపికి 51, శివసేనకు 25 వచ్చాయి. 3727 కౌన్సిల్ సీట్లలో 893 (2011లో యీ సంఖ్య 298) గెలిచింది. కాంగ్రెసుకు 727 వచ్చాయి. దేవేంద్ర దీన్ని వ్యక్తిగతంగా పరువుప్రతిష్ఠలకు సంబంధించిన వ్యవహారంగా తీసుకుని రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ప్రచారం చేయడం వలన యీ విజయం కలిగిందంటున్నారు. అతను 40 పట్టణాల్లో ర్యాలీలు నిర్వహిస్తే 33టిల్లో బిజెపి గెలిచింది. అతని సొంత ప్రాంతమైన విదర్భలో పార్టీ చాలా సీట్లు గెలిచింది. అతనికి ప్రత్యర్థులైన రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిణి పంకజా ముండే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన రావ్‌సాహెబ్ దాన్వేలు తమతమ ప్రాంతాల్లో పార్టీని గెలిపించుకోలేక పోయారు. దేవేంద్ర అనుచరులు గిరీశ్ మహాజన్, జయకుమార్ రావల్‌లు ప్రాతినిథ్యం వహించే ఉత్తర మహారాష్ట్రలో ఎక్కువ సీట్లు వచ్చాయి. ఎన్‌సిపికి మంచి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రపై దేవేంద్ర ప్రత్యేక శ్రద్ధ పెట్టి అక్కడ ఎన్‌సిపి కంటె బిజెపికి ఎక్కువ సీట్లు వచ్చేట్లు చేశాడు.

ఇంత చేసినా దేవేంద్ర యిది తన ప్రతిభ అని చెప్పుకోకుండా మోదీ నోట్లరద్దు నిర్ణయానికి, సర్జికల్ దాడుల నిర్ణయానికి ప్రజల నుంచి లభించిన ఆమోదం అని చెప్తున్నాడు. 2017 ఫిబ్రవరిలో రాబోయే ముంబయి కార్పోరేషన్ ఎన్నికలలో శివసేనతో పొత్తు పెట్టుకుందామని మోదీకి చెప్పి ఒప్పించే అవకాశాలున్నాయి. అమిత్ అది సాగనిస్తాడో లేదో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

**డిసెంబరు 19** **ఎమ్బీయస్ : షీలా దీక్షిత్ గతి ఏమవుతుంది?**

మోదీపై ఆరోపణలు చేసి భూకంపం సృష్టిస్తా అంటూ రాహుల్ గాంధీ సహారా వారి డైరీ, బిర్లా వారి డైరీలోని ఎంట్రీలు బయటపెట్టాడు. భూకంపం ఎక్కడ? అంటూ మోదీ ఎద్దేవా చేశాడే కానీ వాటిపై విచారణ జరిపిస్తానని ఏమీ అనలేదు. సహారా డైరీలో ఎంట్రీలన్నీ అభూతకల్పనలు అని కోర్టు చెప్పింది అంటూన్న బిజెపి ప్రతినిథులు బిర్లా డైరీ గురించి సరైన వివరణ యివ్వటం లేదు. సహారా డైరీలో తన పేరు కూడా వుండడంతో షీలా దీక్షిత్ అదంతా బోగస్ అని కొట్టి పారేయడాన్ని బిజెపి తమకు అనుకూలంగా వుపయోగించుకుంటోంది. షీలాయే కాదు, ఆ పరిస్థితుల్లో ఎవరైనా సరే అదే చేస్తారు. కానీ డైరీ ఎంట్రీల ఆధారంగానే గతంలోనూ విచారణలు జరిగాయి. కొందరు పట్టుబడ్డారు కూడా. ఆ డైరీని పట్టుకుని మీరు రాజీనామా చేయాలి అని రాహుల్ మోదీని అడుగుతూండగా 'అయితే మీ యుపి ముఖ్యమంత్రి అభ్యర్థి షీలా దీక్షిత్ మీద వున్న ఆరోపణలు కూడా ఒప్పుకున్నట్టేగా' అని బిజెపి వారు తప్పక అడుగుతారు. అప్పుడు కాంగ్రెసు షీలాను తమ అభ్యర్థిగా విరమింప చేయక తప్పదు. వీటన్నిటికీ సిద్ధపడ్డాకనే కాంగ్రెసు ఆ డైరీని బయటపెట్టిందనుకోవాలి. అలా అనుకుంటే షీలాపై తనే ఆరోపణలు చేసి, తన ముఖ్యమంత్రి అభ్యర్థినే కాంగ్రెసు ఎందుకు దెబ్బ తీసుకుందనే ప్రశ్న వస్తుంది. యుపిలో పరిణామాలు గమనిస్తే దానికి సమాధానం తోస్తుంది.

గత కొద్దికాలంగా యుపి అధికారపక్షమైన ఎస్పీలో కుటుంబకలహాలు పెచ్చుమీరాయి. ములాయం తన రెండవ భార్య సాధనా గుప్తకు, ఆమె కొడుకు ప్రతీక్‌కు ఆప్తుడైన సంజయ్ సేఠ్‌ను 2015 జూన్‌లో పార్టీ తరఫున ఎమ్మెల్సీగా నియమిస్తానన్నపుడు అఖిలేశ్ అడ్డుకున్నాడు. సంజయ్ షాలిమార్ కార్పోరేషన్ అనే రియల్ ఎస్టేటు కంపెనీకి మేనేజింగ్ డైరక్టరు. తర్వాత అతన్ని పార్టీ కోశాధికారిగా నియమిస్తానన్నపుడూ అడ్డుకున్నాడు. దాంతో ములాయంకు తిక్కరేగింది. కొడుకుపై విమర్శలు పెంచి తమ్ముడు శివపాల్‌ను వెనకేసుకుని రాసాగాడు. అతన్ని పార్టీ రాష్ట్ర విభాగానికి అధ్యక్షుడిగా చేశాడు. రాబోయే ఎసెంబ్లీ ఎన్నికలలో టిక్కెట్ల పంపిణీ విషయంలో తన మాట చెల్లాలన్న షరతుపై దానికి అఖిలేశ్ అంగీకరించాడు. శివపాల్ తన పదవిని యిష్టం వచ్చినట్లు వుపయోగిస్తూ అఖిలేశ్‌కు చిక్కులు తెచ్చిపెట్టాడు. అతను పూర్తిగా వ్యతిరేకిస్తున్న క్వామీ ఏక్‌తా దళ్‌ను పార్టీలో విలీనం చేశాడు. నేరప్రవృత్తి వున్నవారికి, క్రిమినల్ కేసులున్న వారికి టిక్కెట్లు యివ్వకూడదన్న అఖిలేశ్ వాదనను పక్కన పెట్టి ములాయం 'ఇలాటివి పట్టించుకోకూడదు, నెగ్గడం ముఖ్యం' అని వాదించే తమ్ముడి మాటలకే విలువ యివ్వసాగాడు.

పార్టీలో గొడవలు యిలా వుండగానే అఖిలేశ్ అభివృద్ధిలో తనకు ఎవరూ సాటి రారు అని చూపించుకోవడానికి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందాడు. అతను పార్టీని చీల్చి బయటకు వస్తాడని, దాంతో అన్ని పార్టీల యువత అతనికి ఓట్లేస్తారని అనుకోసాగారు. కానీ తను పార్టీ చీల్చనని అఖిలేశ్ ప్రకటించాడు. పార్టీ మాట ఎలా వున్నా అఖిలేశ్‌కు గెలిచే అవకాశాలు బాగున్నాయి కాబట్టి అతనితో చేతులు కలిపితే మంచిదని కాంగ్రెసు సలహాదారు ప్రశాంత్ కిశోర్ సలహా యిచ్చాడు. దానికి కాంగ్రెసు సమ్మతించడంతో అతను అఖిలేశ్ వద్దకు, అతని సూచనపై ములాయం వద్దకు రాయబారం నడిపాడు. ప్రస్తుతం యుపిలో బిజెపి ముందుకు దూసుకుపోతోంది. బిజెపి వ్యతిరేక ఓటర్లకి ఎస్పీ, బియస్పీ, కాంగ్రెసు రూపంలో మూడు ఆప్షన్లు వున్నాయి. కలహాలతో మునిగిన ఎస్పీ బిజెపిని ఎదుర్కోలేదని, కాంగ్రెసు గతంలో కంటె పుంజుకున్నా బిజెపిని ఎదిరించేందుకు సొంతంగా బలం చాలదని ఆ ఓటర్లు అనుకుంటున్నారు. అందుచేత మూకుమ్మడిగా బియస్పీకి ఓటేద్దామనుకుంటున్నారు. ఎస్పీ అంతర్గతంగా చేయించుకున్న సర్వేలో బిజెపి, బియస్పీల తర్వాతనే తమ స్థానం వున్నట్లు తెలుసుకుంది. ఎందుకంటే బిసి ఓటర్లలో బిజెపి చీలిక తేగలిగింది.

ఇలాటి పరిస్థితుల్లో కాంగ్రెసు, ఎస్పీతో చేతులు కలిపితే బిజెపి వ్యతిరేక ఓటర్లందరినీ ఆకర్షించగలదు. 2012 ఎసెంబ్లీ ఎన్నికలలో వారికి వచ్చిన ఓట్ల శాతాలను కలిపితే 41% వచ్చింది. 2014 లోకసభ ఎన్నికల అంకెలు చూసినా 30% వస్తోంది. ఆ ఎన్నికలలో బిజెపికి 43% వచ్చింది కానీ యీసారి అంత రాదని అందరికీ తెలుసు. కాంగ్రెసుతో బాటు ఆర్ఎల్‌డిని కలుపుకుని బిహార్ తరహాలో మహాగఠ్‌బంధన్ ఏర్పరచాలని ములాయం ఆలోచన. అది ఫలిస్తే అఖిలేశ్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం. శివపాల్‌కు అది యిష్టం లేదు. అందుకని ఎస్పీకి సొంతంగా బలం వుందని, కాంగ్రెసుతో చేతులు కలపనక్కలేదని ప్రకటనలు యిచ్చాడు. డిసెంబరు 11న 23 మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేశాడు. దానిలో క్వామీ ఏక్‌తా దళ్ ఎమ్మెల్యే సిగ్బతుల్లా అన్సారీ పేరు వుండడం అఖిలేశ్‌ను మండించింది. తను సమాంతరంగా జాబితా తయారుచేశాడు. అది వింటూనే శివపాల్ 175 మంది పేర్లతో మరో జాబితా విడుదల చేశాడు. డిసెంబరు 24 న అఖిలేశ్ తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి 'మీ అందరికీ టిక్కెట్లిచ్చే బాధ్యత నాది' అన్నాడు. మర్నాడు తన జాబితాను ములాయంకు సమర్పించాడు.

పార్టీకి 229 మంది ఎమ్మెల్యేలుంటే వారిలో 183 మంది అఖిలేశ్‌కు మద్దతిస్తున్నారన్న సంగతి ములాయంకు తెలుసు. ఇటు శివపాల్ 'ముఖ్యమంత్రి ఎవరన్నది ముందే చెప్పం. ఎన్నికల తర్వాత గెలిచిన అభ్యర్థులు ఎన్నుకుంటారు' అని చెప్తున్నా అఖిలేశ్‌ను చూసే కాంగ్రెసు ముందుకు వస్తోందని తెలుసు. చివరకు ఎటు మొగ్గుతాడో చూడాలి. కాంగ్రెసుతో పొత్తు పెట్టుకునేట్లయితే యిప్పటికే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన షీలా దీక్షిత్‌ను వాళ్లు ఎలా వదుల్చుకుంటారన్న ప్రశ్న వస్తుంది. ఇప్పుడు డైరీల వ్యవహారం తర్వాత తోచేదేమిటంటే – తమ పార్టీ నైతికతకు కట్టుబడి వుందని చూపుకుంటూ కాంగ్రెసు షీలాను అభ్యర్థిగా తీసివేసి పొత్తుకు మార్గం సుగమం చేయవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

కేంద్రంలోను, రెండు తెలుగు రాష్ట్రాలలోను కొత్త ప్రభుత్వాలు ఏర్పడి రెండున్నరేళ్లు గడిచాయి. అంటే పదవీకాలంలో సగకాలం. చివరి ఆర్నెల్లలో ఎన్నికల హడావుడి వుంటుంది. పరిస్థితి బాగుందని పాలకులకు తోస్తే ముందస్తు ఎన్నికలకు కూడా వెళ్లవచ్చు. అందువలన వాళ్ల తడాఖా చూపించేందుకు 2017, 2018 సంవత్సరాలే వున్నాయి. ఇప్పటిదాకా జరిగినది ఒకసారి చూసుకుంటే 2017పై ఏ మేరకు ఆశలు పెట్టుకోవచ్చో ఒక అంచనా వస్తుంది. వీళ్లేదో సాధిస్తారని ఆశ పెట్టుకున్నవాళ్లకి గత రెండున్నరేళ్లలో జరిగినది కచ్చితంగా ఆశాభంగం కలిగించింది. ఈ ముగ్గురూ భారీగా వాగ్దానాలు చేశారు, ప్రజల్లో ఆశలు పెంచారు. ఆ మేరకు పనితీరు కనబరచలేక పోయారు. ఎందుకిలా అని అడిగితే 70 లేదా 60 ఏళ్లగా పేరుకున్న కుళ్లు కడుగుతున్నాం అంటున్నారు. ఎన్నికలకు ముందు మాత్రం తాము అధికారం చేపట్టిన నెలల్లోనే అద్భుతాలు చూపిస్తామన్నారు. ఇప్పుడిలా మాట్లాడుతున్నారు. ముగ్గురిలోనూ కనబడే సామాన్య (కామన్) లక్షణం ప్రచారార్భాటం. చేసినది గోరంతైతే, కొండంత చెప్పుకుంటారు. మీడియాను బాగా వాడుకుంటారు. కేంద్రస్థాయిలో ప్రతిపక్షాలను బతకనిస్తున్నారు కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ప్రతిపక్షాలకు, వ్యతిరేక మీడియాకు నిలువనీడ లేకుండా చేస్తున్నారు. మోదీ, కెసియార్, బాబు – ముగ్గురికీ వీరాభిమానులున్నారు. వాళ్ల మీద యీగ వాలనివ్వరు. వాళ్లు చేసిన ప్రతి పనిలో ఏదో మహోద్దేశ్యం కనబడుతుంది వాళ్లకు. జనరల్ పబ్లిక్‌కు మాత్రం అంత వెర్రి లేదు.

తెలంగాణ సంగతి చూస్తే – కెసియార్ ఎవరి మాటా లెక్క చేయటం లేదు. తన నమ్మకాలు, తన విలాసాలు తనవే. ఎదురాడినవారిని సహించే పరిస్థితి లేదు. ప్రజాభిప్రాయానికి, ప్రజాస్వామ్యానికి పూచికపుల్ల విలువ లేదు. తన మాట కాదంటే తెలంగాణ ద్రోహి ముద్ర కొట్టేస్తారు. సర్వాధికారాలు ఆయనవీ, ఆయన కుటుంబసభ్యులవీ. ఎప్పటి కెయ్యది సమయానుకూలంగా మాట్లాడి, ప్రజల్ని సమ్మోహితులను చేస్తూనే వున్నాడు. తెలంగాణ సాధనకై ఉద్యమించిన వర్గాలెన్నో తాము కలలు కన్న తెలంగాణ యిది కాదని మొత్తుకుంటున్నాయి. అయినా కెసియార్ చెవి కెక్కటం లేదు. ఎన్నో తిక్కపనులు, దేనికీ శాస్త్రీయత లేదు. అన్నీ ఫ్యూడల్ విధానాలు. గట్టిగా అడుగుదామంటే ఎక్కడ తొక్కేస్తారోనన్న భయం. అంతర్జాతీయ నగరం అంటూ కాన్వాస్ చేసిన హైదరాబాదు వర్షాలకు ఎలా నాశనమైందో కళ్లారా కనబడుతోంది. దాన్ని సరిచేయడం చాతకాదు. అక్రమ నిర్మాణాలు ఆగలేదు, మెట్రో ముందుకు సాగటం లేదు, హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కాలేదు, మిషన్ కాకతీయ వలన కొంత మేలు జరిగింది కానీ చిత్తశుద్ధితో బాగా చేసి వుంటే శాశ్వతంగా లాభం జరిగేది. అనేక పథకాలకు డబ్బు లేదంటారు కానీ తన నివాసానికి కోట్లు ఖర్చు పెట్టారు. దోపిడీదారులతో చెలిమి సాగిస్తూనే, కొత్తగా శాటిలైట్ నగరాలు, కొత్త జిల్లాలు, కొత్త యాదాద్రి అంటూ ఏదో సందడి చేస్తూ ప్రజల ద ృష్టిని మరలిస్తూనే వున్నారు.

ఎన్నో దశాబ్దాలుగా యితరులు డెవలప్ చేసి యిచ్చిన హైదరాబాదు, యిన్‌ఫ్రాస్ట్రక్చర్ వున్నాయి కాబట్టి పెట్టుబడులు వస్తున్నాయి. దాన్ని తమ ఘనతగా చెప్పుకునే లాఘవం ఆయనకూ, ఆయన కుటుంబసభ్యులకూ వుంది. నిజానికి కెసియార్ తనకు అనుకూలంగా చెప్పుకోదగ్గ అంశమంటూ ఏదైనా వుందంటే అది తెలంగాణలో ఘర్షణవాతావరణం రాకుండా చూడడం. పదవి అందుకున్నాక కొన్నాళ్లు ఆ మార్గం ప్రయత్నించారు కానీ తర్వాత ఏ బేరాలు కుదిరాయో ఏమో చల్లబడ్డారు. అందువలన పరిశ్రమలు తరలి వెళ్లలేదు. కుంటుకుంటూ బండి నడిచిపోతోంది. కొత్త సంవత్సరం యింతకంటె బాగా వుండే అవకాశమైతే తోచటం లేదు. నోట్లరద్దు వలన దెబ్బతిన్న వ్యాపారాలు కోలుకోవడానికి యింకో ఆర్నెల్లు కనీసం పడుతుంది, అదైనా ప్రభుత్వం తీసుకునే దిద్దుబాటు చర్యలపై ఆధారపడి వుంటుంది.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో, కేంద్రంలో టిడిపి–బిజెపి సంకీర్ణ ప్రభుత్వాలు కాబట్టి నిధులు కురుస్తాయనుకున్నారు. పరిపాలనాదక్షుడైన బాబు సారథ్యంలో ఆ నిధులు శాశ్వతనిర్మాణాలుగా రూపొంది, విదేశీ పెట్టుబడులను సైతం ఆకర్షిస్తాయనుకున్నారు. కానీ అనుకున్నదేమీ జరగలేదు. ప్రత్యేక హోదా లేదు, తక్కిన రాష్ట్రాల కిచ్చినట్లు గానే విద్యాసంస్థలు, నిధులూ యిచ్చి అదే ప్రత్యేక ప్యాకేజీ అనుకోమన్నారు. ప్రత్యేక రైల్వే జోను లేదు, మెట్రో లేదు, కొత్త రాష్ట్రం కదాని ఆదుకున్నదీ లేదు. పోలవరం బాధ్యత మాదే అని కేంద్రం ఎప్పుడో చెప్పినా నిధులు విదిల్చినప్పుడల్లా హంగామా చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి లక్షల కోట్లవుతాయంటే, వేల కోట్లతో సరిపెట్టుకోమంటున్నారు. కేంద్రం ఆంధ్రపై సవతితల్లి ప్రేమ కాదు, పగబట్టింది. బాబు నిస్సహాయంగా చూస్తూ, గట్టిగా నోరెత్తలేకుండా వున్నారు. ఏమీ చేయలేకపోతున్నాం కదాని ఉన్నంతలో సర్దుకుందామని అనుకోకుండా ఏదో జరిగిపోతోందన్న భ్రమ కల్పించడానికి శతథా ప్రయత్నిస్తున్నారు. పాలనంటే పండగలు చేయడమే అనే ఫిలాసఫీ పెట్టుకున్నారు. సింగపూరు జపం వదలటం లేదు. తెలంగాణ నుండే కాక యితర రాష్ట్రాల నుంచి కూడా ఆంధ్ర పెట్టుబడిదారులు తరలి వస్తారని, యింటికో ఉద్యోగం వస్తుందని ఎన్నో ఆశలు కల్పించారు. ఏదీ జరగలేదు, ఎవరూ రాలేదు. ఆంధ్రలో ఏ ప్రాంతంలోనూ అభివ ృద్ధి కనబడటం లేదు. ఆశలు అడుగంటి, ఎవరి బతుకు వాళ్లు బతుకుతున్నారు.

పరిస్థితి యిలాగే కొనసాగితే ఫలానాది చేసి చూపించానని 2019లో చెప్పుకోవటానికి బాబుకి ఏమీ వుండదు. 2017, 18లలో ఆయన ఏదైనా గట్టిగా చేసి చూపించాలి. దానికై కేంద్రంతో తలపడగలగాలి. ఆ ధైర్యం లేదు. నోట్ల రద్దు చిన్న పరిశ్రమలను బాగా దెబ్బ తీసింది. ఆంధ్రలో వున్న చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారాలకు గట్టి దెబ్బ తగిలింది. ఎలా కోలుకుంటారో తెలియదు.

కెసియార్‌కు సమర్థులైన తన కుటుంబసభ్యుల మద్దతు వుంది. బాబుకి లోకేశ్ నుండి అలాటి మద్దతు వూహించలేం. పార్టీ, ప్రభుత్వం అన్నీ తనే చూసుకోవాల్సి వస్తోంది. గతంలో వున్న దృఢత్వమూ లేదు, దృక్పథమూ లేదు.

ఇక కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పోరేట్లకు కొమ్ము కాస్తూ వుండడంతో మధ్యతరగతి ప్రజల ఆశలు నెలనెలకూ దిగజారుతున్నాయి. పెట్రోలు ధరలు ఎందుకు తగ్గించరో, స్వచ్ఛభారత్ పేరుతో వసూలు చేస్తున్న సెస్ ఏమౌతోందో, ధరలు ఎందుకు పెరుగుతూ పోతున్నాయో ఏమీ అర్థం కావటం లేదు. కాంగ్రెసు తరహా రాజకీయాలే మోదీ చేస్తున్నారని నికరంగా తెలిపోయింది. వాజపేయిలో వున్న ఉదారత్వం మోదీలో లేదు సరికదా, విమర్శలు జవాబు చెప్పడం కానీ, పార్లమెంటును పట్టించుకునే లక్షణం కానీ లేవని నిరూపితమైంది. అసంఖ్యాకంగా జరిపిన విదేశీ పర్యటనల వలన విదేశాల్లో భారత్ ప్రతిష్ఠ ఏమీ పెరగలేదు. పాకిస్తాన్, చైనాలతో సంబంధాలలో మెరుగుదల లేదు. మిలటరీ ద్వారా సర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించి ప్రజామోదాన్ని సంపాదించినది తాత్కాలిక విజయమే అయింది. పాకిస్తాన్‌ను అదుపులో పెట్టడం యిప్పటికీ సాధ్యపడటం లేదు. ప్రత్యామ్నాయం ఎవరూ కనబడక ప్రజలు మోదీనే నమ్ముకుని వుండగా, ఎందుకు బుద్ధి పుట్టిందో ఏమో మోదీ హఠాత్తుగా నోట్ల రద్దుకు దిగి ఆర్థిక విలయానికి తెరతీశారు. సరైన సైన్యం లేకుండా, ప్రణాళిక లేకుండా యుద్ధానికి దిగినట్లయింది. సామాజిక వ్యవస్థలో లోపాలన్నీ బయటపడ్డాయి. ఆయన పెట్టిన 50 రోజుల గడువు పూర్తయినా ప్రజల కష్టాలు తీరలేదు. అనేకమంది ప్రజలకు మోదీపై విశ్వాసం సడలింది. అడుగు వెనక్కి తీసుకోవడానికి మోదీ అహం అడ్డు వస్తోంది. ఈ సంకటంలోంచి బయటపడడానికి 2017 మొత్తం పట్టినా ఆశ్చర్యపడనక్కరలేదు.

**ఈ పరిస్థితుల్లో 2017పై ఆశలు పెట్టుకునే వ్యక్తి ఊహాలోకవాసి అయి వుండాలి, లేదా భ్రమానందస్వామి అయి వుండాలి. నేను రెండూ కాదు. – ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2016)**

•••